اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيمَ

# శాంతిబాట

సంతోషమయ జీవనానికి మార్గదర్శి

సంపుటి 4 సంచికలు 1 & 2 ఆగస్టు & సెప్టెంబర్ 2012 రూ. 34/- (17 + 17)

## భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ
ప్రత్యేక వ్యాసం

## ఇబ్రాహీమ్, హాజర మరియు ఇస్మా'ఈల్ చేసిన అసమాన త్యాగాన్ని గుర్తుచేసే పండుగ బక్రీద్

మనుషుల బలహీనతలతో వ్యాపారం ...

## చేతబడి

రక్షణ కొరకు దు'ఆలు

## బుఖారీ(ర) వారిపై
ప్రత్యేక వ్యాసం

## ముస్లిమ్ మహిళ
వివాహం విషయంలో స్త్రీకి పూర్తి స్వేచ్ఛ కల్పించిన ధర్మం - ఇస్లామ్

4 th year

First special issue

هُوَ الْأَوَّلُ وَالْآخِرُ وَالظَّاهِرُ وَالْبَاطِنُ وَهُوَ بِكُلِّ شَيْءٍ عَلِيمٌ

సృష్టికర్త

الله

అల్లాహ్

అల్-అవ్వలు

الأَوَّلُ

మొట్టమొదటివాడు

***The First***

అల్-ఆఖిరు

الآخِرُ

చిట్టచివరివాడు

***The Last***

ఆయనే మొట్టమొదటివాడు మరియు చిట్టచివరివాడు
మరియు ప్రత్యక్షుడు మరియు పరోక్షుడు. మరియు
ఆయనే ప్రతిదాని గురించి జ్ఞానం గలవాడు.

(ఖుర్'ఆన్ 57:3)

**He is the FIRST and the LAST, the APPARENT (Ascendant) and the INTIMATE (Unapparent) and He is, of all things, knowing.**
**(Qur'an 57:3)**

# శాంతిబాట

మాసపత్రిక రూ.34/- (17+17)

సంపుటి 4 సంచికలు 1 & 2 ఆగష్టు-సెప్టెంబర్, 2012

2-8-31, కోటబజార్, సామర్లకోట 533 440

www.saanthibaata.net

www.saanthibaata.com

Email:velugubaata@gmail.com

**Cell : 9491103017**


Saanthibaata


**ఎడిటర్:**

ఎమ్‌డి. అతహరుల్లా



**ఎడ్వయిజరీ బోర్డ్:**

డా॥ సలీమ్ పాషా

డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు

ఎమ్‌డి. అఫ్ఫాన్ ఉమ్రీ



**Editor**

Md. Athaharullah



**Advisory Board**

Dr. Salim Pasha

Dr. Nagireddi Srinivasa Rao

Md. Affan Omri



**Printed by**

Md. Athaharullah

**Published by**

Md. Athaharullah

**Owned by**

Velugubaata Educational Society

(R.No. 569/2008), Samalkot-533440

and

**Printed at**

Saanthibaata Printing House,

19-1-447, Hanuman Statue Center

Samalkot - 533440

and

**Published at**

2-8-31, Kota Bazar,

Samalkot - 533440,

**Editor:** Md. Athaharullah

Phone : 9347046090,

Email: velugubaata@gmail.com

RNI Regd. No. APTEL/2009/29650

**Production Incharge**

T. Srinivasa Rao

(Zakir)


## ఆగస్టు - సెప్టెంబర్ 2012

**రమదాన్ - జిల్ ఖాఇదా హి. 1433**


**5** **అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం :** ఖుర్'ఆన్ గ్రంథ అధ్యయనానికి ప్రోత్సాహం - సూరహ్ అల్-బఖరా తఫ్సీర్ : 40 - 49 ఆయత్‌లు ...

**11** **ప్రపంచ శాంతిదూత 'ముహమ్మద్(స)' వారి బోధనలు, ఆచరణలు :** సమాజంలోని సమస్యలకు పరిష్కార మార్గం - ఈ నెల ప్రత్యేకం : ఉత్తమ సమాజం - ఉత్తమ లక్షణాలు - 2 ...

**17** **తిరిగి గూటికి :** ఏ సృష్టి ధర్మంతో బిడ్డ జన్మించిందో, తిరిగి ఆ ధర్మానికే చేరుకున్న సోదరుడు లేదా సోదరి గురించి (వారి మాటలలో). నవముస్లిముల సమస్యలపై ప్రత్యేక వ్యాసం- **ఉమ్మె సులైమ్**(రజి)

**22** **హదీస్ విజ్ఞానం :** బుఖారీ(ర) (ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్) ...

**28** **అసమాన త్యాగాన్ని గుర్తు చేసే బక్రీద్**

**41** **ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదువుదాం :** నెలకు 24 అరబీ పదాల చొప్పున 30 నెలలలో ఖుర్'ఆన్‌లోని 80 శాతం పదాలను నేర్పించాలని...

**45** **భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ**

**53** **ముస్లిమ్ మహిళ :** స్త్రీ యొక్క అంగీకారం లేకుండా ఆమెకు వివాహం జరిపే హక్కు ఉందా? ...

**62** **మస్‌జిద్‌లు విజ్ఞాన కేంద్రాలు :** సంపూర్ణ జ్ఞానాన్ని ఇచ్చే ఖుర్'ఆన్, హదీస్, సీరత్, చారిత్రక పుస్తకాలతో ప్రతీ మస్‌జిద్ శోభనిచ్చే విధంగా చేయవలసిన కృషి



**సంవత్సర చందా :**

**రూ. 200/-**

*For online payments, Please contact Dr. N. Srinivasa Rao (Cell: 9491103017)*

M.O. చేయవలసిన చిరునామా:

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**

2-8-31, కోట బజార్,

సామర్లకోట-533440

**మీ ఫోన్ నంబర్ తప్పనిసరిగా వ్రాయండి**

మీ పూర్తి ఎడ్రస్‌ను, ఫోన్ నెంబర్లతో సహా **M.O.** ఫారమ్‌పై వ్రాయండి.

లేదా

క్రింది నెంబర్‌కు

మీ వివరాలను **SMS** చేయండి.

**Cell : 9491103017**

ఇతర వివరాలకై సంప్రదించండి

**డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు,** *M.Sc.,Ph.D.* **Cell : 9491103017**

**M.O. పంపినా లేక బ్యాంక్ ఎకౌంట్‌లో డిపాజిట్ చేసినా, వెంటనే ఫోన్ చేసి చెప్పవలసిందిగా కోరుతున్నాము**

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో)

# ఆత్మపరిశీలన అవసరం

సెప్టెంబర్ నెల వస్తే చాలు. ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రత్యేక కార్యక్రమాలు సెప్టెంబర్ 11వ తారీఖున ప్రసారం కాబడేవి. ఆ కార్యక్రమంలో హీరో అమెరికా అయితే విలన్ మాత్రం బిన్ లాడెన్. కాని అమెరికా చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలు అని బాగా తెలిసిన తరువాత కూడా ప్రసారం చేస్తే బాగుండదని ఆ కార్యక్రమం పట్ల ప్రాముఖ్యత తగ్గించారు. సాధారణంగా ఏప్రిల్ 1వ తేదీని పాశ్చాత్యులు ఫూల్స్ డేగా భావిస్తారు. కాని అమెరికా ప్రభుత్వం ప్రపంచ ప్రజలను 2001 సెప్టెంబర్ 11వ తేదీనాడు ఫూల్స్‌ను చేసింది.

అల్-ఖైదా అనే ఓ సంస్థని స్థాపించింది మరెవరో కాదు, అమెరికా ప్రభుత్వమే. మరియు దానిపై ఉగ్రవాద సంస్థ అని ముద్ర వేసినది కూడా అమెరికా ప్రభుత్వమే! ఈ సంస్థలో ప్రపంచ నలుమూలల నుండి ఎందరినో రిక్రూట్ చేసుకుని, వారందరికీ అమెరికాలో శిక్షణ ఇచ్చి, తన దేశ గూఢచారి సంస్థ అయిన CIA ఆధ్వర్యంలో ఆర్థిక సహకారాన్ని అందించి, బిన్ లాడెన్‌ను పొగడ్తలతో ముంచెత్తిన అమెరికా ఎందుకు ప్లేటు ఫిరాయించింది? అమెరికా శతృదేశం రష్యా అని అందరికీ స్పష్టంగా తెలిసిన విషయమే! రష్యా ఆఫ్ఘనిస్తాన్‌ను ఆక్రమించింది. రష్యాను ఆఫ్ఘనిస్తాన్ నుండి వెడలగొట్టడానికి ఈ అల్-ఖైదా ద్వారా అమెరికాయే అన్ని పనులూ చేయించింది. రష్యా వెడలిపోయాక ఇదే సంస్థను తీవ్రవాద సంస్థ అని ముద్ర వేసేసి ప్రపంచాన్ని బలవంతంగా నమ్మించింది. బిన్ లాడెన్‌ను ప్రపంచంలో కరడుగట్టిన తీవ్రవాదిగా ప్రచారం చేసింది.

ట్విన్ టవర్స్ కూల్చివేతకు కారణం బిన్ లాడెన్ అని తన దగ్గర ఆధారాలున్నాయంటూ **అమెరికా ప్రభుత్వం అబద్ధం చెప్పింది.** ట్విన్ టవర్స్ కూల్చివేతకు, బిన్ లాడెన్‌కు సంబంధం ఉన్నట్లు తెలిపే ఏ ఒక్క సాక్ష్యమూ FBI దగ్గర లేదని, ఆ సంఘటన జరిగిన 6 సంవత్సరాల తరువాత FBI అధికారిని ఎవరో అడిగితే తెలిసింది. FBI వారి వెబ్‌సైట్ చూసినా ఈ విషయం తెలిసేది. కాని మీడియా ఇవేమీ తెలుసుకోకుండా, బిన్ లాడెన్‌పై కథనాలు విపరీతంగా ప్రసారం చేసింది. ఇది అమెరికా స్పాన్సర్డ్ ఫెయిడ్ న్యూస్‌గా భావించాలి. అయితే టవర్స్ కూలిన దాదాపు 3 నెలలకే బిన్ లాడెన్ మరణించినట్లు అంతర్జాతీయ పత్రికలలో వచ్చింది. అది నిజమేనని పరోక్షంగా అమెరికా సెనేట్‌కు సమర్పించిన నివేదిక తెలియజేస్తుంది.

బిన్ లాడెన్ టవర్స్ కూల్పించాడని అబద్ధం చెప్పి, ఆఫ్ఘనిస్తాన్‌పై విరుచుకు పడ్డ అమెరికా బాంబులతో ఆ దేశాన్ని సర్వనాశనం చేసేసిన తరువాత, అమెరికా సైనికులు బిన్ లాడెన్‌ను చుట్టుముట్టారట. కాని ఎందుకో వదిలేసి వచ్చేసారట. **ఇంత వెటకారమా?** బిన్ లాడెన్‌ను పట్టుకోవడానికి యుద్ధం చేసి, అతనిని చుట్టముట్టి వదిలేస్తారా? అంతేకాకుండా, ఆ విధంగా వదిలేయడంతో అతడు పాకిస్తాన్ పారిపోయాడట. పట్టుకోకుండా వదిలేస్తే పారిపోవలసిన అవసరం ఎవరికైనా ఎందుకుంటుంది? అంటే దీనర్థం **బిన్ లాడెన్ లేడు**. అప్పటికే మరణించాడు. లేకపోతే అతనిని పట్టుకుని ప్రపంచానికి చూపేవారు.

కొన్ని నెలల క్రితం పాకిస్తాన్‌కు తెలియకుండా పాకిస్తాన్‌లో తలదాచుకున్న బిన్‌లాడెన్‌ను అమెరికన్ సైనికులు చంపినట్లు, ఆ తరువాత అతని మృతదేహాన్ని సముద్రంలో పారవేసినట్లు చెప్పినది మరియు చూపించినది అంతా కూడా ఓ డ్రామా. ఆ సంఘటనను అమెరికా అధ్యక్షుడు ఒబామా మరియు హిల్లరీ క్లింటన్‌లు ఉత్కంఠతతో తిలకిస్తున్నట్లు ఓ వీడియోను మీడియాకు వదిలారు. అది ఓ అడ్వర్‌టైజ్‌మెంట్‌లా ఉంది తప్ప నమ్మదగినదిగా లేదు. వారిద్దరి హావభావాలు చూపించారు. ఇది **అమెరికా ప్రభుత్వం చెప్పిన మరో అబద్ధం.**

ఇరాఖ్‌లో విధ్వంసకర ఆయుధాలున్నాయని, ఆ విషయానికి సంబంధించి ఆధారాలు తమ దగ్గర ఉన్నాయని జార్జ్ బుష్ నమ్మబలికాడు. కాని అంతర్జాతీయ నిపుణుల బృందం తనిఖీ చేసి అటువంటివి లేవని స్పష్టంగా చెప్పినా కూడా వినకుండా, ఇరాఖ్‌పై పడి లక్షల మందిని చంపించారు. బాంబులతో నాశనం చేయించారు. ఆ తరువాత ఇరాఖ్ వద్ద ఆయుధాలు లేవని అమెరికా అధ్యక్షుడు ఒప్పుకున్నాడు. సద్దామ్ హుస్సేన్‌ని కడతేర్చారు. ఆయుధాలున్నాయని చెప్పిన విషయం అబద్ధమని ప్రపంచానికి స్పష్టంగా తెలిసిన తరువాత, ఇరాక్‌లోని ఓ టాక్సీ డ్రైవరు చెబితే, ఉన్నాయని అనుకున్నారని అమెరికా అధ్యక్షుడు చెప్పడం జరిగింది. పాశ్చాత్యులు అబద్ధాలతో, మోసాలతో దేశాలను ఆక్రమించుకుంటారని చరిత్ర చెబుతుంది. **ఇవన్నీ చూస్తుంటే, శతాబ్దాలు గడిచినా వారిలో మార్పు రాలేదని, రాక్షసత్వం స్థానంలో ఏ కోశానా మానవత్వం పెరగలేదని స్పష్టంగా అర్థమౌతుంది.**

ఈ విధంగా 21వ శతాబ్దంలో అమెరికా మానవత్వంలేని రాక్షసరాజ్యంగా తన అసలు రూపాన్ని ప్రపంచానికి చూపింది.'ఐక్యరాజ్య సమితి' కాస్తా 'అమెరికాకు అనుబంధ సమితి'గా అయిపోయింది. ఇప్పుడు అమెరికా ఆడింది ఆట. పాడింది పాట. బిన్ లాడెన్ అధ్యాయం ముగిసింది. బిన్ లాడెన్ ఎంత మందిని చంపాడో ఎవరికీ తెలియదుగాని, అతడి పేరునుపయోగించి అమెరికా మాత్రం లక్షల సంఖ్యలో ముస్లిములను హతమార్చింది. కాబట్టి అమెరికా అధ్యక్షులవంటి తీవ్రవాదులతో బిన్ లాడెన్‌ను పోలిస్తే, పర్వతంతో పరమాణువును పోల్చినట్లు అవుతుంది. బిన్ లాడెన్ ఇక లేడు కాబట్టి, డేవిడ్ హెడ్లీ అనే స్మగ్లర్‌ని తరువాత రంగంలోకి దింపింది అమెరికా ప్రభుత్వం. ఇతడు పాత నేరస్తుడే! అమెరికా ప్రభుత్వంలాగే ఈ హెడ్లీకి కూడా నేర చరిత్ర ఉంది కాబట్టి, అతనిని అమెరికా ప్రభుత్వం క్షమించేసింది. ఈ హెడ్లీకి పాకిస్తాన్‌లోని తీవ్రవాద సంస్థలతో సంబంధాలున్నాయని స్వయంగా అతని భార్యే FBI కు ఫిర్యాదు చేసినా, FBI పట్టించుకోలేదు. ఎందుకని? ఎందుకంటే హెడ్లీకి అమెరికాకు సంబంధాలున్నాయి. అంటే పరోక్షంగా అమెరికాకు మరియు పాకిస్తాన్‌లోని తీవ్రవాద సంస్థలకు సంబంధం ఉండి ఉండాలి. ఈ విషయాన్ని కాలమే ఇన్షా అల్లాహ్ సాక్ష్యాలతో బయట పెడుతుంది.

మన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌గారిని, సినిమా నటుడు షారూక్ ఖాన్ వంటి ముస్లిమ్ పేర్లు కలిగిన వారిని తనిఖీ చేసే అమెరికన్లు, హెడ్లీ నేరస్థుడని స్పష్టంగా తెలిసినప్పటికీ అతనిని మాత్రం విచ్చలవిడిగా దేశాల మధ్య తిరగడానికి ఎలా వదలగలిగారు? అతడు ఇండియా, పాకిస్తాన్‌కు పలుమార్లు అమెరికా నుండి వచ్చాడు. అతడు తీవ్రవాది అని అతని భార్య అప్పటికే చెప్పి ఉంది. అటువంటప్పుడు ఇండియాకు హెడ్లీ గురించి సమాచారాన్ని అమెరికా ముందుగానే ఎందుకు ఇవ్వలేదు? బొంబాయిలో జరిగిన దాడికి సూత్రధారి హెడ్లీ అని తెలుస్తుంది. ఆ హెడ్లీ అమెరికా రక్షణలో ఉన్నాడు. కాబట్టి తీవ్రవాద దాడుల వెనుక నున్న హస్తం అమెరికాదే అని అనుమానపడటంలో ఆశ్చర్యమేముంది?

ఇప్పుడు ఆ హెడ్లీ గురించి ఎటువంటి సమాచారం లేదు. మరో ఇడ్లీని అమెరికా పరిచయం చేయవచ్చేమో! కొంతకాలం నుండి 'అసాంజే' అనే వ్యక్తి కథ నడుస్తుంది. ఈ అసాంజే పట్ల నిజంగానే అమెరికా ఆగ్రహంగా ఉందా? లేక ఇది కూడా అమెరికా కుట్రలో భాగమేనా? ఏమో! ఇది కూడా కాలమే బయట పెట్టాలి. ఇస్లామ్‌పై విద్వేషాన్ని కక్కిన సల్మాన్ రష్దీ తలపై ఇరాన్ బహుమతి ప్రకటించిన తరువాత, అతనికి బ్రిటిష్ ప్రభుత్వం ఆశ్రయమిచ్చి, ఎంతో గౌరవాన్ని కలిగించింది. **భావప్రకటనా స్వేచ్ఛకు బ్రాండ్ అంబాసిడర్‌లా ఇంతకాలం బిల్డప్ ఇచ్చిన బ్రిటిష్ ప్రభుత్వం**, ఇప్పుడు చీకటి వాస్తవాలను బయట పెట్టిన అసాంజేని మాత్రం శిక్షించాలని చూస్తుంది. అయితే అతనికి ఈక్వెడార్ ఎంబసీ ఆశ్రయం ఇచ్చింది. కొసమెరుపు ఏమిటంటే ఈ ఎంబసీ లండన్‌లోనే ఉంది. సల్మాన్ రష్దీ, తస్లీమా నస్రీన్ వంటి వారికి ఏ విధంగా బ్రిటిష్ ప్రభుత్వం అభయం ఇచ్చిందో, అదే విధంగా లండన్‌లో నున్న ఈక్వెడార్ ఎంబసీ అసాంజేకు అభయం ఇచ్చింది.

ఆ ఎంబసీ కాంపౌండ్ నుండి బయట కాలుపెట్టిన వెంటనే అసాంజేను అరెస్ట్ చేయాలని, రెండు నెలల నుండి అక్కడ పోలీసులను బ్రిటిష్ ప్రభుత్వం కాపలా పెట్టింది. ఆ కాపలా కోసం ఇప్పటి వరకూ 7కోట్ల 60 లక్షల రూపాయలు ఖర్చు అయిందట. నీతిలేని పాశ్చాత్య దేశాల అభయం పొందిన సల్మాన్ రష్దీ ఎటువంటివాడు అయివుంటాడో ప్రపంచానికి తెలియదా? ఇస్లామ్‌పై విషం కక్కేవారికి పాశ్చాత్యుల సహకారం ఉంటుంది.

ఈ మధ్యనే ఓ ఇస్రాయిలీ అమెరికన్ ఇస్లామ్‌కు వ్యతిరేకంగా నిర్మించిన సినిమా విషయంలో ఘర్షణ మొదలైంది. కొన్ని చోట్ల దాడులు జరిగాయి. అవి కూడా అమెరికా డైరక్షన్‌లోనే జరిగినట్లు అనుమానాలున్నాయి. ఇస్లామ్‌కు మరియు ముస్లిములకు వ్యతిరేకంగా జరిగే ఏ కుట్రలోనైనా యూదుల భాగస్వామ్యం తప్పక ఉంటుందని ట్విన్ టవర్స్ కూలినప్పటి నుండి అర్థమౌతుంది. సినిమా నిర్మించింది సామ్ బాసిల్ అనే ఇస్రాయిలీ అమెరికన్ మరియు సినిమాను ప్రమోట్‌చేసిన వ్యక్తి ఫ్లోరిడావాసి యైన neo-fundamentalist క్రిస్టియన్ టెర్రీ జోన్స్.

**"మా పౌరులపై దాడులు చేస్తే సహించం"** అని ఒబామా గారు సీరియస్‌గా హెచ్చరించారు. అంతేకాకుండా విధ్వంసానికి మించి మీడియా కవరేజి ఇవ్వడం జరిగింది. ***అమెరికా రాక్షసనీతి అందరికీ తెలిసిందే కాబట్టి పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.***

ఎందుకంటే అమెరికాలో ఎలక్షన్ల హడావుడి మొదలైతే, ప్రపంచంలో ఎక్కడో ఒకచోట ముస్లిములపై దాడులు జరుగుతాయి లేదా వారిపై యుద్ధం జరిపి ముస్లిములను వేల సంఖ్యలో, వీలైతే లక్షల సంఖ్యలో చంపడం జరుగుతుంది లేదా ఇస్లామ్‌పై విషప్రచారం జరుగుతుంది. అలా చేయించగలిగిన వారికే అమెరికా ఎలక్షన్లలో నెగ్గే అవకాశం ఉంటుంది. ఎందుకంటే అక్కడ యూదులు ఓట్లు అత్యంత కీలకమైనవి. ముస్లిములకు నష్టం కలిగించే వారికే యూదులు ఓట్లు వేసి నెగ్గిస్తారు. ఇజ్రాయెల్ ప్రధాని ఇప్పటికే అమెరికాలోని యూదులతో ఇరాన్‌పై యుద్ధం చేసే వారికే ఓటువేయాలని చెప్పినట్లు సమాచారం.

రెండవసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికవ్వాలి అంటే, ఈ విధ్వంసం భారీ స్థాయిలో జరగాలి. ఈ సినిమా విషయంలో జరిగిన విధ్వంసానికి సంబంధించి 'ద హిందూ' దినపత్రిక 13.09.12 వ తేదీనాడు 10 పేజీలో ప్రచురించబడిన ఎడిటోరియల్ (Libya's spiral of violence) లోని కొంత భాగం :

"With presidential and congressional elections around the corner, it will be tempting for US politicians to respond to his killing with shows of machismo. In fact, a little introspection might prove more productive."

హిల్లరీ క్లింటన్‌గారు ఇలా అన్నారు : "**It was an attack that should shock the conscience of people of all faiths around the world.**" మానవతా విలువల గురించి, ప్రజాస్వామ్యం గురించి, సెక్యులర్ భావాల గురించి లెక్చర్లిచ్చే **అమెరికా వంటి దేశంలో ఇటువంటి సినిమాలు నిర్మించబడటం షాక్ కాదా?**

టెర్రరిజం అనే పేరు ఉపయోగించడం మొదలు పెట్టినప్పటి నుండి ఎన్నో దశాబ్దాల పాటు ప్రపంచమంతా వందల సంఖ్యలో తీవ్రవాద దాడులు జరిగాయి. కాని వాటిలో ఏ ఒక్కటీ ముస్లిములు చేసినది కాదు. బ్రిటిష్ ప్రభుత్వం మన స్వాతంత్ర్య సమర యోధుడైన అల్లూరి సీతారామరాజు గారిని టెర్రరిస్ట్ అంది. పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించుకుని ఏర్పడిన ఇజ్రాయెల్ తొలి ప్రధానిని కూడా టెర్రరిస్ట్ అని అంది. ఆ తరువాత అతనికి నోబెల్ శాంతి బహుమతి వచ్చింది. అప్పటి వరకూ ఏ ముస్లిమ్ కూడా టెర్రరిస్ట్ అని పిలువబడలేదు. అప్పటికి ఇస్లామ్ ఆచరణలోకి వచ్చి 1300 సంవత్సరాలు దాటింది. **మరి అటువంటప్పుడు కొత్తగా 'ఇస్లామిక్ తీవ్రవాదం' అని అమెరికా చేసిన మరియు చేస్తున్న విషప్రచారం ప్రపంచంలోని అన్ని మత విశ్వాసాల వారికి షాక్‌గా** అనిపించి ఉంటుందని హిల్లరీ క్లింటన్‌గారికి ఆలోచన రాకపోవడం విచారకరం!

రష్యా ఈ సినిమాను నిషేధించింది. యెమన్ మరియు ఈజిప్టులలో ఈ నిరసన దాడులలో ఒకరు మరణించగా, 21మంది గాయపడ్డారు. పాకిస్తాన్‌లో 20 మంది మృతి చెందగా, వందలాది మంది గాయపడ్డారు. కోట్లాది రూపాయల విలువైన ప్రైవేట్, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం అయ్యాయి. 'ప్రవక్తను ప్రేమించండి' పేరుతో నిరసనకు పాకిస్తాన్ ప్రభుత్వమే పిలుపు నిచ్చిందట. ఎవడో తిట్టాడని మన ఇంటిని తగులబెట్టు

కుంటామా? ప్రభుత్వాలు నిరసన పిలుపు నివ్వడం కాదు, అమెరికాపై వత్తిడి తీసుకురావాలి. మరలా అటువంటి సినిమాలు నిర్మించకుండా అందరూ కలిసి అమెరికాను మందలించాలి. పరమత సహనం గురించి ఆ దేశాధ్యక్షుడికి బోధించాలి.

మన భారత దేశంలో ఈ నిరసన చెన్నయ్, శ్రీనగర్‌లలో జరిగింది. చెన్నయ్‌లో థౌజండ్ లైట్స్ మస్‌జిద్ నుంచి వేలాదిమంది నిరసనకారులు అమెరికా దౌత్య కార్యాలయానికి బయలుదేరారు. శ్రీనగర్‌లోని ప్రెస్ ఎన్‌క్లేవ్ వద్ద గుమిగూడిన విద్యార్థులు పెద్ద పెట్టున అమెరికా, ఇజ్రాయెల్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ చిత్రానికి సంబంధించి ఇంటర్‌నెట్‌లో అందుబాటులోనున్న పేజీలన్నింటిని బ్లాక్ చేయాలంటూ జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం నుంచి అందిన విజ్ఞప్తిని కేంద్ర హోంశాఖ గురువారం (13.09.12) కంప్యూటర్ ఎమెర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ డైరెక్టర్ జనరల్‌కు పంపింది. **ఇటువంటి విజ్ఞప్తిని వివిధ ముస్లిమ్ జమాత్‌ల నాయకులు కూడా చేయవచ్చు.**

మన భారతప్రభుత్వం దేశంలోని అమెరికా దౌత్య కార్యాలయాల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాల్సిందిగా రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఇక మన రాష్ట్రం విషయానికొస్తే, నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలంటూ ఎమ్.ఐ.ఎమ్ పార్టీ ఎమ్.పి. అసదుద్దీన్ ఒవైసీ ఇంటెలిజెన్స్ అదనపు డీజీ గారిని కలుసుకుని విజ్ఞప్తి చేయడం జరిగింది. మనదేశంలో మన రాష్ట్రంలో విధ్వంసాలు జరుగలేదు. పాకిస్తాన్, ఈజిప్టు, యెమన్‌లలో జరిగిన దాడులు అమెరికా పథకం ప్రకారమే జరిగి ఉండవచ్చు.

**ఇటువంటి ఓ సినిమా తీస్తున్నారని అమెరికా ప్రభుత్వానికి ముందుగా తెలియదా?** అమెరికా నాయకుల స్పందన చూస్తే వారికి ముందే తెలుసని నమ్మకం కలుగుతుంది. సరే, నిజంగా వాళ్ళ ఇంటెలిజెన్స్ విభాగం **అంత బలహీనంగా ఉండి తెలుసుకోలేకపోతే**, కనీసం తెలిసిన వెంటనే అయినా ఆ చిత్రాన్ని నిషేధిస్తామని ప్రకటించవచ్చు. వెబ్‌సైట్స్ నుండి ఆ పేజీలను తొలగించవచ్చు. అవి చేయకుండా ముస్లిమ్ ప్రపంచంలో 17 - 18 చోట్ల బలగాలు మొహరించడం ఎంతవరకూ సబబు? బలగాలు మొహరించడంలో చూపిన శ్రద్ధ, **సెక్యులర్ ముసుగు వేసుకున్న అమెరికాకు ప్రకటన చేయడంలో లేకపోవడం వారి కపటత్వాన్ని తెలియజేస్తుంది.**

ప్రపంచంలోని ఎన్నో దేశాలు, అమెరికాలో నిర్మించిన ఒక చిత్రాన్ని హేయమైనదిగా వర్ణించి నిషేధించారంటే, అది ఎంత సిగ్గు చేటయిన విషయమో పాశ్చాత్య దేశాలు ముఖ్యంగా అమెరికా, బ్రిటన్ దేశాలు అర్థం చేసుకుంటే మంచిది. అబద్దాలతో, మోసాలతో ప్రపంచ శాంతిని హరించి వేస్తున్న ఈ ధూర్తదేశాల కుట్రలను తిప్పి కొట్టడానికి బదులు, ఆసియాలోని ఆస్తులు తగలబెట్టుకోవడం పాశ్చాత్యదేశాలకు ఆనందం కలిగిస్తుంది తప్ప మరే ప్రయోజనమూ లేదు. **ఇది హిక్మత్ అనిపించుకుంటుందా?** ఇస్లామ్‌ను అర్థం చేసుకున్నవారు వివేకంతో వ్యవహరిస్తారు.

మన దేశంలో నిర్మించబడిన ఎన్నో సినిమాలలో కూడా ఇస్లామ్‌ని చాలా అభ్యంతకర స్థాయిలో చూపిన సందర్భాలున్నాయి. ముస్లిమ్‌ల ముసుగులో ఎందరో కపట విశ్వాసులు ఒక మతధర్మంవారి ఆర్థిక సహకారంతో ముహమ్మద్(స)వారిని అవమానిస్తున్నారు. కపట విశ్వాసుల కార్యక్రమాలు మన రాష్ట్రంలో నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ఈ విషయం వివిధ జమాత్‌ల నాయకులకు తెలిసి కూడా, తెలియనట్లు నిద్ర నటిస్తున్నారు. మన చుట్టుపక్కల జరుపుతున్న వారికే నిరసన తెలపలేని, మరియు వారిని చట్టపరంగా హెచ్చరించలేని ఇక్కడి ముస్లిములు ఎక్కడో ఓ శక్తివంతమైన ధూర్తదేశం చేసే పనులను ఎలా నిరోధించ గలుగుతారు?

**ముస్లిమ్ సోదరులకు విజ్ఞప్తి** : విధ్వంసాలు చేసే మానవత్వం లేని పాశ్చాత్య దేశాలు, ముస్లిములను విధ్వంసకారులుగా చిత్రీకరించాలని ఎన్నో పథకాలు వేస్తున్నాయి. **వారి కవ్వింపులకు మీరు రెచ్చిపోతే వారి కుట్ర ఫలిస్తుంది.** మన ప్రియ ప్రవక్త ముహమ్మద్(స)వారు చూపిన శాంతియుత మార్గంలో వారికి ధీటుగా సమాధానం చెప్పాలి. ప్రపంచ ప్రజలు వారి రాక్షసత్వాన్ని తెలుసుకునేలా చేయాలి. పాశ్చాత్య దేశాలు సిగ్గుతో తలదించు కునేలా శాంతియుతంగా వ్యవహరించాలి.

ముహమ్మద్(స)వారు జన్మించడానికి ముందు ఉండే జాతులలో ప్రవక్తలను దూషించే వ్యక్తులు, అవమానించే వ్యక్తులు, ప్రవక్తలను చంపే వ్యక్తులు ఉండేవారు. ముహమ్మద్(స)వారు ఇస్లామ్ బోధనలతో ప్రవక్తలందరినీ ప్రేమించే విధంగా మరియు గౌరవించే విధంగా ముస్లిములకు శిక్షణ ఇచ్చారు. అమెరికా ప్రభుత్వం తమ ప్రవక్తను ప్రేమించి, అంతిమ ప్రవక్తయైన ముహమ్మద్(స)వారిపై విద్వేషం కక్కుతుంది. ఇజ్రాయెల్ తమ ప్రవక్తను ప్రేమిస్తూ, ముహమ్మద్(స)వారిపై విషం కక్కుతుంది. కాని ఇస్లామ్‌ను ప్రేమించేవారు ప్రవక్తలందరినీ ప్రేమిస్తూ, ముహమ్మద్(స)వారిని అనుసరిస్తారు. అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఇలా చెప్పారు :

> నిశ్చయంగా మీరు, మీ ధన ప్రాణాలతో పరీక్షింపబడతారు మరియు నిశ్చయంగా, **మీకు పూర్వం గ్రంథం ప్రసాదించబడిన వారినుండి మరియు అల్లాహ్‌కు భాగస్వాములు (సాటి) కల్పించిన వారి నుండి, మీరు అనేక వేదన కలిగించే మాటలు** వింటుంటారు. కానీ, ఒకవేళ మీరు ఓర్పు వహించి, అల్లాహ్ పట్ల భీతి కలిగి ఉంటే! నిశ్చయంగా, అది సాహసంతో కూడిన కార్యం. **(ఖుర్ఆన్ 3:186)**

**సహనం అనేది విశ్వాసుల (మోమిన్ల)కుండే ముఖ్య లక్షణం.** ప్రవక్త(స)వారి విధానం ప్రకారం ఎవరి ఆచరణ అయినా ఉంటే ప్రపంచం అటువంటి ఆచరణగలవారిని ప్రేమిస్తుంది. అప్పుడు మన ప్రవక్త(స)వారిపై ఎందరు ఎంత విద్వేషాన్ని కక్కినా, ఎవ్వరూ పట్టించుకోరు. విద్వేషం కక్కేవారిని అవమానిస్తారు.

**మనమంతా ఆచరణల ద్వారా ఇస్లామ్ గురించి ప్రజలకు తెలియజేసినపుడు, ఏ దుష్ప్రచారకుడైనా ప్రజల మధ్యకు వచ్చి ధూషించే ధైర్యం చేయగలడా? ఆత్మపరిశీలన చేసుకోవాలి.**

**- శాంతిబాట టీమ్**



# అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

25

## ఖుర్'ఆన్ తఫ్సీర్

البقرة

**2. సూరహ్ అల్-బఖరా**

( గత సంచిక తరువాయి )

### 40వ ఆయత్ నుండి 49వ ఆయత్ వరకూ

క్రిందటి సంచికలో 40వ ఆయత్ వ్యాఖ్యానంలో 'ఇస్రాయీల్ - అల్లాహ్ యొక్క ప్రవక్తయైన యాఖూబ్(అ)'అని మరియు ఇస్రాయీల్ సంతానంపై అల్లాహ్ యొక్క అనుగ్రహాల గురించి ప్రస్తావించడం జరిగింది. ఆ ఆయత్ గురించి మరికొంత తఫ్సీర్ ఇప్పుడు చెప్పుకుందాం. 40వ ఆయత్‌లో ఇస్రాయీలీయులతో తనకు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చమని అల్లాహ్ గుర్తుచేశారు. అల్లాహ్‌తో వారు చేసుకున్న ఆ వాగ్దానాన్ని క్రింది ఖుర్'ఆన్ వాక్యం వివరిస్తుందని ఖతాదహ్ మరియు ముజాహిద్ వ్యాఖ్యానించారు :

> **"మరియు వాస్తవానికి అల్లాహ్ ఇస్రాయీల్ సంతతివారి నుండి ధృఢమైన ప్రమాణాన్ని తీసుకున్నాడు. మరియు మేము వారిలో నుండి పన్నెండు మందిని నాయకులుగా నియమించాము. అల్లాహ్ వారితో అన్నాడు : "ఒకవేళ మీరు సలాత్(నమాజ్) స్థిరంగా సలుపుతూ, జకాత్ (విధి దానం) చెల్లిస్తూ మరియు నా ప్రవక్తలను విశ్వసించిన వారికి తోడ్పడుతూ, అల్లాహ్‌కు మంచి ఋణాన్ని ఇస్తూ వుంటే, నేను నిశ్చయంగా మీతోపాటు ఉన్నాను. మరియు నేను నిశ్చయంగా, మీ నుండి మీ పాపాలను తొలగిస్తాను మరియు నిశ్చయంగా మిమ్మల్ని క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాను. కానీ, దీని తరువాత మీలో ఎవడు సత్య తిరస్కారవైఖరిని అవలంభిస్తాడో! అతడు వాస్తవంగా, సరైన మార్గం నుండి తప్పిపోయినవాడే!"** (ఖుర్'ఆన్ 5:12)

వీరు చేసిన ప్రమాణం - ప్రార్థనలు మరియు దానధర్మాల వంటి ఆచరణలకు మాత్రమే పరిమితం కాదు. ముహమ్మద్(స) వారితో సహా ప్రవక్తలందరిపై విశ్వాసాన్ని కలిగి ఉండాలనే విషయాన్ని స్పష్టం చేస్తుంది. ఖుర్'ఆన్ తఫ్సీర్‌లో ప్రావీణ్యులైన ఇబ్నె అబ్బాస్(రజి)వారి వివరణ ప్రకారం, ఈ ప్రమాణం ప్రవక్త(స)వారిని విశ్వసించడాన్ని మరియు ఆయన(స)కు విధేయత చూపడాన్ని తెలియచేస్తుంది.

40వ ఆయత్‌లో **'నేను మీతో చేసిన వాగ్దానాన్ని నెరవేర్చుతాను'** అనే విషయాన్ని పై ఖుర్'ఆన్ ఆయత్ (5:12) స్పష్టంగా వివరించింది. అంటే వారు తమ వాగ్దానాన్ని నెరవేర్చితే, వాగ్దానం నెరవేర్చినవారి పాపాలను అల్లాహ్ క్షమించి వారిని స్వర్గంలో ప్రవేశింపజేస్తారు.

> **ఓ ఇస్రాయీల్ సంతతివారలారా! నేను మీకు చేసిన ఉపకారాన్ని జ్ఞాపకం చేసుకోండి. మరియు నాతో చేసిన వాగ్దానాన్ని నెరవేర్చండి. నేను మీతో చేసిన వాగ్దానాన్ని నెరవేర్చుతాను. మరియు మీరు నాకు మాత్రమే భయపడండి. మరియు మీ వద్దనున్న వాటిని ధృవీకరిస్తూ నేను అవతరింప జేసిన (ఈ ఖుర్'ఆన్)ను విశ్వసించండి. మరియు దీనిని తిరస్కరించే వారిలో మీరు మొట్టమొదటి వారు కాకండి. మరియు అల్ప లాభాలకు నా సూచన (ఆయత్)లను అమ్మకండి. కేవలం నా యందే భయభక్తులు కలిగి ఉండండి.** (ఖుర్'ఆన్ 2:40-41)

ఇక 41వ ఆయత్ ప్రకారం, ఇస్రాయీలీయులు ఖుర్'ఆన్ సందేశంపై విశ్వాసం కలిగి ఉండటం తప్పనిసరి. ఎందుకంటే దివ్య ఖుర్'ఆన్ ముందు వచ్చిన తౌరాత్‌లోని ముఖ్యమైన బోధనలను ధృవీకరిస్తుంది. కాని వారి విద్వాంసులు సత్యాన్ని బయటపెట్టడానికి భయపడ్డారు. సత్యాన్ని ఒప్పుకుంటే పబ్లిక్ సెంటిమెంట్‌కు వ్యతిరేకంగా వెళ్ళినట్లు అవుతుంది. అంతేకాకుండా తమతో ఉండే అనుచరులను మరియు అక్రమ మార్గంలో ఆర్జించే సంపాదనను వారు కోల్పోవలసి వస్తుంది. కాబట్టి ఈ మూడు ఆయత్‌లు (40,41 మరియు 42) వారిని **భయపడకుండా సత్యాన్ని తెలుపమని బోధిస్తున్నాయి.** ఎందుకంటే ఎవరి భయాన్ని అయినా పొందే హక్కు కేవలం అల్లాహ్‌కే ఉంది. అంటే అల్లాహ్‌కు తప్ప మరొకరికి భయపడ కూడదు. అల్లాహ్‌ను తప్ప వేరొకరిని ఆరాధించకూడదు. అలా చేస్తే అది షిర్క్ అవుతుంది. ఎందుకంటే ఆరాధించబడటానికి హక్కు ఆయన మాత్రమే కలిగి ఉన్నారు. అదే విధంగా భయాన్ని పొందడానికి కూడా ఆయనే హక్కు కలిగి ఉన్నారు.

ఆయనకు కాకుండా ఇతరులకు భయపడితే అది షిర్క్ కాదా? జీవనోపాధిని ఇచ్చేది మరియు గౌరవాన్ని కలిగించేది అల్లాహుతాలాయే! **ఆనాటి విద్వాంసులకే కాకుండా, నేటి విద్వాంసులకు కూడా కనువిప్పు కలిగించే ఆయత్ ఇది.** ఈ ఆయత్ (2:41) ఇస్రాయీలీయులను ప్రోత్సహించడమే కాకుండా, దాని వెంబడే ఓ హెచ్చరిక కూడా చేసింది.

అల్లాహ్ మొట్టమొదట ఇస్రాయీల్ సంతానాన్ని ప్రోత్సహిస్తూ పిలిచారు. తరువాత వారు సత్యం వైపు మరలే విధంగా, రసూలుల్లాహ్ (స)వారిని అనుసరించేలా, ఖుర్ఆన్ నిషేధాజ్ఞలను మరియు ఆదేశాలను లక్ష్యపెట్టే విధంగా మరియు అందులోని విషయాలను విశ్వసించే విధంగా వారిని హెచ్చరించారు. నిశ్చయంగా అల్లాహ్ తను కోరినవారికి సన్మార్గం చూపుతాడు.

**"మరియు మీ వద్దనున్న వాటిని ధృవీకరిస్తూ నేను అవతరింపజేసిన దానిని విశ్వసించండి"** అనే అల్లాహ్ ప్రకటనపై అబూ ఆలియహ్ ఇలా వ్యాఖ్యానించారు :

''ఓ గ్రంథప్రజలారా! విశ్వసించండి నేను అవతరింప జేసినదానిని. అది ధృవీకరిస్తుంది మీరు కలిగియున్న దానిని''. ఇది ఎందుకంటే ముహమ్మద్ (స)వారి గురించిన వర్ణన తౌరాత్ మరియు ఇంజీల్‌లో గ్రంథస్థమై ఉందని వారికి తెలుసు కాబట్టి. దాదాపు ఇటువంటి వ్యాఖ్యానాలే ముజాహిద్, రబీ బిన్ అనస్ మరియు ఖతాదహ్ చేసినట్లు చెప్పబడింది.

**"మరియు దీనిని తిరస్కరించేవారిలో మీరు మొట్టమొదటివారు కాకండి"** అనే విషయంపై ఇబ్నె అబ్బాస్(రజి)వారు ఇలా వ్యాఖ్యానించారు. ''ఈ విషయంలో మీరు ఇతరులకంటే ఎక్కువ జ్ఞానాన్ని కలిగి ఉండి కూడా మొదటివారు కావద్దు ఖుర్ఆన్‌ను తిరస్కరించడంలో''

ఇబ్నె జరీర్ చెప్పారు, ఈ ఆయత్‌లో వివరించబడేది ఖుర్ఆన్ గురించి అని. **"మరియు అల్ప లాభాలకు నా సూచనలను అమ్మకండి"** అంటే నా ఆయత్‌లపై మరియు నా ప్రవక్తపై ఉండవలసిన విశ్వాసానికి, ఇహలోక జీవితం మరియు దాని వ్యామోహాలను ప్రత్నామ్యాయంగా చేసుకోకండి. అవి అల్పమైనవి మాత్రమే కాకుండా వాటి ముగింపు నిశ్చయం.

**మరియు సత్యాన్ని అసత్యంతో కలిపి తారుమారు చేయకండి మరియు మీకు తెలిసి ఉండి కూడా సత్యాన్ని దాచకండి (2:42)**

ఉద్దేశపూర్వకంగా సత్యాన్ని అసత్యంతో కలిపి వక్రీకరించడం నుండి మరియు సత్యాన్ని దాస్తూ అసత్యాన్ని వ్యాపింపజేయడం నుండి యూదులను అల్లాహ్ నిషేధించారు . ఈ ఆయత్‌పై ఖతాదహ్ చెప్పారు, **"యూదత్వాన్ని మరియు క్రైస్తవత్వాన్ని ఇస్లామ్‌తో కలిపి తారుమారు చేయవద్దని."**

**''మీకు తెలిసి ఉండి కూడా సత్యాన్ని దాచకండి''** ఈ విషయంపై ఇబ్నె అబ్బాస్ (రజి)వారి వివరణను ముహమ్మద్ బిన్ ఇస్‌హాఖ్‌గారు ఉల్లేఖించారు. (ఇబ్నె అబీ హాతిమ్ 1:148, తఫ్సీర్ ఇబ్నె కసీర్)

''నా సందేశహరుడు గురించి మరియు దేనితో అయితే అతడు పంపబడ్డాడో (దాని గురించి) మీరు కలిగియున్న జ్ఞానాన్ని దాచవద్దు. అతని యొక్క వర్ణన గురించి మీకు తెలుసు, మీరు కలిగియున్న గ్రంథాలలో వ్రాయబడిందని తెలుసుకోగలరు''.

బఖరహ్ సూరహ్ 43వ ఆయత్ నుండి 49వ ఆయత్ వరకూ ప్రతీ పదానికి తెలుగులో అర్థాన్ని మరియు ఆయత్ అనువాదాన్ని ప్రక్క పేజీలో చూడండి. 43వ ఆయత్‌లో సలాత్ గురించి చెప్పడం జరిగింది.

అస్సలాత్ (నమాజ్) గురించి చెప్పినప్పుడు ఖుర్ఆన్‌లో ఎక్కువగా ఆ పదంతో పాటు 'ఇఖామహ్' అనే పదం కూడా వస్తుంది. భాషా పరంగా ఈ పదానికి అర్థం ఒక వస్తువును నిలువుగా చేయడం లేదా దాని స్థానంలో స్థిరంగా ఉంచడం. **'సలాత్‌ను స్థాపించండి'** అంటే కేవలం సలాత్ చేస్తే సరిపోదు. రోజుకి 5 సార్లు చేయాలి. మరియు వాటిని నిర్ణయించబడిన సమయాలలో చేయాలి. **సలాత్ కొరకు నిర్ణయించ బడిన నియమాలను నెరవేర్చాలి.** అప్పుడే సలాత్ (నమాజ్)ను స్థాపించి నట్లు అవుతుంది.

సలాత్ చేసే విధానం, మరియు దాని ఆచరణకు సంబంధించిన ఎన్నో విషయాలను ప్రవక్త(స)వారు బోధించారు. ఆచరించి చూపారు. ఇవి హదీస్ గ్రంథాలలో ఉన్నాయి.

**'జకాత్'** ఇవ్వండి అని అల్లాహ్ ఆదేశించారు. శాంతిబాట పాఠకులకు జకాత్ గురించి ప్రత్యేకంగా వివరించ నవసరం లేదు. గత మూడు సంవత్సరాలుగా జకాత్‌కు సంబంధించి సూక్ష్మ విషయాలను కూడా వివరించడం జరిగింది. 'సలాత్' - అల్లాహ్‌కు మనపై నున్న హక్కు. అంటే ఇది అల్లాహ్‌కు మరియు దాసుడికి మధ్య నున్న విషయం. 'జకాత్' - సమాజంలో అల్లాహ్ నిర్దేశించిన కొందరికి మనపై నున్న హక్కు. ఈ రెండూ ఆరాధనకు సంబంధించినవే. ఇవి రెండూ ఇహలోకం లోనూ మరియు పరలోకం లోనూ విశ్వాసికి మేలు చేస్తాయి.

ఈ ఆయత్‌లో ''**రుకూ చేసేవారితో రుకూ చేయండి**'' అని ఆదేశించడం జరిగింది. 'రుకూ' అంటే భాషాపరమైన అర్థం 'క్రిందికి వంగుట' (to bow down). **షరీయహ్ అర్థం ప్రకారం** సలాత్‌లో నిర్దేశించబడిన విధంగా వంగుట. భాషాపరమైన అర్థాలు మరియు సాంకేతిక పదాల అర్థాల గురించి మనకు అవగాహన ఉండాలి. సాధారణంగా మనం ఉపయోగించే ఎన్నో పదాలు, ఫిజిక్స్, కెమిస్ట్రీ మొదలైన సబ్జక్టులలో టెక్నికల్ పదాలుగా వాడటం జరిగింది. ఆ టెక్నికల్ పదాన్ని ఆయా సబ్జక్టులలో ఒక ప్రత్యేకమైన ప్రక్రియకు మాత్రమే ఉపయోగించడం జరుగుతుంది. అదే పదాన్ని సాధారణ విషయాలలో చాలా రకాలుగా వాడే అవకాశం ఉంటుంది.

సలాత్ ప్రారంభంలో నిలుచుని ఖుర్ఆన్ పఠించడం, తరువాత రుకూ చేయడం, ఆ తరువాత సజ్దా మొదలైనవి చేస్తాము. కాబట్టి

43. మరియు సలాత్‌ను స్థాపించండి మరియు జకాత్ (విధి దానం) ఇవ్వండి మరియు రుకూ చేసేవారితో పాటు మీరూ రుకూ చేయండి.

44. ఏమీ? మీరు ప్రజలను నీతిపరులుకమ్మని ఆజ్ఞాపిస్తున్నారు, కాని స్వయంగా మీరే దానిని అవలంబించడం మరచి పోతున్నారెందుకు? మరియు మీరైతే గ్రంథాన్ని చదువు తున్నారు! అయితే మీ బుద్ధిని ఉపయోగించరా?

45.మరియు సహనం మరియు సలాత్ ద్వారా (అల్లాహ్) సహాయాన్ని అర్థించండి. మరియు నిశ్చయంగా, అది వినమ్రులైన వారికి తప్ప, (ఇతరులకు) ఎంతో కష్టతరమైనది.

46.అలాంటివారు తాము, తమ ప్రభువును నిశ్చయంగా, కలుసు కోవలసి ఉందనీ మరియు ఆయన వైపునకే మరలి పోవలసి ఉందనీ నమ్ముతారు.

47. ఓ ఇస్రాయీల్ సంతతివారలారా! నేను మీకు చేసిన మహోపకారాన్ని జ్ఞాపకం చేసుకోండి మరియు నేను నిశ్చయంగా, మిమ్మల్ని (మీ కాలంలో) సర్వలోకాలవారి కంటే అధికంగా ఆదరించాను.

48. మరియు ఆ (తీర్పు) దినమునకు భయపడండి, అప్పుడు ఒక వ్యక్తి మరొక వ్యక్తికి ఏ విధంగానూ ఉపయోగపడడు, మరియు అతని నుండి ఎట్టి సిఫారసూ అంగీకరించబడదు మరియు ఎలాంటి పరిహారం కూడా తీసుకోబడదు మరియు వారికెలాంటి సహాయం కూడా చేయబడదు.

**43 ఆయత్ నుండి 49 ఆయత్ వరకూ**

| | | |
|---|---|---|
| وَاٰتُوا | الصَّلٰوةَ | وَاَقِيْمُوا |
| మరియు ఇవ్వండి | అస్సలాత్ (నమాజ్) | మరియు స్థాపించండి |

| | | | | | |
|---|---|---|---|---|---|
| اَتَاْمُرُوْنَ | ٤٣ | الرّٰكِعِيْنَ | مَعَ | وَارْكَعُوْا | الزَّكٰوةَ |
| మీరు ఆదేశిస్తారా? | 43 | రుకూ చేసేవారు | తో | మరియు రుకూ చేయండి | జకాత్ (విధి దానం) |

| | | | | | |
|---|---|---|---|---|---|
| تَتْلُوْنَ | وَاَنْتُمْ | اَنْفُسَكُمْ | وَتَنْسَوْنَ | بِالْبِرِّ | النَّاسَ |
| మరియు మీరు పఠించేవారు | | మీరే స్వయంగా | మరియు మీరు మరచిపోతారు | నీతిపరులు కమ్మని | ప్రజల(ను) |

| | | | | | |
|---|---|---|---|---|---|
| بِالصَّبْرِ | وَاسْتَعِيْنُوْا | ٤٤ | تَعْقِلُوْنَ | اَفَلَا | الْكِتٰبَ |
| సహనంతో | మరియు సహాయాన్ని అర్థించండి | 44 | అయినా మీరు బుద్ధి ఉపయోగించరా? | | గ్రంథాన్ని |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| ٤٥ | الْخٰشِعِيْنَ | عَلَى | اِلَّا | لَكَبِيْرَةٌ | وَاِنَّهَا | وَالصَّلٰوةِ |
| 45 | వినమ్రులైనవారు | పై | తప్ప | ఎంతో కష్టమైనది | మరియు నిశ్చయంగా అది | మరియు సలాత్(తో) |

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| رٰجِعُوْنَ | اِلَيْهِ | وَاَنَّهُمْ | رَبِّهِمْ | مُّلٰقُوْا | اَنَّهُمْ | يَظُنُّوْنَ | الَّذِيْنَ |
| మరలుతారు | ఆయన వైపు | మరియు వారు | తమ ప్రభువును | కలుస్తారు | వారు | నమ్ముతారు | ఎవరైతే |

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| عَلَيْكُمْ | اَنْعَمْتُ | الَّتِيْٓ | نِعْمَتِيَ | اذْكُرُوْا | اِسْرَآءِيْلَ | يٰبَنِيْٓ | ٤٦ |
| మీ పై | నేను అనుగ్రహించాను | ఏదైతే | ఉపకారాన్ని | జ్ఞాపకం చేసుకోండి | ఓ ఇస్రాయీల్ సంతతివారలారా! | | 46 |

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| لَّا | يَوْمًا | وَاتَّقُوْا | ٤٧ | الْعٰلَمِيْنَ | عَلَى | فَضَّلْتُكُمْ | وَاَنِّيْ |
| లేదు | ఆ రోజు నుండి | మరియు భయపడండి | 47 | సర్వలోకాలు | పై | మిమ్మల్ని ఆధిక్యులుగా చేశాను | మరియు దానిని నేను |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| مِنْهَا | يُقْبَلُ | وَّلَا | شَيْـًٔا | عَنْ نَّفْسٍ | نَفْسٌ | تَجْزِيْ |
| దాని నుండి | మరియు స్వీకరించ బడదు | | ఏదైనా | మరొక వ్యక్తి | వ్యక్తి | ప్రయోజనం |

49. మరియు ఫిర్ఔన్ జాతివారి (బానిసత్వం) నుండి మేము మీకు విముక్తి కలిగించిన సందర్భాన్ని (జ్ఞాపకం చేసుకోండి). వారు మిమ్మల్ని ఘోరహింసకు గురిచేస్తూ ఉండేవారు. మీ కుమారులను వధించి, మీ స్త్రీలను సజీవులుగా విడిచి పెట్టేవారు. మరియు ఇందులో మీ ప్రభువు తరపునుండి మీకు గొప్ప పరీక్ష ఉండింది.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| هُمْ | وَّلَا | عَدْلٌ | مِنْهَا | يُؤْخَذُ | وَّلَا | شَفَاعَةٌ |
| వారు | మరియు కాదు | పరిహారం | దాని నుండి | మరియు తీసుకోబడదు | | సిఫారసు |
| اٰلِ فِرْعَوْنَ | مِّنْ | نَجَّيْنٰكُمْ | وَاِذْ | ۴۸ | يُنْصَرُوْنَ | |
| ఫిరౌన్ ప్రజలు | నుండి | మేము మిమ్మల్ని రక్షించాము | మరియు అప్పుడు | 48 | సహాయం చేయ బడినవారు (కాదు) | |
| وَيَسْتَحْيُوْنَ | اَبْنَآءَكُمْ | يُذَبِّحُوْنَ | الْعَذَابِ | سُوْٓءَ | يَسُوْمُوْنَكُمْ | |
| మరియు బ్రతకనిచ్చేవారు | మీ కుమారులను | వధించేవారు | శిక్ష | ఘోరమైన | మిమ్మల్ని హింసించినవారు | |
| ۴۹ عَظِيْمٌ | رَّبِّكُمْ | مِّنْ | بَلَآءٌ | ذٰلِكُمْ | وَفِيْ | نِسَآءَكُمْ |
| గొప్పది | మీ ప్రభువు | నుండి | ఒక పరీక్ష | మరియు మీ కొరకు దానిలో | | మీ స్త్రీలను |

## సూరహ్ అల్-బఖరా (43 నుండి 49 ఆయత్‌లలో వచ్చిన అరబీ) పదాల అర్థాలు

| | | | |
|---|---|---|---|
| 355. స్థిరంగా ఉండండి | أَقِيْمُوْا | 370. అది వారు | أَنَّهُمْ |
| 356. రుకూ చేయండి | ارْكَعُوْا | 371. కలుస్తారు | مُلَاقُوْا |
| 357. రుకూ చేసేవారు | رَاكِعِيْنَ | 372. మరలేవారు | رَاجِعُوْنَ (ر ج ع) |
| 358. ఏమీ? | أَ | 373. అది నేను | أَنِّيْ |
| 359. ఆదేశిస్తారు | تَأْمُرُوْنَ (ا م ر) | 374. నేను ఆధిక్యత నిచ్చాను | فَضَّلْتُ (ف ض ل) |
| 360. ధర్మపరాయణత | بِرّ | 375. మరియు భయపడండి | وَاتَّقُوْا |
| 361. మీరు మరచిపోతారు | تَنْسَوْنَ (ن س ي) | 376. ఒక రోజు | يَوْمًا |
| 362. మీరే స్వయంగా | أَنْفُسَكُمْ (ن ف س) | 377. ఉపయోగం ఉండదు | لَاتَجْزِىْ (ج ز ي) |
| 363. మీరు పఠిస్తారు | تَتْلُوْنَ (ت ل و) | 378. ఆత్మ (వ్యక్తి) | نَفْسٌ |
| 364. అయినప్పటికీ | أَفَلَا | 379. గురించి | عَنْ |
| 365. మీరు ఆలోచిస్తారు | تَعْقِلُوْنَ (ع ق ل) | 380. స్వీకరించబడదు | لَا يُقْبَلُ (ق ب ل) |
| 366. సహాయాన్ని అర్థించండి | اِسْتَعِيْنُوْا | 381. సిఫారసు | شَفَاعَةٌ (ش ف ع) |
| 367. ఎంతో కష్టమైన | لَكَبِيْرَةٌ | 382. వారు సహాయంచేయబడతారు | يُنْصَرُوْنَ |
| 368. వినమ్రులైనవారు | خَاشِعِيْنَ (خ ش ع) | 383. తీసుకోబడదు | لَا يُؤْخَذُ |
| 369. నమ్ముతారు | يَظُنُّوْنَ (ظ ن ن) | 384. పరిహారం | عَدْلٌ |

| | | | |
|---|---|---|---|
| 385. మేము మిమ్మల్ని విముక్తులను చేశాము | نَجَّيْنَاكُمْ (ن ج و) | 392. కుమారులు (మగపిల్లలు) | أَبْنَآءَ (ابْنٌ (sr.: |
| 386. ప్రజలు / అనుచరులు | آلَ | 393. వారు బ్రతకనిచ్చేవారు/వదిలేవారు | يَسْتَحْيُوْنَ |
| 387. ఫిర్ఔన్ | فِرْعَوْنَ | 394. స్త్రీలు | نِسَآء |
| 388. వారు గురిఅయ్యారు | يَسُوْمُوْنَ | 395. మరియు అందులో | وَفِيْ ذٰلِكُمْ |
| 389. ఘోరం | سُوْءَ | 396. పరీక్ష | بَلَآءٌ |
| 390. శిక్ష | عَذَاب | 397. మీ ప్రభువు | رَبُّكُمْ |
| 391. వధించుట | ذَبْح | 398. గొప్పది | عَظِيْمٌ |

సలాత్ చేసేవారితో కలిసి సలాత్ చేయండి అని చెప్పినా, 'రుకూ చేసేవారితో కలిసి రుకూ చేయండి' అని చెప్పినా విశ్వాసులు దానిని ఒకే విధంగా తీసుకుంటారు. అయితే అరబీ పదాల భాషానువాదాన్ని మాత్రమే ప్రస్తావించి సత్యాన్ని వక్రీకరించేవారికి ఇక్కడ అవకాశం లేదు.

**ఇక్కడ సలాత్‌ను దానిలోని ఒక ముఖ్య విశేషణాన్ని ఉపయోగించి ప్రస్తావించడం జరిగింది.** దీనిని ఇంగ్లీష్‌లో metonymy అంటారు. ఉదాహరణకు ఇంగ్లీష్ భాషలో king (రాజు) అనడానికి crown (కిరీటం) అనే పదాన్ని కూడా ఉపయోగిస్తారు. ఎందుకంటే కిరీటం అనేది రాజు మాత్రమే పెట్టుకుంటాడు. అదే విధంగా 17వ సూరహ్‌లోని 78వ ఆయత్ చూడండి. అందులో **(ఖుర్'ఆనల్ ఫజ్ర్) "ఉదయకాలపు ఖుర్'ఆన్ పఠనం"** అనేది 'ఫజ్ర్ సలాత్'లో చదివే ఖుర్'ఆన్ పఠనం. సలాత్‌లోని ఓ విశేషణంతో సలాత్‌ను సూచించే పదాలు చాలా హదీసులలో కూడా చెప్పబడ్డాయి. **రుకూ చేయడమనేది ఇస్లామీయ సలాత్‌లోనే ఉంది.** కాబట్టి రుకూ చేసేవారితో రుకూ చేయండి అంటే ఇస్లామ్ స్వీకరించి, వారితో పాటు అంటే ఇస్లామీయ ఉమ్మత్‌తోపాటు సలాత్ చేయమని.

అంతేకాకుండా **"సలాత్ చేసేవారితో సలాత్ చేయడం"** అనేది ఓ విషయాన్ని స్పష్టం చేస్తుంది. అదేమిటంటే, సలాత్ అనేది సామూహికంగా చేయాలి. ఈ విధంగా 43వ ఆయత్ సలాత్‌ను స్థాపించడం గురించి, సలాత్‌ను సామూహికంగా చేయడం గురించి, జకాత్ చెల్లించడం గురించి వివరిస్తూ ఇస్రాయీల్ సంతానాన్ని ఇస్లామ్ స్వీకరించమని వివరిస్తుంది.

**ఏమీ? మీరు ప్రజలను నీతిపరులుకమ్మని ఆజ్ఞాపిస్తున్నారు, కాని స్వయంగా మీరే దానిని అవలంభించడం మరచి పోతున్నారు ఎందుకు? మరియు మీరైతే గ్రంథాన్ని చదువు తున్నారు! అయితే మీ బుద్ధిని ఉపయోగించరా? (ఖుర్'ఆన్ 2:44)**

ఈ ఆయత్ విషయమై ఖతాదహ్‌గారు చేసిన వ్యాఖ్యానాన్ని మ'మర్ చెప్పగా అబ్దుర్రజ్జాక్ చెప్పారు : ఇస్రాయీల్ సంతతివారు తమ ప్రజలతో అల్లాహ్‌కు విధేయత చూపమని, ఆయనకు భయపడమని మరియు మంచిపనులు చేయమని ఆదేశిస్తుండేవారు. కాని వారు ఈ ఆదేశాలకు విరుద్ధంగా ఉండేవారు, కాబట్టి అల్లాహ్ వారికి ఈ వాస్తవాన్ని జ్ఞాపకం చేస్తున్నారు. అస్-సుద్దిగారు కూడా ఇదే విధంగా చెప్పారు.

ఇబ్నె జురైజ్ గారు ఇలా చెప్పారు : (ఈ ఆయత్) **గ్రంథప్రజలు మరియు కపట విశ్వాసుల గురించి.** వారు ప్రజలను ప్రార్థనలు చేయమని మరియు ఉపవాసం ఉండమని ఆదేశిస్తుండేవారు. అయినప్పటికీ, వారు ఆచరించేవారు కాదు ఏదైతే వారు ఇతరులకు ఆదేశించేవారో. అల్లాహ్ వారి ప్రవర్తనను వారికి జ్ఞాపకం చేశారు. కాబట్టి ఎవరైతే ప్రజలను మంచి చేయమని ఆదేశిస్తారో, అతడు వారిలో మొదటివాడు అయ్యుండాలి ఆ ఆదేశాన్ని పాటించడంలో."

**"మరియు మీరైతే గ్రంథాన్ని చదువుతున్నారు. అయితే మీ బుద్ధిని ఉపయోగించరా?"** దీనిపై ఇబ్నె అబ్బాస్(రజి)వారు చెప్పిన దానిని ఇస్‌హాఖ్ ఉల్లేఖించారు. ప్రవక్తిత్వాన్ని మరియు మీతో ఉన్న తౌరాత్‌లోని మీరు ప్రస్తావిస్తున్న ఒడంబడికను తిరస్కరించడం నుండి ప్రజలను మీరు నిరోధిస్తున్నారు. (కాని) స్వయంగా మీరే దానిని మరచిపోతున్నారు, అంటే **'మీరు మరచిపోయారు నా సందేశహరుడిని స్వీకరించాలని నేను మీతో చేసిన ఒడంబడికను.'** మీరు నా ఒడంబడికను భగ్నం చేశారు మరియు నా గ్రంథంలో మీకు తెలిసిన దానిని తిరస్కరించారు." (అత్తబరి 2:7, ఇబ్నె కసీర్)

ఇబ్రాహీమ్ నఖా'ఈ చెప్పారు, "నేను ప్రజలకు సలహా ఇవ్వడానికి 3 ఆయత్‌ల వలన వెనుకాడుతున్నాను.

**ఏమీ? మీరు ప్రజలను నీతిపరులుకమ్మని ఆజ్ఞాపిస్తున్నారు, కాని స్వయంగా మీరే దానిని అవలంభించడం మరచి పోతున్నారెందుకు? (ఖుర్'ఆన్ 2:44)**

**ఓ విశ్వాసులారా! మీరు చేయని దానిని ఎందుకు పలుకు తున్నారు? మీరు చేయని దానిని పలకటం అల్లాహ్ దృష్టిలో అసహ్యకరమైన విషయం. (ఖుర్'ఆన్ 61:2-3)**

**"... నేను (షు'ఐబ్) మిమ్మల్ని నిషేధించిన దానికి వ్యతిరేకంగా చేయదలచుకోలేదు. నేను మాత్రం మిమ్మల్ని నా శక్తిమేరకు సంస్కరించ దలచుకున్నాను. నా కార్యసిద్ధి కేవలం అల్లాహ్‌పైననే ఆధారపడి ఉంది. నేను ఆయననే నమ్ముకున్నాను మరియు నేను ఆయన వైపునకే పశ్చాత్తాపంతో మరలుతాను. (ఖుర్'ఆన్ 11:88)**

**కాబట్టి ధర్మాచరణ గురించి బోధించడమే కాదు, దానిని ఆచరించాలి.** ఆ విధంగా చేయని ఓ బోధకుడి పరిస్థితి ఏమయిందో చూడండి :

ఉసామా బిన్ జైద్(రజి)వారి ఉల్లేఖనంలోని భాగం :

అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పగా విన్నాను : "ఒక వ్యక్తి పునరుత్థాన దినమున తీసుకురాబడి నరకాగ్నిలో విసిరివేయ బడతాడు. అతని ప్రేవులు వెదజల్లబడతాయి. మరియు అతడు వాటి చుట్టూ తిరుగుతాడు గానుగ చుట్టూ గాడిద తిరిగినట్లు. నరకాగ్ని ప్రజలు అతని చుట్టూ చేరి అడుగుతారు, "ఓ ఫలానా! నీకు ఈ గతి పట్టిందేమిటి? నీవు మాకు మంచిని ఆదేశించి మరియు చెడును నిరోధించే వాడివి కదా". అతడు చెబుతాడు, **"ఔను, నిశ్చయంగా నేను మీకు మంచిని ఆదేశించే వాడిని మరియు నేను దానిని చేసేవాడిని కాదు మరియు నేను చెడును నిరోధించేవాడిని మరియు నేను దానిని చేసేవాడిని."** (సహీహ్ **ముస్లిమ్, 7483, పుస్తకం 53, అధ్యా.7, సంపుటి 7)**

పైన ఇబ్రాహీమ్ నఖా'ఈ గారు ప్రస్తావించిన ఖుర్'ఆన్ ఆయత్‌ల ప్రకారం మరియు పై హదీస్‌లోని వివరాల ప్రకారం బోధించేవారు, **వాటిని పాటిస్తూ బోధించాలనేది** స్పష్టమౌతుంది.

ఆచరించేవాడు మాత్రమే బోధించాలంటే ఎలా కుదురుతుంది? **అలాగే జరగాలంటే ధర్మం ఎప్పుడు ప్రజలకు తెలుస్తుంది?** అని అడ్డంగా మాట్లాడేవారు ఆత్మపరిశీలన చేసుకోవాలి.

దగ్గు తగ్గడానికి ఓ మంచి మందు ఒకరు తయారు చేసారనుకుందాం. అది నిజంగా బాగా పనిచేస్తుందనే అనుకుందాం. అయితే ఆ దగ్గు మందు గురించి, దాని యొక్క గొప్పతనాన్ని ఇతరులకు వివరించే వ్యక్తి, చెబుతున్నప్పుడు విపరీతంగా దగ్గుతుంటే, వినేవారికి ఆ మందుపై అనుమానం కలిగే అవకాశం ఉంది. అతని దగ్గర మందు ఉంది. దానిని వేసుకునే అవకాశం కూడా అతనికి ఉంది.

దీనివలన ఆ మందు గురించి ప్రజలకు ఎటువంటి భావన కలుగుతుంది?

అయితే ఎప్పుడూ దగ్గుతూ ఉండే ఓ వ్యక్తికి నయం కావడాన్ని గమనించినవారు, అతనికి ఎలా నయమైందని అడిగినప్పుడు, అతడు ఆ మందు గురించి చెప్పినప్పుడు ప్రజలకు ఆ మందుపై విశ్వాసం కలుగుతుంది.

**అదే విధంగా సత్యధర్మాన్ని ఆచరిస్తూ బోధించడం ద్వారా గాని లేదా కేవలం ఆచరణ ద్వారానే బోధించడం వలన ధర్మంపట్ల ఇతరులలో మంచి అభిప్రాయం ఏర్పడే అవకాశం ఉంది, ఇన్షా అల్లాహ్!**

**(తఫ్సీర్‌లో మరికొంత భాగం ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో ...)**

---

### ఖుర్'ఆన్‌ను ప్రతీరోజూ చదువుదాం!

ఖుర్'ఆన్ పఠనాన్ని **వినడం** ఎంత పుణ్యమో తెలిసిన విషయమే! అయితే దానిని **పఠించడం** వలన లభించే పుణ్యం గురించి క్రింది హదీస్ తెలియజేస్తుంది.

حَدَّثَنَا قُتَيْبَةُ ابْنُ سَعِيدٍ وَ مُحَمَّدُ [بْنُ] عُبَيْدٍ الْغُبَرِيُّ، جَمِيعًا عَنْ أَبِي عَوَانَةَ قَالَ ابْنُ عُبَيْدٍ : حَدَّثَنَا أَبُو عَوَانَةَ عَنْ قَتَادَةَ، عَنْ زُرَارَةَ ابْنِ أَوْفَى، عَنْ سَعْدِ بْنِ هِشَامٍ، عَنْ عَائِشَةَ قَالَتْ : قَالَ رَسُولُ اللهِ ﷺ : ((الْمَاهِرُ بِالْقُرْآنِ مَعَ السَّفَرَةِ الْكِرَامِ الْبَرَرَةِ، وَالَّذِي يَقْرَأُ الْقُرْآنَ وَيَتَتَعْتَعُ فِيهِ، وَهُوَ عَلَيْهِ شَاقٌّ، لَهُ أَجْرَانِ)).

**ఆయిషా(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : "ఖుర్'ఆన్‌ను మంచి ప్రావీణ్యంతో పఠించే వ్యక్తి ఉన్నతమైన మరియు గౌరవనీయులైన లేఖకులతో (అస్-సఫరితిల్-కిరామిల్-బరరహ్‌తో) ఉంటాడు. మరియు ఎవరైతే ఖుర్'ఆన్ పఠిస్తూ మరియు (పఠించడంలో) తొట్రుపాటు పడుతూ మరియు కష్టంగా (పఠిస్తాడో) అతడు రెట్టింపు ఫలితాన్ని పొందుతాడు."**
**(సహీహ్ ముస్లిమ్, 1862, పుస్తకం 6, అధ్యా. 38, సంపుటి 2)**

పై హదీస్‌కు కొనసాగింపుగా ఉన్న హదీస్ (1863)లో ఇలా ఉంది. **"మరియు ఎవరైతే దానిని పఠిస్తారో అది అతనికి కష్టమైనప్పటికీ రెట్టింపు ఫలితాన్ని కలిగి ఉంటాడు."**

అరబ్బీ సరిగ్గా రాదని, ధారాళంగా చదవలేనని, పఠనం అంత బావుండదని ఏ విశ్వాసి కూడా భావించ నవసరం లేదు. అరబీ నేర్చుకుంటూ ఖుర్'ఆన్ పఠనం మొదలుపెట్టండి. రోజూ చదువుతుంటే తొట్రుపాటు పడకుండా చదవ గలుగుతారు. కంప్యూటర్‌లో వింటున్నాము. మొబైల్‌లో వింటున్నాము కదా సరిపోతుంది అనుకోవద్దు. అల్లాహ్ మనకోసం ఏర్పాటు చేసిన అవకాశాన్ని వదులుకోకూడదు. రెట్టింపు ఫలితాన్ని జారవిడుచుకోవద్దు.

**ఖుర్'ఆన్ అందరి కోసం. కేవలం విద్వాంసులకోసం కాదు.**

ప్రపంచ శాంతి దూత

# ముహమ్మద్ (స) వారి

**సన్మార్గ బోధకుడు**
**నాయకుడు**
**ఆదర్శనీయుడు**

**బోధనలు ఆచరణలు**

మంచిగా మానవత్వంతో బ్రతకమనే హితబోధను ప్రతి మనిషి తన ఊహతెలిసిన దగ్గరనుండి వింటూనే ఉంటాడు. అయితే ఏది మంచి? ఏది చెడు? కొంతమంది తమ దృష్టిలో ఫలానా విషయం మంచిది అని సమర్థిస్తారు. అదే విషయాన్ని మరికొందరు పూర్తి చెడుగానూ తీసుకుంటారు. అంతెందుకు, ఒకే మనిషిలో ఒకే పనిపై, తన జీవితంలోని వివిధ దశలలో వేర్వేరు అభిప్రాయాలు జనిస్తాయి. నిజంగా మంచి చెడులపై మనుషులయొక్క వ్యక్తిగత అభిప్రాయాలనే గనుక పరిగణనలోకి తీసుకుంటే, అన్ని పనులూ మంచి పనులే. అలాగే అన్నీ కూడా చెడ్డపనులే అవుతాయి.

కేజీ బరువున్న వస్తువును, ప్రపంచంలో ఎక్కడకు తీసికెళ్లినా అది కేజీ బరువే ఉంటుంది. అలాగే కొలతలకు కూడా ప్రపంచవ్యాప్తంగా ఒకటే ప్రమాణముంది.

మరి మనిషి జీవనానికి లేదా ఆచరణకు ప్రపంచవ్యాప్తంగా  అలాంటి ఓ ప్రమాణం లేదా? ప్రపంచంలోని ఏ మారుమూలనుండి ఏ వ్యక్తిని తీసుకున్నా, అతని శారీరక నిర్మాణం, అతని అవయవాల పనితీరు తదితర అంశాలన్నీ మిగతా ప్రాంతాలలోని మనుషులలాగే ఒకే విధంగా ఉంటాయి కదా!

మనిషి అనే ఈ జీవయంత్రాన్ని తయారుచేసి, దానికి అవసరమైన ప్రోగ్రామింగ్‌ను చేసిన సృష్టికర్తకే తెలుసు - ఈ మనిషికి ఏది మంచి చేస్తుందో, ఏది చెడు చేస్తుందోనన్న విషయం.

మంచి చెడుల  ప్రమాణాలు ఖుర్'ఆన్‌లో ఉన్నాయి. అయితే ఆ ప్రమాణాల ప్రకారంగా ఎటువంటి సందేహానికి లోనవకుండా ఉండేందుకు ముహమ్మద్(స) మనందరి శిక్షణకై ఎన్నో విషయాలను ఆచరించి చూపారు. ఖుర్'ఆన్ యొక్క ఆదేశాల ప్రకారంగా దైవప్రవక్త ముహమ్మద్ (స)ఆచరించిన పనులను మరియు ఆయన యొక్క  ప్రవచనాలను హదీస్‌లు అంటారనే  విషయం చాలామందికి తెలుసు.  సమకాలీన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వేల సంఖ్యలో ఉన్న హదీసులలోని కొన్ని హదీసులను ఎన్నుకొని ఈ శీర్షిక ద్వారా ఇన్షాఅల్లాహ్ అందిస్తూ ఉంటాము.

---

## ఉత్తమ సమాజం 20

**ఈ నెల ప్రత్యేకం : ఉత్తమ లక్షణాలు** (Best Character)

**“మరియు మీరు ప్రజలకు సాక్షులుగా ఉండటానికి మరియు సందేశహరుడు (ముహమ్మద్) మీకు సాక్షిగా ఉండటానికి మేము మిమ్మల్ని ఒక మధ్యస్థ (ఉత్తమ మరియు న్యాయశీలమైన) సమాజంగా చేశాము .....” (ఖుర్'ఆన్ 2:143)**

"And thus we have made you a **median [i.e. just] community** that you will be witnesses over the people and the Messenger will be a witness over you ....." (Qur'an 2:143)

---

**“మీరే మానవజాతి (హితం) కొరకు నిలబెట్టబడిన ఉత్తమ సమాజం వారు. మీరు మంచిని ఆదేశించే (బోధించే)వారు మరియు చెడును నిరోధించే వారు మరియు మీరు అల్లాహ్ యందు విశ్వాసం కలిగి ఉన్నవారు ...”  (ఖుర్'ఆన్ 3:110)**

"You are the **best nation** produced [as an example] for mankind. You enjoin what is right and forbid what is wrong and believe in ALLAH ....." (Qur'an 3:110)



ఒక సమాజం ఉత్తమ సమాజం కావాలంటే జీవనోపాధి గురించి ఇతరులపై ఆధారపడకుండా, ఏ రిజర్వేషన్లు లేకుండానే ఏ విధంగా సాధించవచ్చో జూన్-జూలై'10 సంచికలోనూ, ఆర్థికంగా స్థిరపడిన తరువాత మనపై నున్న బాధ్యతలను తెలుసుకుని మసలుకోవాలని చెబుతూ, ముఖ్య బాధ్యతలను హదీస్‌ల ద్వారా క్లుప్తంగా తరువాయి సంచికలో వివరించడం జరిగింది. వ్యాపారం మరియు వ్యవసాయ ఉత్పత్తులు వాటికి సంబంధించిన విషయాలను, సంపాదన గురించి ఈ శీర్షికలోని గత మూడు వ్యాసాలలో అందించడం జరిగింది. హరామ్(నిషిద్ధ) వ్యాపారాలు చేయకూడదు. హలాల్ (ధర్మసమ్మతమైన) వ్యాపారంలో కూడా ఏ ఏ విషయాలు ప్రవక్త(స)వారిచే నిషేధించేబడ్డాయో, ఏవి అనుమతించబడ్డాయో చెప్పడం జరిగింది.

వ్యాపారం గురించి, వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాల గురించి, సంపాదన గురించి ముఖ్య విషయాలను ముహమ్మద్(స)వారి బోధనల ద్వారా తెలుసుకున్నాము. కేవలం బోధనలు వినడం వలన ఉత్తమ సమాజం ఏర్పడదు. వాటిని ఆచరణలో పెట్టాలి. వాటిలో కొన్నింటిని ఆచరణలో పెట్టడానికి నాయకుడు కఠినంగా వ్యవహరించాలి కూడా.

ఇదే శీర్షికలో వెనుకటి వ్యాసంలో జ్ఞానాన్ని 'ప్రాపంచిక జ్ఞానం మరియు ధార్మిక జ్ఞానం' అని వేర్వేరుగా జ్ఞానాలుగా విభజించ నవసరం లేదని, ఇస్లామీయ జ్ఞానమున్నవానికి ప్రాపంచిక జ్ఞానం బాగా ఉంటుందని చెప్పడం జరిగింది. ఇస్లామ్ అంటే కేవలం బోధించబడే ధర్మం కాదు. దానితోపాటు ఆచరణ కూడా ఉండాలి. ఇస్లామీయ జ్ఞానమున్న వ్యక్తి ఏదైతే ప్రజలకు బోధిస్తాడో అతడు కూడా దానిని ఆచరిస్తాడు.

ముస్లిములు అలవరచు కోవలసిన
BEST CHARACTER

## ఉత్తమ లక్షణాలు 2

ఉత్తములుంటేనే ఆ సమాజం ఉత్తమ సమాజం అవుతుంది. అసలు ఉత్తముడంటే ఎవరు? అల్లాహ్ యొక్క సందేశహరుడైన ముహమ్మద్(స)వారు మానవోత్తముడు. **ఈయన మనకు రోల్ మోడల్.** ఉత్తముడు అంటే మంచి అలవాట్లు మరియు మంచి లక్షణాలు కలవాడని ముహమ్మద్(స)వారు చెప్పారు. **ప్రతీ ముస్లిమ్ ఉత్తముడు కావాలి.** అంటే అతడు విశ్వాసి కావాలి.

క్రిందటి సంచికలో ఉత్తమ లక్షణాల యొక్క పరిచయ వ్యాసంలో ఓర్పు మరియు సహనం, కోపాన్ని నిగ్రహించుకోవడం, అహంకారం గురించి, పుకార్లను వ్యాపింప జేయడం వలన సంభవించే స్వర్గ నిషేధం గురించి, నీడనిచ్చే చెట్లను అకారణంగా నరకడం వలన కోల్పోయే మేలు గురించి చెప్పుకున్నాం.

మన దైనందిన జీవితంలో జీవనోపాధి కోసం మరియు ఇతర అవసరాల కారణంగా మరియు మస్‌జిద్‌లకి వెళ్ళడానికి ఇంటి నుండి బయటకి వస్తాము. మార్గమధ్యంలో స్త్రీలు కనిపించవచ్చు. అటువంటప్పుడు ఒక విశ్వాసి ఏ విధంగా ప్రవర్తించాలనేది ఖుర్ఆన్‌లో అల్లాహుతాలా తెలియజేశారు.

సహీహ్ బుఖారీ (సంపుటి 8)లోని 79వ పుస్తకం, అధ్యాయం 2లో 6228 హదీస్‌కు ముందుగా ప్రస్తావించబడిన విషయాలు : ''స'ఈద్ బిన్ అబీహసన్, అల్-హసన్‌కు చెప్పారు, **"అరబ్బేతర స్త్రీలు తమ ఛాతీ మరియు శిరస్సులను బహిర్గత పరుస్తారు."** అల్-హసన్ అన్నారు (స'ఈద్‌తో), ''**మళ్ళించు నీ కళ్ళను వారి నుండి ఎందుకంటే అల్లాహ్ అజ్జ వజల్ల్ చెప్పారు** :

**విశ్వసించిన పురుషులతో, వారి చూపులను క్రిందికి పెట్టుకోమని మరియు వారి మర్మాంగాలను కాపాడుకోమని చెప్పు. ఇది వారికి ఎంతో శ్రేష్ఠమైనది. నిశ్చయంగా అల్లాహ్, వారి చేష్ఠలను బాగా ఎరుగును.** (ఖుర్ఆన్ 24:30)

మరియు ఖతాద అదనంగా చెప్పారు (పై ఆయత్ వివరణకు సంబంధించి), "రక్షించుకోవాలి వారికి ధర్మసమ్మతం కాని వాటి నుండి." మరియు అల్లాహ్ ఇది కూడా చెప్పారు :

**మరియు విశ్వసించిన స్త్రీలతో కూడా వారి చూపులను క్రిందికి పెట్టుకోమని మరియు వారి మర్మాంగాలను కాపాడుకోమని చెప్పు....** (ఖుర్ఆన్ 24:31)

మరియు **కన్నులు చేసే మోసం** అంటే నిషేధించబడిన దానిపై దృష్టి సారించడం. మరియు అజ్-జుహ్రీ చెప్పారు, "చూడటం సరికాదు వారిలోని ఏ బాలికనైనా, ఎవరినైతే ఒకరు చూడాలనుకుంటున్నారో, ఆమె బాగా చిన్న వయస్కురాలైనప్పటికీ."

### ఒకవేళ అనుకోకుండా చూస్తే .....

**జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి)వారి ఉల్లేఖనం. ''నేను రసూలుల్లాహ్(స) వారిని అడిగాను అనుకోకుండా చూడటాన్ని మరియు ఆయన(స) నన్ను ఆదేశించారు నా చూపును మరలించమని."** (సహీహ్ ముస్లిమ్, 5644, పుస్తకం 38, అధ్యా.10, సంపుటి 5)

حَدَّثَنَا قُتَيْبَةُ بْنُ سَعِدٍ : حَدَّثَنَا يَزِيْدُ بْنُ زُرَيْعٍ؛ وَ حَدَّثَنَا أَبُو بَكْرِ ابْنُ أَبِي شَيْبَةَ : حَدَّثَنَا اِسْمَاعِيلُ ابْنُ عُلَيَّةَ، كِلاهُمَا عَنْ يُونُسَ؛ وَحَدَّثَنِي زُهَيْرُ بْنُ حَرْبٍ : حَدَّثَنَا هُشَيْمٌ : أَخْبَرَنَا يُونُزُ عَنْ عَمْرِو بْنِ سَعِيدٍ، عَنْ أَبِي زُرْعَةَ، عَنجَرِيرِ ابْنِ عَبْدِاللهِ، قَالَ : سَأَلْتُ رَسُولَ اللهِ ﷺ عَنْ نَظْرَةِ الْفُجَائَةِ، فَأَمَرَنِي أَنْ أَصْرِفَ بَصَرِي.

కేవలం మనం నడిచే మార్గమధ్యంలోనే కాకుండా, ఒకరి ఇంటికి వెళ్ళినప్పుడు కూడా వారి ఇంట్లోకి ప్రత్యక్షంగా చూడకుండా, ఆ ఇంటివారిని అనుమతి నడగాలి. ఆ రోజుల్లో ద్వారాలకు పరదాలు (కర్టెన్లు) ఉండేవి కావు. మనం వెళ్ళిన సమయంలో ఆ ఇంట్లోనివారు ఏ పరిస్థితిలో ఉంటారో మనకు తెలియదు. అటువంటప్పుడు మన ప్రవర్తన ఎలా ఉండాలో ప్రవక్త(స)వారు బోధించారు.

ఇది చాలా ముఖ్యమైన విషయం. మన పొరుగింటివారికి మన వలన ప్రశాంతత దూరం కాకూడదు. మన ప్రవర్తన కారణంగా మరొకరికి ఇబ్బంది గాని, బాధగాని కలుగకూడదు. వారు ముస్లిములైనా లేక ముస్లిమేతరులైనా సరే మన ప్రవర్తన ప్రవక్త(స)వారి బోధనకు అనుగుణంగా ఉండాలి. మన కారణంగా వేరొకరు ఇబ్బంది పడకూడదని చెప్పే ముహమ్మద్(స)వారి బోధనలు అనేకం ఉన్నాయి.

**తల్హా ఉల్లేఖనం. హుజైల్ చెప్పారు, "ఒక వ్యక్తి" - ఉస్మాన్ (ఉల్లేఖకులలో ఒకరు) చెప్పారు - "సాద్ - వచ్చాడు మరియు నిలుచున్నాడు ప్రవక్త(స)వారి ద్వారం వద్ద మరియు లోపలకి ప్రవేశించడానికి అనుమతి నడిగాడు. మరియు అతడు ద్వారం దగ్గర నిలుచున్నాడు - ఉస్మాన్ చెప్పారు : "తలుపుకు అభిముఖంగా (ఎదురుగా) - ప్రవక్త(స)వారు చెప్పారు : "ఈ విధంగా లేదా ఈ విధంగా" (అంటే ద్వారానికి ఇటువైపు లేదా అటువైపు నిలబడాలి) ఎందుకంటే అనుమతి నడగడం ఆదేశించ బడింది చూడటాన్ని నిరోధించడానికే"** (అబూదావూద్, హసన్, 5174, పుస్తకం 40, అధ్యాయం 127, సంపుటి 5)

حَدَّثَنَا عُثْمانُ بنُ أَبِي شَيْبَةَ قَالَ : حَدَّثنا جَرِيرٌ؛ ح : وحدثنا أَبو بَكْرِ بنُ أَبِي شَيْبَةَ : حَدَّثنا حَفْصٌ عن الأعْمَشِ، عن طَلْحَةَ، عن هُزَيْلٍ قالَ : جَاءَ رَجلٌ – قال عُثْمانُ : سَعْدٌ فوَقَفَ عَلَى بَابِ النَّبيِّ ﷺ يَسْتَأْذِنُ فَقَامَ عَلَى الْبَابِ – قَالَ عُثْمانُ : مُسْتَقْبِلَ الْبَابِ – فَقَالَ لَهُ النَّبيُّ . : ((هٰكَذَا – عَنْكَ – أو هٰكَذَا فَإِنَّمَا الا سْتِئْذَانُ مِنَ النَّظَرِ)).

---

**అబ్దుల్లాహ్ బిన్ బుస్ర్ ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) ఎవరి ఇంటి ద్వారం దగ్గరికైనా వచ్చినప్పుడు ఆయన ద్వారానికి అభిముఖంగా (ఎదురుగా) ఉండరు, బదులుగా ఆయన కుడివైపు (నిలుచుంటారు) లేక ఎడమవైపు. మరియు చెబుతారు "అస్సలాము అలైకుమ్, అస్సలాము అలైకుమ్". అది ఎందుకంటే పరదాలు ఉండేవి కావు ద్వారాలపై ఆ రోజులలో** (అబూదావూద్, హసన్, 5186, పుస్తకం 40, అధ్యా 127,128 సంపుటి 5)

حَدَّثَنَا مُؤَمَّلُ بنُ الْفَضْلِ الْحَرَّانِيُّ في وآخَرِينَ قالُوا : حَدَّثنا بَقِيَّةُ بنُ الْوَلِيدِ حَدَّثَنَامُحَمَّدُ بنُ عَبْدِ الرَّحْمٰنِ عن عَبْدِ اللهِ بنِ بُسْرٍ قَالَ : كَانَ رَسُولُ اللهِ ﷺ اِذَا أَتَى بَابَ قَوْمٍ لَمْ يَسْتَقْبِلِ الْبَابَ مِنْ تِلْقَاءِ وَ جْهِهِ، وَلكِن مِنْ رُكْنِهِ الأيْمَنِ أَوِ الأيْسَرِ وَيَقُولُ : ((السَّلامُ عَلَيْكُم، السَّلامُ عَلَيْكُم))، وَذٰلِکَ أَنَّ الدُّورَ لَمْ يَكُنْ عَلَيْهَا يَوْمَئِذٍ سُتُورٌ.

ద్వారానికి కర్టెన్లు లేనప్పుడుగాని లేదా తలుపు తెరచి ఉన్నప్పుడు గాని ఎదురుగా నిలుచుంటే లోపలివారు కనిపించవచ్చు. కాబట్టి ఆ ద్వారానికి ఒక ప్రక్కన నిలుచుని అనుమతి నడగాలి. ద్వారానికి ఏ వైపున నిలుచోవాలని ఆలోచించనవసరం లేదు. ఆ ఇంటికి మనం వెళ్ళేదారి ద్వారానికి కుడివైపున ఉంటే కుడివైపు నిలుచుని మాట్లాడవచ్చు.

ఇంటిలోని వారికి వినబడేటట్లుగా సలామ్ చెప్పాలి.

## ఒకవేళ తలుపువేసి ఉంటే .....

**జాబిర్(రజి)వారి ఉల్లేఖనం. ఆయన ప్రవక్త(స)వారి వద్దకు వెళ్ళారు తన తండ్రి అప్పు గురించి. "నేను ద్వారంపై తట్టాను మరియు ఆయన(స) అడిగారు : "ఎవరది?" నేను చెప్పాను, 'నేను'. ఆయన(స) అన్నారు, 'నేను, నేను', దానిని** (అంటే ఆ విధంగా చెప్పడాన్ని) **ఆయన ఇష్టపడనట్లుగా** (అబూదావూద్, సహీహ్, 5187, పుస్తకం 40, అధ్యా 127,128 సంపుటి 5)

---

حَدَّثَنَا مُسَدَّدٌ : حَدَّثَنَا بِشْرٌ عن شُعْبَةَ، عن مُحَمَّدِ بنِ الْمُنكَدِرِ، عن جَابِرٍ؛ أَنَّهُ ذَهَبَ اِلَى النَّبيِّ . في دَيْنِ أَبِيهِ : فَدَقَقْتُ الْبَابَ، فقَالَ : ((مَنْ هٰذَا؟)) فقُلْتُ : أنَا . قال. ((أنَا، أنَا))، كَأَنَّه كَرِهَهُ.

తలుపువేసి ఉంటే ఆ తలుపును తట్టవచ్చు. లోపలున్నవారు అడిగితే తన పేరు చెప్పాలి. 'నేను' అని ఎవరైనా చెబితే ఆ స్వరాన్ని ఒకొక్కసారి గుర్తుపట్టలేకపోవచ్చు. లోపలివారు అడగక పోయినా సరే సలామ్ చెప్పి నేను ఫలానా అని వచ్చినవారు చెప్పడం సున్నత్. ఈ విషయం తరువాయి హదీస్‌లలో కూడా వివరించబడింది.

## తలుపుకు ఉన్న ఖాళీలోనుండి తొంగి చూస్తే .....

తలుపులకు పగుళ్ళు ఉండవచ్చు. కన్నాలు (రంధ్రాలు) ఉండవచ్చు. తలుపులు పూర్తిగా మూయబడకుండా ఉండవచ్చు. అయినా సరే అనుమతి లేకుండా లోపలికి చూడకూడదు.

**అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు. ఒక వ్యక్తి అనుమతి లేకుండా మీవైపు లోపలకి చూస్తే మరియు మీరు అతనిపై రాతి బెడ్డ విసరండి మరియు అతని కన్ను పోయినాసరే మీపై ఎటువంటి నింద లేదు.** (సహీహ్ ముస్లిమ్, 5643, పుస్తకం 38, అధ్యా.9, సం.5)

పై హదీస్ ద్వారా స్పష్టమయ్యేది ఏమిటంటే, ఒకరి ఇంటిలోకి అనుమతి లేకుండా చూడటం అనేది చాలా హేయమైన పని. ఇక్కడ ముఖ్యంగా తెలుసుకోవలసింది ఏమిటంటే ప్రవక్త(స) వారు ఈ

విషయంలో ఎవరి కళ్ళు పీకెయ్యలేదు. ఇది ఎందుకు చెబుతున్నామంటే భాషానువాదాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకునేవారున్నారు కనుక. కాబట్టి విశ్వాసులు **అనుమతి లేకుండా చూడటమనేది తీవ్రమైన పనిగా అర్థం చేసుకోవాలి.** పై హదీస్‌కు అరబీ మూలం దిగువున ఇవ్వబడింది.

حَدَّثَنَا ابْنُ أَبِي عُمَرَ : حَدَّثَنَا سُفْيَانُ عَنْ أَبِي الزِّنَادِ، عَنِ الْأَعْرَجِ، عَنْ أَبِي هُرَيْرَةَ؛ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ : ((لَوْ أَنَّ رَجُلًا اطَّلَعَ عَلَيْكَ بِغَيْرِ إِذْنٍ فَجَذَفْتَهُ بِحَصَاةٍ، فَفَقَأْتَ عَيْنَهُ، مَا كَانَ عَلَيْكَ مِنْ جُنَاحٍ)).

---

ఈ అంశానికి సంబంధించి మరికొన్ని హదీస్‌లు :

**సహ్ల్ బిన్ సాద్ అన్సారీ ఉల్లేఖించారు. ఒక వ్యక్తి రసూలుల్లాహ్(స) వారి తలుపు కన్నం గుండా లోపలికి చూస్తున్నాడు మరియు అల్లాహ్ యొక్క సందేశహరులు(స) దగ్గర దువ్వెన ఉంది. దానితో ఆయన తల దువ్వుకుంటున్నారు. అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) అతనితో అన్నారు. "నీవు నా వైపు చూస్తున్నట్లు నాకు తెలిసి వుంటే, నేను దీనితో నీ కంటిలో పొడిచి ఉండేవాడిని. అనుమతిని అడగమని మాత్రమే అల్లాహ్ ఆదేశించారు చూడకుండా ఉండటం కోసమే.** (సహీహ్ ముస్లిమ్, 5639, పుస్తకం 38, అధ్యా.10, సంపుటి 5. 6241 సహీహ్ బుఖారీ)

وَحَدَّثَنِي حَرْمَلَةُ ابْنُ يَحْيَىٰ : حَدَّثَنَا ابْنُ وَهْبٍ : أَخْبَرَنِي يُونُسُ عَنِ ابْنِ شِهَابٍ؛ أَنَّ سَهْلَ بْنَ سَعْدٍ الْأَنْصَارِيَّ أَخْبَرَهُ؛ أَنَّ رَجُلًا اطَّلَعَ مِنْ جُحْرٍ فِي بَابِ رَسُولِ اللهِ ﷺ، مِدْرًى يُرَجِّلُ بِهِ رَأْسَهُ، فَقَالَ لَهُ رَسُولُ اللهِ ﷺ : ((لَوْ أَعْلَمُ أَنَّكَ تَنْظُرُ، طَعَنْتُ بِهِ فِي عَيْنِكَ، إِنَّمَا جَعَلَ اللهُ الْإِذْنَ مِنْ أَجْلِ الْبَصَرِ)).

## అనుమతి ఎలా అడగాలి?

**"అస్సలాము అలైకుమ్. నేను లోపలికి రావచ్చా?"** అని అడగమని ప్రవక్త(స)వారు శిక్షణ నిచ్చారు. క్రింది హదీస్ చూడండి.

**అబుల్ అహ్వస్, మన్సూర్ నుండి (ఆయన) రిబ్'ఈ నుండి ఉల్లేఖించారు. అతను చెప్పారు, "బనూ 'ఆమిర్ నుండి ఓ వ్యక్తి మాకు ఉల్లేఖించారు, అదేమిటంటే అతడు ప్రవక్త(స)వారిని అడిగాడు లోపలికి రావడానికి, ఆయన(స) ఇంట్లో ఉన్నప్పుడు. అతడు అడిగాడు : 'నేను లోపలికి రావచ్చా?'. ప్రవక్త(స)వారు తన నౌఖరుకు చెప్పారు : 'ఆ వ్యక్తి దగ్గరకు వెళ్ళు మరియు అతనికి నేర్పు లోపలికి ప్రవేశించడానికి అనుమతి ఎలా అడగాలో. అతనికి చెప్పు : "చెప్పు : అస్సలాము అలైకుమ్, నేను రావచ్చా?". ఆ వ్యక్తి విన్నాడు మరియు చెప్పాడు : "అస్సలాము అలైకుమ్, నేను లోపలికి రావచ్చా?" ప్రవక్త(స)వారు అతనికి అనుమతి నిచ్చారు మరియు అతడు లోపలకి వచ్చాడు.**

**(అబూదావూద్, 5177, పుస్తకం 40, అధ్యా 127,128 సంపుటి 5)**

حَدَّثَنَا أَبُو بَكْرِ بْنُ أَبِي شَيْبَةَ حَدَّثَنَا أَبُو الْأَحْوَصِ عن مَنْصُورٍ، عن رِبْعِيٍّ قَالَ : حَدَّثَنَا رَجُلٌ مِنْ بَنِي عَامِرٍ أَنَّهُ اسْتَأْذَنَ عَلَى النَّبِيِّ ﷺ وَهُوَ فِي بَيْتٍ فَقَالَ : أَأَلِجُ؟ فَقَالَ النَّبِيُّ ﷺ لِخَادِمِهِ : ((اخْرُجْ إِلَى هٰذَا فَعَلِّمْهُ الاسْتِئْذَانَ فَقُلْ لَهُ : قُلِ : السَّلَامُ عَلَيْكُمْ أَأَدْخُلُ))، فَسَمِعَهُ الرَّجُلُ فَقَالَ : السَّلَامُ عَلَيْكُمْ أَأَدْخُلُ، فَأَذِنَ لَهُ النَّبِيُّ ﷺ فَدَخَلَ.

## అనుమతి ఎన్నిసార్లు అడగాలి? ...

అనుమతి మూడుసార్లు అడగాలి. క్రింది హదీస్ చూడండి :

అబూ మూసా అల్-అష్'అరీ ఉల్లేఖనం. "అబూ మూసా(రజి)వారు ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారి దగ్గరికి వచ్చారు మరియు చెప్పారు 'అస్సలాము అలైకుమ్, నేను అబ్దుల్లాహ్ బిన్ ఖైస్'. కాని అనుమతి లభించలేదు లోనికి ప్రవేశించడానికి. ఆయన చెప్పారు, 'అస్సలాము అలైకుమ్. నేను అబూ మూసా'. 'అస్సలాము అలైకుమ్. నేను అల్-అష్'అరీ'. తరువాత ఆయన వెళ్ళిపోయారు. ఆయన (ఉమర్) చెప్పారు : 'అతనిని వెనక్కి నా దగ్గరకు తీసుకురండి. అతనిని వెనక్కి నా దగ్గరకు తీసుకురండి'. కాబట్టి వారు ఆయనను వెనక్కి తీసుకువచ్చారు. ఆయన అడిగారు, 'ఓ అబూ మూసా, నీవెందుకు వెనక్కి వెళ్ళిపోయావు? మేము వేరే పనిలో నిమగ్నమై (బిజీగా) ఉన్నాము.' అతను చెప్పారు : 'నేను రసూలుల్లాహ్(స)వారు చెప్పగా విన్నాను : **'అనుమతి మూడుసార్లు అడగాలి. అప్పుడు మీకు అనుమతి లభిస్తే (లోపలికి వెళ్ళండి), లేకపోతే** వెనక్కి **వెళ్ళిపొండి."** ఆయన అన్నారు, 'దీనికి ఆధారం తీసుకురా లేకపోతే నేను ఫలానా ఫలానా చేస్తాను. కాబట్టి అబూ మూసా వెళ్ళిపోయారు.' ఉమర్(రజి) చెప్పారు : ఏదైనా ఆధారముంటే నీవు దానిని హాజరు పరుస్తావు మింబర్ వద్ద ఈ రోజు సాయంత్రం. ఆధారం లేనట్లయితే, నీవు దానిని హాజరు

పరచలేవు.' సాయంత్రం అయినప్పుడు, ఆయన హజరు పరిచారు. ఆయన అడిగారు : 'ఓ అబూ మూసా నీవేమి చెబుతావు! నీవు దానిని పొందావా?' అతను చెప్పారు, 'ఔను, ఉబయ్ బిన్ కాబ్'. ఆయన అన్నారు : **'అతను మంచి శీలం కలవారు'**. ఆయన అడిగారు, 'ఓ అబూ అత్-తుఫైల్, ఇతను చెప్పేదేమిటి?' అతను చెప్పారు, 'నేను రసూలుల్లాహ్(స)వారు చెప్పగా దానిని విన్నాను, ఓ ఖత్తాబ్ కుమారుడా! కాబట్టి రసూలుల్లాహ్(స) అనుచరులను దండించకు. ఆయన అన్నారు, 'సుబహానల్లాహ్. **నేను ఒకటి విన్నాను మరియు దానిని ధృవీకరించుకోవాలను కున్నాను.''** (సహీహ్ ముస్లిమ్, 5633, పుస్తకం 38, అధ్యా.7, సంపుటి 5)

حَدَّثَنَا حُسَيْنُ ابْنُ حُرَيْثٍ أَبُو عَمَّارٍ : حَدَّثَنَا الْفَضْلُ بْنُ مُوسَىٰ : أَخْبَرَنَا طَلْحَةُ بْنُ يَحْيَىٰ عَنْ أَبِي بُرْدَةَ، عَنْ أَبِي مُوسَى الْأَشْعَرِيِّ قَالَ : جَاءَ أَبُو مُوسَىٰ إِلَىٰ عُمَرَ بْنِ الْخَطَّابِ فَقَالَ : السَّلَامُ عَلَيْكُمْ، هَذَا عَبْدُ اللهِ بْنُ قَيْسٍ، فَلَمْ يَأْذَنْ لَهُ، فَقَالَ : السَّلَامُ عَلَيْكُمْ، هَذَا أَبُو مُوسَىٰ، السَّلَامُ عَلَيْكُمْ، هَذَا الْأَشْعَرِيُّ، ثُمَّ انْصَرَفَ، فَقَالَ : رُدُّوا عَلَيَّ، رُدُّوا عَلَيَّ فَجَاءَ فَقَالَ : يَا أَبَا مُوسَىٰ! مَا رَدَّكَ؟ كُنَّا فِي شُغْلٍ، قَالَ : سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ : ((الِاسْتِئْذَانُ ثَلَاثٌ، فَإِنْ أُذِنَ لَكَ، وَإِلَّا فَارْجِعْ))، قَالَ : لَتَأْتِيَنِّي عَلَىٰ هٰذَا بِبَيِّنَةٍ، وَإِلَّا فَعَلْتُ وَ فَعَلْتُ، فَذَهَبَ أَبُو مُوسَىٰ.

قَالَ عُمَرُ : إِنْ وَجَدَ بَيِّنَةً تَجِدُوهُ عِنْدَ الْمِنْبَرِ عَشِيَّةً، وَإِنْ لَمْ يَجِدْ بَيِّنَةً فَلَمْ تَجِدُوهُ، فَلَمَّا أَنْ جَاءَ بِالْعَشِيِّ وَجَدُوهُ، قَالَ : يَا أَبَا مُوسَىٰ! مَا تَقُولُ؟ أَقَدْ وَجَدْتَ؟ قَالَ : نَعَمْ، أُبَيَّ بْنَ كَعْبٍ، قَالَ : عَدْلٌ، قَالَ : يَا أَبَا الطُّفَيْلِ! مَا يَقُولُ هٰذَا؟ قَالَ : سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ ذٰلِكَ يَا ابْنَ الْخَطَّابِ! فَلَا تَكُونَنَّ عَذَابًا عَلَىٰ أَصْحَابِ رَسُولِ اللهِ ﷺ . قَالَ : سُبْحَانَ اللهِ! إِنَّمَا سَمِعْتُ شَيْئًا، فَأَحْبَبْتُ أَنْ أَتَثَبَّتَ.

పై హదీస్‌లో అబూ మూసా(రజి)వారు మూడుసార్లు సలామ్ చెప్పారు. మరియు ప్రతీసారి ఆయన పేరు కూడా చెప్పారు. లోపలి నుండి స్పందన లేకపోవడంతో వెనుతిరిగారు.

హదీస్ విన్న తరువాత ధృవీకరించుకోవడం ఎంత ముఖ్యమో పై హదీస్ ద్వారా తెలుస్తుంది.

**మనం ఏదైనా అవసరం వలన, మన పిల్లలను వేరొకరి ఇంటికి పంపుతుంటాం. కాబట్టి మన పిల్లలకు నేర్పవలసిన విషయాలు: అనుమతి ఎలా అడగాలి? ఎన్ని సార్లు అడగాలి? మరియు తలుపు దగ్గర ఎలా నిలుచుని అడగాలి? చిన్నతనం నుండే ఇటువంటి అలవాట్లను పిల్లలు అలవరచుకునేలా శిక్షణ ఇవ్వాలి. ఈ అలవాట్లు మన పిల్లలకు వస్తే, వారు ఇతరుల చేత అభిమానించ బడతారు.**

క్రింది హదీస్ చూడండి :

**అమ్ర్ బిన్ అబీ సుఫ్యాన్ ఉల్లేఖనం. అమ్ర్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ సఫ్వాన్ ఆయనకు తెలియజేశారు. కలదహ్ బిన్ హంబల్ ఆయనకు తెలియజేశారు. సఫ్వాన్ బిన్ ఉమయ్యాహ్ ఆయనకు కొంత పరిమాణంలో పాలు, ......... మరియు దఘాబీస్ (పొట్లకాయలు) పంపారు. ప్రవక్త(స)వారికి ఆయన(స) లోయ పైభాగాన ఉండగా. (అతను చెప్పారు): "నేను ఆయన(స) ఉన్నచోటుకి ప్రవేశించాను అనుమతి అడగకుండా, సలామ్ చెప్పకుండా." ప్రవక్త(స)వారు చెప్పారు : 'వెనక్కి వెళ్ళు మరియు చెప్పు : అస్సలాము అలైకుమ్, నేను లోపలికి రావచ్చా?" మరియు అది సఫ్వాన్ ఇస్లామ్ స్వీకరించిన తరువాత. (తిర్మిజీ, హసన్, 2710, పుస్తకం 23, అధ్యా. 18, సంపుటి 5)**

حَدَّثَنَا سُفْيَانُ بْنُ وَكِيعٍ : حَدَّثَنَا رَوْحُ بْنُ عُبَادَةَ عَنِ ابْنِ جُرَيْجٍ قَالَ : أَخْبَرَنِي عَمْرُو بْنُ أَبِي سُفْيَانَ أَنَّ عَمْرَو بْنَ عَبْدِ اللهِ بْنِ صَفْوَانَ أَخْبَرَهُ أَنَّ كَلَدَةَ بْنَ حَنْبَلٍ أَخْبَرَهُ : أَنَّ صَفْوَانَ بْنَ أُمَيَّةَ بَعَثَهُ بِلَبَنٍ وَلِبَاءٍ وَضَغَابِيسَ إِلَى النَّبِيِّ ﷺ وَالنَّبِيُّ ﷺ بِأَعْلَى الْوَادِي، قَالَ : فَدَخَلْتُ عَلَيْهِ وَلَمْ أَسْتَأْذِنْ، وَلَمْ أُسَلِّمْ، فَقَالَ النَّبِيُّ ﷺ : ((ارْجِعْ فَقُلْ : السَّلَامُ عَلَيْكُمْ أَأَدْخُلُ))؟ وَذٰلِكَ بَعْدَ مَا أَسْلَمَ صَفْوَانُ. قَالَ عَمْرٌو : وَأَخْبَرَنِي بِهٰذَا الْحَدِيثِ أُمَيَّةُ بْنُ صَفْوَانَ. وَلَمْ يَقُلْ سَمِعْتُهُ مِنْ كَلَدَةَ.

*(పై హదీస్‌లో ప్రస్తావించబడిన సఫ్వాన్ బిన్ ఉమయ్యహ్‌గారు కలదహ్ బిన్ హంబల్‌కి సోదరుడు అవుతాడు తల్లి తరపునుండి మరియు అతడు ఇస్లామ్‌కి మరియు రసూలుల్లాహ్(స)వారికి బద్ధ శత్రువైన ఉమయ్యాహ్ బిన్ ఖలఫ్ కుమారుడు. మక్కా విజయం సందర్భంలో అతడు ఇస్లామ్ స్వీకరించాడు. తరువాత అతడు ప్రవక్త(స)వారికి ఓ బహుమతి పంపారు. మరియు ఆ బహుమతి తెచ్చినవానికి ఇస్లామ్ ప్రకారం ఒక వ్యక్తిని కలవడానికి గల ఆచరణను ప్రవక్త(స)వారు తెలిపారు.)*

పై హదీస్‌లో ఒక వ్యక్తి చేసినట్లుగా మన పిల్లలుగాని, బంధువులు గాని, ఇతర ముస్లిమ్ సోదర, సోదరీమణులు గాని చేస్తే, మనం వారిని ఒకసారి బయటకి పంపి, ముహమ్మద్(స)వారు చేసినట్లు చేయడానికి తటపటాయించవలసిన అవసరం లేదు. ప్రవక్త(స)వారు కాబట్టి అలా చేసినా ఎవరూ ఏమీ అనలేదు గాని, మనం అలా చేస్తే అవమానించామని అనుకుంటారని భావించ నవసరం లేదు. మనం వారి మేలు కోరి చేస్తున్నాము అనే విషయం మనకు స్పష్టంగా తెలును. అంతేకాకుండా వారితో, 'ఈ విధంగా ప్రవక్త(స)వారు చేశారు కాబట్టి చేశాను' అని కూడా చెప్పవచ్చు. అప్పుడు అది కూడా సున్నత్ అవుతుంది.

మరొక ముఖ్య విషయం : కొందరు పిల్లలు ఎంత చెప్పినా వినరు. అయినా సరే చెబుతూ ఉండాలి. ఇన్షాఅల్లాహ్! ఏదో ఒక రోజు వారిలో ఆ అలవాటు రావచ్చు.

## ఎవరైనా అనుమతి నడిగినప్పుడు సలాత్‌లో ఉంటే .....

**అలీ(రజి)వారి ఉల్లేఖనం. నేను రెండుసార్లు రసూలుల్లాహ్ (స)వారిని సందర్శించాను, రాత్రివేళ మరియు పగటి వేళ. ఆయన సలాత్ చేస్తున్నప్పుడు నేను ఆయన(స) దగ్గరికి వస్తే, ఆయన(స) గొంతు సవరించు కునేవారు.** (అంటే ఆయన(స) ప్రార్థనలో ఉన్నారని తెలపడానికి) **(ఇబ్నెమాజా, 3708)**

حَدَّثَنَا أَبُو بَكْرِ بْنُ أَبِي شَيْبَةَ : حَدَّثَنَا أَبُو بَكْرِ بْنُ عَيَّاش عَنْ مُغِيرَةَ، عَنِ الْحَارِثِ، عَنْ عَبْدِ اللهِ بْنِ نُجَيٍّ، عَنْ عَلِيٍّ قَالَ : كَانَ لِي مِنْ رَسُولِ اللهِ ﷺ مُدْخَلَانِ : مُدْخَلٌ بِاللَّيْلِ، وَمُدْخَلٌ بِالنَّهَارِ. فَكُنْتُ إِذَا أَتَيْتُهُ وَهُوَ يُصَلِّي، يَتَنَحْنَحُ لِي.

పై హదీస్‌లో వివరించిన విధంగా, మనం ప్రార్థనలో ఉన్నప్పుడు గొంతు సవరించుకుంటే, ఆ శబ్దం విని బయట నుండి పిలిచే వ్యక్తి అర్థం చేసుకుని కాస్సేపు మౌనంగా నిరీక్షించే అవకాశం ఉంది.

**(మరొక ఉత్తమ లక్షణం గురించి ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో ...)**


మీ బంధువులు మరియు స్నేహితులను శాంతిబాట చందా దారులుగా చేర్చి సత్యాన్ని వ్యాపింప చేయడంలో సహకరించమని కోరుతున్నాము.

**డి.టి.డి.సి. కొరియర్ ద్వారా కాపీని పొందగోరువారు సంవత్సర చందా రూ. 200/- కు అదనంగా మరో రూ. 100/- చెల్లిస్తే, మీకు కొరియర్ ద్వారా పంపిన వెంటనే కన్‌సైన్‌మెంట్ నంబర్ మీకు ఎస్.ఎమ్.ఎస్. చేస్తాము, ఇన్షా అల్లాహ్**

**కొత్తగా చేరిన పాఠకులకు మా విన్నపం**

మాకు ఉన్న పోస్టల్ లైసెన్స్ ప్రకారం ప్రతీ నెల 15వ తారీఖున శాంతిబాట పోస్ట్ చేయవలసి ఉంది. ఒకొక్కసారి కొన్ని వ్యాసాల పరిశోధన కొరకు ఎక్కువ సమయం అవసరమౌతుంది. సాంకేతిక సమస్యల వలన కూడా పత్రిక ఆలస్యం కావచ్చు.

**సంవత్సర చందా వివరాలు :**

**రూ. 200/- పోస్టల్ మనియార్డర్ (M.O.) ద్వారా**

**క్రింది ఎడ్రస్‌కు పంపండి.**

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**
2-8-31, కోట బజార్, సామర్లకోట-533440
మనియార్డర్ చేయగానే 9491103017కి ఫోన్ చేసి తెలియజేయవలసిందిగా కోరుతున్నాము

**ఎక్కువ చందాలను పంపగోరువారు**
**క్రింది ఎకౌంట్‌లో డిపాజిట్ చేయవచ్చు.**
SBI A/c No. 10428633092
Waltair, Visakhapatnam-530003
Contact : Dr. N. Srinivasa Rao, Cell:9491103017
velugubaata@gmail.com
info@saanthibaata.net

**మొదటి సంవత్సరం సంచికలు**
(తొలి సంచిక ఆగష్టు 2009 మినహా)
**మరియు 2వ సంవత్సరం సంచికలు కావలిసిన వారు**
**రూ. 365/- మనియార్డర్ చేయగలరు.**

**కేవలం ఏదో ఒక ఆర్టికల్ మాత్రమే అవసరమైతే మా వెబ్‌సైట్ www.saanthibaata.net నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.**

మీ కవర్‌పై ఉండే ఎడ్రస్ స్లిప్‌పై మీ ఫోన్ నంబర్ లేకపోయినా లేక మీ నంబర్ మారినా ఆ నంబర్‌ను వెంటనే మాకు తెలియజేయండి.

18

# తిరిగి గూటికి

దైవధర్మం అనేది ఏ ఒక్కరి సొత్తో కాదు. ప్రకృతిలాగే ఇది అందరికీ చెందుతుంది. ఈ వాస్తవాన్ని ఆలస్యంగానైనా సరే చాలా మంది తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం ఇస్లాం (శాంతి) ధర్మం ప్రపంచంలో అత్యంత వేగంతో విస్తరిస్తుంది. ఈ ధర్మంపై బురద చల్లడానికి పాశ్చాత్యులు చేస్తున్న కృషి వలన, ఈ ధర్మవ్యాప్తి తగ్గడానికి బదులు దీని వేగం మరింత పెరుగుతూ వస్తుంది. ఈ ధర్మాన్ని ఆచరించడం అనేది 'మత మార్పిడి' ఎంత మాత్రం కాదు. దారి తప్పిన సోదరి లేదా సోదరుడు తిరిగి తన పయనించవలసిన దారిని చేరుకోవడం వంటిది. ఇలా తిరిగి గూటికి చేరుకున్న ఓ సోదరి గురించి గాని, ఓ సోదరుని గురించి గాని ఈ శీర్షికలో పరిచయం చేయబడుతుంది.

ఇస్లాం ధర్మంలో అడుగిడిన వీరిని కొత్త ముస్లింలు లేదా నవముస్లింలు తోటి ముస్లిం సోదరసమాజం పిలుస్తుంది. అయితే ఇస్లాం పట్ల అవగాహన లేని కొంతమంది 'ముస్లిం' సోదరులుగాని, విద్వాంసులుగాని ఈ నవముస్లింల పట్ల ప్రవర్తించే తీరు కొంతమేర అభ్యంతరకరంగానూ, ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) వారి సాంప్రదాయానికి వ్యతిరేకంగానూ ఉంటుంది. ఇస్లాం పట్ల అవగాహన ఉన్నవారు వీరిని ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటున్నారు. దారి తప్పిన తమ సోదరుడు లేదా సోదరి తిరిగి తన గూటికి చేరుకున్నారన్న ఆనందోత్సాహం వారిలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఇస్లాం ధర్మాన్ని అవగాహన చేసుకుంటే, ఏ ధర్మానికి చెందినవారైనా సరే, ఇది ఖచ్చితంగా దైవధర్మమనే విషయాన్ని అంగీకరిస్తారు. కాని ఈ ధర్మాన్ని ఆచరించడానికి మనో ధైర్యం కావాలి. దైవ భీతికలవారికి ఇది సునాయాసంగా లభిస్తుంది. కుటుంబానికో, సమాజానికో భయపడటం వల్లనో లేదా ఇతరత్రా కారణాల వల్లనో అల్లాహ్ ధర్మానికి చాలామంది దూరంగా ఉన్నారు.

అలాగే కొత్తగా 'ఇస్లామ్'లోకి వచ్చిన వారికి చాలా సందేహాలుంటాయి. ఒక్కసారిగా అన్ని పుస్తకాలనూ వారు చదువలేరు. ధర్మావగాహనకు కూడా వారికి కొంత సమయం పడుతుంది. అనుభవజ్ఞుల వివరణలు వీరికి చాలా అవసరం. ఇంతకు ముందరి జీవన విధానంలోని కొన్ని అభ్యంతరకరమైన అలవాట్లు నుండి దూరం కావడానికి వారిలో కొందరికి మరికొంత సమయం పట్టవచ్చు. వారు ప్రారంభంలో ఓ ప్రత్యేకమైన అవస్థకు గురై ఉంటారు. వారికి ప్రవక్తగారి సాంప్రదాయ ప్రకారం సౌమ్యంగా, సహనంతో అన్ని విషయాలను ఆకళింపు చేసుకొనేలా చేయడం, వారికి తోడుగా ఉండడం మనందరి బాధ్యత.

ఈ శీర్షిక ద్వారా వీలుని బట్టి నవ ముస్లిం సోదరులకు ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని సునాయాసంగా అధిగమించడానికి ఖుర్'ఆన్, హదీసుల వెలుగులో పరిష్కారాలను కూడా అందించే ప్రయత్నం జరుగుతుంది, ఇన్షా అల్లాహ్.

### *నవ ముస్లిమ్?* | *New Muslim?*

*అబూబక్ర్ సిద్దీఖ్(రజి), ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి), ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి), అలీ బిన్ అబీ తాలిబ్(రజి) మొదలైన విశ్వాసులంతా ఇస్లామ్ స్వీకరించిన వారే! వీరిని నవముస్లిములుగా ఎవరూ పరిచయం చేయలేదు. నమాజ్ చేయడం నేర్చుకునే వరకో లేక మస్జిద్ అలవాటు అయ్యే కొన్ని రోజుల వరకో తోటి ముస్లిములకు తెలియడానికై 'నవముస్లిమ్' అనే పదాన్ని వారి కొరకు ఉపయోగించవచ్చు. కాని వారికి ఇస్లామ్ ధర్మంపై పూర్తి అవగాహన ఏర్పడి ఇస్లామ్ ప్రకారం వారి ఆచరణ ఉన్నప్పుడు, ఎన్ని సంవత్సరాలైనా సరే వారిని 'నవ ముస్లిములు'గా పరిగణించడం సరికాదు.*

### ఏ భాష అయినా ఒక్కటే! | అంతా సమానమే!

ఖుర్'ఆన్ అరబీ భాషలో అవతరించింది. అరబీ భాష ముస్లిములకు అతి ముఖ్యమైన మరియు నేర్చుకోవలసిన భాష. 'ఉర్దూ' భాష భారతీయ భాషలలో ఒక భాష మాత్రమే. 'ఉర్దూ' అంటే మార్కెట్ అని అర్థం. ఇది అరబ్బులు మరియు భారతీయుల మధ్య వ్యాపార లావాదేవీల కొరకు తయారైన భాష. అరబీ భాష కాకుండా, ఇతర ఏ భాష అయినా ముస్లిములకు ఒక్కటే! ఇస్లామ్‌లో రంగు, తెగ, లేమి, కలిమి, భాష, ప్రాంతం మొ॥న వాటిని బట్టి ఎటువంటి ప్రాముఖ్యతా లేదు. అందరూ సమానమే! కేవలం ధర్మ పరాయణత మాత్రమే ముస్లిముల స్థాయిని నిర్దేశించే కొలమానం. తెలుగు మాట్లాడేవారి కొరకు ఒక మస్జిద్, వేరే భాష మాట్లాడేవారికి మరొక మస్జిద్ ఏర్పాటు చేయాలని చేసే ఏ ప్రయత్నమైనా సున్నత్‌కి వ్యతిరేకమైనదే! అందరినీ కలిపి ఉంచే ధర్మమే ఇస్లామ్ (శాంతి).

*శాంతిబాట మొదటి సంవత్సరంలో విదేశాలలో ఇస్లామ్ స్వీకరించిన ఏడుగురు సోదరీమణుల గురించి తెలియజేయడం జరిగింది. ద్వితీయ సంవత్సరం తొలి సంచికయైన ఆగష్టు'10 సంచికలో నవముస్లిములు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ ఓ సోదరుడు ఆవేదన వ్యక్తం చేస్తూ వ్రాసిన లేఖను అందించాము.* ***ఆ సమస్యలకు ఖుర్‌ఆన్ మరియు సున్నత్ విధానంలో పరిష్కార మార్గాన్ని ఇన్షా అల్లాహ్ తరువాయి సంచికలలో అందిస్తామని చెప్పడం జరిగింది.*** తరువాయి సంచికలలో కొన్నింటికి ఖుర్‌ఆన్ మరియు సున్నత్ వెలుగులో పరిష్కారం అందించాము. వాస్తవ సంఘటనల ద్వారా సమస్యల పరిష్కారాన్ని తెలియజేసే ఉద్దేశ్యంతో ముహమ్మద్(స)వారి అనుచరులైన బిలాల్(రజి), అబూజర్(రజి), సల్మాన్ ఫార్సీ (రజి), అబూ ఉబైదా(రజి), సాద్ బిన్ అబీ వఖ్ఖాస్(రజి), అమ్ర్ బిన్ ఆస్(రజి)వారి జీవితచరిత్రలను క్లుప్తంగా అందించడం జరిగింది. ఇవన్నీ చదివితే ఎవరికైనా తమ సమస్యలు, పైన వివరించిన విశ్వాసుల సమస్యల కంటే చాలా చిన్నవిగా కనిపిస్తాయి. సులువుగా తమ సమస్యలను పరిష్కరించుకో గలమనే మనో ధైర్యం వారిలో ఏర్పడుతుంది. గత మూడు సంచికల నుండి విశ్వాస స్త్రీల జీవితచరిత్రలను ఓ ఆరు నెలల పాటు అందించాలని అల్లాహ్ పేరుతో సంకల్పించడం జరిగింది. **క్రిందటి సంచికలో ఉమ్మె అయ్‌మన్ (రజి) వారి గురించి క్లుప్తంగా అందించాము.**

# ఉమ్మె సులైమ్ బిన్తె మిల్‌హాన్ అన్సారియా (రజి)

## ఇస్లామ్ స్వీకరణనే మహ్రాగా తీసుకుని ఇస్లామీయ చరిత్రలోనే అత్యంత విలువైన మహ్రాను పొందిన తొలి విశ్వాసురాలు.

**త్యాగం మరియు సహనం కలిగిన ధీరవనిత. అల్లాహ్‌ను మరియు ఆయన సందేశహరుడిని అమితంగా ప్రేమించిన అన్సార్ మహిళ. ఒక స్త్రీ ధర్మపరాయణురాలైతే, ఆమె వంశంలో ఎందరో విద్యావంతులు తయారౌతారని చెప్పడానికి ఓ ఉదాహరణ.**

ఉమ్మె సులైమ్(రజి)వారి గురించి కొన్ని ముఖ్య విషయాలు క్రిందటి సంచికలో 'ముస్లిమ్ మహిళ' శీర్షికలో చూడండి. ఈ సంచికలో కూడా 56వ పేజీలో నసాయీ(3354) హదీస్ కూడా చూడండి.

మక్కా నుండి మదీనాకు వలస వెళ్లినవారిని ముహాజిరీన్ మరియు వారికి ఆశ్రయమిచ్చిన మదీనావాసులను అన్సారులు (సహాయకులు) అంటారని పాఠకులకు తెలిసిన విషయమే. ఉమ్మె సులైమ్(రజి)వారు ఒక అన్సార్ మహిళ. అన్సార్ స్త్రీలు ఆమెను నాలుగైదు పేర్లతో పిలిచే వారు. అయితే చివరికి ఆమె 'ఉమ్మె సులైమ్'గానే అందరికీ సుపరిచిత మయ్యారు. ఈమె భర్త పేరు మాలిక్ బిన్ నజర్. వీరికి జన్మించిన కుమారుని పేరు - అనస్ బిన్ మాలిక్(రజి). ఈయన ప్రవక్త(స)వారి ప్రముఖ అనుచరులలో ఒకరు మరియు ఈమె సోదరుడైన హరమ్ బిన్ మిల్‌హాన్ ప్రవక్త(స)వారికి ముఖ్య సహచరుడే.

మదీనాకు చెందిన 12 మంది మక్కాలోని 'అఖబా' అనే చోట ప్రవక్త(స)వారికి విధేయులుగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ముహమ్మద్(స)వారికి విధేయత చూపుతామని ప్రతిజ్ఞ చేసిన తొలి అన్సార్ మహిళలలో ఈమె ఒకరు. ఈమె ఇస్లామ్ స్వీకరణ భర్తకు ఇష్టం లేదు. ఆమె పది సంవత్సరాల వయస్సున్న కుమారుడి చేత కూడా కలిమా చదివించారు. భార్యాభర్తల మధ్య ఇస్లామ్ విషయమై విబేధాలు చోటు చేసుకున్నాయి. చివరికి కోపంగా అతడు సిరియాకు బయలుదేరి వెళ్ళిపోయాడు. అయితే అతడు అక్కడ చంపబడ్డాడు.

ఉమ్మె సులైమ్(రజి)వారు మంచి వివేకంగల స్త్రీ. మంచి తల్లి కూడా. ఇక ఆమె ధ్యాస అంతా కుమారుడిపైనే. అతడికి వ్రాయడం మరియు చదవడం నేర్పారు మరియు ఖుర్‌ఆన్‌లోని సూరాహ్‌లు కంఠస్థం చేయించేవారు. అప్పటికి ఆ అబ్బాయికి 10 సంవత్సరాల వయస్సు ఉంటుంది.

మదీనాలో అబూతల్హా అనే అందమైన యువకుడు ఉమ్మెసులైమ్(రజి)వారిని వివాహ ప్రతిపాదన చేరారు. పేజీ 56 చూడండి. ఆమె ఆయనను ఇస్లామ్ స్వీకరించమని, ఆ స్వీకరణే తనకు మహ్ర్ అని చెప్పారు. అనస్(రజి)వారు 'నికాహ్' ఏర్పాట్లు చేశారు.

కేవలం వివాహం కోసమే ఆయన ఇస్లామ్ స్వీకరించారా? అబూతల్హా(రజి)వారి ఇస్లామ్ స్వీకరణను కేవలం ఉమ్మె సులైమ్(రజి)వారి **వివాహంతో ముడిపెట్టడానికి లేదు.** ఇక్కడ నేపథ్యమే వివాహం. కాని ఉమ్మె సులైమ్(రజి)వారి ఉత్తమ నడవడిక మరియు వివేకం **ఆయనను ఆలోచింప జేసింది.** కేవలం వివాహం కోసమే విశ్వసించి ఉంటే తరువాయి కాలంలో ఆయన విశ్వాసం బలహీన పడిపోయేది. కాని ఇస్లామీయ చరిత్రలో ఆయన పేరు నిలిచిపోయేలా అమోఘమైన విశ్వాసంతో ప్రవక్త(స)వారితో అల్లాహ్ మార్గంలో పనిచేశారాయన.

ఉమ్మె సులైమ్(రజి)వారు తన కుమారుడి చేయి పట్టుకుని రసూలుల్లాహ్(స)వారి వద్దకు తీసుకువెళ్ళారు. మరియు ఆయన(స)తో

ఆమె చెప్పారు: "ఓ రసూలల్లాహ్(స)! అన్సారులలో ఓ స్త్రీగాని లేదా పురుషుడుగాని మీకు బహుమతి ఇవ్వకుండా లేరు. కాని నేను దేనినీ ఇవ్వలేను బహుమతిగా ఈ నా కుమారుడిని తప్ప. కావున ఇతనిని తీసుకోండి మరియు మీకు సరిపోయేలా ఏ విధంగానైనా సేవ చేయనివ్వండి."

అనస్(రజి)వారు ప్రవక్త(స) వారి సేవలో 10 సంవత్సరాలు గడిపారు. అనస్(రజి)వారి జీవితంలో అత్యంత శ్రేష్ఠమైన కాలం అదే! ఉమ్మె సులైమ్(రజి)వారి విజ్ఞప్తి మేరకు ప్రవక్త(స)వారు అతని జ్ఞానాన్ని వృద్ధి చేయమని మరియు ఇహలోకం లోనూ మరియు పరలోకంలోనూ అతని సంపదను వృద్ధి చేయమని అల్లాహ్‌కు దు'ఆ చేశారు. మరియు అల్లాహుతాలాకు ప్రవక్త(స)వారు చేసిన దు'ఆకు సమాధానంగా అనస్(రజి)వారు 103 సంవత్సరాలు జీవించారు. మరియు 80 మంది పిల్లలకు తండ్రి అయ్యారు. **ఆయన కుమారులలో చాలామంది విద్వాంసులు అయ్యారు.**

అనస్(రజి) బాలుడిగా ప్రవక్త(స)వారి ఇల్లు చేరారు. ప్రవక్త(స)వారు ఆ అబ్బాయితో ఆడేవారు మరియు జోక్ చేసేవారు, ఒక సందర్భంలో ప్రవక్త(స)వారు జోక్ చేస్తూ ఇలా సంబోధించారు: **"ఓ రెండు చెవులు కలిగియున్నవాడా!"**

ఉమ్మె సులైమ్(రజి) మరియు అబూతల్హా(రజి)వారికి మగ బిడ్డ జన్మించాడు. ఆ అబ్బాయి పేరు అబూ ఉమైర్. ఆ అబ్బాయిని అబూ తల్హా(రజి) చాలా ప్రేమగా చూసుకునేవారు. ఒకరోజు వారి ఇంటికి ప్రవక్త(స) వచ్చారు. అబూ ఉమైర్ చాలా నిరుత్సాహంగా ఉండటాన్ని చూసారు. ఎందుకు విచారంగా ఉన్నాడని అడిగారు. ఉమ్మెసులైమ్(రజి) కారణం చెప్పారు, ఆ అబ్బాయి ఎంతో ఇష్టపడే పక్షి చనిపోయింది. ప్రవక్త(స)వారు ఆ అబ్బాయిని ప్రేమతో ఓదార్చి ఉత్సాహ పరచానికి కాస్త సమయం గడిపారు.

కొన్నాళ్ళకు అబూ ఉమైర్ జబ్బుపడ్డాడు మరియు ఒక రాత్రి అతని శరీర ఉష్ణోగ్రత బాగా పెరిగిపోయింది. పిల్లవాడి వ్యాధి చూసి అబూ తల్హా విచారపడ్డారు. ఆయన ఫజ్ర్ సలాత్‌కై ఉదయం లేచేవారు. ప్రవక్త(స)వారి వద్దకు వెళ్ళి సలాత్ చేసేవారు మరియు ఆయనతో సగం రోజు ఉండేవారు. మరియు తరువాత ఇంటికి వచ్చి ఓ కునుకు తీసి భోజనం చేసేవారు. జుహ్ర్ తరువాత బయటకి వెళ్ళి ఇషా సలాత్ వరకూ వచ్చేవారు కాదు. ఒక సాయంత్రం అబూతల్హా బయలుదేరారు ప్రవక్త(స) వారిని చూడటానికి. బిడ్డ చనిపోయాడు (తండ్రి లేని సమయంలో).

ఉమ్మె సులైమ్(రజి) చెప్పారు, "ఎవరూ అబూతల్హాకి అతని బిడ్డ మరణం గురించి చెప్పకండి నేను ఆయనకు చెప్పేవరకూ." ఆమె బిడ్డను కప్పారు అతను పడుకుని ఉన్నట్లుగా మరియు అతనిని గదిలోని ఓ మూల ఉంచారు. అబూ తల్హా ప్రవక్త(స)వారిని కలిసి వెనక్కి వచ్చేసారు మరియు కొందరిని మస్జిద్‌నుండి తనతో తీసుకువచ్చారు. ఆయన అడిగారు "నా కుమారుడు ఎలా ఉన్నాడు?" ఆమె చెప్పారు, "అతడు జబ్బుపడినప్పటి నుండి అతడెన్నడూ ఇంత నిశ్శబ్దంగా లేడు ఇప్పుడు ఉన్నట్లు మరియు నేను అనుకుంటున్నాను అతడు ప్రశాంతంగా ఉన్నాడు." (ఆమె అబద్ధం చెప్పలేదు. జరిగిన విషయాన్నే మరో విధంగా చెప్పారు. కాని అబూ తల్హా(రజి) కుమారుడి పరిస్థితి మెరుగు పడిందని అనుకున్నారు). ఆమె భోజనం తెచ్చారు మరియు వారందరూ తిన్నారు. తరువాత వారు వెళ్ళిపోయారు. తరువాత ఆయన వెళ్ళి పడుకున్నారు మరియు ఆమె లేచి మరియు అత్తరు పూసుకుని మరియు స్వయంగా ఆమె అంతకు పూర్వం కంటే బాగా అందంగా తనను అలంకరించు కున్నారు. (ఇది ఆమె సహనానికి మరియు అల్లాహ్ యొక్క ఆజ్ఞపై ఆమెకు గల విశ్వాసానికి సూచన. ఆమె అల్లాహ్ నుండి అనుగ్రహం పొందాలని తన భావాలను దాచుకున్నారు).

తరువాత ఆమె వచ్చి అతనితో పడుకున్నారు. మరియు ఆయన సువాసన పీల్చినప్పుడు, అతడు చేశాడు పురుషులు సాధారణంగా తమ భార్యలతో చేసేటట్లు. ఆ రాత్రి చివరిలో, ఆమె చెప్పారు 'ఓ అబూ తల్హా, కొందరు ఏదైనా కొందరికి అప్పగించి, తరువాత వారు దానిని వెనక్కి తీసుకోవడానికి అడిగితే, దానిని వెనక్కి ఇవ్వకుండా ఉండే హక్కు వారికి ఉందని అనుకుంటున్నారా?'

ఆయన అన్నాడు 'లేదు'. ఆమె చెప్పారు, "అల్లాహ్ మీకు బిడ్డను అప్పగించారు మరియు ఇప్పుడు ఆయన అతడిని వెనక్కి తీసుకున్నారు. కావున అల్లాహ్ అనుగ్రహాన్ని అర్థించండి మరియు సహనం వహించండి."

ఆయన కోపగించాడు మరియు చెప్పారు, "నీవు నన్ను వదిలావు నేను చేసింది చేసేవరకూ (అంటే సంభోగం), తరువాత నీవు చెబుతున్నావు నా కుమారుడు మరణించాడని!"

తరువాత అతను పలికాడు, "ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజి'ఊన్" మరియు అతడు అల్లాహ్‌ను కీర్తించారు. ఉదయం, గుస్ల్ చేసి ఆయన రసూలుల్లాహ్(స)వారి దగ్గరికి వెళ్ళారు. మరియు ఆయన(స)తో సలాత్ చేశారు. మరియు ఆయన(స)కి చెప్పారు ఏమి జరిగిందో. రసూలుల్లాహ్(స)వారు చెప్పారు, **"అల్లాహ్ అనుగ్రహించు గాక మీ క్రిందటి రాత్రిని".** ఆమె గర్భవతి అయ్యారు.

ఉమ్మె సులైమ్(రజి)వారు ఎన్నో యుద్ధాలలో ప్రవక్త(స) మరియు ముస్లిములతో పాల్గొన్నారు. దీనికి కారణం ఆమెకు అల్లాహ్‌పై మరియు ఆయన సందేశహరునిపై అమితమైన ప్రేమ ఉండేది. హునైన్ యుద్ధం మక్కా విజయం తరువాత జరిగింది. ఆ యుద్ధం పూర్తి అయ్యేవరకూ ఆమె ముస్లిమ్ సైన్యంతో పాటు ఉన్నారు మరియు ఎంతో కష్టంతో కూడిన ప్రయాణంలో కూడా ఉన్నారు. ఉమ్మె సులైమ్(రజి)వారు ఈ యుద్ధంలో ఓ డాగర్‌ని తీశారు. అది చూసి అబూతల్హా(రజి) ప్రవక్త(స)వారికి అది చూపారు. ఆ డాగర్‌తో దగ్గరికొచ్చే ముష్రిక్‌ల పొట్ట చీల్చుతానని సమాధానమిచ్చారు. ఆమె ఈ యుద్ధంలో గర్భవతి. ఆమె మాత్రం స్థిరంగానే యుద్ధంలోనే ఉన్నారు. బద్ర్ యుద్ధంలో సైనికులకు

నీరు అందించడం మరియు గాయపడిన వారికి సహాయం చేసేవారు. ఉహద్ యుద్ధంలో ప్రవక్త(స)వారి రక్షణ కొరకు ముందుకు వచ్చిన వారిలో ఆమె ఒకరు.

ఉమ్మె సులైమ్(రజి)వారు రసూలుల్లాహ్(స)వారితో ప్రయాణించే వారు, మదీనా వదిలేవారు ఆయన వదలగానే మరియు తిరిగి వచ్చేవారు ఆయన(స) తిరిగి వచ్చినప్పుడు. రసూలుల్లాహ్(స)వారు చెప్పారు, "ఆమె ప్రసవించాక, బిడ్డను నా దగ్గరకు తీసుకురా." ఆయన ప్రయాణంలో ఉన్నారు మరియు ఉమ్మె సులైమ్ వారు కూడా ఆయనతో ఉన్నారు. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) ప్రయాణం నుండి తిరిగి వచ్చినప్పుడు, ఆయన ఎన్నడూ రాత్రి పూట మదీనాలో ప్రవేశించేవారు కాదు (ప్రజలకు అంతరాయం కలగకుండా మరియు భార్యలు తమ భర్తలను ఆహ్వానించడానికి సిద్ధపడేవిధంగా).

వారు మదీనా సరిహద్దులను చేరుకున్నారు. మరియు ఆమెకు పురిటి నొప్పులు ఆరంభమయ్యాయి. అబూ తల్హా(రజి) ఆమెతోనే ఉన్నారు మరియు రసూలుల్లాహ్(స)వారు ముందుకు కొనసాగుతున్నారు. అబూ తల్హా అన్నారు, "ఓ అల్లాహ్ మీకు తెలుసు నేను ఇష్టపడతాను బయలు దేరడానికి మీ సందేశహరుడితో, ఆయన(స) బయలుదేరినప్పుడు మరియు వెనక్కి వస్తాను ఆయనతో ఆయన వెనక్కి వచ్చినప్పుడు. నేను ఆపివేయబడ్డాను మీరు చూస్తున్నట్లుగా."

ఉమ్మె సులైమ్(రజి) చెప్పారు, "ఓ అబూ తల్హా! అంత ఎక్కువుగా నొప్పి అనిపించడం లేదు." కాబట్టి వారు బయలుదేరారు మరియు వారు మదీనా చేరగానే, ఆమె పురిటినొప్పులు తిరిగి మొదలయ్యాయి. మరియు ఆమె ఓ మగబిడ్డకు జన్మనిచ్చారు. ఆమె తన కుమారుడు అనస్(రజి)తో చెప్పారు, "ఓ అనస్! ఆ బిడ్డకు ఏదీ ఇవ్వను ఆహారంగా ఉదయం నీవు అతనిని రసూలుల్లాహ్(స)వారి వద్దకు తీసుకెళ్ళేవరకూ." మరియు ఆమె కొన్ని ఖర్జూరాలు అతనితో పాటు పంపారు. ఆ బిడ్డ రాత్రంతా ఏడుస్తూనే ఉన్నారు మరియు నేను (అనస్, ఈ వృత్తాంతాన్ని ఉల్లేఖించినవారు) అతనిని జాగ్రత్తగా చూసుకున్నాను. ఉదయం ఆ బిడ్డను రసూలుల్లాహ్(స)వారి వద్దకు తీసుకెళ్ళాను బురదా ధరించి ఉన్నారు మరియు దానంగా ఇవ్వబడిన ఒంటెలు మరియు గొఱ్ఱెలపై గుర్తులు వేస్తున్నారు. ఆయన(స) అతనిని చూడగానే, అనస్(రజి)తో అన్నారు, "ఒక్క నిమిషం (ఆగు) నీతో ఉంటాను". ఆయన(స) తన చేతిలోని పనిముట్టుని క్రింద ఉంచి బిడ్డను తీసుకున్నారు. తరువాత ఆయన(స) అన్నారు, "అతడి కోసం నీ దగ్గర ఏదైనా ఉందా?" అతడు చెప్పారు, "ఔను, ఖర్జూరాలు". ప్రవక్త(స) కొన్ని ఖర్జూరాలు తీసుకుని వాటిని నమిలారు, తన లాలాజలంతో కలిపి. తరువాత ఆయన(స) బిడ్డ నోరు తెరచి ఆ మెత్తటి ఖర్జూరంలో కొంత భాగాన్ని నోటి లోపల రాస్తూ, ఆ పసిబిడ్డ పెదవులను నాకడం ప్రారంభించాడు, ఖర్జూరాల మాధుర్యం మరియు ప్రవక్త(స)వారి లాలాజలం కొంత చప్పరించాడు.

ఆ విధంగా ఆ బిడ్డ కడుపును చేరిన తొలి ఆహారం రసూలుల్లాహ్ (స)వారి లాలాజలంతో మిలితమైనది. ఆయన(స) అన్నారు, "చూడు అన్సారులు ఖర్జూరాలను ఎంతగా ఇష్టపడతారో".

నేను (అనస్) అన్నాను, "ఓ రసూలుల్లాహ్(స)! అతడికి పేరు పెట్టండి." ఆయన(స) అతని ముఖాన్ని తడిమి అబ్దుల్లాహ్ అని అతనికి పేరు పెట్టారు. అన్సారులలో అతని కంటే మంచి యువకుడు లేడు. మరియు అతడు పెద్దవాడయ్యాక చాలామంది కుమారులను పొందాడు మరియు పర్షియాలో షహీద్ అయ్యాడు.

అనస్(రజి) తల్లిగారి దగ్గర ఒక మేక ఉండేది. ఒకరోజు ఆమె దాని పాల నుండి నెయ్యి తయారు చేశారు మరియు దానిని ఓ చిన్న చర్మపు పాత్రలో సేకరించారు. అది పూర్తిగా నిండినప్పుడు, దానిని ప్రవక్త(స)వారికి బహుమతిగా తన దత్తపుత్రికచే పంపించారు. ప్రవక్త(స)వారు తన వారితో ఆ పాత్రను ఖాళీ చేసి తిరిగి దానిని ఆ చిన్నారికి ఇచ్చివెయ్యమని చెప్పారు. ఆ పాప ఆ ఖాళీ పాత్రను వెనక్కి తీసుకువచ్చి, వంటగది గోడకున్న మేకుకు వ్రేలాడదీసింది.

ఉమ్మె సులైమ్(రజి)వారు ఆ పాత్ర ఇంకా వ్రేలాడబడి ఉండటాన్ని మరియు నిండుగా ఉండటాన్ని చూసారు. వాస్తవానికి అది పూర్తిగా నిండిపోయి క్రిందికి కారుతుంది. ఆమె తన కుమార్తెతో తాను చెప్పినది ఎందుకు చేయలేదని అడిగారు. ఆ నెయ్యిని ప్రవక్త(స)వారి ఇంటికి ఆమె చెప్పినట్లుగానే తీసుకువెళ్ళి మరియు ఖాళీ పాత్రను వెనక్కి తీసుకు వచ్చి వ్రేలాడదీసానని ఆ చిన్నారి చెప్పింది. అది విని ఉమ్మె సులైమ్ (రజి)వారు ఆశ్చర్యపోయారు.

ఆమె ప్రవక్త(స)వారి ఇంటికి వెళ్ళారు మరియు ఆయన(స)కు ఆ వింత సంఘటన గురించి తెలియజేశారు. ఆయన(స) చెప్పారు ఆ చిన్నారి తెచ్చిన బహుమతిని స్వీకరించినట్లు మరియు ఆమె ఇక్కడి నుండి ఖాళీ పాత్రతో వెళ్ళినట్లు ధృవీకరించారు.

ఆయనని ఏకైక సత్యధర్మానికి సందేశహరుడిగా పంపిన అల్లాహ్ సాక్షిగా ఉమ్మె సులైమ్ చెప్పారు. ఆ పాత్ర నిండుగా ఉందని మరియు ఇప్పటికీ కారుతుందని. ప్రవక్త(స)వారు ఆమెతో ఆశ్చర్యపడవద్దని చెప్పారు. ఆమె అల్లాహ్ ప్రవక్త(స)కు బహుమతిని పంపారు. కాబట్టి దానికి బదులుగా ఆయన తనకు బహుమతి పంపారని చెప్పారు. ఆమెను తినమని మరియు దానిని ఇతరులకు తినిపించమని ప్రవక్త(స)వారు చెప్పారు. ఉమ్మె సులైమ్(రజి)వారు దానిని పెద్దపాత్రలోకి తీసుకున్నారు. అది దాదాపు రెండు నెలల వరకూ సరిపోయింది మరియు ఇతరులు కూడా దానిని తిన్నారు. **అల్లాహ్ తన సందేశహరునికి ప్రేమతో ఎవరైనా బహుమతి పంపితే, అల్లాహ్ ఇచ్చే బహుమతి కూడా అసాధారణంగానే ఉంటుంది.**

అబూతల్హా(రజి)వారు ఒకసారి ప్రవక్త(స)వారి కంఠస్వరం బాగా బలహీనంగా వినబడటాన్ని గమనించారు. అది ఆకలి వలన అని ఆయన అర్థం చేసుకున్నారు. ఇదే విషయాన్ని ఆయన తన భార్య ఉమ్మె సులైమ్(రజి)తో చెప్పి, తినడానికి ఏదైనా ఆహారం గురించి వాకబు

చేశారు. కొన్ని రొట్టెముక్కలున్నాయి. ఆమె ఒక వస్త్రాన్ని తీసి అందులో వాటిని ఉంచి కుమారుడైన అనస్(రజి) చంకలో ఉంచారు మరియు అతని శరీర పైభాగాన్ని ఆ వస్త్రంతో మిగిలిన భాగంతో కప్పి ముహమ్మద్(స)వారికి ఇవ్వమని పంపారు. అప్పుడు ముహమ్మద్(స)వారు మస్జిద్‌లో ఉన్నారు. ఆయనతో పాటు కొందరున్నారు. అనస్(రజి)వారు అక్కడకు వెళ్ళి వారి మధ్య నిలుచున్నారు. రసూలుల్లాహ్(స)వారు 'అబూ తల్హా నిన్ను పంపారా?' ఔనని సమాధానమిచ్చారు అనస్(రజి). ఆయన(స) మరలా అడిగారు 'ఆహారంతో'. ఔనని సమాధానమిచ్చారు.

అల్లాహ్ యొక్క సందేశహరులు తనతో ఉన్నవారిని లేవమని చెప్పి బయలుదేరారు. వారి కంటే ముందే అనస్(రజి)వారు బయలుదేరి వచ్చి అబూతల్హా(రజి)వారికి ఆ విషయాన్ని చెప్పారు. అది విని అబూ తల్హా తన భార్యతో 'ఓ ఉమ్మె సులైమ్! అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) ప్రజలతో వస్తున్నారు మరియు మన దగ్గర ఏదీ లేదు వారికి ఆతిధ్య మివ్వడానికి.'' **అల్లాహ్‌కు మరియు ఆయన సందేశ హరునికి బాగా తెలుసని ఆమె అన్నారు.**

అబూ తల్హా వెళ్ళి ప్రవక్త(స)వారితో తిరిగి వచ్చారు. ప్రవక్త(స)వారు ఉమ్మె సులైమ్(రజి)వారిని పిలిచారు. ఆమె రొట్టెను తెచ్చారు. దానిని ముక్కలుగా చేయమని ముహమ్మద్(స)వారు ఆదేశించారు. ఉమ్మె సులైమ్(రజి) దానిపై కొంత వెన్న ఉంచారు. ఏదైతే పఠించాలని అల్లాహ్ కోరారో, ముహమ్మద్(స)వారు ఆ ఆహారంపై (దానిని) పఠించారు. తరువాత ఆయన(స) పదిమందిని పంపించమన్నారు భుజించడానికి. పదిమంది వచ్చారు. కడుపు నిండా తిని వెళ్ళిపోయారు. తరువాత మరో పదిమందిని పిలిచారు. ఈ విధంగా పదేసిమంది చొప్పున పిలిచేవారు. అందరూ కడుపారా తిని వెళ్ళిపోయారు. అనస్(రజి)వారు చెప్పినదాని ప్రకారం వారు డబ్బయి లేదా ఎనభై మంది ఉంటారు. (తిర్మిజీ 3630 నుండి) ప్రవక్త(స)వారి ఇంటికి ఖర్జూరాలను, ఏదైనా వంటకాన్ని పంపిస్తుండేవారు. జైనబ్ బిన్తె జహష్(రజి)వారిని ముహమ్మద్(స)వారు వివాహం చేసుకున్నప్పుడు, వారి ఇంటికి బహుమతిగా ఖర్జూరాలు మరియు నెయ్యితో చేసిన వంటకాన్ని పంపారు. మరో మాతృమూర్తి యైన సఫియ్యా(రజి)వారిని వధువుగా సిద్ధంగా చేసే బాధ్యతను ప్రవక్త(స)వారు ఉమ్మెసులైమ్(రజి)వారికి అప్పగించారు.

ఎక్కువగా ఉమ్మె సులైమ్(రజి)వారి ఇంటికి ప్రవక్త(స)వారు వస్తూ ఉండేవారు. కారణం ఒక యుద్ధంలో ఆమె సోదరుడు తనతో ఉన్నప్పుడు షహీద్ అయ్యారు.

## ప్రవక్త(స)వారి స్వేదం సువాసనాభరితం :

ఉమ్మె సులైమ్(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు ఆమె ఇంటికి వస్తుండేవారు మరియు ఆ ఇంటి దగ్గర కునుకు తీసేవారు. ఆమె ఓ వస్త్రాన్ని పరిచేవారు మరియు ఆయన దానిపై పడుకునేవారు. ఆయనకు ఎక్కువగా చెమట పట్టేది మరియు ఆమె ఆయన(స) యొక్క స్వేద బిందువులను సేకరించి తన అత్తరు సీసాలో ఉంచేవారు. ప్రవక్త(స)వారు అడిగారు, 'ఓ ఉమ్మె సులైమ్, ఇదేమిటి?' ఆమె చెప్పారు: 'మీ స్వేదం నేను అత్తరులో ఉంచాను.' **(సహీహ్ ముస్లిమ్, 6057, పుస్తకం 43 అధ్యా.22, సంపుటి 6).**

పరిమళానికి సంబంధించి మరో రెండు హదీస్‌లు :

అనస్(రజి)వారి ఉల్లేఖనం. నేనెన్నడూ వాసన చూడలేదు ఏదైనా అంబర్ లేక కస్తూరి లేక దేనినైనా అల్లాహ్ యొక్క సందేశహరులు (స) యొక్క సువాసన కంటే శ్రేష్ఠమైన దానిని. మరియు నేనెన్నడూ ముట్టుకోలేదు ఏదైనా దీబాజ్(చర్మం) లేక పట్టును (అంత) మెత్తగా రసూలుల్లాహ్(స)వారిని ముట్టుకోవడం కంటే. (ముస్లిమ్, 6053, పుస్తకం 43, అధ్యా.21, సంపుటి 6)

జాబిర్ బిన్ సమురహ్ చెప్పారు : నేను తొలి (ఫజ్ర్) సలాత్ రసూలుల్లాహ్(స)వారితో చేశాను. తరువాత ఆయన తన ఇంటికి బయలు దేరారు మరియు నేను ఆయన(స) వెంటే వెళ్ళాను. కొంతమంది పిల్లలు ఆయనను కలిసారు మరియు ఆయన(స) బుగ్గలను నిమరడం ప్రారంభించారు ఒకరి తరువాత ఒకరిగా. మరియు ఆయన నా బుగ్గలను కూడా నిమిరారు మరియు నేను తెలుసుకున్నాను ఆయన చేయి చల్లగా మరియు సువాసన భరితంగా ఉంది. ఎంత సువాసన భరితంగా అంటే ఆయన(స) అత్తరు అమ్మేవాని సంచిలో చేయిపెట్టి బయటకి తీసినట్లుగా.'' **(సహీహ్ ముస్లిమ్ 6052. పుస్తకం 43, అధ్యా.21, సంపుటి 6)**

బుఖారీలో ఒక ఉల్లేఖనం (1301) ఉంది. ''వారికి (అబూ తల్హా మరియు అతని భార్యకు) తొమ్మండుగురు పిల్లలు మరియు అందరూ ఖారీలే. అల్లాహ్‌పై అచంచలమైన విశ్వాసం. ముహమ్మద్(స)వారిపై అమితమైన ప్రేమ. పిల్లలను ప్రేమించడమే కాకుండా వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దారు.

**సహనం, ఓర్పు మాత్రమే కాకుండా ధీరత్వం కలిగిన ఈ విశ్వాసురాలు ఇహలోకంలోనే స్వర్గ శుభవార్తను అందుకున్నారు.**

అనస్(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు: నేను స్వర్గంలో ప్రవేశించాను మరియు అడుగుల చప్పుడు విన్నాను. నేను అడిగాడు ఎవరువారు? వారు చెప్పారు : 'ఆమె అల్-ఘుమైసా' బిన్తె మిల్‌హాన్, అనస్ బిన్ మాలిక్(రజి)వారి తల్లిగారు. **(సహీహ్ ముస్లిమ్ 6320, పుస్తకం 43 అధ్యా.19, సంపుటి 6)**

జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) ఉల్లేఖనం. రసూలుల్లాహ్ (స)వారు చెప్పారు : 'నాకు స్వర్గం చూపబడింది మరియు నేను అబూ తల్హా భార్యను చూశాను. తరువాత నేను నా ముందుగా అడుగుల చప్పుడు విన్నాను మరియు అక్కడ బిలాల్(రజి) ఉన్నారు. **(సహీహ్ ముస్లిమ్ 6321, పుస్తకం 43 అధ్యా.19, సంపుటి 6)**

ఆమె నుండి ఎన్నో హదీస్‌లను సహాబాలు తీసుకున్నారు.

Science of Hadith

# హదీస్ విజ్ఞానం

( మార్చి 2012 సంచిక తరువాయి )

12

## బుఖారీ (ర)

**( ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ )**

(194 - 256 హి.)

### ఖుర్‌ఆన్ - అల్లాహ్ యొక్క ప్రసంగం

ఇప్పటి వరకూ బుఖారీ(ర)వారి వ్యక్తిత్వం గురించి, జ్ఞానం గురించి మరియు ఆయన పట్ల గురువులకు ఉన్న గౌరవాభిమానాల గురించి చెప్పుకున్నాం. జ్ఞానాన్ని పొందడానికి బుఖారీ(ర)వారు ఎంతో కష్టపడ్డారు. హదీస్ విజ్ఞానంలో అందరినీ మించిన విద్వాంసుడుగా ఇమామ్ బుఖారీ(ర)వారిని ఆనాటి విద్వాంసులందరూ గుర్తించారు.

నైసాపూర్ అనే పట్టణంలోని విద్వాంసులు ఆయనను ఆహ్వానించారు. ఆ ఆహ్వానం ఏ స్థాయిలో జరిగిందో ఇమామ్ ముస్లిమ్(ర)వారు చెప్పారు:

**"నేనెన్నడూ చూడలేదు నైసాపూర్ ప్రజలు ముహమ్మద్ బిన్ ఇస్మా'ఈల్(ర)వారిని ఆహ్వానించినట్లుగా ఏ గవర్నర్‌నిగాని లేదా ఏ విద్వాంసుడినిగాని ఆహ్వానించడాన్ని."**

బుఖారీ(ర)వారిని ఆహ్వానించిన విద్వాంసులలో ముందున్న వ్యక్తి - ముహమ్మద్ బిన్ యహ్యా. ఇతడు నైసాపూర్‌లో గుర్తించబడిన ఒక విద్వాంసుడు. ఈయన తన శిష్యులను ధర్మపరాయణుడైన బుఖారీ(ర) దగ్గరికి వెళ్ళమని మరియు ఆయన చెప్పేది వినమని ప్రోత్సహించాడు.

బుఖారీ(ర)వారు నైసాపూర్ పట్టణానికి రావడానికి ఒకరోజు ముందు ఈ ముహమ్మద్ బిన్ యహ్యా తన శిష్యులతో ఇలా చెప్పారు: **"ఎవరైతే ముహమ్మద్ బిన్ ఇస్మా'ఈల్ వారిని ఆహ్వానించాలని అనుకుంటారో, అతనిని అలా చేయనివ్వండి. ఎందుకంటే నిశ్చయంగా ఆయనను ఆహ్వానించే వారిలో నేనూ ఉంటాను."** అంతేకాకుండా వివాదాస్పదమైన అంశాలపై అడగవద్దని కూడా తన శిష్యులకు సలహా ఇవ్వడం జరిగింది. ఎందుకంటే ఒకవేళ ఈ విద్వాంసుడు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పు అని బుఖారీ(ర)వారి ద్వారా తేలితే, ఇతని అభిప్రాయాన్ని వ్యతిరేకించే వారికి సంతోషం కలుగుతుందని ఈ విద్వాంసుడు భయపడ్డాడు. **హదీస్ విజ్ఞానంలో బుఖారీ(ర)వారి స్థానం అటువంటిది.**

ఒక జనాజాకి బుఖారీ(ర)వారు హాజరయ్యారు మరియు నైసాపూర్ విద్వాంసుడైన ముహమ్మద్ బిన్ యహ్యా కూడా దానికి హాజరయ్యారు. ఉల్లేఖకుల పేర్లు మరియు వారి కున్యాలు మరియు హదీస్ ఉల్లేఖనాలలో కనిపించని దోషాల గురించి బుఖారీ(ర)వారిని ఆ విద్వాంసుడు అడిగారు. మరియు బుఖారీ(ర) అతని ప్రశ్నలకు బాణం వేగంతో చెప్పారు. నైసాపూర్ ఆహ్వానానికి కాస్త ముందు జరిగిన ఈ సంఘటన గురించి అబూ అహ్మద్ అల్-'అమాష్ చెప్పారు.

పై విషయాలను బట్టి ముహమ్మద్ బిన్ యహ్యా గారికి బుఖారీ(ర) వారి విజ్ఞానంపై సరియైన అవగాహన అప్పటికే ఉందని స్పష్టంగా తెలుస్తుంది. బుఖారీ(ర)వారితో నైసాపూర్‌లో సమావేశాలు మొదలు అయ్యాయి. ప్రజలు గుంపులు గుంపులుగా బుఖారీ(ర)వారి సమావేశాలకు హాజరయ్యేవారు. ఇదిలా వుండగా ముహమ్మద్ బిన్ యహ్యా సమావేశాలలో పాల్గొనే జనాలు బాగా తగ్గిపోయారు. దానితో అతనిలో బుఖారీ(ర) వారి పట్ల తీవ్రమైన అసూయ మొదలైంది.

> రెండవ రోజు లేదా మూడవరోజు సమావేశంలో బుఖారీ(ర)వారిని ఒక వ్యక్తి అడిగాడు **'ఖుర్‌ఆన్‌ను ఒకరు పలకడం - అది సృష్టించ బడినదా? కాదా?'** అని.
>
> ఈ విషయం - ''ఖుర్'ఆన్ సృష్టించబడిందా? లేదా?'' అనే విషయం వంటిదే. **ఖుర్'ఆన్ అల్లాహ్ యొక్క ప్రసంగం** మరియు ఆయన యొక్క మహోన్నత గుణాలలో ఆయన ప్రసంగం ఒకటి. కాబట్టి ఖుర్'ఆన్ సృష్టించబడలేదు.

ఇమామ్ బుఖారీ సమాధానం చెప్పారు **"మన ఆచరణలు సృష్టించ బడ్డాయి మరియు మనం పలికేవి కూడా మన ఆచరణలలోకే వస్తాయి."** సమావేశానికి వచ్చిన ప్రజలు ఒకరితో ఒకరు విబేధించుకోవడం మొదలుపెట్టారు. అందులో కొందరు అన్నారు: 'ఆయన ఖుర్‌ఆన్‌ను నేను పలకడం సృష్టించబడింది అని చెప్పారు'. ఇదిలా ఉండగా ఇతరులు అన్నారు, **"లేదు, ఆయన అది చెప్పలేదు."**

అసూయతో రగిలిపోతున్న ముహమ్మద్ బిన్ యహ్యా ఈ అంశాన్ని ఉపయోగించుకున్నాడు. బుఖారీ గారి మాటలకు తప్పుడు అర్థం ఆపాదించి, దానినే బాగా ఎక్కువగా ప్రచారం చేయించాడు మరియు దాని ఫలితంగా బుఖారీ(ర)వారికి చెడును ఆపాదించాడు.

అతడు ఇలా చెప్పడం ప్రారంభించాడు, **"ఎవరైతే అతని సమావేశానికి వెళతారో, వారు మా సమావేశానికి రావద్దు.** బాగ్దాద్ ప్రజలు మనకు తెలియజేశారు (ఖుర్'ఆన్ ఆయత్‌లను) ఒకరి యొక్క పలుకుగా చెప్పినట్లు. మేము ఆ విధంగా చేయవద్దని నిరోధించాం. కాని ఆయన (ఇమామ్ బుఖారీ) ఆపలేదు. **కాబట్టి అతని దగ్గరికి పోకండి.** మరియు ఎవరైతే అతని దగ్గరకు వెళ్ళారో వారు మా దగ్గరకు రావద్దు. ఇమామ్ బుఖారీ ఉద్దేశ్యం నా అభిప్రాయంలో జహ్మియ్యహ్ అనే వర్గంవారి ఉద్దేశ్యం కంటే చెడ్డది.'' ముహమ్మద్ బిన్ యహ్యా మాత్రమే కాకుండా నైసాపూర్‌లోని మరికొందరు విద్వాంసులు కూడా బుఖారీ(ర) వారి పట్ల అసూయ చెందారు.

ముహమ్మద్ బిన్ ముస్లిమ్ ఖిస్సామ్ ఉల్లేఖించారు "ఖుర్ఆన్‌ను ఒకరు పలకడం" విషయంలో బుఖారీ(ర)వారు తన ఉద్దేశ్యాన్ని స్పష్టం చేసిన తరువాత,

నైసాపూర్ ప్రజలు అన్నారు, "మేము మీ దగ్గరకు వచ్చేటప్పటికి ఈ మీ ఉద్దేశ్యాన్ని ఉపసంహరించుకోవడం మేలు."

**"నేను ఆ విధంగా చేయను, మీరు చెప్పినదానికి ఓ స్పష్టమైన ఆధారాన్ని నా దగ్గరకు తెచ్చేంతవరకూ - నా దగ్గర ఉన్న స్పష్టమైన ఆధారం కంటే బలమైన దానిని"**

ఇమామ్ బుఖారీ(ర)వారు చెప్పిన సమాధానంపై ముహమ్మద్ బిన్ ముస్లిమ్ వ్యాఖ్యానించారు, **"నేను చాలా ప్రభావితం అయ్యాను ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ గారి స్థిరత్వానికి"**.

బుఖారీ(ర)వారు గొప్ప విద్వాంసుడు మాత్రమే కాదు, సత్యంపై స్థిరంగా నిలబడిన విశ్వాసి ఆయన.

అల్-ఫిరాబ్రీ చెప్పారు : నేను విన్నాను ముహమ్మద్ బిన్ ఇస్మా'ఈల్ చెప్పగా, "**దాసుల ఆచరణలకు సంబంధించి, అవి సృష్టించ బడ్డాయి** ఎందుకంటే అలీ బిన్ అబ్దుల్లాహ్ మాకు తెలిపారు మర్వాన్ బిన్ ము'ఆవియా నుండి, అబూ మాలిక్ నుండి, రిబ్'ఈ నుండి, హుజైఫా నుండి, ప్రవక్త(స)వారు చెప్పారు "**నిశ్చయంగా అల్లాహ్ సృష్టించాడు ప్రతీ శ్రామికుడిని మరియు అతడి నైపుణ్యాన్ని"**

ఇమామ్ బుఖారీ(ర)వారు ఈ విషయాన్ని ఇంకా బాగా విశదీకరించి చెప్పారు :

**"ప్రజల కదలికలు, వారి స్వరాలు, ఆచరణలు మరియు వ్రాతలు అన్నీ సృష్టించబడినవే. అల్ మసాహిఫ్** (వ్రాయబడిన ఖుర్'ఆన్ కాపీల)**లో స్థిరపరచబడిన మరియు హృదయాలలో కలిగియున్న అల్-ఖుర్'ఆనుల్-ముబీన్, అది అల్లాహ్ యొక్క ప్రసంగం, అది సృష్టించబడలేదు"**

ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ గారు కొంత కాలమే నైసాపూర్‌లో ఉన్నారు. తరువాత ఆయన బుఖారా వెళ్ళిపోయారు. బుఖారీ(ర)వారి పట్ల ముహమ్మద్ బిన్ యహ్యా ప్రవర్తన రోజులు గడిచేకొద్దీ అధ్వాన్నంగా మారిపోయింది. తరువాత అతడు చెప్పేవాడు, **"ఎవరైతే ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ దగ్గరకు వెళతారో అతనిని నిందించండి."** బుఖారీ(ర) వాస్తవంగా ఏదైతే చెప్పారో ఆ మాటలను వినడానికి ముహమ్మద్ బిన్ యహ్యా ఇష్టపడలేదు, కాని బదులుగా విన్నాడు ఏదైతే అతను వినాలని కోరుకున్నాడో దానినే.

బుఖారీ(ర)వారు స్పష్టంగా చెప్పారు :

**"ఖుర్'ఆన్ అల్లాహ్ యొక్క ప్రసంగం. అది సృష్టించబడలేదు. మరియు ఎవరైతే అది సృష్టించబడిందని చెబుతారో అతడు కాఫిర్."**

బుఖారీ(ర)వారికి మరియు ముహమ్మద్ బిన్ యహ్యాకు మధ్య సమస్యలు వచ్చాక ముహమ్మద్ బిన్ షాదిల్ బుఖారీ(ర)వారి దగ్గరకు వచ్చి అన్నారు, "ఓ అబూ అబ్దుల్లాహ్! మేము మీకు మరియు ముహమ్మద్ బిన్ యహ్యా మధ్య విషయాన్ని ఏ విధంగా పరిష్కరించ గలం? మీ దగ్గరకు ఎవరైనా వచ్చి కలిస్తే, అతడు పంపించి వేయబడు తున్నాడు."

బుఖారీ(ర) స్పందించారు, **"ముహమ్మద్ బిన్ యహ్యా జ్ఞానం విషయంలో అసూయకు గురి అయ్యాడు. జ్ఞానం అల్లాహ్ పోషణ నుండి. ఆయన దానిని అనుగ్రహిస్తారు ఆయన కోరిన వారిపై."**

నేను అడిగాను, "మీకు ఆపాదించబడుతున్న ఈ ఉద్దేశ్యం గురించి ఏమిటి?"

ఆయన అన్నారు, "ఓ నా కుమారా! ఆ విషయం దానికదే ముప్పు. **నేను చూసాను అహ్మద్ బిన్ హంబల్ గారికి ఏమి జరిగిందో,** ఆయన ఈ విషయం గురించి మాట్లాడినప్పుడు మరియు నేను దానిని నాపైనే ఉంచుకున్నాను దాని గురించి మాట్లాడకూడదని."

అబూ అమ్ర్ ఖఫ్ఫాఫ్‌తో బుఖారీ(ర)వారు చెప్పారు, తాను చెప్పబోయే దానిని జ్ఞాపకం ఉంచుకోమని, **"నైసాపూర్ నుండి, ఖూమస్, అర్రయ్యీ, హమ్దాన్, హిల్వాన్, బాగ్దాద్, కూఫా, బస్రా, మక్కా మరియు మదీనా నుండి 'ఖుర్ఆన్ సృష్టించబడింది'అని** నేను చెప్పానని ఎవరైతే ప్రకటిస్తారో, **అతడు అబద్ధం చెప్పాడు. నేనెన్నడూ అటువంటిదేదీ చెప్పలేదు. నేను చెప్పినదేమిటంటే, "దాసుల ఆచరణలు సృష్టించ బడ్డాయి" అని.**

అహ్మద్ బిన్ సలమహ్‌గారు బుఖారీ(ర)వారితో చెప్పారు: 'ఓ అబూ అబ్దుల్లాహ్! ఈ వ్యక్తి (అంటే ముహమ్మద్ బిన్ యహ్యా) ఖురసాన్ ప్రాంతంలో మరియు ప్రత్యేకంగా ఈ పట్టణంలో (నైసాపూర్‌లో) ఆమోదించ బడిన విద్వాంసుడు. వారించినా అతడు వినకుండా మొండిగా ఈ విషయమే చెబుతున్నాడు మరియు అది ఏ స్థాయికి చేరిందంటే మాలో ఎవ్వరూ దాని గురించి అతనితో మాట్లాడలేకుండా ఉన్నాము. కాబట్టి ఈ విషయంలో ఏమి చేయాలని మీరు అను కుంటున్నారు?"

ఇమామ్ బుఖారీ చెప్పారు :

**"... ఇక నా వ్యవహారాన్ని నేను అల్లాహ్‌కు అప్పగిస్తున్నాను. నిశ్చయంగా, అల్లాహ్ తన దాసులను కనిపెట్టుకుని ఉంటాడు."** (ఖుర్'ఆన్ 40:44)

ఆయన తరువాత పలికారు :

**"ఓ అల్లాహ్! మీకు తెలుసు నేను నిర్ణయించుకోలేదు నైసాపూర్‌లో ఉండాలని అహంకారంతోగాని, గర్వంతోగాని లేక నాయకత్వ స్థానాన్ని పొందాలని కోరికతోగాని ... ఈ వ్యక్తి నన్ను లక్ష్యంగా చేసుకున్నాడు, అల్లాహ్ నాకు ఏదైతే అనుగ్రహించారో దానిపట్ల అసూయాపరుడై."**

ఇమామ్ బుఖారీ(ర) తరువాత అహమద్ బిన్ సలమహ్‌తో చెప్పారు:

"ఓ అహ్మద్, నేను రేపు వెళుతున్నాను అతడు (నీకు) చెప్పేదాని నుండి నీవు రక్షించబడే విధంగా, నా కారణంగా (అంటే నాతో నీకు ఉన్న మైత్రి కారణంగా)"

బుఖారీ(ర) పట్టణాన్ని వీడి వెళుతున్నారని అహ్మద్‌గారు తనతో ఉండే చాలామందికి తెలియజేశారు. కాని ఆయనకు వీడ్కోలు పలికింది ఈయన ఒక్కరే. బుఖారీ(ర) పట్టణం వదిలేవరకూ ఆయనతో పాటు ఉన్నారు.

ఇదే పట్టణంలోకి ప్రవేశించేటప్పుడు కిలోమీటర్ల దూరం జనాలు బారులు తీరి ఆహ్వానాన్ని పలికారు. కాని ఒక విద్వాంసుడి అసూయ, ఓ ధర్మ పరాయణుడి పట్ల ప్రజలలో అనుమానం కలుగజేసింది.

బుఖారీ(ర)వారు నైసాపూర్‌కి రాక పూర్వం ఆయనతో చర్చించి తన సందేహాలను తీర్చుకున్న 'ముహమ్మద్ బిన్ యహ్యా', ఇప్పుడు తన పట్టణంలోనే బుఖారీ(ర) బస చేసి ఉన్నప్పుడు, ఎవరో చెప్పింది విన్నారు.

బుఖారీ(ర)వారి ధర్మపరాయణత గురించి ఇతనికి తెలుసు. హదీస్ విజ్ఞానంలో ఆయనకున్న ప్రావీణ్యం గురించి తెలుసు. మరి అటువంటప్పుడు తాను విన్న విషయం తప్పు కావచ్చేమో అని అనుమాన పడాలి. బుఖారీ(ర) అదే పట్టణంలో బస చేసి ఉన్నారు కాబట్టి సులభంగా ఆయన దగ్గరకు వెళ్ళి తాను వినిన విషయాలు నిజమా? కాదా? అని అడిగి తెలుసు కోవచ్చు. **కాని అలా ఎందుకు చేయలేదు?** కేవలం అసూయ! కేవలం అసూయతోనే అతడు బురదచల్లాడు.

ఇతర విద్వాంసులు అతని మాటలు ఖండించాలి. కాని ముహమ్మద్ బిన్ యహ్యా తానా అంటే తందానా అనే విద్వాంసులు నిశ్శబ్దంగా ఉండిపోయారు. ఇమామ్ ముస్లిమ్(ర) ప్రాక్టికల్‌గా సరియైన విధంగా స్పందించారు. **సత్యానికి మద్దతుగా ఒక్క గొంతు లేచినా చాలు.**

## ఇమామ్ ముస్లిమ్ (ర) స్పందన

సహీహ్ ముస్లిమ్ గ్రంథకర్తయైన ఇమామ్ ముస్లిమ్(ర) మాత్రం బుఖారీ(ర)వారికి విశ్వసనీయంగానే ఉన్నారు. బుఖారీ(ర)వారు నైసాపూర్‌లో ఉన్నప్పుడు, ఆయన ఇంటికి తరచూ వెళుతుండేవారు.

బుఖారీ(ర)ను కలిసి వచ్చిన వారికి తన సమావేశానికి హాజరయ్యే అనుమతి లేదని చెబుతున్నప్పుడు, ఇమామ్ ముస్లిమ్(ర) తన వస్త్రాన్ని తలపాగాపై వేసుకుని ఆ సమావేశంలో పాల్గొన్న వారు చూస్తుండగా లేచారు మరియు ఆ సమావేశాన్ని విడిచి వచ్చేశారు. అంతేకాకుండా ఆ అసూయపరుడైన ముహమ్మద్ బిన్ యహ్యా నుండి **వ్రాసుకున్న హదీస్‌లను తిరిగి ఆయనకే పంపించి వేశారు.** ఈ పని ఆయన బహిరంగంగానే చేశారు.

ముహమ్మద్ బిన్ అబూహాతిమ్ బుఖారీ(ర) చెప్పిన విషయాన్ని ఉల్లేఖించారు:

అజ్ఞానులు మాకు వ్యతిరేకంగా తమలో తాము పథకాలు వేసుకున్న ప్రతీసారి, నేను అదే రాత్రి కలలో అగ్నిని చూసేవాడిని, అగ్ని వెలిగించ బడింది కాని అది ఎవరికీ ఉపయోగం లేదు. మరియు నా చేతికి అందించ బడేది అల్లాహ్ చెప్పిన విషయం,

**... వారు యుద్ధ జ్వాలలను ప్రజ్వలింప జేసినప్పుడల్లా, అల్లాహ్ దానిని చల్లార్చాడు. మరియు వారు భూమిలో కల్లోలం రేకెత్తించ టానికి పాటు పడుతున్నారు. మరియు అల్లాహ్ కల్లోలం రేకెత్తించే వారిని ప్రేమించడు ...** (ఖుర్'ఆన్ 5:64)

### పండితులకైతే ఒక సత్యం, పామరులకైతే మరో సత్యమా? వారందరికీ తెలపవలసిన సత్యం ఒక్కటే!

మర్వ్ పట్టణానికి ఒకసారి బుఖారీ(ర)వారు వచ్చినప్పుడు ఆయనను ఆహ్వానించిన వారిలో ఒకరైన అహ్మద్ బిన్ యసార్ బుఖారీ(ర)వారికి చెప్పారు, "ఓ అబూ అబ్దుల్లాహ్! మేము (అంటే విద్వాంసులం) మీరు ఏదైతే చెప్పారో దానిని ఒప్పుకోకపోవడమనేది ఉండదు. కాని సాధారణ ప్రజానీకం మీ ఉద్దేశాన్ని వ్యక్తపరిస్తే సహించలేరు."

ఇమామ్ బుఖారీ(ర) సమాధానం చెప్పారు,
**"నిశ్చయంగా నేను భయపడతాను నరకాగ్నికి,**
**నాకు సత్యమని తెలిసిన విషయం గురించి**
**నేను అడగబడినప్పుడు,**
**సత్యం కాకుండా మరేదైనా చెప్పవలసి వస్తే."**

బుఖారీ(ర)వారికి ఉన్న విశ్వాసాల గురించి ముహమ్మద్ బిన్ న'ఈమ్‌గారు అడిగినప్పుడు ఆయన ఇలా సమాధానమిచ్చారు:

**"అల్-ఈమాన్ (విశ్వాసం అంటే) వాక్కు మరియు ఆచరణ. మరియు అది పెరుగుతుంది మరియు తగ్గుతుంది. ఖుర్'ఆన్ అల్లాహ్ యొక్క ప్రసంగం మరియు అది సృష్టించ బడలేదు. రసూలుల్లాహ్(స)యొక్క ఉత్తమ సహచరులు అబూబక్ర్(రజి), తరువాత ఉమర్(రజి), తరువాత ఉస్మాన్(రజి) మరియు తరువాత అలీ(రజి). వీటిపైనే నేను జీవిస్తాను వీటిపైనే నేను మరణిస్తాను. మరియు వీటిపైనే నేను పునరుత్థాన దినమున లేపబడతాను, ఇన్షా అల్లాహ్."**

### బుఖారా పట్టణం గవర్నర్‌తో విరోధం

ఖాలిద్ బిన్ అహ్మద్ అజ్-జుహలీ గారు బుఖారా పట్టణానికి గవర్నర్. ఒకసారి ఆయన ముహమ్మద్ బిన్ ఇస్మా'ఈల్(ర)వారికి వ్రాసారు, "అల్-జామి, అత్-తారిఖ్ మరియు మీరు వ్రాసిన ఇతర పుస్తకాలను నా దగ్గరకు తీసుకురండి, నేను మీ దగ్గర నుండి వినడానికి"

గవర్నర్ గారి రాయబారికి ఇమామ్ బుఖారీ ఇలా స్పందన తెలిపారు:

“నేను జ్ఞానం యొక్క స్థాయిని తగ్గించను. నేను దానిని ప్రజల ద్వారాల చెంతకు తీసుకువెళ్ళను. నేను కలిగియున్న జ్ఞానం నుండి మీకేదైనా అవసరమైతే నా మస్‌జిద్‌కు లేక నా ఇంటికి రండి. అది చేయడం మీకు నచ్చకపోతే, మీరు పాలకులు మరియు మీరు నన్ను ఇతరులకు బోధించడానికి కూర్చోకుండా అడ్డు కోవచ్చు. అది నాకు సాకుగా ఉంటుంది అల్లాహ్‌తో పునరుత్థాన దినమున. **నేను జ్ఞానాన్ని దాచను.** ఎందుకంటే, ప్రవక్త(స)వారు చెప్పారు, **“ఎవరైతే జ్ఞానం గురించి అడగబడతాడో మరియు దానిని దాస్తాడో అగ్ని తాడుతో కళ్ళెం వేయబడతాడు”**

అయితే మరొక ఉల్లేఖనంలో పుస్తకాలను తీసుకువచ్చి తన పిల్లలకు వినిపించాలని ఖాలిద్ అడిగినట్లు చెప్పబడింది మరియు బుఖారీ(ర) జ్ఞానం విషయంలో ప్రత్యేకంగా వ్యక్తిగత హోదాలకు ప్రాధాన్యత నివ్వలేదు. ఆయన విద్యార్థులందరికీ ఒకే విలువ ఇచ్చారు.

ఈ సంఘటన ఖాలిద్ మరియు ఇమామ్ బుఖారీ(ర)వారి మధ్య విరోధానికి కారణమైంది.

ఈ విరోధం కారణంగా, హురైస్ బిన్ అబూ వరఖా మరియు మరొక వ్యక్తి యొక్క సహాయాన్ని గవర్నర్ కోరాడు మరియు వారు కలిసి బుఖారీ(ర)వారి దృక్కోణంపై వ్యతిరేకంగా మాట్లాడి బుఖారా పట్టణం నుండి బుఖారీ(ర)వారిని బహిష్కరించారు.

### శాపం

తనపై దుష్ప్రచారం ఈ విధంగా తారా స్థాయికి చేరడంతో ఇమామ్ బుఖారీ(ర)వారికి ఆగ్రహం కలిగింది. ఆయన అల్లాహ్‌కు దు'ఆ చేశారు. తారీఖ్ బాగ్దాద్ మరియు ముఖద్దిమతుల్ ఫతహ్‌లో బుఖారీ(ర)వారి దు'ఆ ఉల్లేఖించబడింది.

**“ఓ అల్లాహ్! నాకు చూపండి వారిలో, వారి సంతానంలో మరియు వారి కుటుంబంలో ఏ కష్టాలతో వారు నన్ను బాధించాలని అను కుంటున్నారో ...”**

**బుఖారీ(ర)వారి దు'ఆ ఫలితంగా,** ఒక నెలలోనే ఖలీఫా దగ్గర నుండి ఒక రాయబారి బుఖారా గవర్నర్ దగ్గరకు వచ్చి అతనిని పదవినుండి ఖలీఫా తొలగించినట్లు ప్రకటించాడు.

హురైస్ విషయానికొస్తే తన కుటుంబంతో ఇబ్బందులలో పడ్డాడు. అతడు చాలా బాధపడ్డాడు వారి వలన. మరియు మూడవ కుట్రదారుడు, అతడు తన సంతానంతో ఇబ్బందులలో పడ్డాడు.

అల్లాహ్ పట్ల స్థిరమైన విశ్వాసంగలవారిపై దౌర్జన్యం చేసినా లేక వారిని అవమానాలపాలు చేయాలని ప్రయత్నిస్తే నష్టపోయేది వారే!

### మరణం

అబ్దుల్-ఖుద్దూస్ బిన్ అబ్దుల్ జబ్బార్ సమర్‌ఖందీ చెప్పగా ఇబ్నె'అదీ ఉల్లేఖించారు. ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్(ర) ఖజన్‌తక్ గ్రామాన్ని సందర్శించారు. సమర్‌ఖంద్‌కి రెండు లీగ్స్ (దాదాపు 10 కిలోమీటర్ల) దూరంలో ఉండే గ్రామం ఇది. ఆయనకు అక్కడ బంధువులున్నారు. ఆయన వారి దగ్గరే బస చేశారు. ఒక రాత్రి తహజ్జుద్ సలాత్ పూర్తి చేసుకున్న తరువాత, నేను ఆయన దు'ఆ చేయడం విన్నాను,

**“ఓ అల్లాహ్! నిశ్చయంగా భూమి, విశాలమైనప్పటికీ, నాకు ఇరుకుగా అయిపోయింది. కాబట్టి నన్ను మీ దగ్గరకు తీసుకోండి.”**

ఆ నెల ముగియకుండానే ఆయన మరణించారు మరియు ఆయన సమాధి ఖజన్‌తక్‌లో ఉంది. ఇమామ్ బుఖారీ చివరి రోజులలో అబూ మన్సూర్ గాలిబ్ బిన్ జిబ్రీల్ గారింట్లో ఉన్నారు. ఆయన వ్యాధి మరీ ఎక్కువయింది. ఇమామ్ బుఖారీ తన సవారీ జంతువు వైపు నడుస్తుండగా, ఆయనకు చాలా అమితంగా చెమట పట్టింది. దాదాపు ఆ సమయంలో ఆయన అబూమన్సూర్‌కు మరియు ఆయన అనుచరులకు ఈ ఆదేశాలను విడిచారు :

“నన్ను కప్పండి మూడు తెల్లటి వస్త్రాలతో, వాటిలోని ఏ వస్త్రమూ చొక్కా కాకూడదు లేక తలపాగా కాకూడదు.” తరువాత కొంత సేపటికి ఇమామ్ బుఖారీ మరణించారు.

**ఈదుల్ ఫిత్ర్‌కు ముందు రోజు రాత్రి 'ఇషా' సలాత్ సమయంలో మరణించారు. హిజ్రి శకం 256 ఈదుల్ ఫిత్ర్ రోజున జుహ్ర్ సలాత్ తరువాత సమాధి గావించబడ్డారు. 13 రోజులు తక్కువ 62 సంవత్సరాలు జీవించారు.**

**అమూల్యమైన హదీస్ జ్ఞానాన్ని గ్రంథస్థం చేసి మనకెంతో మేలు చేసిన ఈ విద్వాంసుడిపై అల్లాహ్ కారుణ్యం కురిపించుగాక! ఆమీన్!**

### అల్-మిస్క్‌ను మించిన సువాసన

అబూ మన్సూర్ గాలిబ్ చెప్పారు, “మేము ఆయనను సమాధి గావించి నప్పుడు, సమాధిని కప్పిన మట్టినుండి చాలా మంచి సువాసన వెలువడింది - ఆ వాసన అల్-మిస్క్ వాసనను మించింది. మరియు ఆ సువాసన సమాధి నుండి ఎన్నో రోజులపాటు ఎడతెగ కుండా వెలువడింది. ఆయన సమాధిపై నుండి ప్రత్యక్షంగా తెల్లటి పొడవైన స్తంభాలు కనిపించాయి ఆకాశంలోకి చాలా ఎత్తుగా. చూసినవారు ఆశ్చర్యచకితులయ్యారు. ప్రజలు చూడటానికి వచ్చారు. ప్రజలు బహుశా అది అనుగ్రహించబడిన మట్టిగా భావించి సమాధిపై ఉండే మట్టిని తీసుకెళ్ళడం మొదలెట్టారు. అయితే సమాధిని రక్షించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు.

**సువాసన ఎన్నో రోజులపాటు ఎగజిమ్మింది.**

ప్రజలు దాని గురించే మాట్లాడుకున్నారు. ఆయనకు తప్పుడు విషయాన్ని ఆపాదించి వ్యతిరేకత చూపినవారికి **నిజం ఏమిటో**

**అర్థమైంది.** ఆయన పట్ల తాము చేసిన పొరపాటుకు చింతించారు. ఆ సమాధి దగ్గరకు వెళ్ళి బహిరంగంగా విచారాన్ని వ్యక్తం చేసి పశ్చాత్తాప పడ్డారు. అల్లాహ్ అనంత కరుణామయుడు.

**అసూయపరులు చేసిన దుష్ప్రచారం బుఖారీ(ర)వారి విలువను తగ్గించలేక పోయింది. అల్లాహ్ కారుణ్యంతో ఆయన విశ్వాసం దుష్ప్రచారాన్ని జయించింది. ప్రజల హృదయాలలో ఆయన విలువ ఎన్నోరెట్లు పెరిగింది.**

---

**అసూయ, అక్రమ సంపాదనపై ఆశ మొ॥వి దుష్ప్రచారాన్ని ప్రోత్సహిస్తాయి. సత్యంపై స్థిరంగా నిలబడే విశ్వాసికి అల్లాహ్ కారుణ్యం తోడుగా ఉంటుంది.**

---

**సత్యాన్ని ఏ మానవుడూ ఆపలేడు. ఎందుకంటే అల్లాహ్‌యే సర్వసత్యం. అసత్యపు మబ్బులు శాశ్వతంగా ఉండవు. సత్యం ప్రకాశిస్తూనే ఉంటుంది. సత్యంపై స్థిరంగా నిలబడేవానిదే విజయం.**

### కలలు (స్వప్నాలు)

ప్రవక్తలకు కలల రూపంలో 'వహీ' అందిందని అందరికీ తెలిసిన విషయమే! మంచి కలలు అల్లాహ్ తరఫునుండి వస్తాయని తెలిపే ప్రవక్త(స)వారి బోధనను కూడా ఇదివరకే అందించాము. సలాత్ కొరకు మస్జిద్ నుండి ఇచ్చే అజాన్ ఎలా ఉండాలో కొందరు సహాబాలు కలలో చూసారు. విశ్వాస మాతృమూర్తులలో కొందరికి కొన్ని ప్రత్యేక కలలు వచ్చాయి. ఆ విధంగా ప్రవక్త(స)వారు భర్త కాబోతున్నారనే విషయం అల్లాహ్ వారికి ముందే తెలిపారు.

బుఖరీ(ర)వారి గురించి పరిచయ వ్యాసంలో ఆయన తల్లిగారికి వచ్చిన ఒక కల గురించి ప్రస్తావించడం జరిగింది. ఆయన తల్లిగారు (ప్రవక్త) ఇబ్రాహీమ్ అల్-ఖలీల్(అ)వారిని స్వప్నంలో చూశారు మరియు ఆయన(అ) ఆమెతో అన్నారు, "ఓ మహిళా! అల్లాహ్ నీ కుమారుడికి చూపు తిరిగిచ్చారు నీ దు:ఖం వలన లేక నీవు చేసుకున్న ఎన్నో దు'ఆల వలన."

ఎందరో విద్వాంసులకు బుఖారీ(ర)వారి విషయంలో వచ్చిన కలలలో కొన్నింటిని ఇక్కడ తెలియజేస్తున్నాము. ఈ కలల గురించి ఇక్కడ ప్రస్తావించడానికి గల కారణం బుఖారీ(ర)వారిపై **వ్యక్తిగత ఆరాధనను ప్రోత్సహించడానికి ఎంతమాత్రం కాదు.** విశ్వాసంతో సత్యంపై స్థిరంగా ఉండే వారికి అల్లాహ్ తోటివారిలో ఎటువంటి గౌరవాన్ని కలుగజేశారో తెలపాలనే సంకల్పం మాత్రమే. Hero-worship కి శాంతిబాట ఎల్లప్పుడూ వ్యతిరేకమే!

### విద్వాంసులకు వచ్చిన కలలు

నేను చూసాను ప్రవక్త(స)వారిని మరియు ఆయనతోపాటు చాలా మంది అనుచరులను. ఆయన ఒకచోట నిలుచుని ఉన్నారు మరియు నేను ఆయనకు సలామ్ చేశాను. ఆయన(స) నా సలామ్‌కు జవాబు చెప్పారు, తరువాత నేను అన్నాను, 'ఓ రసూలుల్లాహ్(స)! మీరెందుకు ఇలా నిలుచున్నారు? ఆయన(స) అన్నారు, 'నేను ముహమ్మద్ బిన్ ఇస్మాయిల్ అల్-బుఖారీ కోసం ఎదురుచూస్తున్నాను.'

కొన్ని రోజుల తరువాత ఆయన మరణం గురించి తెలుసుకున్నారు. మరియు (ఆశ్చర్యమేమిటంటే) నేను తెలుసుకున్నాను ఆయన మరణించారు ఆ సమయంలో, ఏ సమయంలో నేను ప్రవక్త(స) వారిని (కలలో) చూశానో. **- అబ్దుల్ వాహిద్ బిన్ ఆదమ్ తవావీస్**

---

నేను చూశాను అల్-బుఖారీను కలలో. అతడు ప్రవక్త(స)వారి వెనుక నడుస్తున్నారు మరియు ప్రవక్త(స)వారు నేలమీద ఓ చోట నుండి పాదం ఎత్తిన ప్రతీసారి, అబూ అబ్దుల్లాహ్ తన పాదాన్ని ఉంచేవారు అదే చోట." **- ముహమ్మద్ బిన్ అబూ హాతిమ్ అల్-వర్రాఖ్**

---

"నేను చూశాను ప్రవక్త(స)వారిని కలలో మరియు ఆయన(స) నాతో అన్నారు, "ఎటువైపు వెళుతున్నావు?" నేను అన్నాను, 'నేను ముహమ్మద్ బిన్ ఇస్మా'ఈల్ వైపు వెళుతున్నాను'. ఆయన(స) చెప్పారు, నా నుండి అతనికి సలాములు అందజేయి

**- అల్-ఫిర్‌బ్రీ**

### బుఖారీ(ర)వారి సమకాలీనులు మరియు ముహద్దిస్‌లు ఆయన గురించి తెలిపిన అభిప్రాయాలలో కొన్ని:

సాధారణంగా ఒకే కాలంలోని విద్వాంసుల మధ్య లేదా కలిసి చదువుకున్న విద్వాంసుల మధ్య అసూయ ఉంటుంది. కాని బుఖారీ(ర) వారి సమకాలీనులందరూ ఆయనను ఎంతగానో ప్రశంసించారు.

**ఆకాశపు కప్పు క్రింద హదీస్ రంగంలో మిక్కిలి జ్ఞానాన్ని కలిగియున్న వ్యక్తి లేడు ముహమ్మద్ బిన్ ఇస్మాయిల్(ర) కంటే.**
*- ముహమ్మద్ బిన్ ఇస్‌హాఖ్ బిన్ ఖుజైమహ్ (ర)*

**ఇరాక్‌లోగాని, ఖురసాన్‌లోగాని నేనెవర్నీ చూడలేదు చరిత్ర గురించి, హదీస్ ఉల్లేఖనాలలో దాగియున్న దోషాల గురించి మరియు హదీస్ ఉల్లేఖకుల చైన్ గురించి ముహమ్మద్ బిన్ ఇస్మాయిల్ తెలిపినంత ఎక్కువగా.** - *తిర్మిజీ (ర)*

**మీ పాదాలను ముద్దు పెట్టుకునే అనుమతి నివ్వండి ఓ గురువులకు గురువా! హదీస్ విద్వాంసుల నాయకుడా! మరియు హదీస్ ఉల్లేఖనాల, వాటి దోషాల వైద్యుడా! కేవలం ఓ అసూయ పరుడు మాత్రమే మిమ్మల్ని ద్వేషిస్తాడు మరియు నేను సాక్ష్యమిస్తున్నాను ఈ ప్రపంచంలో ఎవ్వరూ లేరు మీకు సమానంగా."**

*- ఇమామ్ ముస్లిమ్ బిన్ అల్-హజ్జాజ్*

**ముహమ్మద్ బిన్ ఇస్మాయిల్ మా అందరిలో చాలా జ్ఞానం గలిగిన వారు. మా అందరికంటే ఆయన చాలా లోతుగా మరియు సరియైన**

**విధంగా ధర్మాన్ని అర్థం చేసుకున్నారు. మరియు జ్ఞాన అన్వేషణకై మిక్కిలి అంకిత భావంతో చాలా కష్టపడ్డారు మరియు మాలో ఎవరి కంటే కూడా. నేను మక్కా, మదీనా, హిజాజ్, షామ్ మరియు ఇరాఖ్ విద్వాంసులను చూశాను. కాని నేనెన్నడూ చూడలేదు వారిలో బాగా పరిపూర్ణుడిని ముహమ్మద్ బిన్ ఇస్మా'ఈల్ కంటే.**

**ముహమ్మద్ బిన్ ఇస్మా'ఈల్ వివేకం గలవారు మరియు నా కంటే చాలా ఎక్కువ జ్ఞానం గలవారు. వాస్తవానికి నేడు, అల్లాహ్ సృష్టి రాశులలో అన్నిటికంటే వివేకం గలవాడు (ఆయన).**

**అల్లాహ్ అతనిని అనుగ్రహించారు - ఆయన గ్రంథంలో మరియు ఆయనప్రవక్త(స)వారి నాలుకపై ప్రస్తావించబడిన ఆయన(అల్లాహ్) ఆదేశాలను మరియు నిషేధాలను అర్థం చేసుకునే సామర్థ్యాన్ని ఇచ్చి. ముహమ్మద్ బిన్ ఇస్మా'ఈల్ ఖుర్'ఆన్ పఠించినప్పుడు అతని హృదయం, అతని దృష్టి, అతని వినికిడి ఏకాగ్రతలో నిమగ్నమై ఉంటాయి. మరియు ఆయన ఒకే విధమైన ఆయత్‌లను మననం చేస్తారు. మరియు దాని ఫలితంగా ధర్మ సమ్మతం మరియు అధర్మమైన వాటి గురించి తెలుసుకుంటారు.**

*- అబ్దుర్-రహ్మాన్ అద్-దారిమీ (ర)*

బుఖారీ(ర)వారి గురించి చెప్పడానికి ఇంకా ఎన్నో విషయాలు ఉన్నప్పటికీ ఈ వ్యాసంతో ఆయన జీవితచరిత్రను క్లుప్తంగా ముగించాము. వచ్చే సంచికలో, ఇన్షా అల్లాహ్, ఆయన తెలిపిన ఓ ముఖ్య విషయాన్ని అందించి, మాకు అందుబాటులో ఉన్న మరో ముహద్దిస్ గారి గురించి క్లుప్తంగా తెలియజేస్తాము, ఇన్షా అల్లాహ్!

ముహద్దిస్‌లు ప్రవక్త(స)వారి బోధనలను గ్రంథస్థం చేసి మనకు అందించి ఎనలేని సహాయం చేశారు. వారిపై అల్లాహ్ కారుణ్యం కురవాలని దు'ఆ చేసుకోవడం మనపైనున్న బాధ్యత. మనకు ముఖ్యం అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడైన ముహమ్మద్(స)వారు మాత్రమే. హదీస్ విజ్ఞానం కూడా మహాసాగరం వంటిది. దాని గురించి తెలియకుండా ఎవరికి తోచిన విధంగా వారు మాట్లాడుతున్నారు. 'అందని ద్రాక్ష పుల్లన' అనే సామెత ఈ సందర్భానికి సరిపోతుంది.

హదీస్‌లను తేలికగా తీసిపారేసే వారున్నారు. ముహద్దిస్‌ల గురించి తెలియకుండా వారిపై వ్యాఖ్యలు చేసే మూర్ఖులున్నారు. పాఠకులు ఇటువంటి వారికి దూరంగా ఉండండి.

ఒక హదీస్ మౌదూ (కల్పితం) హదీస్ అయితే దానిని స్వీకరించము. దయీఫ్ అనేది సందేహాస్పదమైన హదీస్. సందేహాల పట్ల దూరంగా ఉండటమే మేలు.

ఆచరణ విషయానికొస్తే, అది **'సహీహ్'** అయినా ఆచరించాలి. అది **'హసన్'** అయినా ఆచరించాలి. ఇవి హదీస్‌ల యొక్క ప్రామాణికతను సూచించేవి మాత్రమే గాని ముహమ్మద్(స)వారి బోధనల స్థాయిని తెలిపేవి మాత్రం కావు. **ముహమ్మద్(స)వారి ఏ బోధన అయినా సరే అది అత్యుత్తమమైనదే.**

### హదీస్‌లలో ప్రాథమిక రకాలు

ఖౌలి, ఫె'లి, తఖ్‌రీర్, షమాఇల్

### హదీస్ వర్గీకరణలు

(Classifications of Hadith) :

- **ఓ నిర్దిష్టమైన ప్రామాణికునిపై ఆధారపడి**

  ఖుద్‌సీ, మర్‌ఫూ, మఖూఫ్, మఖ్‌తూ

- **సనద్‌లో ఉండేవారి మధ్య సంబంధాల ఆధారంగా**

  ముస్‌నద్, ముర్సల్, మున్‌ఖతి, ముత్తసిల్, ము'అదల్, ము'అల్లఖ్

- **ఇస్నాద్ యొక్క ప్రతీ దశలో ఉన్న హదీస్‌ను తెలియజేసేవారి సంఖ్యను బట్టి వర్గీకరణ**

  ముతవాతిర్

  అహద్ (గరీబ్, అజీజ్, మష్‌హూర్)

- **హదీస్‌ను ఉల్లేఖించిన విధానాన్ని బట్టి వర్గీకరణ**

  ముదల్లస్ హదీస్

  తద్‌లీస్ (తద్‌లీస్ అల్-ఇస్నాద్, తద్‌లీస్ అల్-షుయూఖ్ తద్‌లీస్ అల్-తస్వియ్యహ్)

  ముసల్‌సల్

- **సనద్ మరియు మతన్ లక్షణాన్ని బట్టి వర్గీకరణ**

  షాజ్, మున్‌కర్, ముద్‌రజ్

- **సనద్ మరియు మతన్ లోని దోషాన్ని బట్టి వర్గీకరణ**

  మ'లూల్ లేక ము'అల్లల్

  ముజ్‌తరిబ్

  మఖ్‌లూబ్

- **ఉల్లేఖకుల విశ్వసనీయత మరియు జ్ఞాపకశక్తి ఆధారంగా వర్గీకరణ**

  సహీహ్, హసన్, దయీఫ్, మౌదూ

**పై హదీస్ వర్గీకరణలన్నింటినీ ఉదాహరణ పూర్వకంగా శాంతిబాట పూర్వపు సంచికలలో ఇదే శీర్షికలో వివరించడం జరిగింది.**

**మస్జిద్‌లలో లభించిన ఇమామ్ ఉద్యోగాలు లేదా మదరసాలలో తమ టీచర్ ఉద్యోగాలు పోతాయనే భయంతో కొందరు విద్వాంసులు సత్యాన్ని బహిరంగ పరచడానికి భయపడుతున్నారు. అటువంటివారికి బుఖారీ(ర)వారి జీవితం కనువిప్పు కావాలి.**

# అసమాన త్యాగాన్ని గుర్తుచేసే బక్రీద్

إِسْمَاعِيل هَاجَر إِبْرَاهِيم

బక్రీద్ జరుపుకున్నాం!

వచ్చే సంవత్సరం, ఇన్షా అల్లాహ్ జరుపుకుంటాం. ఎన్నో సంవత్సరాల నుండి ఈ పండుగ ముస్లిములు జరుపుకుంటూనే ఉన్నారు. అయితే ఈ పండుగకి మూలకారణమైన 'త్యాగం' గురించి ఎంతమంది గుర్తు చేసుకుని ఉంటారు? మనం ఒక జంతువుని జిబహ్ చేయడం త్యాగం అవుతుందా? వాస్తవానికి అది త్యాగం కాదు, కాని ఓ అసమాన త్యాగానికి గుర్తుగా జరుపుకునేది.

ఓ తండ్రి, ఓ తల్లి మరియు వారి కుమారుడు చేసిన త్యాగం అది.

సమాజంలో కుటుంబం అనేది ఒక యూనిట్. ప్రతీ కుటుంబానికి పైన తెలిపిన ముగ్గురు వ్యక్తులు చేసిన త్యాగాలు ఆదర్శం కావాలి.

ఈ కుటుంబంలో తండ్రి మరెవరో కాదు ఖలీలుల్లాహ్ - **ఇబ్రాహీమ్(అ)**. ఆయన భార్య హాజర(అ). అల్లాహ్ అనుగ్రహంతో వారికి సహనశీలుడైన ఇస్మా'ఈల్(అ) వారు జన్మించారు.

ఈ త్యాగశీలుర కుటుంబం యొక్క తరతరాల వారసులలో మన ప్రియ ప్రవక్త ముహమ్మద్(స) వారు అతి ముఖ్యమైనవారు.

అల్లాహ్ యొక్క సందేశహరుడైన ఇబ్రాహీమ్(అ)వారికి వృద్ధాప్యంలో పెద్ద కుమారుడైన ఇస్మా'ఈల్(అ)వారు హాజర(అ)వారికి జన్మించారు. ఆ తరువాత ఈ కుటుంబం చేసిన త్యాగానికి ప్రతిఫలంగా అల్లాహుతాలా ఇబ్రాహీమ్(అ)వారి మొదటి భార్యయైన శారా(అ)వారికి 'ఇస్‌హాఖ్' అనే మరో కుమారుడిని అనుగ్రహిస్తున్నట్లు శుభవార్త నిచ్చారు. సద్వర్తునుడైన 'ఇస్‌హాఖ్'(అ)వారి కుమారుడే యాఖూబ్(అ). ఈ యాఖూబ్(అ)వారికే ఇస్రాయీల్ అనే మరో పేరుకూడా ఉంది. ఆయన సంతానమే - బనీ ఇస్రాయీల్.

కాబట్టి ఇస్‌హాఖ్(అ)వారు గ్రంథప్రజలకు పితామహుడు.

ఇబ్రాహీమ్(అ)వారి పెద్ద కుమారుడు మరియు సహనశీలుడైన ఇస్మా'ఈల్(అ)వారు ముహమ్మద్(స)వారి పితామహుడు. అరబ్బులను బనీ మా ఇస్సమా (ఆకాశ జలపుత్రులు) అంటారు. ఈ అరబ్బులకు తల్లి హాజర(అ).

**స్త్రీ జాతికి గర్వకారణం ఈ మహిళ. మనకున్న ఆధారాలను బట్టి ఆమె చేసినటువంటి గొప్ప త్యాగం మరో స్త్రీ చేయలేదనే చెప్పాలి. ఆమె త్యాగం అసమానం.**

నిర్మానుష్యమైన మక్కాలో ఇబ్రాహీమ్(అ), హాజర(అ) మరియు ఇస్మా'ఈల్(అ) అడుగుపెట్టక ముందు ఈ భూమిపై **'జమ్‌జమ్'** నీరు అందుబాటులో లేదు. ఈ కుటుంబం యొక్క విశ్వాసానికి మరియు త్యాగానికి అందిన మహోన్నత ఇహలోక ప్రతిఫలాలలో ఒకటి - ఈ జమ్‌జమ్ నీరు. ఈ కుటుంబం ద్వారానే జమ్‌జమ్ నీటిని మానవులు త్రాగగలిగే అవకాశం లభించింది.

**అల్లాహ్‌పై విశ్వాసంలోగాని మరియు అల్లాహ్ కోసం త్యాగం చేయడంలోగాని ఈ ముగ్గురూ ముగ్గురే!**

ముస్లిములు చేసుకునే రెండు పండుగలలో, ఒకటైన ఈదుల్ ఫిత్ర్ అల్లాహ్ కోసం ఉపవాసం ఉండి, వాటిని నెలరోజుల పాటు పూర్తిచేసిన సందర్భంగా చేసుకునే పండుగ అయితే, ఈ రెండవ పండుగైన బక్రీద్ మాత్రం అల్లాహ్ పట్ల ఒక కుటుంబం చూపిన విశ్వాస త్యాగాలకు గుర్తుగా జరుపు కుంటున్నాము.

ఇస్లామ్ యొక్క 5 మూల స్తంభాలలో ఒకటైన 'హజ్జ్'లో నిర్వహించే విధులు ఈ ముగ్గురునీ గుర్తు చేస్తాయి. షైతాన్‌పై ఇబ్రాహీం(అ)వారు రాళ్ళు రువ్వడాన్ని హజ్జ్‌లో మనం అనుకరిస్తున్నాం. సఫా, మర్వా పర్వతాల మధ్య స'ఈ చేసి, హాజిరా(అ)వారిని అనుకరిస్తున్నాము. ఇస్మా'ఈల్(అ) వారు జిబహ్‌కు సిద్ధపడ్డాక, ఆయనకు బదులు గొఱ్ఱె పిల్లను జిబహ్ చేయడం, ఈద్ రోజున మనం అనుకరిస్తున్నాం.

ఇది ప్రళయం వరకూ ఆచరణలో ఉంటుంది. ఈ కుటుంబం అల్లాహ్‌చే ఎంతగానో అనుగ్రహించబడిన కుటుంబం మరియు ముస్లిములకు ఈ కుటుంబం ప్రత్యేకమైనది. ఈ కుటుంబం గురించి ప్రామాణిక హదీస్‌లు మరియు తఫ్సీర్ గ్రంథ వివరాలు జూన్ మరియు జూలై, 2010 సంచికలో ప్రత్యేక వ్యాసాల రూపంలో అందించాము. ఈ ప్రస్తుత వ్యాసంలో వాటినే సులభమైన వచన రూపంలో ఒక వరుస క్రమంలో అందిస్తున్నాము.

బక్రీద్‌కు ముందు వచ్చే రెండు మూడు శుక్రవారాల ఖుత్బాలలో మరియు ఈద్ ఖుత్బాలో త్యాగం గురించి సాధారణంగా చెబుతారు. కాని మాతృమూర్తి **హాజర(అ)**వారి గురించి చెప్పేది చాలా తక్కువ.

ఆమె చేసిన అసమాన త్యాగానికి ఈ ఖుత్బాలలో ప్రాధాన్యత అంతగా లేకపోవడం విచారకరమైన విషయం. ఆ లోటును తీర్చడానికి ఈ త్యాగమహిళ గురించి శాంతిబాట అందించే ప్రత్యేక విశ్లేషణే ఈ వ్యాసం.

## ఇబ్రాహీమ్(అ)

ఈయన అల్లాహ్ యొక్క ప్రవక్త మరియు సందేశహరుడు. ఈయన తన కుమారుడైన ఇస్మా'ఈల్(అ)తో కలిసి 'కాబా' మస్జిద్ నిర్మాణం గావించారు. ఈ కాబా మస్జిద్‌కు తిన్నగా పైన 7వ ఆకాశంలో బైతుల్ మ'మూర్ ఉంది. అక్కడ ప్రతీ రోజు 70,000 మంది అల్లాహ్ యొక్క దూతలు తవాఫ్ చేస్తారు. ఒకసారి తవాఫ్ చేసిన దూతలకు పునరుత్థాన దినం వరకూ అవకాశం రాదు. ఆ విధంగా ప్రతీరోజూ కొత్తగా 70వేల మంది ప్రదక్షిణం చేసే ఆ బైతుల్ మ'మూర్ దగ్గరే ఇబ్రాహీమ్(అ)వారి స్థానం. ముహమ్మద్(స)వారు మేరాజ్ సందర్భంగా గగనయాత్రలో బైతుల్ మ'మూర్ వద్ద ఇబ్రాహీమ్(అ)వారిని కలిశారు.

> ఇబ్రాహీమ్ యూదుడూ కాడు మరియు క్రైస్తవుడూ కాడు! కాని అతను **హనీఫ్** (ఏకదైవ సిద్ధాంతంపై ఉన్నవాడు), **ముస్లిమ్** (అల్లాహ్‌కు విధేయుడు) మరియు అతడు ఏమాత్రం **ముష్రిక్** (అల్లాహ్‌కు సాటి కల్పించేవాడు) కాడు. (ఖుర్'ఆన్ 3:67)
>
> నిశ్చయంగా, ఇబ్రాహీమ్‌తో దగ్గరి సంబంధం గలవారంటే, అతనిని అనుసరించే వారు మరియు ఈ ప్రవక్త (ముహమ్మద్) మరియు విశ్వసించిన వారు. మరియు అల్లాహ్‌యే విశ్వాసుల సంరక్షకుడు. (ఖుర్'ఆన్ 3:68)

మనం ప్రతీరోజూ చేసే సలాత్ (నమాజ్)లో దరూద్ పఠిస్తాము. అది చదవకుండా సలాత్ పూర్తి కాదు.

> **అల్లాహుమ్మ సల్లి అలా ముహ్మదిన్ వ్వ అలా ఆలి ముహమ్మదిన్ కమా సల్లయ్‌త అలా ఇబ్రాహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదు మ్మజీద్. అల్లాహుమ్మ బారిక్ అలా ముహమ్మదిన్ వ్వ అలా ఆలి ముహమ్మదిన్ కమా బారక్త అలా ఇబ్రాహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదు మ్మజీద్.**
>
> *(ఓ అల్లాహ్! ముహమ్మద్ (స) మరియు ఆయన కుటుంబీకుల పైనా కారుణ్యం అవతరింప చెయ్యి నీవు ఇబ్రాహీమ్ పైనా ఆయన కుటుంబీకుల పైనా కారుణ్యం అవతరింపజేసినట్లుగానే. నిశ్చయంగా నీవే సకల పొగడ్తలకు మరియు కృతజ్ఞతలకు అర్హుడివి, ఘనతగలవాడివి. ఓ అల్లాహ్! ముహమ్మద్(స) మరియు ఆయన కుటుంబీకులపై శుభములను అవతరింప చెయ్యి. ఇబ్రాహీమ్ (అ)పైనా ఆయన కుటుంబీకుల పైనా శుభాలను అవతరింప జేసినట్లుగానే, నిశ్చయంగా నీవే సకల పొగడ్తలకు మరియు కృతజ్ఞతలకు అర్హుడివి, ఘనతగలవాడివి.)*

పై విషయాలను బట్టి ఇబ్రాహీమ్(అ)వారు మనకెంత ముఖ్యులో అర్థమవుతుంది. కాబట్టి ఈయన గురించి ప్రతీ ముస్లిమ్ స్పష్టంగా తెలుసుకోవాలి.

విగ్రహాలు తయారుచేసే ఆజర్ ఇబ్రాహీమ్(అ)వారి తండ్రి. ఇబ్రాహీమ్(అ)వారు తన తండ్రి మరియు ప్రజలు విగ్రహారాధన చేయడాన్ని చూసి వారిని ఇలా అడిగారు : **"మీరెవరిని ఆరాధిస్తున్నారు?"** ''మేము విగ్రహాలను ఆరాధిస్తున్నాము మరియు మేము వాటికే ఎల్లప్పుడు భక్తులమై ఉంటాము'' అని వారు చెప్పారు.

''మీరు వీటిని పిలిచినప్పుడు ఇవి మీ మొర ఆలకిస్తాయా?'' అని ఇబ్రాహీమ్(అ)వారు మరలా వారిని ప్రశ్నించారు. మరియు ''లేదా, మీకేమైనా మేలు చేయగలవా? లేదా హాని చేయగలవా?'' అని కూడా అన్నారు.

సమాధానంగా వారు 'మేము మా తండ్రి తాతలను, వీటినే ఆరాధిస్తూ ఉండగా చూశాము' అని చెప్పారు. వాస్తవానికి, వారు మరియు వారి తండ్రితాతలు స్పష్టంగా మార్గ భ్రష్టత్వంలో పడి ఉన్నారని ఇబ్రాహీమ్(అ) అన్నారు.

'ఏమీ? నీవు మా వద్దకు ఏదైనా సత్యాన్ని తెచ్చావా? లేదా నీవు మాతో పరిహాసమాడుతున్నావా?'' అని వారడిగారు.

(ఇబ్రాహీమ్) అన్నాడు : 'అలా కాదు! భూమ్యాకాశాల ప్రభువే మీ ప్రభువు! ఆయనే వాటన్నింటినీ సృజించాడు. మరియు నేను ఈ విషయం గురించి మీ ముందు సాక్ష్యమిస్తున్నాను. మరియు నేను అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెబుతున్నాను, మీరు వెళ్ళిపోయిన తరువాత మీ విగ్రహాలకు విరుద్ధంగా తప్పక యుక్తి పన్నుతాను'.

ఇబ్రాహీమ్(అ)వారు ఒక పెద్ద (విగ్రహం) తప్ప మిగిలిన వాటన్నింటినీ ముక్కలు ముక్కలుగా చేశారు, బహుశా వారు దాని వైపునకు మరలుతారని!

ప్రజల అనుమానం ఇబ్రాహీమ్(అ)వారిపైనే.

'ఓ ఇబ్రాహీమ్! ఏమీ? నీవేనా మా ఆరాధ్య దైవాలతో ఇలా వ్యవహరించిన వాడవు?' అని అడిగారు. ఆయన ఆ పెద్ద విగ్రహం గురించి ప్రస్తావిస్తూ, 'కాదు కాదు! వారిలోని ఈ పెద్దవాడే ఇలా చేశాడు! అవి మాట్లాడగలిగితే వాటినే అడగండి!' అని సమాధానమిచ్చారు.

**ఏమని అడగగలరు? అవి మాత్రం ఏమని సమాధానం చెప్పగలవు?** అవి మాట్లాడలేవని ప్రజలకు స్పష్టంగా తెలుసు. ఆ విషయాన్ని వారే చెప్పారు. **"అలా అయితే! మీరు అల్లాహ్‌ను వదలి, మీకెలాంటి లాభంగానీ, నష్టంగానీ చేకూర్చలేని వాటిని ఆరాధిస్తారా?"** అని ఇబ్రాహీమ్(అ) వారికి హితబోధ చేశారు.

కాని వారు ఆగ్రహించారు: **'మీరేమైనా చేయదలుచుకుంటే! ఇతనిని కాల్చివేయండి, మీ ఆరాధ్య దైవాలకు తోడ్పడండి'.**

ఇబ్రాహీమ్(అ)వారు విగ్రహారాధకుడైన తన తండ్రికి కూడా హితబోధ చేశారు.

> ''ఓ నాన్నా! వినలేని మరియు చూడలేని మరియు నీకు ఏ విధంగానూ సహాయపడలేని వాటిని, నీవెందుకు ఆరాధిస్తున్నావు? ఓ నాన్నా! వాస్తవానికి, నా వద్దకు వచ్చిన జ్ఞానం నీ వద్దకు రాలేదు, కావున నీవు నన్ను అనుసరిస్తే, నేను నీకు సరైనమార్గం చూపుతాను.

ఓ నాన్నా! షైతాన్‌ను ఆరాధించకు. నిశ్చయంగా షైతాన్ అనంత కరుణామయునికి అవిధేయుడు. ఓ నాన్నా! నిశ్చయంగా, నీవు అనంత కరుణామయుని శిక్షకు గురి అయ్యి, షైతాన్ యొక్క స్నేహితుడవు అయిపోతావేమోనని నేను భయపడుతున్నాను!''

కాని కుమారుడి హితబోధ తండ్రి చెవికెక్కలేదు. బదులుగా ఆగ్రహించాడు. **''ఓ ఇబ్రాహీమ్! ఏమీ? నీవు నా దేవుళ్ళకు విముఖత చూపుతున్నావా? ఒకవేళ నీవిది మానుకోకపోతే నేను నిన్ను రాళ్ళు రువ్వి చంపివేస్తాను. కావున నీవు నా నుండి చాలా దూరమైపో!''**

ఇబ్రాహీమ్(అ) ఇలా చెప్పారు : ''నీకు సలాం! నీ కొరకు నా ప్రభువు క్షమాపణను వేడుకుంటాను.నిశ్చయంగా, ఆయన నా యెడల ఎంతో దయాళువు.''

ఇబ్రాహీమ్(అ)వారు అల్లాహ్‌కు దు'ఆ చేశారు.

**మరియు నా తండ్రిని క్షమించు. నిశ్చయంగా, అతడు మార్గభ్రష్టులలోని వాడే! మరియు అందరూ తిరిగి బ్రతికింపబడే రోజు నన్ను అవమానంపాలు చేయకు."** (ఖుర్'ఆన్ 26:86-87)

**కాని కాఫిర్లకు అల్లాహ్ స్వర్గాన్ని నిషేధించారు.** ఇబ్రాహీమ్(అ)వారి తండ్రిని అల్లాహ్ క్షమించలేదు. ఈ విషయం క్రింది హదీస్ వివరిస్తుంది.

అబూహురైరా(రజి) ఉల్లేఖనం : పునరుత్థాన దినం నాడు ఇబ్రాహీమ్(అ) తన తండ్రి 'ఆజర్'ని కలుస్తారు. అతని ముఖం నల్లగా ధూళితో కప్పబడి ఉంటుంది. ఇబ్రాహీమ్(అ) (అతనితో) చెబుతారు: 'నాకు అవిధేయత చూపించ వద్దని నీకు నేను చెప్పలేదా?'. అతని తండ్రి సమాధానమిస్తాడు: 'ఈ రోజు నీకు నేను అవిధేయత చూపను'. ఇబ్రాహీమ్(అ) చెబుతారు : 'ఓ అల్లాహ్! నీవు వాగ్దానం చేశావు పునరుత్థాన దినమున నన్ను అవమానంపాలు చేయనని, మరియు నా తండ్రిని అగౌరవ పరచడం మరియు శపించడం కంటే ఎక్కువ అవమానకరం ఇంకేముంటుంది? అప్పుడు (అతనితో) అల్లాహ్ చెబుతారు: 'నేను అవిశ్వాసులపై స్వర్గాన్ని నిషేధించాను'. తరువాత అతనికి వివరించబడుతుంది. 'ఓ ఇబ్రాహీమ్! చూడు! నీ పాదాల క్రింద ఏముంది? ఆయన చూస్తారు. అక్కడ ఓ జీఖ్ (లేక హైనా - ఓ జంతువు) రక్తసిక్తమైనది కనిపిస్తుంది. అది కాళ్ళతో పట్టబడి (నరక)అగ్నిలోకి విసిరివేయ బడుతుంది. **(సహీహ్ బుఖారీ, 3350, పుస్తకం 60, అధ్యా.8, సంపుటి 4)**

(ఇబ్రాహీమ్(అ)వారి తండ్రి జంతువు రూపంలోకి మార్చబడి అగ్నిలోకి విసిరివేయబడతాడు. అతని 'ముస్లిమ్ కుమారుని' మధ్యవర్తిత్వం అతనికి ఉపయోగ పడలేదు. ఎందుకంటే అతడు అవిశ్వాసి. ఆ తరువాత ఇబ్రాహీం(అ)వారు తన తండ్రి బాధ్యతను వదిలేస్తారు)

ప్రజలు తమ విగ్రహాల ధ్వంసం విషయంలో ఇబ్రాహీమ్(అ)వారిని కాల్చివెయ్యాలని నిర్ణయించుకున్నారు. ఆ సంఘటన తఫ్సీర్ గ్రంథాలలో వివరించబడింది. ఆయనను కాల్చడానికి మంటను సిద్ధం చేయ దలిచారు.

నగరంలోని వారందరూ పూర్తిగా ఒక నెలరోజుల పాటు కట్టెలను సేకరించడంలో మునిగిపోయారు. ఆ కట్టెలను కాల్చి ఆ మంటలో ఇబ్రాహీమ్(అ)వారిని వేయాలని వారి నిర్ణయం. వారు కట్టెలకు నిప్పు అంటించి అది భయానకంగా మండేలా వారం రోజుల పాటు రాజేసారు. వాటి జ్వాలలు ఆకాశాన్ని అంటుకుంటున్నాయా అనిపించేలా.

అగ్ని బాగా ప్రజ్వరిల్లినప్పుడు పూర్తి భయంకరంగా మారినప్పుడు, దానిలోకి ఇబ్రాహీమ్(అ)వారిని విసిరివేయాలని నిర్ణయించుకున్నారు. కాని ఆ అగ్ని ఎంత తీవ్రతతో మండుతున్నదంటే, ఏ ఒక్కరూ దానిని సమీపించడానికి ధైర్యం చేయలేకపోయారు. అప్పుడు వారికి షైతాన్ ఉపాయం చెప్పాడు. తాళ్ళతో ఎగురవేయడానికి ఉపయోగించే సాధనాన్ని ఉపయోగించి మంటల్లో విసరమని.

అల్లాహ్ స్నేహితుడైన ఇబ్రాహీమ్(అ)వారిని ప్రజలు మంటల్లో తోయడానికి సన్నద్ధమవు తుండగా భూమ్యాకాశాలలోని సకల జీవులు, అల్లాహ్ దూతలు ఇబ్రాహీమ్(అ)వారి పరిస్థితికి ఒకే విధంగా కేకలు వేయడం జరిగింది. అప్పుడు ఇబ్రాహీమ్(అ)వారికి సహాయం చేయడానికి అల్లాహుతాలా వారందరికి అనుమతినిచ్చారు. తమ సహాయం ఆయనకు అవసరమా అని అల్లాహ్ దూతలు ఇబ్రాహీమ్(అ)వారిని అడిగినప్పుడు, **తనను కాపాడటానికి అల్లాహ్ చాలు అని మరియు ఆయన తనని గమనిస్తూనే ఉంటారని సమాధానమిచ్చారు.**

జిబ్రీల్(అ)వారు కూడా తాను సహాయం అందించాలా అని అడిగినప్పుడు ఇబ్రాహీమ్(అ) బదులిచ్చారు **'నాకు తప్పకుండా సహాయం అవసరం, కాని అది అల్లాహ్ నుండే (రావాలి), మీ నుండి కాదు''.**

ఖుర్'ఆన్ (21:69)లో అల్లాహ్ అగ్నిని ఇలా ఆజ్ఞాపిస్తున్నారు :

**'ఓ అగ్నీ! నీవు ఇబ్రాహీమ్ కొరకు చల్లగా సురక్షితంగా అయిపో!'**

అల్లాహ్ ఆదేశంతో అగ్ని చల్లబడి ఆయనకు సౌకర్యంగా మారింది. అది ఆయనకు ఆహ్లాదకరంగా మారింది. అంటే మంట మంటలాగే ఉంది. ఆయన చుట్టూ ఉన్న ఇతరత్రా అన్ని కాలిపోయాయి. ఆయనకు కట్టిన తాడు కాలిపోయింది. అయినా సరే ఆ మంట ఇబ్రాహీమ్(అ)వారి శరీరాన్ని తాకలేదు.

**కొన్ని చారిత్రక ఆధారాలను బట్టి ఆయన అగ్నిలో ఏడు రోజులు ఉన్నారని, ఆయన తన పూర్తి జీవితంలో ఆ ఏడు రోజులే ఎంతో సౌకర్యాన్ని పొందిన రోజులుగా ఆయన గుర్తుచేసుకునేవారని తెలుస్తుంది.**

మనకు అందుబాటులో ఉన్న ఆధారాలను బట్టి ఇబ్రాహీమ్(అ) అల్లాహ్ కోసం ప్రాణ త్యాగానికి సిద్ధపడిన తొలి ప్రవక్త మాత్రమే కాకుండా, అల్లాహ్ సహాయం తప్ప ఇతరుల సహాయాన్ని స్వీకరించడానికి ఇష్టపడలేదు.

విశ్వాసులకు అల్లాహ్ సహాయం అందిస్తారు, ఆయన విశ్వాసులైన

తన దాసులను కనిపెట్టుకుని ఉంటారు. కేవలం అల్లాహ్ సహాయాన్ని మాత్రమే అర్థించేవారికి, అల్లాహ్ ఏ విధంగా సహాయం చేస్తారో పై సంఘటన తెలియజేసింది.

ఇబ్రాహీమ్(అ) వారిని మంటలలో వేసి **ప్రజలు ఏమని భావించి ఉంటారు?** వారి భావనకు పూర్తి విరుద్ధంగా ఆయన ఎంతో సంతోషంగా, జీవితంలో ఏనాడూ పొందని ఆహ్లాదాన్ని అనుభవించారు.

**ధర్మానికి దూరంగా ఉండి ఎన్నో సౌకర్యాలతో ఇహలోక సుఖాలను అనుభవించే వారెందరో సమాజంలో ఉన్నారు. ధర్మపరాయణులైన విశ్వాసులను కష్టాలలో ఉండగా చూసి, వారి బ్రతుకు నాశనమైనట్లుగా భావిస్తారు. అవును. చూసేవారికి అలాగే కనిపిస్తుంది. కాని అల్లాహ్ వారిని కనిపెట్టుకుని ఉంటారు. వారికి ఆయన సహాయం అందుతుంది.**

వాస్తవానికి ఎవరు నష్టపోయారో ఖుర్'ఆన్‌లో అల్లాహుతాలా తెలియజేశారు :

మేము (అల్లాహ్) ఆజ్ఞాపించాము : 'ఓ అగ్నీ! నీవు ఇబ్రాహీమ్ కొరకు చల్లగా సురక్షితంగా అయిపో!'

మరియు వారు ఇబ్రాహీమ్‌కు కీడు తలపెట్ట గోరారు కాని మేము వారినే నష్టంలో పడవేశాము.'' **(ఖుర్'ఆన్ 21:69-70)**

'మరియు నేను మిమ్మల్ని - మరియు అల్లాహ్‌కు బదులుగా మీరు ప్రార్థిస్తున్న వాటిని - అందరినీ వదిలి పోతున్నాను. మరియు నేను నా ప్రభువును ప్రార్థిస్తాను. నేను నా ప్రభువును ప్రార్థించి విఫలుడను కానని,నమ్ముతున్నాను''**(ఖుర్'ఆన్ 19:48)**

ఇబ్రాహీమ్(అ)వారికి 'శారా'వారితో వివాహం జరిగింది.

ఇబ్రాహీమ్(అ)వారు తన భార్య 'శారా'తో ఓ క్రూరుడైన రాజు పాలించే భూభాగం గుండా వెళుతున్నప్పుడు, ఆ రాజుకి సమాచారం అందింది. ఒక మనిషి అందమైన స్త్రీతో కలిసి ఉన్నారని. ఆ రాజు ఇబ్రాహీమ్(అ) వారిని తన దగ్గరికి రమ్మని కబురు పంపి 'శారా' గురించి అడిగారు, ''ఆ స్త్రీ ఎవరు?'' 'ఆమె నా చెల్లెలు' అని ఇబ్రాహీమ్(అ)వారు చెప్పారు. ఇబ్రాహీమ్(అ)వారు తన జీవితంలో అప్పటికే అల్లాహ్ కోసం రెండు అబద్ధాలు చెప్పారు. ఇది 3వ అబద్ధం. ఇవి తప్ప ఆయన ఏ అబద్ధాలు చెప్పలేదు.

ఇబ్రాహీమ్(అ)వారు ఈ అబద్ధం చెప్పడానికి ఒక కారణం ఉంది. అదేమిటంటే, ఏ స్త్రీ అయినా సరే తన తండ్రి లేదా సోదరునితో వెళ్తుంటే, ఆ స్త్రీని ఆ రాజు వదిలేసేవాడు. తన భార్య గౌరవాన్ని కాపాడటానికే ఇబ్రాహీమ్(అ) ఆ విధంగా చెప్పారు.

రాజు దగ్గర నుండి వెనక్కి వచ్చిన తరువాత, ఆయన తన భార్య దగ్గరికి వెళ్ళి చెప్పారు, **'ఓ శారా! ఈ భూభాగంపై నువ్వు మరియు నేను తప్ప విశ్వాసులు లేరు. నీ గురించి అతడు నన్ను అడిగాడు మరియు నీవు నా సోదరివి అని చెప్పాను. కాబట్టి నా మాటను ఖండించకు.'**

ఆ క్రూరుడు శారాను పిలిపించాడు మరియు ఆమె అతని దగ్గరికి వచ్చినప్పుడు ఆమెను తన చేతితో పట్టుకుందామని ప్రయత్నించాడు. కాని అతని చేయి బిగుసుకు పోయింది. అతడు శారాను అడిగాడు, తన కొరకు అల్లాహ్‌ను ప్రార్థించమని మరియు ఆమెకు హాని తలపెట్టనని. కాబట్టి శారా అల్లాహ్‌ను అర్థించారు అతనికి నయం కావాలని. అతనికి నయమైంది.

అయినాసరే వాడి ఆలోచన మారలేదు. మరలా రెండవసారి పట్టు కోవడానికి ప్రయత్నించాడు, కాని అతని చేయి ఇంతకు పూర్వం కంటే ఎక్కువగా బిగుసుకు పోయింది. మరలా తన కొరకు అల్లాహ్‌ను ప్రార్థించమని కోరాడు. ఆమె అల్లాహ్‌ను అర్థించారు. తిరిగి అతడు బాగయ్యాడు.

ఆమెను తీసుకువచ్చిన భటుడిని పిలిచి, 'నీవు నా దగ్గరికి ఓ మనిషిని తీసుకురాలేదు. ఓ దెయ్యాన్ని తీసుకు వచ్చావు' అన్నాడు.

ఆ రాజు 'హాజర'ను 'శారా'కు బహుమతిగా ఇచ్చాడు. 'శారా' ఇబ్రాహీమ్ (అ)వారి దగ్గరకు వచ్చి జరిగింది చెప్పారు. 'శారా'(అ)వారికి పిల్లలు కలుగలేదు. ఇబ్రాహీమ్(అ)వారు హాజర(అ)వారిని వివాహం చేసుకున్నారు. వారిద్దరికీ జన్మించిన కుమారుడు - ఇస్మా'ఈల్(అ). ఈయన ద్వారా అరబ్బు జాతి మక్కాలో విస్తరించింది. అందుకే 'హాజర' వారిని అరబ్బులకు మాతృమూర్తి అన్నారు.

## హాజర(అ)

హాజర(అ)వారికి ఇస్మా'ఈల్(అ) జన్మించే సమయానికి ఇబ్రాహీమ్ (అ)వారి వయస్సు సుమారు 80 సంవత్సరాలు. మొదటి భార్య 'శారా'తో ఇబ్రాహీమ్(అ)వారికి అప్పటివరకూ సంతానం కలుగలేదు.

ఇబ్రాహీమ్(అ)వారికి తన భార్యతో అభిప్రాయ బేధాలొచ్చినప్పుడు, ఆయన ఇస్మా'ఈల్(అ)ని మరియు అతని తల్లి, హాజరని దూరంగా తీసుకు వెళ్ళారు.

మెడనుండి క్రింది వరకూ ఉన్న వస్త్రాన్ని ధరించిన తొలి మహిళ ఇస్మా'ఈల్(అ)వారి మాతృమూర్తి. 'శారా'కు తన అడుగుజాడలు తెలియకుండా ఉండటానికి ఆమె ఆ వస్త్రాన్ని ఉపయోగించారు. 'శారా' మరియు 'హాజిరా' మధ్య ఉన్న సమస్య గురించి ప్రామాణిక సమాచారం లేదు. ఆ విషయంపై భిన్న కథనాలున్నాయి. అవి నిజమో, కాదో అల్లాహ్‌కు తెలియాలి. అందుకని ఆ విషయాలను ఇక్కడ తెలియజేయడం లేదు.

ఇబ్రాహీమ్(అ) ఆమెను మరియు చనుబాలు త్రాగే కుమారుడు 'ఇస్మాయీల్(అ)ను 'కాబా'కు దగ్గరగా ఉండే ప్రదేశానికి (ఇప్పుడు) జమజమ్ ఉన్నచోటులో చెట్టు క్రిందకు, మస్జిద్ యొక్క ఎత్తైన ప్రదేశానికి తీసుకువచ్చారు.

ఆ రోజుల్లో మక్కాలో ఎవరూ లేరు. నీరు కూడా లేదు. ఆయన ఇద్దరిని అక్కడ కూర్చోబెట్టి ఖర్జూరాలున్న తోలు సంచిని మరియు

కొంచెం నీరుగల ఓ చిన్న నీటితిత్తిని వారి దగ్గరలో ఉంచారు. నీటితిత్తి నుండి ఇస్మా'ఈల్(అ) తల్లి నీటిని త్రాగేవారు. తన బిడ్డ ఆకలి తీర్చడానికి ఆమెలో 'పాలు' పెరిగేవి.

ఇంటివైపు ఇబ్రాహీమ్(అ)వారు బయలుదేరారు. హాజర(అ) ఆయనను అనుసరించారు. వారు 'కదా' అనే ప్రాంతాన్ని చేరుకున్నప్పుడు, ఆమె ఆయనని వెనుక నుండి పిలిచారు, '**ఓ ఇబ్రాహీమ్! మీరెక్కడకు వెళుతున్నారు, ఎవరి సహవాసంలో సంతోషం కలుగుతుందో అటువంటి ఎవరూ లేని, ఏదీలేని ఈ లోయలో మమ్మల్ని వదిలి?'**

అవే మాటలను ఆమె చాలా సార్లు పలికారు, కాని ఆయన ఆమె వంక వెనుతిరిగి చూడలేదు. అప్పుడు ఆమె అడిగారు :

"**ఆ విధంగా చేయమని అల్లాహ్ మిమ్మల్ని ఆదేశించారా?**".

ఆయన అన్నారు "**ఔను**".

"**అయితే ఆయన (అల్లాహ్) మమ్మల్ని నిర్లక్ష్యం చేయరు**" అని ఆమె అన్నారు.

అల్లాహ్ ఆదేశించారని తెలియగానే **ఆమెలో అల్లాహ్ పట్ల ఎంత భరోసా!** అల్లాహ్ నిర్లక్ష్యం చేయరనే భరోసా ఉన్న ఏ విశ్వాసియైనా ఎటువంటి భయానక పరిస్థితులోనైనా జీవించడం సాధ్యమౌతుంది.

వారికి కనిపించనంత దూరంలో ఉన్న సనియా అనే చోటుకి చేరుకున్నాక, ఇబ్రాహీమ్(అ) కాబా వైపు తిరిగి రెండుచేతులు ఎత్తి ఈ దు'ఆ చేశారు.

**"ఓ మా ప్రభూ! వాస్తవానికి నేను నా సంతానంలో కొందరిని నీ పవిత్ర గృహం (కాబా) దగ్గర పైరు పండని, ఎండిపోయిన కొండలోయలో నివశింపజేశాను. ఓ మా ప్రభూ! వారిని అక్కడ సలాత్ (నమాజ్) స్థాపించడానికి ఉంచాను. కనుక నీవు ప్రజల హృదయాలను, వారివైపు ఆకర్షింపజెయ్యి మరియు వారు కృతజ్ఞులై ఉండటానికి వారికి జీవనోపాధిగా ఫలాలను సమకూర్చు" (ఖుర్'ఆన్ 14:37)**

భర్తతో మాట్లాడిన తరువాత ఆమె వెనక్కి తన చోటుకు వచ్చి నీటితిత్తి నుండి నీటిని త్రాగారు. ఆమె బిడ్డ కొరకు ఆమెలో పాలు పెరిగాయి. నీటితిత్తిలోని నీరు అంతా అయిపోయాక, ఆమెకు దాహం వేసింది మరియు ఆమె బిడ్డకు కూడా దాహంగా ఉంది. బిడ్డ వైపు ఆందోళనతో చూస్తున్నారు. ఆమె తన బిడ్డ వంక చూసి సహించే శక్తిలేక, అతనిని వదిలి అక్కడికి సఫా పర్వతం దగ్గరగా ఉందని గ్రహించి, దానిపై నిలుచుని లోయ వంక నిశితంగా చూస్తున్నారు ఎవరైనా కనిపించ వచ్చేమోనని, కాని ఆమెకు ఎవరూ కనిపించలేదు.

తరువాత ఆమె సఫా పర్వతాన్ని దిగి లోయను చేరుకున్నాక, ఆమె తన దుస్తులను దోపుకుని, తీవ్రమైన కష్టాలలో ఉన్న వ్యక్తిలా లోయలో పరుగెత్తారు, ఆ లోయను దాటి మర్వా పర్వతాన్ని చేరేవరకూ. అక్కడ ఆమె నిలుచుని ఎవరైనా కనిపిస్తారేమోనని చూస్తున్నారు, కాని ఆమెకు ఎవరూ కనిపించలేదు.

(ఆ రెండు కొండల మధ్య) ఆమె ఇటూ అటూ చాలాసార్లు పరుగెత్తారు. అప్పుడామె స్వగతంలో చెప్పుకున్నారు, 'నేను వెళ్ళి నా బిడ్డ పరిస్థితి చూడటం మేలు'. ఆమె వెళ్ళి, చావు బతుకులలో ఉన్నట్టున్న తన బిడ్డను చూశారు. అతని ఆ స్థితిని చూసి సహించలేక పోయారు. (తనలో) చెప్పుకున్నారు, '**నేను వెళ్ళి చూస్తే, నాకు ఎవరైనా కనిపించవచ్చు**'. ఆమె వెళ్ళి సఫా పర్వతాన్ని అధిరోహించి చాలా సేపు చూశారు.

ఆమె ఈ విధంగా ఏడుసార్లు చేశారు. (అంటే సఫా పర్వతం నుండి మర్వా పర్వతానికి మధ్య 7 సార్లు).

ముహమ్మద్(స)వారు చెప్పారు, "వాటి (సఫా మరియు మర్వాల) మధ్య ప్రజలు సయీ చేసే (నడిచే) సాంప్రదాయానికి ఇదే మూలం."

**ఇక్కడ అతి ముఖ్యమైన ఓ విషయాన్ని గమనించాలి. అల్లాహ్‌పై పూర్తిగా ఆమెకు భరోసా ఉంది. అయినా సరే, అల్లాహ్ పేరుతో ప్రయత్నం మానలేదు. ఆమె తన శక్తి మేర ప్రయత్నించారు.**

ఆఖరిసారిగా ఆమె 'మర్వా'ను చేరుకున్నప్పుడు మరలా ఆమె (స్వగతంలో) చెప్పుకున్నారు, 'నేను వెనక్కి వెళ్ళి బిడ్డ పరిస్థితిని చూడటం మేలు'. కాని అకస్మాత్తుగా **ఓ కంఠస్వరం వినబడింది.** ఆమె తనకు తాను నిశ్శబ్దంగా ఉండాలని చెప్పుకుని శ్రద్ధగా విన్నారు. ఆమె ఆ స్వరం మరలా విని చెప్పారు, '**మీ మాటలు నాకు వినిపించాయి. మీ దగ్గర సహాయం ఉందా?**'

ఆ కంఠస్వరం అల్లాహ్ యొక్క దూతయైన జిబ్రీల్(అ) వారిది. జిబ్రీల్(అ) నేలను తన కాలిమడమతో కొట్టారు. నీరు బయటకి ఉబికి వచ్చింది. దాని చుట్టూ గట్టు వలే ఆమె తయారు చేశారు.

ఈ విధంగా తన చేతులను ఉపయోగించి, నీటితిత్తిని తన చేతులతో నింపడం ప్రారంభించారు. మరియు దాని నుండి కొంత నీరు తోడాక నీరు బయటకు వస్తూనే ఉంది.

**ప్రవక్త(స)వారు చెప్పారు, ఇస్మా'ఈల్(అ)వారి తల్లిపై అల్లాహ్ కరుణను కురిపించుగాక! ఆమె జమ్‌జమ్‌ను అలా ఉండనిస్తే (అంటే ప్రవాహాన్ని ఆపడానికి ప్రయత్నించకుండా లేక నీటి తిత్తిని నింపడానికి అందులోని నీటిని పైకెత్తకుండా ఉంటే), జమ్‌జమ్ ఒక 'నది' గా మారి భూమిపై ప్రవహిస్తూ ఉండేది".**

ప్రవక్త(స)వారు చెప్పారు, 'తరువాత ఆమె (నీటిని) త్రాగారు మరియు బిడ్డచేత త్రాపించారు. జిబ్రీల్(అ) ఆమెతో చెప్పారు:

**'నిర్లక్ష్యం చేయబడ్డారని భయపడవద్దు. ఇది అల్లాహ్ యొక్క గృహం దీనిని ఈ బాలుడు మరియు అతని తండ్రి నిర్మిస్తారు మరియు అల్లాహ్ ఎన్నడూ తన ప్రజలను నిర్లక్ష్యం చేయరు'**

**అల్లాహ్ తన దాసులను నిర్లక్ష్యం చేయరు అనే విషయం ప్రతీ ముస్లిమ్ మనస్సులో స్థిరంగా నాటుకోవాలి.** అక్కడ కాబా మస్జిద్ పునాదులున్నాయి. ఆ పునాదిపై కాబా మస్జిద్ నిర్మాణాన్ని ఇబ్రాహీమ్(అ) మరియు ఇస్మా'ఈల్(అ) నిర్మిస్తారని ముందుగానే ఆ మాతృమూర్తికి సందేశం అందింది. ప్రవక్తలకు 'వహీ' అందజేసే జిబ్రీల్ (అ)వారే ఆమెకు ఆ సందేశాన్ని తెలిపారు.

ఆ సమయంలో కాబా గృహం ఎత్తైన ప్రదేశంలో ఓ చిన్న కొండను పోలి ఉంది. పెద్ద వానలు వచ్చినప్పుడు అవి గుట్టకు కుడివైపుకు మరియు ఎడమవైపుకు ప్రవహించేవి.

జుర్హమ్ తెగవారు కొందరు ఆ ప్రాంతంవైపు వచ్చేవరకూ ఆమె ఆ విధంగా నివశించారు (లేక) జుర్హుమ్ కుటుంబం ఆమె మరియు ఆమె బిడ్డ ప్రక్కగా వెళ్ళడం జరిగింది. 'కదా' మార్గం నుండి వస్తున్నారు గనుక వారు మక్కా క్రింది భాగాన ఆగారు. **వారు ఒక పక్షిని చూశారు.**

వారు అన్నారు, "ఈ పక్షి ఖచ్చితంగా నీటి చుట్టూ ఎగురుతుంది, ఈ లోయలో నీరు లేదని మనకు తెలిసినప్పటికీ". వారు ఒకరో ఇద్దరో దూతలను నీటిమూలాన్ని కనుగొనడానికి పంపారు. వారు నీటిని చూసి తిరిగి వచ్చారు వారికి తెలియజేయడానికి. కాబట్టి, వారంతా నీటి వైపు వచ్చారు.

ముహమ్మద్(స)వారు చెప్పారు: ఇస్మా'ఈల్(అ)వారి మాతృమూర్తి నీటికి సమీపంలో కూర్చుని ఉన్నారు. వారు ఆమెను అడిగారు **'మీతో ఇక్కడ ఉండటానికి అనుమతి నిస్తారా?'** ఆమె సమాధాన మిచ్చారు, 'అలాగే, కాని ఈ నీటిపై మీకు హక్కు ఉండదు'. దానికి వారు అంగీకరించారు.

ప్రవక్త(స) చెప్పారు : వారి సహచర్యం ఆమెకు సంతోషం కలిగిస్తుండడంతో, ఆ పరిస్థితులు ఇస్మా'ఈల్(అ)వారి మాతృమూర్తికి స్వాంతన నిచ్చాయి. వారు అక్కడే స్థిరపడిపోయారు, తరువాత కాలంలో అక్కడ స్థిరపడినవారు తమ కుటుంబాల కొరకు కబురు పంపారు. వారు వచ్చి వీరితోపాటు స్థిరపడిపోయారు. ఆ విధంగా కొన్ని కుటుంబాల వారు (అక్కడ) శాశ్వత నివాశమేర్పరచుకున్నారు.

> చూశారా! ఆమె తన బిడ్డతో అక్కడకు వచ్చేటప్పటికి నీరు లేదు, మనుష్యులు లేరు. కాని ఇప్పుడు అక్కడ నీరు ఉంది. కుటుంబాలు కూడా వచ్చి చేరాయి. ఇదే అల్లాహ్ కారుణ్యం. అల్లాహ్ విశ్వాసులను నిర్లక్ష్యం చేయరు.

ఆ బిడ్డ (ఇస్మా'ఈల్) పెరిగి పెద్దవాడయ్యారు మరియు వారి నుండి అరబీ భాష నేర్చుకున్నారు. మరియు (అతని సుగుణాల వలన) వారిచే ప్రేమించ బడ్డారు మరియు ఆయనతో పాటు వారి అభిమానమూ పెరిగింది.

ఇస్మా'ఈల్(అ)వారు సహనశీలుడని అల్లాహ్‌యే చెప్పారు. అల్లాహ్ యొక్క సందేశం (వహీ) ప్రవక్తలకు చాలా రకాలుగా అందుతుంది. అందులో ఒకటి - కల(స్వప్నం) రూపంలో తెలియజేయబడే వహీ.

లేక లేక కలిగిన కుమారుడైన ఇస్మా'ఈల్(అ)ని స్వయంగా తనే జిబహ్ చేస్తున్నట్లు ఇబ్రాహీమ్(అ)వారికి కలవచ్చింది. అది అల్లాహ్ యొక్క ఆదేశం. ఉన్న ఒక్క కుమారున్ని కూడా ఖుర్బానీ ఇవ్వవలసిన పరిస్థితి వచ్చింది. ఇది మామూలు త్యాగం కాదు. వృద్ధాప్యంలో లేక లేక కలిగిన కుమారుడిని త్యాగం చెయ్యాలి. కలిగిన ఆ ఒక్క కుమారుడి దగ్గర ఉండి ఆ బిడ్డ ఆలనా పాలనా చూసుకునే అవకాశం కూడా లేకపోయింది. ఈ విషయమే ఖుర్'ఆన్‌లో అల్లాహుతాలా ఇలా తెలియజేశారు:

"మరియు అతను (ఇబ్రాహీమ్) అన్నాడు : "నిశ్చయంగా, నేను నా ప్రభువు (తీసుకునివెళ్ళే) వైపునకు వెళ్ళిపోతాను. ఆయనే నాకు మార్గదర్శకత్వం చేస్తాడు". (అతను ఇలా ప్రార్థించాడు): **"ఓ నా ప్రభూ! నాకు సద్వర్తనుడైన (కుమారుణ్ణి) ప్రసాదించు!"** కావున **మేము అతనికి సహనశీలుడైన కుమారుని శుభవార్తనిచ్చాము.** ఆ బాలుడు అతనికి తోడుగా శ్రమ చేయగల వయస్సుకు చేరుకున్నప్పుడు, అతను (ఇబ్రాహీమ్) అన్నాడు: **"ఓ నా కుమారా! వాస్తవానికి నేను నిన్ను జిబహ్ చేస్తున్నట్లుగా కలలో చూశాను. ఇక నీ సలహా ఏమిటో చెప్పు!"** అతను (ఇస్మాయీల్) అన్నాడు: "ఓ నాన్నా! నీకు ఇవ్వబడిన ఆజ్ఞను నెరవేర్చు. అల్లాహ్ కోరితే నీవు నన్ను సహనశీలులలో పొందగలవు!" ఆ తరువాత వారిద్దరూ (అల్లాహ్) ఆజ్ఞను నెరవేర్చడానికి సిద్ధపడ్డారు. మరియు అతను (ఇబ్రాహీమ్) అతనిని (ఇస్మా'ఈల్‌ను) నుదుటిపై బోర్లా పరుండబెట్టాడు. మరియు మేము అతనిని పిలుస్తూ ఇలా అన్నాము : **"ఓ ఇబ్రాహీమ్! వాస్తవంగా, నీవు కలను నిజం చేసి చూపించావు!"** నిశ్చయంగా, మేము సజ్జనులకు ఇలాంటి ప్రతిఫలమిస్తాము. నిశ్చయంగా ఇదొక స్పష్టమైన పరీక్ష. మరియు మేము అతనికి (ఇస్మా'ఈల్‌కు) బదులుగా ఒక గొప్ప జబీహాను పరిహారంగా ఇచ్చాము. మరియు తరువాత వచ్చే తరాలలో అతని కీర్తిని నిలిపాము. "ఇబ్రాహీమ్‌కు శాంతి కలుగుగాక !" (ఖుర్'ఆన్ 37:99-109)

సద్వర్తనుడైన కుమారున్ని ప్రసాదించమని ఇబ్రాహీమ్(అ)వారు చేసుకున్న ప్రార్థనని స్వీకరించి అల్లాహుతాలా ఆయనకి సహనశీలుడైన కుమారున్ని ప్రసాదిస్తున్నట్లు శుభవార్త నిచ్చారు. ఇబ్రాహీమ్(అ)వారి సతీమణి 'శారా'వారికి సంతానం కలుగలేదు. ఓ రాజు ఆమెకు గృహసంబంధమైన విషయాలలో సహాయకారిగా ఉండటానికి 'హాజర'ను బహుమతిగా ఇచ్చారు, శారా(అ), ఆమెను తన భర్తకు బహుమతిగా ఇచ్చారు. 'హాజర'(అ)వారిని ఇబ్రాహీమ్(అ) వివాహం చేసుకున్నారు.

పై ఆయత్‌లో చెప్పిన 'సహనశీలుడైన' కుమారుడు 'హాజర'కు జన్మించారు. ఆయనకు 'ఇస్మాయీల్'అని పేరు పెట్టడం జరిగింది. కొన్ని ఉల్లేఖనాలను బట్టి **ఈ కల వరుసగా 3 రోజులపాటు వచ్చిందని తెలుస్తుంది** (ఖుర్తుబీ).

**ఇక్కడ ఓ ముఖ్య విషయాన్ని మనం గుర్తించాలి.**

తన మొదటి కుమారున్ని 'జిబహ్' చేయమని చెప్పే అల్లాహ్ యొక్క సందేశాన్ని (అంటే వహీ) తీసుకుని ఏ దూత కూడా ఇబ్రాహీమ్(అ)వారి దగ్గరికి రాలేదు. ఈ ఆదేశం కేవలం కల ద్వారానే తెలియజేయబడింది.

**'కలలోనే వచ్చింది కదా'** అని ఆ సందేశం పట్ల ఇబ్రాహీమ్(అ) నిర్లక్ష్యం వహించ లేదు. దానిని ఆదేశంగా స్వీకరించి అల్లాహ్‌కు విధేయత చూపారు. **ఇందులో ఎంతో వివేకముంది.** దీనిని బట్టి ఇబ్రాహీమ్(అ)వారికి అల్లాహ్ పట్ల ఉన్న విధేయత ఎంత గొప్పదో అర్థమౌతుంది.

ఇస్మా'ఈల్(అ), ఇబ్రాహీమ్(అ)వారికి తొలి సంతానం మాత్రమే కాకుండా, ఆ సమయానికి ఆయనే ఏకైక కుమారుడు. ఎంతటి కఠిన పరీక్ష ఇది.

''**ఆ బాలుడు అతనికి తోడుగా శ్రమ చేయగల వయస్సుకు చేరుకున్నప్పుడు .....**'' అని 102వ ఆయత్‌లో చెప్పడాన్ని బట్టి, ఆ సమయంలో ఆ బాలుడు ఊహ తెలియనివాడు కాదని, పరిస్థితులను అర్థం చేసుకోగల మానసిక ఆరోగ్యం కలిగినవాడని స్పష్టమౌతుంది. లేక లేక కలిగిన కుమారుడు మాత్రమే కాకుండా, చేతికి అంది వచ్చిన కుమారుడు - **ఇస్మా'ఈల్(అ).**

కొందరు వ్యాఖ్యాతల ప్రకారం అప్పటికి ఇస్మా'ఈల్(అ)వారి వయస్సు 13 సంవత్సరాలు.

అల్లాహ్ ఆదేశం గురించి ఇబ్రాహీమ్(అ) తన కుమారునికి చెప్పినప్పుడు, ఎటువంటి అభ్యంతరం చెప్పకుండా ఆయన వెంటనే ఆ ఆదేశాన్ని అమలు చేయడానికే సిద్ధపడ్డారు .

**"ఇన్షా అల్లాహ్! (అల్లాహ్ కోరితే) నీవు నన్ను సహనశీలులలో పొందగలవు".**

ఈ మాటలతో ఎంతో వినయం చూపారు ఇస్మా'ఈల్(అ). తను ఒక్కడే సహనశీలుడు అని చెప్పకుండా, సహనశీలురలో ఒక్కరిగా ఆయనను చెప్పుకున్నారు. ఇక్కడ ''**ఇన్షా అల్లాహ్** (అల్లాహ్ కోరితే)'' అని చెప్పడం ద్వారా ఈ త్యాగానికి తను సిద్ధమైనప్పటికీ అది తన గొప్పతనంగా భావించకుండా అల్లాహ్ అంగీకారం పైనే ఉంచడాన్ని బట్టి ఆయన సమాధానంలో గర్వంగాని, అహంగాని ఏ కోశానా కనిపించలేదు. ఎంతో వినయం, విధేయతతో కూడి ఉన్నాయి ఆయన మాటలు. ఈ వాక్యంలో మనమందరం నేర్చుకోవలసిన ఓ గొప్పపాఠం ఉంది. అదేమిటంటే,

**మనపై మనకు ఎంత ఆత్మవిశ్వాసం ఉన్నా సరే, అహంతో కూడిన మాటలతోగాని, ప్రగల్భాలతోగాని పెద్ద పెద్ద ప్రకటనలు చేయకూడదని, ఇటువంటి విషయంలో ఆచితూచి చాలా జాగ్రత్తగా పదాలు ఉపయోగించాలని తెలుసుకోవాలి. ఇటువంటి విషయంలో మనపై ప్రజలు దృష్టిపడే విధంగా కాకుండా, 'అల్లాహ్'పై విశ్వాసం ఉండేలా వారి దృష్టిని మరల్చాలి. మన శక్తిమేర వినయ విధేయతలను చూపించ వలసి ఉంది.**

కొన్ని చారిత్రక మరియు వ్యాఖ్యాన గ్రంథాల నివేదికలను బట్టి మనకు తెలిసేది ఏమిటంటే, ఈ త్యాగం చేయకుండా షైతాన్ ఇబ్రాహీమ్(అ)వారిని తప్పుదోవ పట్టించడానికి మూడుసార్లు ప్రయత్నించాడు మరియు ప్రతీసారి ఇబ్రాహీమ్(అ) 7 రాళ్ళను వానిపై విసిరి వాడిని అక్కడి నుండి పారద్రోలారు.

**ఇప్పటికీ ఈ చర్యకు గుర్తుగా మినా యొక్క మూడు స్తంభాలపై రాళ్ళు రువ్వబడుతున్నాయి.**

చివరకు, ఇద్దరూ జిబహ్ చేసే ప్రదేశానికి వచ్చినప్పుడు, ఇస్మా'ఈల్(అ) తన తండ్రికి కొన్ని విషయాలు చెప్పారు, శరీరం ఎక్కువగా కదలకుండా, ఎక్కువగా తిరిగిపోకుండా, తండ్రి బట్టలపై రక్తపు మరకలు పడకుండా ఉండేలా తనను సరిగా కట్టమని, బట్టలపై ఆ రక్తపు చుక్కలు తల్లి చూస్తే విచారపడుతుందని. కత్తిని బాగా పదునుగా చేయమని, తన కంఠంపై వేగంగా పోనివ్వమని, ఆ విధంగా అతని చివరి శ్వాస సులభమౌతుందని. తరువాత తల్లి దగ్గరకు ఆయన తిరిగి వెళ్ళినప్పుడు, తన సలామ్ ఆమెకు తెలియజేయమని, అతని చొక్కాను తీసుకు వెళ్ళాలంటే, సంతోషంగా తీసుకు వెళ్ళవచ్చని, దాని ద్వారా ఆమెకు అవసరమైన సౌకర్యాన్ని అది కలుగజేస్తుందని చెప్పడం జరిగింది. తన ఒక్కగానొక్క కుమారుని నోట ఇటువంటి మాటలు విన్న తండ్రి గుండె ఆ సమయంలో ఎలా స్పందించి ఉంటుందో! తన కుమారునితో చెప్పారు, **"కుమారా! అల్లాహ్ నాపై ఉంచిన ఈ కార్యంలో నువ్వు నాకెంత సహాయకారివో!"** ఇలా చెప్పి, కుమారుడిని చెమర్చిన కళ్ళతో ముద్దు పెట్టుకుని ఆయనను కట్టారు (మజ్‌హరి).

103వ ఆయత్‌లో చెప్పినట్లు ''**... అతనిని నుదుటిపై బోర్లా పరుండ బెట్టాడు ...**'' అయితే ప్రారంభంలో అతని ముఖం పైకి ఉండేటట్లుగా ఉంచి, అతని గొంతుపై కత్తిని కదిపినా, ఎన్నోసార్లు ప్రయత్నించినప్పటికీ కోయబడలేదు. ఎందుకంటే అల్లాహ్ ఇష్టప్రకారం కత్తికి మరియు కంఠానికి మధ్య రాగి రేకు అడ్డువచ్చేది. అప్పుడు కుమారుడే తన తండ్రితో తన తలను క్రిందివైపు ఉంచమని అభ్యర్థించడం జరిగిందని కొన్ని వ్యాఖ్యాన గ్రంథాల ద్వారా తెలుస్తుంది.

**"ఓ ఇబ్రాహీమ్! వాస్తవంగా, నీవు కలను నిజం చేసి చూపించావు"** అని పై ఆయత్‌లో చెప్పబడింది. నిజానికి కలలో కూడా ఆయన తన కుమారుని జిబహ్ చేయడానికి కత్తిని కదపడం మాత్రమే చూశారు. **"మేము అతనికి బదులుగా ఒక గొప్ప జబీహ్‌ని పరిహారంగా ఇచ్చాము."**

కొన్ని హదీస్‌లను బట్టి, ఆకాశాల నుండి ఆ పిలుపు వినగానే ఇబ్రాహీమ్(అ) పైకి చూస్తే జిబ్రీల్(అ) ఓ గొఱ్ఱెతో కనిపించారు. తన కుమారునికి బదులుగా అల్లాహ్ పంపిన ఆ గొఱ్ఱెను జిబహ్ చేయడం జరిగింది. ఆ విధంగా జిబహ్ చేయబడిన జంతువును - 'జిబ్‌హున్ అజీమ్' (గొప్పది) అన్నారు. ఎందుకంటే అల్లాహ్ యొక్క కరుణతో పంపబడింది కనుక.

ఇస్మా'ఈల్(అ) యుక్తవయస్సుకు చేరుకున్నప్పుడు, ఆ ప్రాంతంలో స్థిరపడిన కుటుంబంలోని ఓస్త్రీకి ఇచ్చి వివాహం జరిపించారు.

తన వారిని చూడాలని ఇబ్రాహీమ్(అ)వారికి అనిపించింది.

ఆ విషయాన్ని తన భార్య (శారా) ముందు బహిర్గత పరిచారు. **'(మక్కాలో)నేను వదిలిన నాపై ఆధారపడిన వారిని చూడాలను కుంటున్నాను.'**

ఇస్మా'ఈల్(అ)వారి మాతృమూర్తి మరణించారు. తరువాత ఇబ్రాహీమ్(అ) వచ్చారు. తన కుటుంబాన్ని వదిలి చాలా కాలమయింది. చూడాలని వచ్చారు. కాని ఆయనకు ఇస్మా'ఈల్(అ) కనిపించలేదు. అతని గురించి ఇస్మా'ఈల్(అ)వారి భార్యను ఆయన అడిగినప్పుడు, ఆమె సమాధానమిచ్చారు **'ఆయన మా జీవనోపాధి కొరకు బయటకు వెళ్ళారు'.**

తరువాత ఆయన వారి స్థితి గురించి మరియు వారి జీవన విధానం గురించి ఆమెను అడిగారు. ఆమె సమాధాన మిచ్చారు, 'మేము దారిద్ర్యంలో జీవిస్తున్నాము. మేము కష్టాలతో మరియు లేమితో జీవిస్తున్నామని ఫిర్యాదు చేసారు. ఆయన అన్నారు, **"నీ భర్త ఇంటికి వచ్చినప్పుడు, అతనికి నా సలాము అందజేయి మరియు (నీ ఇంటి) గడపను మార్చమన్నానని అతనికి చెప్పు".**

ఇస్మా'ఈల్(అ) వచ్చినప్పుడు ఆయనకి ఏదో అసాధారణ భావం కలిగింది, ఆయన తన భార్యను అడిగారు, **'ఎవరైనా చూడటానికి వచ్చారా?'**. ఆమె సమాధానమిచ్చారు, 'ఔను, ఫలానా వర్ణన గల ఓ ముసలాయన వచ్చారు మరియు మీ గురించి నన్ను అడిగారు మరియు నేను ఆయనకు తెలియజేశాను, మన జీవన స్థితిగతుల గురించి అడిగారు. మనం కష్టాల్లో మరియు బీదరికంలో జీవిస్తున్నట్లు ఆయనకు చెప్పాను'.

ఇస్మా'ఈల్(అ) చెప్పారు, **'నీకు ఆయన ఏదైనా సలహా ఇచ్చారా?'**. ఆమె సమాధాన మిచ్చారు, 'ఔను, మీకు సలాము అందజేయమని మరియు మీ ఇంటి గడప మార్చమని ఆయన నాకు చెప్పారు'.

ఇస్మా'ఈల్(అ) చెప్పారు, **'ఆయన నా తండ్రిగారు మరియు నీకు విడాకులివ్వమని ఆయన నన్ను ఆదేశించారు. మీ ఇంటికి వెళ్ళిపో'**. ఆ విధంగా, ఇస్మా'ఈల్(అ) ఆమెకు విడాకులిచ్చి వారిలోని (జుర్హుమ్ తెగలోని) మరో స్త్రీని వివాహం చేసుకున్నారు.

తరువాత అల్లాహ్‌కు ఇష్టమైనంత కాలం వారికి ఇబ్రాహీమ్(అ) దూరంగా గడిపారు. మరలా ఇబ్రాహీమ్(అ) (మక్కాలో) విడిచిపెట్టిన తనవారిని చూడాలనే ఆలోచన వచ్చింది. ఆయన తన భార్యతో తన ఉద్దేశాన్ని చెప్పారు.

మరోసారి వచ్చారు. కాని ఇస్మా'ఈల్(అ) కనిపించ లేదు. ఇస్మాయిల్(అ) భార్య దగ్గరికి వచ్చి ఇస్మాయీల్(అ)వారి గురించి ఆమెను అడిగారు. ఆమె చెప్పారు, **'మాకు ఉపాధి కొరకు ఆయన బయటికి వెళ్ళారు'**. ఇబ్రాహీమ్(అ) ఆమెను అడిగారు, **'మీకు ఎలా గడుస్తుంది?'** వారి జీవన స్థితిగతుల గురించి అడిగారు. ఆమె సమాధాన మిచ్చారు, **"మేము బాగున్నాము మరియు లోటు లేదు"**. తరువాత ఆమె **అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు.**

ఆహార పానీయాలు తీసుకోవడానికి కాస్సేపు ఉంటారా అని ఆమె ఆయనను అడిగారు.

ఇబ్రాహీమ్(అ) అడిగారు, 'ఏ రకమైన ఆహారాన్ని మీరు తింటున్నారు?' ఆమె చెప్పారు, **'మాంసం'**. ఆయన అడిగారు, 'మీరు ఏమిటి త్రాగుతున్నారు?'. ఆమె చెప్పారు, **'నీరు'**.

ఆయన అన్నారు, **'ఓ అల్లాహ్! వారి మాంసం మరియు నీళ్ళలో శుభాలను కలుగజేయండి'**.

ఈ సందర్భంగా ముహమ్మద్(స)వారు చెప్పారు, ''ఆ సమయానికి వారు ధాన్యాలు కలిగిలేరు. మరియు వారు ధాన్యాలను కలిగి ఉంటే, వాటిలో శుభాలను కల్గించమని ఆయన అల్లాహ్‌ను ప్రార్థించేవారు''.

ప్రవక్త(స) చెప్పారు, ''ఎవరైనా తను బ్రతకడం కొరకు ఈ రెండు వస్తువులనే (మాంసం మరియు నీరు మాత్రమే) కలిగి ఉంటే, అతని ఆరోగ్యం మరియు విధానంపై చెడు ప్రభావం కలుగుతుంది, అతను మక్కాలో నివశిస్తే తప్ప'.

అప్పుడు ఇబ్రాహీమ్(అ) ఇస్మా'ఈల్(అ)వారి భార్యతో చెప్పారు, **"నీ భర్త వచ్చినప్పుడు, నా సలాము అందజేయి మరియు అతనికి చెప్పు తన గడపను స్థిరంగా ఉంచమన్నానని"**.

ఇస్మా'ఈల్(అ) (ఇంటికి) వచ్చినప్పుడు, **'నీ దగ్గరకు ఎవరైనా వచ్చారా?'**

ఆమె సమాధాన మిచ్చారు, **'అవును, మంచిగా కనిపించే ఓ ముసలాయన నా దగ్గరకు వచ్చారు, ఆ విధంగా ఆయనను గౌరవంగా వర్ణిస్తూ చెప్పారు, ఆయన మీ గురించి అడిగారు మరియు నేను తెలియజేశాను, మన జీవనాధారం గురించి ఆయన అడిగారు. మనం మంచి స్థితిలో ఉన్నామని ఆయనకు నేను చెప్పాను.'**

తెలియని వారితో పై విధంగా ఓ ఇల్లాలు మాట్లాడారు అంటే, ఆమె యొక్క గొప్ప సంస్కారం మరియు భర్త పట్ల ప్రేమ, ఆమె పెద్దల పట్ల గౌరవం గల ఇల్లాలు అని ఎవరికైనా స్పష్టంగా అర్థమౌతుంది.

ఇస్మా'ఈల్(అ) ఆమెను అడిగారు, 'ఆయన నీకేదైనా సలహా ఇచ్చారా?' ఆమె చెప్పారు, **'అవును, మీకు తన సలాము అందజేయమని మరియు మీ గడపను స్థిరంగా ఉంచుకోవాలని ఆదేశించారు'**. అప్పుడు ఇస్మాయిల్(అ) చెప్పారు, 'ఆయన నా తండ్రిగారు మరియు నీవే ఆ గడపవి. నిన్ను నాతో పాటే ఉంచుకోమని ఆయన నన్ను ఆదేశించారు'.

తరువాత అల్లాహ్‌కు ఇష్టమైనంతకాలం వారి నుండి ఇబ్రాహీమ్(అ) దూరంగా ఉన్నారు. మరోసారి ఇబ్రాహీమ్(అ)వారికి (మక్కాలో)

విడిచిపెట్టిన తన కుటుంబాన్ని చూడాలనే ఆలోచన వచ్చింది. కాబట్టి ఆయన తన భార్యకు తన నిర్ణయాన్ని చెప్పారు.

ఆ తరువాత వారిని చూడటానికి వచ్చారు.

ఆయన అక్కడకు వచ్చేటప్పటికి, ఇస్మా'ఈల్(అ)వారు జమ్‌జమ్ దగ్గర చెట్టు క్రింద తన బాణాలను పదును చేసుకుంటున్నారు. ఇబ్రాహీమ్(అ)ను అతను చూసినప్పుడు, ఇస్మా'ఈల్(అ) లేచారు. ఎలా అయితే ఒక కుమారుడు తన తండ్రితో, ఒక తండ్రి తన కుమారునితో ప్రవర్తిస్తారో అలా ప్రవర్తించారు.

ఇబ్రాహీమ్(అ) చెప్పారు, **'ఓ ఇస్మా'ఈల్! అల్లాహ్ నాకొక ఆదేశమిచ్చారు'**. ఇస్మా'ఈల్(అ) చెప్పారు, **'మీ ప్రభువు మీకు ఏది ఆదేశించారో అది చేయండి.'**

ఇబ్రాహీమ్(అ) అడిగారు, **"నీవు నాకు సహకరిస్తావా?"**

ఇస్మా'ఈల్(అ) చెప్పారు, **'నేను మీకు సహకరిస్తాను'**.

ఇబ్రాహీమ్(అ) చెప్పారు, ''ఇక్కడ ఓ గృహాన్ని నిర్మించమని అల్లాహ్ నన్ను ఆదేశించారు, చుట్టూ ఉన్న నేలకంటే ఎత్తుగా నున్న గుట్టను చూపిస్తూ'.

ముహమ్మద్(స)వారు చెప్పారు, ''అప్పుడు వారు (కాబా) గృహం యొక్క పునాదులను పెంచారు (గోడలు కట్టారు). ఇస్మా'ఈల్(అ) రాళ్ళను తీసుకొచ్చారు. ఇబ్రాహీమ్(అ) నిర్మాణం గావించారు. మరియు గోడలు ఎత్తుగా అయినప్పుడు, ఇస్మా'ఈల్(అ) ఓ రాయిని తీసుకువచ్చి ఇబ్రాహీం(అ)వారి కొరకు ఉంచారు. ఆయన దానిపై నిలుచుని నిర్మాణం పనిగావించారు. (ఇస్మా'ఈల్(అ)వారు ఉంచిన ఆ రాయిని **అల్-మఖామ్** అంటారు. ఇది ఇప్పటికీ కాబా మస్జిద్ మరియు జమ్‌జమ్‌కి మధ్యలో ఉంది. దానిపై ఉన్న ఇబ్రాహీమ్(అ)వారి పాద గుర్తులను చూడవచ్చు.)

ఇస్మా'ఈల్(అ) ఆయనకు రాళ్ళు అందిస్తుండగా, మరియు వారిద్దరూ చెబుతున్నారు : **'ఓ మా ప్రభూ! మా ఈ సేవను స్వీకరించు. నిశ్చయంగా, నీవు మాత్రమే సర్వం వినేవాడవు. సర్వజ్ఞుడవు.'** (ఖుర్'ఆన్ 2:127)

ప్రవక్త(స) చెప్పారు, ''గృహ నిర్మాణాన్ని ఇద్దరూ పూర్తి గావించి కాబా చుట్టూ 'ఓ మా ప్రభూ! మా ఈ సేవను స్వీకరించు. నిశ్చయంగా, నీవు మాత్రమే సర్వం వినేవాడవు. సర్వజ్ఞుడవు' పఠిస్తూ తవాఫ్ (ప్రదక్షిణ) చేశారు.

ఇస్మా'ఈల్(అ)వారిని పాలు త్రాగే వయస్సులో మక్కాలో వదిలి వచ్చాక, 4 సార్లు ఇబ్రాహీమ్(అ) మక్కా వెళ్ళినట్లు ఖుర్'ఆన్ మరియు హదీస్ ద్వారా ప్రామాణిక ఆధారాలున్నాయి. ఇవి కాక, ఇతర సందర్భాలలో ఆయన మక్కా విచ్చేసారా? లేదా? అనేది తెలియదు.

తన కుటుంబాన్ని చూడటానికి మక్కా వెళ్ళిన నాలుగు సార్లలో మొదటిసారి తన కుమారుడు ఇస్మా'ఈల్(అ) బాలుడుగా ఉన్నప్పుడు, (కలలో అల్లాహ్ ఆదేశించిన ప్రకారం) తన ఒక్కగానొక్క కుమారుడైన ఇస్మా'ఈల్(అ)వారిని జిబహ్ చేయడానికి వచ్చారు.

కుమారుడు ఎటువంటి అభ్యంతరం చెప్పకుండా, అల్లాహ్ ఆదేశం ప్రకారం ఆచరించమని సిద్ధపడి తన సహనశీలతను చూపించారు. ఇక నాల్గవసారి (అంటే ఇస్మా'ఈల్(అ)వారిని ఇబ్రాహీమ్(అ)వారు కలిసిన రెండవ సారి) కాబా గృహం నిర్మాణ విషయంలో అల్లాహ్ యొక్క ఆదేశాన్ని వినిపించడానికి వచ్చారు.

పై విషయాలను బట్టి తెలిసేది ఏమిటంటే, పాలు త్రాగే వయస్సులో కుమారున్ని ఎడారిలో వదిలి వచ్చేశాక తన కుమారుడిని రెండుసార్లు మాత్రమే కలిసినా, ఆ రెండు సార్లు కూడా అల్లాహ్ యొక్క ఆదేశాన్ని తీసుకుని వచ్చారు.

ఈ రెండుసార్లు కూడా ఎటువంటి అభ్యంతరం తెలపకుండా అల్లాహ్ ఆదేశాన్ని శిరసావహించడానికి సిద్ధపడిన **సహనశీలుడు - ఇస్మా'ఈల్(అ).** ఆయన గురించి ఖుర్'ఆన్‌లో ఒక చోట ఇలా చెప్పారు అల్లాహుతాలా:

**"మరియు ఈ గ్రంథం (ఖుర్'ఆన్)లో వచ్చిన ఇస్మా'ఈల్ గాథను ప్రస్తావించు. నిశ్చయంగా, అతను సత్య వాగ్దానాలు చేసేవాడు మరియు ఒక సందేశహరుడు మరియు ఒక ప్రవక్త.**

**మరియు అతను తన కుటుంబం వారిని సలాత్(నమాజ్) మరియు జకాత్ (విధి దానం)లను పాటించమని ఆజ్ఞాపించేవాడు మరియు తన ప్రభువుకు ప్రీతిపాత్రుడుగా ఉండేవాడు." (ఖుర్'ఆన్ 19:54-55)**

## విశ్లేషణ

ఇబ్రాహీమ్(అ)వారు తన తండ్రితో చేసిన సంభాషణ మరొకసారి చదవండి. ఇబ్రాహీమ్(అ)వారికి మరియు ఆయన కుమారుడైన ఇస్మా'ఈల్(అ)వారికి మధ్య జరిగిన సంభాషణ చూడండి. **తల్లి దండ్రులకు తగిన తనయుడు** - ఇస్మా'ఈల్(అ).

ఎవరూలేని చోట ఆనాడు ఇబ్రాహీమ్(అ)వారు హాజర(అ)ను వదిలి పెట్టినప్పుడు, ఆ విధంగా వదలడానికి గల కారణం'**అల్లాహ్ ఆదేశం**' అని తెలియగానే ఆమె మనస్ఫూర్తిగా ఆ ఆదేశాన్ని స్వీకరించారు.

కుమారుడు కూడా తన తల్లి స్పందించిన విధంగానే స్పందించారు: **"ఓ నాన్నా! నీకు ఇవ్వబడిన ఆజ్ఞను నెరవేర్చు. అల్లాహ్ కోరితే నీవు నన్ను సహనశీలులలో పొందగలవు!"**

అల్లాహ్ ఆదేశాన్ని పాటించడంలో ఇబ్రాహీమ్(అ)వారికి **భార్య మరియు కుమారుడు ఎంత గొప్పగా సహకరించారు!** ఇస్మా'ఈల్(అ) వారు తన తల్లికి తగిన తనయుడిగా, తల్లికి గర్వకారణమయ్యారు.

ఇబ్రాహీమ్(అ)వారిని మంటల్లో వేసి చంపడానికి సిద్ధపడుతున్నారని తెలిసినా, ఆనాడు ఆయన ఎవరి సహాయాన్ని తీసుకోకుండా కేవలం అల్లాహ్ సహాయాన్ని మాత్రమే కోరి ప్రాణత్యాగానికి సిద్ధపడ్డారు.

ఇస్మాయీల్(అ)వారు చిన్న తనంలోనే ప్రాణత్యాగానికి సిద్ధపడ్డారు. తండ్రితో "**అల్లాహ్ కోరితే నీవు నన్ను సహనశీలులలో పొందగలవు!**" అని అన్నారు. ఈయన కూడా తన త్యాగానికి అల్లాహ్ కారుణ్యాన్నే కారణంగా చూపారు. అంతేకాకుండా తన మరణం తరువాత తల్లిదండ్రులకు కలిగే శోకాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని కన్నతండ్రికి సూచన లిచ్చారు.

**తల్లిదండ్రుల ఆదేశాలను గౌరవించడం మాత్రమే కాకుండా, తనను కోల్పోవడం ద్వారా వారికి కలిగే బాధను తగ్గించాలని అనుకోవడం చూశాక ఆ తల్లిదండ్రులకు ఆ బిడ్డ ఎంత గర్వకారణమో మనకు అర్థమౌతుంది.**

ఆనాడు ఇబ్రాహీమ్(అ) తన తండ్రిని నరకాగ్ని నుండి రక్షించే ప్రయత్నంలో, అతనికి హితబోధ చేస్తే కొడుకు అని కూడా ఆలోచించ కుండా, రాళ్ళతో రువ్వి చంపుతానన్నాడు. అయినా సరే ఆఖరి వరకూ తండ్రి క్షమాపణ కొరకు ఇబ్రాహీమ్(అ) ప్రయత్నం చేశారు. అల్లాహ్ మార్గాన్ని తిరస్కరించిన తండ్రికోసం ఆయన ఆవేదన చెందారు.

ఇప్పుడు అల్లాహ్ మార్గంలో ఉన్న తన కుమారుడిని, తండ్రిగా తన హితబోధకు ఏ విధంగానూ అడ్డు చెప్పని కుమారుడిని తన స్వహస్తాల తోనే జిబహ్ చేయవలసి వస్తుంది.

ఆనాడు తన తండ్రి రాళ్ళు రువ్వి చంపుతానన్నాడు, ఈనాడు తన కుమారుడిని తానే జిబహ్ చేస్తానని అనవలసి వచ్చింది. ఇబ్రాహీమ్(అ) వారి జీవితం త్యాగాలమయం.

### తండ్రి పట్ల విధేయత

- ఇస్మా'ఈల్(అ)వారు 13 సంవత్సరాల వయస్సులో తండ్రికి ఇవ్వ బడిన ఆదేశం కోసం జిబహ్‌కి సిద్ధపడి తండ్రికి సహకరించారు.
- గడప మార్చమని తండ్రి సలహా ఇస్తే, ఆ సలహా పాటించారు.
- తరువాత మరోసారి వచ్చినప్పుడు గడప జాగ్రత్తగా చూసుకోమన్న సలహాను కూడా పాటించారు.
- కాబా మస్‌జిద్ నిర్మాణానికి సహకరించమంటే సహకరించారు.

పాలు త్రాగే వయస్సులో ఎడారిలో కుమారుడిని ఇబ్రాహీమ్(అ) వదిలేయవలసి వచ్చింది. తండ్రి తనతో కలిసి జీవించకపోయినా సరే తండ్రి పట్ల ఎంతో విధేయత చూపారు. ముహమ్మద్(స)వారు చెప్పారు, "**ఎలా అయితే ఒక కుమారుడు తన తండ్రితో, ఒక తండ్రి తన కుమారునితో ప్రవర్తిస్తారో అలా ప్రవర్తించారు**" అని.

ఈ మాటలలో ఎంతో వివేకం ఉంది. ఒక తండ్రి కొడుకు కలిసి జీవిస్తే, వారు ఎలా ప్రవర్తిస్తారో వీరిద్దరూ కూడా అదే విధంగా ప్రవర్తించారు. **ఇది ఎలా సాధ్యం అయింది?**

కారణం - ఇస్మా'ఈల్(అ) మాతృమూర్తియైన **హాజర(అ)వారి పెంపకం.** అల్లాహ్ పట్ల గొప్ప భరోసా కలిగిన స్త్రీ. కుమారుడికి కూడా అటువంటి శిక్షణనే ఇచ్చారు. **తండ్రిని గౌరవించేలా పెంచారు.** తండ్రి ఆదేశానికి వ్యతిరేకంగా పల్లెత్తు మాట కూడా అనకుండా, ఏ విధమైన అడ్డు చెప్పకుండా మనస్ఫూర్తిగా స్వీకరించేలా పెంచారు.

మన జీవితంలో ప్రతీ క్షణం ప్రతీ విషయం ముహమ్మద్(స)వారిని ఆదర్శంగా తీసుకుని చేస్తాము. ఒక ఆచరణలో మనమంతా ఇబ్రాహీమ్(అ), హాజర(అ), ఇస్మా'ఈల్(అ)వారిని అనుకరిస్తున్నాము. ఇది కూడా సున్నతే! ఎందుకంటే ముహమ్మద్(స)వారు చేసి, మనల్ని చేయమని చెప్పారు కాబట్టి.

విశ్వాసం వలన త్యాగం సాధ్యమవుతుంది. విశ్వాసత్యాగాలు ఇహపర లోకాల్లో ఎంతటి గౌరవాన్ని కలిగిస్తాయో ఈ కుటుంబం ద్వారా అల్లాహుతాలా మనకు చూపారు.

ఆ అమోఘమైన త్యాగాలను గుర్తు చేసే పండుగే బక్రీద్.

2013 సంవత్సరంలో రాబోయే బక్రీద్‌కు ముందే మనకిష్టమైన ఎన్నింటినో త్యాగం చేసి సంతోషంగా ఈద్ జరుపుకుందాం ఇన్షా అల్లాహ్!

(పొగరుగా అహంకారంతో మాట్లాడటాన్ని త్యాగం చేయవచ్చు. అబద్ధం చెప్పడాన్ని త్యాగం చేయవచ్చు. వడ్డీ అనేది ఏ రూపంలో ఉన్నా దానిని త్యాగం చేయవచ్చు. వృద్ధాప్యంలో ఉన్న తమ తల్లిదండ్రులకు కష్టం కలిగించే తమ సుఖాలను కొన్నింటిని త్యాగం చేయవచ్చు. ఇలా ఎన్నో త్యాగాలు చేసే అవకాశం మనకు ఉంది.)

అనస్ బిన్ మాలిక్ ఉల్లేఖనం. ఉహుద్ పర్వతం దృష్టిపథంలోకి వచ్చినప్పుడు అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : ఈ పర్వతం మనల్ని ప్రేమిస్తుంది మరియు దానిని మనం ప్రేమిస్తున్నాము. "ఓ అల్లాహ్! ఇబ్రాహీమ్(అ) మక్కాను పవిత్ర స్థలంగా చేశారు మరియు నేను చేస్తున్నాను ఈ రెండు పర్వతాల మధ్య (ప్రాంతాన్ని అంటే మదీనా)ను పవిత్ర స్థలంగా." (సహీహ్ బుఖారీ, 3367, పుస్తకం 60, అధ్యా. 10, సంపుటి4)

**ఖుర్బానీ పశువులను, మేము మీ కొరకు అల్లాహ్ యొక్క చిహ్నాలుగా చేశాము, మీకు వాటిలో మేలున్నది. కావున వాటిని (ఖుర్బానీ కొరకు) నిలబెట్టి వాటిపై అల్లాహ్ పేరును ఉచ్ఛరించండి. అవి (ప్రాణం విడిచి) ప్రక్కల మీద పడిపోయిన తరువాత మీరు వాటిని తినండి మరియు యాచించని పేదలకు మరియు యాచించే పేదలకు కూడా తినిపించండి. ఈ విధంగా మేము వాటిని మీకు ఉపయుక్తంగా చేశాము, బహుశా మీరు కృతజ్ఞులౌతారేమోనని. వాటి మాంసంగానీ, వాటి రక్తం గానీ అల్లాహ్‌కు చేరవు! కాని మీ భయభక్తులే ఆయనకు చేరుతాయి. మీకు సన్మార్గం చూపినందుకు, మీరు అల్లాహ్ ఘనతను కొనియాడటానికి, ఈ విధంగా ఆయన వాటిని మీకు వశపరిచాడు. సజ్జనులకు శుభార్తను వినిపించు. (ఖుర్'ఆన్ 22:34-37)**

# ముఖ్య వివరణ

**అసమాన త్యాగానికి సిద్ధపడి తల్లిదండ్రులకు అత్యంత విధేయతాపరుడు మరియు సహనశీలుడైన ఇస్మా'ఈల్(అ)వారిని ఒక ధర్మం వారు సంస్కార హీనంగా వర్ణించారు. ఇటీవల ఓ తెలుగు న్యూస్‌పేపర్‌లో ఓ వ్యక్తి వ్రాసిన వ్యాసంలో కూడా ఈ వర్ణన ఉంది. ప్రవక్తలను హతమార్చిన యూదులు మరియు ప్రవక్తలను హింసించడానికి ఏవిధంగానూ వెనుకాడని యూదులు ప్రవక్తల గురించి గౌరవంగా మాట్లాడతారని ఎవరైనా ఎలా అనుకోగలుగుతారు? ఖుర్'ఆన్ మర్యమ్(అ)వారిని శీలవతిగా వర్ణించింది. ఆ శీలవతియైన మర్యమ్(అ)వారిపై కూడా యూదులు నిందలు వేశారు. ప్రతీ ప్రవక్తను గౌరవించడం ముస్లిముల సాంప్రదాయం.**

ఇబ్రాహీమ్(అ), హాజర(అ) మరియు ఇస్మా'ఈల్(అ) యొక్క విశ్వాస త్యాగాలు కఠిన హృదయుల్ని సైతం కదిలిస్తాయి. అల్లాహ్‌పై విశ్వాసమున్న ముస్లిములకు త్యాగాల పండుగైన బక్రీద్ సంతోషాన్ని కలిగిస్తుంది. అల్లాహ్ ఆదేశాన్ని ఏ మానవుడూ నిర్వర్తించకుండా చేయడానికి షైతాన్ ఎల్లప్పుడూ కాచుకుని ఉంటాడు. ఇబ్రాహీమ్(అ) మరియు ఇస్మా'ఈల్(అ)లను వదలలేదు. వారిద్దరినీ ఆపడానికి ప్రయత్నించాడు. ఇబ్రాహీమ్(అ)వారు షైతాన్‌పై రాళ్ళు రువ్వారు.

ఇబ్రాహీమ్(అ)వారి కుటుంబం విషయంలో ముస్లిములకు చాలా స్పష్టమైన అవగాహన ఉంది. ఎందుకంటే ఆ కుటుంబ వారసుడే ముహమ్మద్(స)వారు కనుక. మరియు ఇబ్రాహీమ్(అ)వారు ముస్లిములకు పితామహుడు కనుక. ఆయన(స) చాలా స్పష్టంగా బోధించిన రెండు పెద్ద హదీస్‌లు (3364 మరియు 3365) సహీహ్ బుఖారీ 4వ సంపుటిలో ఉన్నాయి. అవే ఈ వ్యాసానికి ముఖ్య ఆధారం.

ఇబ్రాహీమ్(అ)వారు ఇస్మా'ఈల్(అ)వారి అంగీకారంతో ఆయనను జిబహ్ చేయడానికి తీసుకు వెళ్ళడం మరియు జిబహ్ చేయడానికి ఉపక్రమించడం వల్లనే ఇస్మా'ఈల్(అ)వారికి 'జబీహుల్లా' అనే పేరు వచ్చింది.

ఈ కుటుంబం విషయంలో షైతాన్ పథకాలు బెడిసికొట్టాయి. అందుకని ముస్లిములలో అయోమయాన్ని కలుగ జేయడానికి ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. షైతాన్‌లు జిన్నులలోనే కాదు, మనుష్యులలోనూ ఉన్నారు. **వారు అసత్య ప్రచారం చేస్తుంటారు.** జిబహ్‌కు సిద్ధపడింది ఇస్మా'ఈల్(అ) కాదు, ఇస్‌హాఖ్(అ) అని అంటారు. ఎందుకంటే ఇస్‌హాఖ్(అ)వారి వారసులలో నుండే ఎందరో ప్రవక్తలు అయ్యారు. కాబట్టి ప్రాణ త్యాగానికి సిద్ధపడిన సహనశీలుడే ఇస్‌హాఖ్(అ) అని యూదులు కల్పించారు. వాస్తవానికి అటువంటి కల్పన వారికి అవసరం లేదు. ఇస్‌హాఖ్(అ)వారి తండ్రిగారైన ఇబ్రాహీమ్(అ)వారు కూడా ప్రాణ త్యాగానికి సిద్ధపడినవారే కదా! అప్పుడు వీరంతా ఇబ్రాహీమ్(అ)వారి వారసులే కదా! కాబట్టి ఇబ్రాహీమ్(అ)వారి వారసులమని చెప్పుకుంటే సరిపోదా? కాని ముస్లిముల పట్ల వారికున్న అసూయ, ఆగ్రహం వారిచేత ఈ దుష్ప్రచారం చేయించింది.

ఇబ్రాహీమ్(అ)వారికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుని పేరు: **ఇస్మా'ఈల్(అ)** మరియు రెండవ కుమారుని పేరు: **ఇస్‌హాఖ్(అ)**. ఆధారాలను బట్టి ఇబ్రాహీమ్(అ)వారికి సుమారు 80 సంవత్సరాల వయస్సులో ఇస్మా'ఈల్(అ) మరియు సుమారు 100 సం॥ల వయస్సులో ఇస్‌హాఖ్(అ) జన్మించారు.

> "సర్వ స్తోత్రాలకు అర్హుడైన అల్లాహ్ నాకు వృద్ధాప్యంలో కూడా **ఇస్మా'ఈల్** మరియు **ఇస్‌హాఖ్**లను ప్రసాదించాడు. నిశ్చయంగా, నా ప్రభువు ప్రార్థనలను వినేవాడు" (ఖుర్'ఆన్ 14:39)

ఇబ్రాహీమ్(అ)వారి తొలి భార్య పేరు : **శారా**. రెండవ భార్య పేరు: **హాజర**. మొదటి భార్యకు సంతానం కలుగలేదు. రెండవ భార్య హాజర(అ)కు ఇస్మా'ఈల్(అ) జన్మించారు. హాజర(అ) రాజు కుమార్తె యని, శారాకు బహుమతిగా ఇవ్వబడ్డారని ఓ తఫ్సీర్ గ్రంథంలో చెప్పబడింది.

**ఖుర్'ఆన్ అల్లాహ్ యొక్క ప్రసంగం.** దానిలో ప్రవక్త(స)వారి బోధనలు కలిసి ఉండవు. సహాబాల మాటలుగాని ప్రవక్త(స)వారి జీవిత చరిత్ర గాని ఆ గ్రంథంలో మిళితమై ఉండదు. దేనికదే విడి విడిగా గ్రంథస్థం కాబడటం జరిగింది.

నిజమైన విశ్వాసం కలవారికి అల్లాహ్ యొక్క ప్రసంగం స్పష్టంగా అర్థమౌతుంది. అనుమానాలకు తావు ఇవ్వదు. ఖుర్'ఆన్‌లో వాడబడిన అరబీ భాష మరియు దాని శైలి ద్వారా మనం ఎన్నో విషయాలు స్పష్టంగా తెలుసుకోవచ్చు. ఆ కోణంలోనే శాంతిబాట రీసెర్చ్ టీమ్ ప్రయత్నం చేయడం జరిగింది. అల్లాహ్ అనుగ్రహంతో అరబీ భాషా పదాలు మరియు శైలి ద్వారా స్పష్టంగా జిబహ్‌కు సిద్ధపడిన ప్రవక్త ఇస్మా'ఈల్(అ) అని వివరించగలిగాము. ఈ విషయాలు జూన్ మరియు జూలై 2010 సంచికలో తెలియజేశాము.

**మీరు ప్రత్యేకంగా పరిశోధించడం దేనికి?** ఈ విషయానికి సంబంధించి ఎన్నో ఆధారాలు హదీస్ మరియు తఫ్సీర్ గ్రంథాలలో ఉన్నాయి కదా అని అనవచ్చు. వాటిని కూడా మేము అందించాము. ప్రతీ విషయాన్ని అల్లాహ్ పేరుతో క్షుణ్ణంగా అధ్యయనం చేసి చెప్పాలనేది మా సంకల్పం. ఇది చెప్పడానికి గల కారణం ఏమిటంటే మా టీమ్ గురించి చెప్పుకుందామని కాదు, **ఖుర్'ఆన్‌ని శ్రద్ధగా అధ్యయనం చేస్తే ఎన్నో విషయాలు తెలుస్తాయని చెప్పాలని మాత్రమే.** అంతేకాకుండా మేము చెప్పిన విషయాలు పూర్తిగా ఖుర్'ఆన్ నుండి గ్రహించినవే. విశ్వాసంతో ఆలోచిస్తూ అధ్యయనం చేసేవారికి ఎన్నో విషయాలు ఖుర్'ఆన్ నుండి లభిస్తూనే ఉంటాయి. అందుకే ఖుర్'ఆన్ పఠనాన్ని అరబీలో ప్రోత్సహించాలనేది మా ప్రయత్నం.

1. త్యాగానికి సంబంధించిన ఈ సంఘటన గురించి ఖుర్ఆన్ గ్రంథంలో 37వ సూరహ్‌లో చెప్పిన తరువాత, అదే సూరహ్‌లో 112వ ఆయత్‌లో ఇలా చెప్పబడింది. **"మరియు మేము అతనికి ఇస్హాఖ్ యొక్క శుభవార్తను ఇచ్చాము. అతను ఒక సద్వర్తనుడైన ప్రవక్త".** అంటే జిబహ్ చేయడానికి సిద్ధం చేయబడినవారు ఇస్హాక్(అ)కాదని, అది మరొకరని స్పష్టంగా తెలుస్తుంది. ముందుగా ఇస్మా'ఈల్(అ)వారిని బలిప్రదేశానికి తీసుకెళ్ళి బలివ్వడానికి సిద్ధపడిన సంఘటన, మరియు అతనికి బదులుగా ఓ గొఱ్ఱెను జిబహ్ చేయడం, ఆ తరువాతనే అల్లాహ్ సజ్జనులకు ప్రతిఫల మిస్తానని వాగ్దానం చేయడం జరిగింది. ఆ తరువాత ఇబ్రాహీమ్(అ) వారికి ఇస్హాఖ్(అ)వారి జననం గురించి శుభవార్తను ఇవ్వడం జరిగింది. గొఱ్ఱెను జిబహ్ చేసిన తర్వాత ఇవ్వబడిన శుభవార్త ఇది. అంటే ఈ సంఘటన జరిగిన సమయానికి **ఇంకనూ ఇస్హాఖ్(అ) జన్మించలేదని స్పష్టంగా తెలుస్తుంది.**

2. ఈ శుభవార్తను జాగ్రత్తగా గమనించండి. ఇస్హాఖ్(అ) ప్రవక్త అవుతారని అల్లాహుతాలా తెలియజేస్తున్నారు. అంటే అతను బాలుడుగా ఉన్నప్పుడే జిబహ్ చేస్తే, ఇక ఆయన ప్రవక్త ఎలా కాగలుగుతారు? ఆ బలికి బదులుగా అల్లాహ్ ఓ గొఱ్ఱెపిల్లను పంపుతారని ఇబ్రాహీమ్(అ)వారికి ముందుగా తెలియదు కదా! కలలో కుమారునిపై కత్తిని కదపడం వరకే చూశారు. జిబహ్ చేశాక తన కుమారుడు మరణిస్తాడని తెలిసే సిద్ధపడ్డారు.

   తన కుమారుడు ప్రవక్త అవుతారనే శుభవార్తను అందుకున్న తరువాత గనుక ఈ కల వచ్చి ఉంటే, ఆ కలను ఆయన స్వీకరించి ఉండేవారు కాదు కదా! కాని ప్రవక్తలకు అసత్య కలలు రావు అని తెలుసుకోవాలి (అస్తగ్ఫిరుల్లాహ్). అంతేగాకుండా ఖుర్ఆన్‌లో **11వ సూరహ్** (సూరహ్ హూద్)లోని **71వ ఆయత్**లో చెప్పబడిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా ఓసారి గుర్తు తెచ్చుకుందాం.

   **"అతని (ఇబ్రాహీమ్) భార్య (అక్కడే) నిలబడి ఉండెను, అప్పుడామె నవ్వింది, పిదప మేము ఆమెకు ఇస్హాఖ్ యొక్క మరియు ఇస్హాఖ్ తరువాత 'యాఖూబ్' యొక్క శుభవార్తను ఇచ్చాము"**

   చూశారా! పై వాక్యంలో ఇస్హాఖ్(అ)వారి జననం గురించి మాత్రమే కాకుండా, ఆయన పుట్టకుండానే, అతనికి కూడా పుట్టబోయే 'యాఖూబ్'(అ) వారి జననం గురించి కూడా చెప్పబడింది. అంటే ఇబ్రాహీమ్(అ)వారికి పుట్టబోయే కుమారుడు గురించి మరియు మనవడి గురించి శుభవార్త అందింది.

   అంటే ఈ వాక్యాన్ని బట్టి ఇస్హాఖ్(అ) పెళ్ళి చేసుకుంటారని మరియు అతనికి బిడ్డ జన్మిస్తాడని స్పష్టంగా తెలుస్తుంది. అంటే ఇస్హాఖ్(అ) వారి వయస్సు యుక్తవయస్సు దాటిపోతుందని, వివాహం కూడా జరుగుతుందని ఎంతో స్పష్టంగా ఈ వాక్యంలో తెలియజేయబడింది.

   సూరహ్ 37 నుండి ఇచ్చిన ఖుర్ఆన్ వాక్యాల ద్వారా జిబహ్ చేయడానికి నిర్ణయించుకున్న సమయానికి ఇబ్రాహీమ్(అ)వారి కుమారుని యొక్క వయస్సు తక్కువ. **"ఆ బాలుడు అతనికి తోడుగా శ్రమ చేయగల వయస్సుకు చేరుకున్నప్పుడు ....."** అంటే ఆ బాలుని వయస్సు తక్కువే కాకుండా వివాహ వయస్సు కాదని తెలుస్తుంది. అల్లాహ్ యొక్క వాక్కు సత్యమని ఇబ్రాహీమ్(అ) వారికి తెలుసు.

   కాబట్టి చిన్న వయస్సులోనే ఇస్హాఖ్(అ)వారిని జిబహ్ చేస్తే, వివాహం ఎలా జరుగుతుంది? యాఖూబ్(అ) అతనికి ఎలా సంతానం కాగలుగుతారు?

   కాబట్టి ఆ బాలుడు ఇస్హాఖ్(అ) ఎంతమాత్రం కాదు. ఆ బాలుడు **ఇస్మా'ఈల్**(అ). ఇబ్రాహీమ్(అ) తన కుమారుడు చనిపోతాడనే భావించారు.

3. ఖుర్ఆన్ ప్రకటన బట్టి స్పష్టంగా తెలిసేది ఏమిటంటే జిబహ్ కొరకు దివ్య ఆదేశం వచ్చింది ఇబ్రాహీమ్(అ)వారి మొదటి కుమారుని గురించే. ఇబ్రాహీమ్(అ) తన మాతృభూమి నుండి వలస వెళ్ళేటప్పుడు తనకొక కుమారుని ప్రసాదించమని అల్లాహ్‌ను ప్రార్థించారు. ఆయన ప్రార్థనకు సమాధానంగా, ఆయనకు కుమారుడు కలుగుతాడనే శుభవార్త నిచ్చారు. తన తండ్రితో అతడు పనిచేయగలిగే వయస్సుకు చేరుకున్నప్పుడు అతడిని జిబహ్ చేయమని ఈ కుమారుని గురించే దివ్యాదేశం అందింది. ఈ వరుస సంఘటనలను బట్టి, ఆ కుమారుడు ఇస్మా'ఈల్(అ) అని స్పష్టంగా తెలుస్తుంది.

4. కుమారున్ని జిబహ్ ఇచ్చే ఈ సంఘటన మక్కా పరిసర ప్రాంతాలలో జరిగింది. అందువల్లనే అరబ్బులలో హజ్జ్ యాత్రలో ఖుర్బానీ ఇవ్వడమనేది ఆచారంగా ఉండేది. అంతేకాకుండా, స్వర్గం నుండి తీసుకురాబడి జిబహ్ ఇవ్వబడిన గొఱ్ఱె యొక్క కొమ్ములు పవిత్ర కాబా గృహంలో సంవత్సరాల తరబడి వ్రేలాడుతూ ఉండేవి. దీనికి అనుకూలంగా ఉన్న ఎన్నో ఉల్లేఖనాలను హాఫిజ్ ఇబ్నె కసీర్ తెలియజేశారు. అమీర్ ష'బీ చెప్పారు: నేను స్వయంగా **గొఱ్ఱె కొమ్ములను కాబాలో చూశాను.** మరియు సుఫ్యాన్ చెప్పారు : ఆ గొఱ్ఱె కొమ్ములు కాబాలో నిరంతరం వ్రేలాడుతూనే ఉండేవి (హజ్జాజ్ ఇబ్నె యూసుఫ్‌వారి కాలంలో) కాబాలో మంటలు వ్యాపించే వరకూ. ఆ సమయంలో కొమ్ములు కాలి బూడిదై పోయాయి. (తఫ్సీర్ ఇబ్నె కసీర్)

దీనిని బట్టి స్పష్టమయ్యేది ఏమిటంటే ఇస్మా'ఈల్(అ)వారు మాత్రమే మక్కాలో నివశించారని. ఇస్హాఖ్(స)వారు అక్కడ నివశించలేదని. కాబట్టి జిబహ్ చేయమని వచ్చిన ఆదేశం ఇస్మా'ఈల్(అ)వారికి సంబంధించినదే. భిన్నాభిప్రాయాలు సహాబీల, తాబయీల మధ్య ఉన్నాయన్న విషయంపై ఇబ్నె కసీర్ ఇలా చెప్పారు:

"అల్లాహ్‌కే బాగా తెలుసు. ఈ మాటలన్నీ కాబ్ అల్-అహ్‌బార్ నుండే అందాయి. ఉమర్(రజి)వారి కాలంలో ఇతను ఇస్లామ్ స్వీకరించారు. ఆయన తన పూర్వ గ్రంథాల నుండి కొన్ని విషయాలు చెప్పడం ప్రారంభించారు. కొన్ని సంధర్భాలలో ఉమర్(రజి) ఆయన మాటలను వినడం జరిగింది. అదే విధంగా ఇతరులు కూడా. అతని

మాటలను ఒకరినుండి మరొకరికి చేరడం జరిగింది. ఈ ఉల్లేఖనాలన్నీ ఓ హాస్యాస్పద మాట. **ఈ ఉమ్మత్‌కి వాటిలో నుండి ఒక పదం కూడా అవసరం లేదు.** అల్లాహ్‌కే బాగా తెలుసు."

**హాఫిజ్ ఇబ్నె కసీర్** మరో విషయాన్ని కూడా తెలియజేశారు :

"ధర్మ పరాయణుడైన ఖలీఫా 'ఉమర్ బిన్ అబ్దుల్-అజీజ్ కాలంలో ఒక యూద విద్వాంసుడు ఇస్లామ్ స్వీకరించాడు. ఖలీఫా అతనిని అడిగారు, "ఇబ్రాహీమ్(అ)వారి కుమారులలో ఎవరు జిబహ్‌కు ఆదేశించబడ్డారు" అని. అతను చెప్పారు : అల్లాహ్ సాక్షి, ఓ అమీరుల్ మోమినీన్, **ఆయన ఇస్మా'ఈల్(అ). యూదులకు ఆ విషయం బాగా తెలుసు. కాని మీ అరబ్బులంటే వారికి అసూయ, అందుకే అలా చెబుతారు."**

**మా అధ్యయనంలో తెలుసుకున్న విషయాలు :**

క్రింది ఖుర్'ఆన్ వాక్యాలను శ్రద్ధగా గమనించండి.

(అతను ఇలా ప్రార్థించాడు): "ఓ నా ప్రభూ! నాకు **సద్వర్తనుడైన** (కుమారుణ్ణి) ప్రసాదించు!'' కావున మేము అతనికి **సహనశీలుడైన** కుమారుని శుభవార్తనిచ్చాము. (37: 100,101)

"నాన్నా! నీకు ఇవ్వబడిన ఆజ్ఞను నెరవేర్చు. అల్లాహ్ కోరితే నీవు నన్ను ఓ **సహనశీలుని**గా పొందగలవు!" (37:102)

"మరియు మేము అతనికి ఇస్‌హాఖ్ యొక్క శుభవార్తను ఇచ్చాము. అతను ఒక **సద్వర్తనుడైన** ప్రవక్త" (37:112)

పైన తెలిపిన 4 ఆయత్‌లలో రెండు ప్రత్యేకమైన పదాలున్నాయి.

1. సద్వర్తనుడు **(సాలిహీన్)** 2. సహనశీలుడు **(హలీమ్, సాబిరీన్)**.

హలీమ్ మరియు సాబిరీన్ అనే రెండు అరబీ పదాలను 'సహనశీలుడు'గా తెలుగులో అనువదించారు. 101వ ఆయత్‌లో ఇబ్రాహీమ్(అ) **సాలిహీన్** అయినటువంటి కుమారున్ని అనుగ్రహించ మన్నారు. దానికి జవాబుగా అల్లాహ్ 102వ ఆయత్‌లో **హలీమ్** అయినటువంటి కుమారుని శుభవార్తనిచ్చారు. ఇబ్రాహీమ్(అ)వారు ఈ విధంగా కోరుకునే సమయానికి, ఆయనకి సంతానం లేదు. ఒక్క కుమారుడు కూడా జన్మించలేదు. 'సాలిహీన్' వంటి కుమారున్ని అడిగితే 'హలీమ్'వంటి కుమారున్ని అనుగ్రహించారు.

సజ్జనులకు మంచి ప్రతిఫలమిస్తామంటూ, అల్లాహ్ వాగ్దానం చేసి **'సాలీహీన్'** అయినటువంటి ఇస్‌హాక్(అ)ను కుమారునిగా అనుగ్రహిస్తానని మరలా కొంతకాలానికి మరో శుభవార్త నిచ్చారు.

ఇక్కడ అల్లాహుతాలా **ఇస్‌హాఖ్(అ)**వారికి ఉపయోగించిన విశేషణ పదం **"సాలిహీన్"**. ఏ కుమారుడూ లేని సమయంలో "సాలిహీన్" వంటి కుమారున్ని ప్రసాదించమని ఇబ్రాహీమ్(అ) అల్లాహ్‌ను వేడుకుంటే, 'హలీమ్' అయినటువంటి శుభవార్త నిచ్చారు. ఒకవేళ ఇస్‌హాక్(అ)వారే మొదటి కుమారుడు అయితే, ఇబ్రాహీమ్(అ) 'సాలిహీన్'ని అడిగినప్పుడు "సాలిహీన్"ని ప్రసాదిస్తున్నట్లుగా చెప్పి ఉండేవారు. ఈ పదాల ద్వారా ఇబ్రాహీమ్(అ)వారి మొదటి కుమారుడు మరియు జిబహ్ కొరకు సిద్ధపడినవారు - ఇస్మా'ఈల్(అ) అని స్పష్టంగా తెలుస్తుంది.

అల్లాహ్ యొక్క ప్రసంగం అమోఘమైనది. ఆయన వాడిన పదాలలో ఎన్నో సూక్ష్మ విషయాలు కూడా చాలా స్పష్టంగా ఉంటాయి. మానవ మాత్రునికి సాధ్యంకాని శైలి ఖుర్'ఆన్ శైలి.

క్రింది ఆయత్‌ను గమనించండి :

"సర్వ స్తోత్రాలకు అర్హుడైన అల్లాహ్ నాకు వృద్ధాప్యంలో కూడా **ఇస్మా'ఈల్** మరియు **ఇస్‌హాఖ్**లను ప్రసాదించాడు. నిశ్చయంగా, నా ప్రభువు ప్రార్థనలను వినేవాడు" (ఖుర్'ఆన్ 14:39)

పై వాక్యంలో ముందుగా చెప్పిన పదం ఇస్మా'ఈల్(అ). కాబట్టి పెద్ద కుమారుడు ఇస్మా'ఈల్(అ). ఖుర్'ఆన్‌లో పదాల క్రమం కూడా చాలా గొప్పగా ఉంటుంది.

**మరో ఉదాహరణ:**

లేక, మీరు : "నిశ్చయంగా **ఇబ్రాహీమ్, ఇస్మా'ఈల్, ఇస్‌హాఖ్, యాఖూబ్** మరియు వారి సంతతి వారంతా యూదులు మరియు క్రైస్తవులు" అని అంటారా? ఇంకా ఇలా అను : "ఏమీ మీకు బాగా తెలుసా? లేక అల్లాహ్‌కు (బాగా తెలుసా?) అల్లాహ్ నుండి తన వద్దకు వచ్చిన సాక్ష్యాన్ని దాచేవాని కంటే ఎక్కువ దుర్మార్గుడు ఎవడు? మరియు మీ కర్మల నుండి, అల్లాహ్ నిర్లక్ష్యంగా లేడు!" (ఖుర్'ఆన్ 2:140)

పై వాక్యంలో ఇచ్చిన పేర్లు ఏ వరుసక్రమంలో ఉన్నాయో గమనించండి. ముందుగా ఇబ్రాహీమ్(అ)వారి పేరు, తరువాత పెద్ద కుమారుడైన ఇస్మా'ఈల్(అ), తరువాత రెండవ కుమారుడైన ఇస్‌హాఖ్(అ) మరియు మనుమడు యూఖూబ్(అ)వారి గురించి చెప్పబడింది.

**కాబట్టి అరబీ భాషను పూర్తిగా నిర్లక్ష్యం చేయకండి.** అరబీ భాషలో ఖుర్'ఆన్‌ను చదివిన తరువాత, మీకు అర్థమయ్యే భాషలో దాని అర్థాన్ని కూడా చదువుతూ ఉంటే మీరు సందేహంలో పడిపోకుండా ఉంటారు. **(మీ మస్జిద్ ఇమామ్‌గారి దగ్గర అరబీ చదవడం నేర్చుకోండి. అరబీ అక్షరాలు 28 మాత్రమే. నేర్చుకోవాలనే తపన గలవారికి వారం పది రోజుల్లో అరబీ చదవడం వస్తుంది. ప్రతీరోజూ పఠిస్తుంటే కొన్నాళ్ళకు తడబడకుండా చదవగలుగుతారు.)**

**ఇతర ధర్మాలతో డిబేట్లను ప్రోత్సహించవద్దు. మరియు అటువంటి వీడియోలను చూడవద్దు. మీకు సమయం లభించినప్పుడల్లా ఖుర్'ఆన్ మరియు హదీస్‌లను అధ్యయనం చేయండి. Comparative Study (తులనాత్మక అధ్యయనం), డిబేట్ల కోసం మీ విలువైన సమయాన్ని వృథా చేసుకోకండి. ఖుర్'ఆన్ అధ్యయనం చేస్తూ ఉంటే ఆ గ్రంథంపై ఆసక్తి పెరుగుతూ ఉంటుంది. అది మనకు ఇహపరలోకాలలో మేలు చేసే అవకాశం ఉంది. ఎవరైనా ఖుర్'ఆన్ వాక్యాన్ని వక్రీకరించి చెబితే, వెంటనే ఆవేదన చెందకండి. ఖుర్'ఆన్‌పై మీకున్న అచంచలమైన విశ్వాసాన్ని వారు ముందు వ్యక్తపరచండి. వారి మాటలను పరిగణనలోకి తీసుకోవద్దు. ప్రస్తుతం జరుగుతున్నది కేవలం దుష్ప్రచారమే. ఖుర్'ఆన్ మరియు సున్నత్ వెలుగులో మన ఆచరణను సరిచేసుకుంటే, అప్పుడు మన ఆచరణ ద్వారా నిజమైన ధర్మ ప్రచారం ప్రారంభమౌతుంది దుష్ప్రచారాన్ని మట్టి కరిపించే విధంగా.**

# ఖుర్ఆన్‌ని అర్థం చేసుకుంటూ చదువుదాం - 27

فِعل ثلاثي مَزيد فيه
ఫి'లె సులాసీ మజీద్ ఫీహి
[క్రియ యొక్క నాల్గవ రూపం]

أَفْعَلَ

ప్రారంభంలో హమ్జా అదనంగా వచ్చినప్పుడు
(فعل ماضی میں پہلا حرف أ زیادہ ہو)

| | | | | | |
|---|---|---|---|---|---|
| کرنا | إِفْعَال (‘ఇఫ్‘ఆల్’) | مُفْعِل (ముఫ్‘ఇల్) | أَفْعِلْ (అఫ్‘ఇల్) | يُفْعِلُ (యుఫ్‘ఇలు) | أَفْعَلَ (అఫ్‘అల) |
| చూచుట, గమనించుట<br>to see; to watch<br>دیکھنا | إِبْصَار చూపు (ఇబ్సార్) | مُبْصِر చూసినవాడు/ గమనించిన వాడు (ముబ్సిర్) | أَبْصِرْ చూడు/ గమనించు (అబ్సిర్) | يُبْصِرُ చూస్తాడు/ గమనిస్తాడు (యుబ్సిరు) | أَبْصَرَ చూచాడు/ గమనించాడు (అబ్సర) |
| మంచిగా చేయుట<br>to do good; اچھی طرح کرنا<br>to do excellently | إِحْسَان (ఇహ్సాన్) | مُحْسِن (ముహ్సిన్) | أَحْسِنْ (అహ్సిన్) | يُحْسِنُ (యుహ్సిను) | أَحْسَنَ (అహ్సన) |
| ముందుకు తీసుకువచ్చుట<br>to bring forth<br>باہر نکالنا | إِخْرَاج (ఇఖ్‌రాజ్) | مُخْرِج (ముఖ్‌రిజ్) | أَخْرِجْ (అఖ్‌రిజ్) | يُخْرِجُ (యుఖ్‌రిజు) | أَخْرَجَ (అఖ్‌రజ) |
| ప్రవేశింపజేయుట<br>to make enter<br>داخل کرنا | إِدْخَال (ఇద్‌ఖాల్) | مُدْخِل (ముద్‌ఖిల్) | أَدْخِلْ (అద్‌ఖిల్) | يُدْخِلُ (యుద్‌ఖిలు) | أَدْخَلَ (అద్‌ఖల) |
| వెనక్కి పంపుట/తీసుకొనుట<br>to send back;<br>to take back لوٹانا | إِرْجَاع (ఇర్‌జాఅ్) | مُرْجِع (ముర్‌జిఅ్) | أَرْجِعْ (అర్‌జిఅ్) | يُرْجِعُ (యుర్‌జి‘ఉ) | أَرْجَعَ (అర్‌జ‘అ) |
| పంపుట<br>to send<br>بھیجنا | إِرْسَال (ఇర్‌సాల్) | مُرْسِل (ముర్‌సిల్) | أَرْسِلْ (అర్‌సిల్) | يُرْسِلُ (యుర్‌సిలు) | أَرْسَلَ (అర్‌సల) |
| హద్దు మీరుట<br>to exceed; to be extravagant<br>حد سے بڑھنا، زیادتی کرنا | إِسْرَاف (ఇస్‌రాఫ్) | مُسْرِف (ముస్‌రిఫ్) | أَسْرِفْ (అస్‌రిఫ్) | يُسْرِفُ (యుస్‌రిఫు) | أَسْرَفَ (అస్‌రఫ) |
| విధేయత చూపుట<br>to submit; to surrender<br>حکم ماننا | إِسْلَام (ఇస్‌లామ్) | مُسْلِم (ముస్‌లిమ్) | أَسْلِمْ (అస్‌లిమ్) | يُسْلِمُ (యుస్‌లిము) | أَسْلَمَ (అస్‌లమ) |
| భాగస్వామిగా చేర్చుట<br>to ascribe a partner<br>شریک کرنا | إِشْرَاك (ఇష్‌రాక్) | مُشْرِك (ముష్‌రిక్) | أَشْرِكْ (అష్‌రిక్) | يُشْرِكُ (యుష్‌రికు) | أَشْرَكَ (అష్‌రక) |
| అయిపోవుట<br>to become<br>ہوجانا؛ صبح کرنا | إِصْبَاح (ఇస్‌బాహ్) | مُصْبِح (ముస్‌బిహ్) | أَصْبِحْ (అస్‌బిహ్) | يُصْبِحُ (యుస్‌బిహు) | أَصْبَحَ (అస్‌బహ) |
| మంచిగా అగుట<br>to become good;<br>to make good اصلاح کرنا | إِصْلَاح (ఇస్‌లాహ్) | مُصْلِح (ముస్‌లిహ్) | أَصْلِحْ (అస్‌లిహ్) | يُصْلِحُ (యుస్‌లిహు) | أَصْلَحَ (అస్‌లహ) |

**ఖుర్ఆన్‌లో మొత్తం పదాల సంఖ్య = సుమారు 77,800.**

***ఈ 27నెలల్లో నేర్చుకున్న ఖుర్ఆన్ పదాల శాతం : 77.7***

ఈ నెల నేర్చుకున్న పదాలు 718 (అంటే ఈ పేజీలోని పదాలు ఖుర్ఆన్‌లో 718 చోట్ల చూడవచ్చు)

source: www.emuslim.com

క్రిందటి సంచికలో (26వ పాఠంలో) క్రియ యొక్క రెండవ రూపం (అంటే రెండవ అక్షరంపై అదనపు తష్దీద్)కు సంబంధించి 4 పదాలు, 3వ రూపానికి సంబంధించి 5 పదాలను ఇవ్వడం జరిగింది. రెండవ రూపం గురించి ఉదాహరణ పూర్వకంగా వివరించాము. అయితే స్థలాభావం వలన 3వ రూపం గురించి వివరించడానికి వీలుకాలేదు.

ముందుగా మూడవ రూపం గురించి చెప్పుకుందాం. మూడక్షరాల క్రియా పదంలో మొదటి అక్షరం తరువాత అలిఫ్ అదనంగా వస్తుంది. ఈ విధంగా అలిఫ్ రావడం వలన అర్థంలో మార్పు ఏ విధంగా ఉంటుందో క్రింది ఉదాహరణల ద్వారా గమనించండి.

| | | | | |
|---|---|---|---|---|
| قَتَلَ | ఖతల | మొదటి రూపం | చంపుట | to kill |
| قَتَّلَ | ఖత్తల | రెండవ రూపం | సామూహికంగా చంపుట, (రక్తపాతం) | to massacre |
| قَاتَلَ | **ఖాతల** | మూడవ రూపం | **చంపడానికి ప్రయత్నించుట** | to try to kill |
| كَتَبَ | కతబ | మొదటి | వ్రాయుట | to write |
| كَتَّبَ | కత్తబ | రెండవ | వ్రాయడానికి కారణమవుట | to cause to write |
| كَاتَبَ | **కాతబ** | మూడవ | **... తో ప్రత్యుత్తరాల ద్వారా సంప్రదించుట** | to correspond with |
| سَلِمَ | సలిమ | మొదటి | క్షేమంగా ఉండుట | to be safe |
| سَلَّمَ | సల్లమ | రెండవ | క్షేమంగా ఉంచుట | to make safe |
| سَالَمَ | **సాలమ** | మూడవ | **... తో శాంతి నెలకొల్పుట** | to make peace with |
| أَكَلَ | అకల | మొదటి | తినుట | to eat |
| أَكَّلَ | అక్కల | రెండవ | తినిపించుట | to feed, to give to eat |
| آكَلَ | **ఆకల** | మూడవ | **... తో తినుట** | to eat with |
| نَزَلَ | నజల | మొదటి | క్రిందికి దిగుట | to descend, |
| نَزَّلَ | నజ్జల | రెండవ | గ్రంథ పుటల్లో చేర్చుట | to inlay, to insert |
| نَازَلَ | **నాజల** | మూడవ | **...తో పోటీ పడుట**<br>**...తో ఘర్షణ పడుట** | to compete with<br>to clash with |

అంటే ఒక వ్యక్తి చేస్తున్న పనిని వర్ణించడానికి లేదా ఇతరులతో చేస్తున్న దానిని వర్ణించడానికి క్రియ యొక్క ఈ మూడవ రూపం ఉపయోగించబడుతుంది. Form 3 of verb describes someone doing the act in question to or with someone else.

## క్రియ యొక్క నాలుగవ రూపం
### (మూడు అక్షరాల క్రియా పదానికి ముందు హమ్జా అదనంగా రావడం)

ఈ 4వ రూపానికి సంబంధించి 11 పదాలు మరియు వాటి భూత, భవిష్యత్, వర్తమాన కాలాలతో సహా, క్రియా నామవాచక పదాలు తెలుపబడ్డాయి. పక్క పేజీలో చూడవచ్చు. ఈ పదాలలోని మొదటి పదానికి అన్ని కాలాలకు సంబంధించి తెలుగులో అర్థాలను అందించడం జరిగింది. ఆ అర్థాలను బట్టి మిగతా 10 పదాలకు మీరు అర్థాలను వ్రాసుకోవచ్చు.

శాంతిబాటలో ఇస్తున్న ఈ పాఠాలు పూర్తిగా ప్రాథమిక స్థాయికి సంబంధించినవి. వీటివలన ఈ భాషపై అవగాహన బాగా పెరుగుతుంది. తద్వారా ఆసక్తిగలవారు అరబీ నేర్చుకోవడానికి ఆ అవగాహన దోహద పడుతుంది. ఒక్కొక్క అరబీ పదానికి ఎన్నో అర్థాలున్నాయి.

ఈ ప్రాథమిక స్థాయిలో అన్ని అర్థాలను ఇవ్వడం వలన నేర్చుకునే వారికి ఇబ్బంది అవుతుందని, ఒకటీ, రెండు అర్థాలను మాత్రమే ఈ శీర్షిక మాతృక నుండి తీసుకుని అందిస్తున్నాము. ఉదాహరణకు ఇదే పాఠంలో ఉపయోగించబడిన మొదటి రెండు పదాలకు మరికొన్ని అర్థాలు అల్-మౌరిద్ అరబీ-ఇంగ్లీష్ డిక్షనరీ నుండి అందిస్తున్నాము.

أَبْصَرَ

to see, to look at, set eyes on, lay eyes on, catch sight of, to notice, observe, perceive, discern, realize, make out.

**అబ్సర** అంటే కేవలం *చూడటం* మరియు *గమనించడం* మాత్రమే కాకుండా, *గ్రహించడం, చూసి తెలుసుకోవడం, సవివరంగా తెలుసుకోవడం, మంచి చెడ్డలను గుర్తించడం* అనే అర్థాలను కలిగి ఉంది.

أَحْسَنَ

to do well or right, act well or right, to do excellently, do expertly, do proficiently, excel in, know how to do, to be or become proficient in, skilled in, well-versed in, to master, know well, gain mastery in

**అహ్సన** అంటే *మంచిగా చేయడం* మాత్రమే కాకుండా *నైపుణ్యంతో చేయడం* మరియు *ప్రావీణ్యంతో చేయడం* అనే అర్థాలు కూడా దీనికి చెందుతాయి.

ఏ భాషనైనా చదవడం, వ్రాయడం నేర్చుకున్నంత మాత్రాన సరిపోదు. ఆ భాషలోని నానుడులు, పదానుబంధాలు మొదలైన ఎన్నింటినో తెలుసుకోవలసి ఉంటుంది. చదివిన పదానికి ఎన్ని అర్థాలున్నాయో మరియు వాటిలోని ఏ అర్థం ప్రస్తుత పరిస్థితికి సరిపోతుందో అవగాహన కలిగి ఉండాలి. ఇవన్నీ బాగా తెలిస్తే ఆ భాషలో వ్రాయబడిన పుస్తకాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోగలుగుతాము.

ఉత్తమ భాషయైన అరబీలో మనకు లభించిన అత్యుత్తమ గ్రంథం - ఖుర్ఆన్. ప్రాథమిక స్థాయిలో అరబీ భాషపై అవగాహన కలిగినవారికి ఖుర్ఆన్‌లోని ప్రధాన విషయాలన్నీ ఈ గ్రంథం నుండి స్పష్టంగా అర్థమౌతాయి. భాషపై పట్టు పెరిగేకొద్దీ ఈ గ్రంథం చదివేవారికి ఆసక్తి విపరీతంగా పెరుగుతూ ఉంటుంది.

ఒకొక్కసారి రెండు వేర్వేరు పదాలు కలిసి ఏర్పడిన పదబంధానికి ఉండే అర్థం ఆ రెండు పదాలకు భిన్నంగా ఉంటుంది. డిక్షనరీ అర్థాలతో మక్కీకి మక్కీ అనువాదం కూడా కొన్ని చోట్ల ఆమోదయోగ్యం కాదు. దాహం వేసినవారు తెలుగులో 'మంచినీళ్ళు' కావాలని అడుగుతారు. త్రాగే నీటిని 'మంచినీళ్ళు' అని, వాడుకకు ఉపయోగించే నీళ్ళను 'నీళ్ళు' అనడం మనకు అలవాటు. కాని ఇంగ్లీష్‌లో 'good water' అని అడగరు. 'drinking water' అని అంటారు.

కేవలం అనువాదాలనే చదివేవారుగాని లేదా అరబీ భాషపై సరియైన అవగాహనలేనివారు గ్రంథ ఆయత్‌లపై వాదనలు చేయకండి. గ్రంథ వాక్యాలపై వాదన జరుగుతుంటే, ముహమ్మద్(స)వారిని ప్రేమించే విశ్వాసి (మోమిన్) అక్కడి నుండి లేచి వెళ్ళిపోతాడు.

ఈ 27వ పాఠంలో తెలిపిన 11 పదాలలోని 10వ పదం = أَصْبَحَ **అస్‌బహ**. ఈ పదాన్ని ఖుర్ఆన్‌లో దాదాపు 34 చోట్ల చూడవచ్చు. దీని అర్థం 'అయిపోవుట/అగుట'.

- **అస్‌బహ** أَصْبَحَ అనేది ఏకవచన పదం. ఈ పదాన్ని క్రింది 11 ఖుర్ఆన్ ఆయత్‌లలో గమనించవచ్చు. [5:30,31,53], [18:42,45], [28:10,18,82], [41:23], [67:30], [68:20]
- **అస్‌బహూ** أَصْبَحُوا అనేది బహువచన పదం (అయి పోయాయి / అయి పోయారు). ఈ పదాన్ని క్రింది 9 ఖుర్ఆన్ ఆయత్‌లలో గమనించ వచ్చు. [5:102], [7:78,91], [11:67,94], [26:157], [29:37], [46:25], [61:14]
- **యుస్‌బిహ్** يُصْبِحُ (అయిపోతుంది / అయిపోతాడు). ఈ పదాన్ని [18:41], [23:40] ఆయత్‌లలో మరియు
- **యుస్‌బిహూ** يُصْبِحُوا (అయిపోతాయి / అయిపోతారు). ఈ పదం [5:52] ఆయత్‌లో మరియు
- **ముస్‌బిహ్** مُصْبِح (అయిపోయినవాడు / అయిపోయినది). ఈ పదం [37:137] ఆయత్‌లో మరియు
- **ఇస్‌బాహ్** إِصْبَاحُ (verbal noun).ఈ పదం [6:96] ఆయత్‌లో గమనించవచ్చు.

మూడక్షరాల మూలపదానికి అదనంగా హమ్‌జా ( أَ ) రావడం వలన, ఆ మూడక్షరాల క్రియ intransitive అయితే ఈ హమ్‌జా చేరడంతో, ఆ క్రియ transitive అవుతుంది. ఒకవేళ ఆ క్రియ transitive అయితే, అప్పుడు దాని అర్థంలోని ఘనత పెరుగుతుంది. (క్రియ యొక్క 2వ రూపం వలే అంటే తష్‌దీద్ వచ్చినట్లు)

ఒక వ్యక్తి స్వయంగా ఓ పనిచేయడం వలన స్థితిలో మార్పురావడాన్ని ఇది సూచిస్తుంది. ఇది తెలుసుకోవడానికి పైన తెలిపిన ఆయత్‌లను శ్రద్ధగా చదివి గమనించండి. అర్థమౌతుంది. ఉదాహరణకు క్రింది ఆయత్ చూడండి :

**వాస్తవానికి మీకు పూర్వం ఒక జాతివారు ఇటువంటి ప్రశ్నలనే అడిగారు. తరువాత వాటి (ఆ ప్రశ్నల) కారణంగానే వారు సత్య తిరస్కారానికి గురి అయ్యారు.** (ఖుర్ఆన్ 5:102)

**పై ఆయత్‌లో యాక్షన్ :** వ్యక్తులు ప్రశ్నలు అడిగారు

**ఫలితం :** వారు సత్యతిరస్కారులుగా అయిపోయారు.

అంటే వారు ప్రశ్నలు అడగక ముందు సత్య తిరస్కారులు కారు. వారు స్వయంగా చేసిన ఓ పనివలన వారి స్థితిలో మార్పు వచ్చింది.

**చివరికి అతడి మనస్సు అతనిని (తన సోదరుని) హత్యకు పురికొల్పింది. కావున అతడు తన సోదరుణ్ణి (హాబిల్‌ను) చంపి నష్టం పొందిన వారిలో చేరిపోయాడు.** (ఖుర్ఆన్ 5:30)

పై ఆయత్‌లో అతడు హత్య చేయక పూర్వం నష్టపోయినవారిలో లేడు. కాని అతడు చేసిన ఆ చర్య వలన నష్టపోయినవాడిగా అయిపోయాడు. ఒక చర్య వలన అతని స్థితిలో మార్పు వచ్చింది.

మామూలు స్థితి నుండి నష్టపడేవారి స్థితికి చేరడాన్ని 5:30, 5:53, 41:23 ఆయత్‌లలో, పశ్చాత్తాప స్థితికి చేరడాన్ని 5:31, 5:52, 26:157, 23:40 ఆయత్‌లలో, కాఫిర్ స్థితికి మారడాన్ని 5:102, ఆధిక్యత పొందడాన్ని 61:14 ఆయత్‌లో చూడవచ్చు.

మానసిక స్థితిలో మార్పు : మూసా(అ)వారి తల్లిగారి హృదయం తల్ల డిల్లింది. ఆమె హృదయం మామూలు స్థితి నుండి తల్లడిల్లే స్థితికి చేరింది. చూడండి 28:10. మరో ఉదాహరణ : 28:18

ఆర్థిక స్థితిలో మార్పు : మామూలు ఆర్థిక స్థితి నుండి ధనవంతులుగా అయిపోవాలనుకోవడం.

**మరియు నిన్నటి వరకూ అతని (ఖారూన్) వలే కావలెనని ఎవరైతే కోరుతూ వచ్చారో, వారు ఇప్పుడు ఇలా పలుకసాగారు : "తెలుసుకోండి! అల్లాహ్ తన దాసులలో, తాను కోరిన వారికి జీవనోపాధిని విస్తరింప జేస్తాడు. మరియు (తాను కోరినవారికి) తగ్గిస్తాడు. ఒకవేళ అల్లాహ్ అనుగ్రహమే మాపై లేకుంటే ఆయన మమ్మల్ని కూడా భూమిలోకి అణగద్రొక్కి ఉండేవాడు. తెలుసుకోండి! సత్య తిరస్కారులు ఎన్నడూ సాఫల్యం పొందలేరు** (ఖుర్ఆన్ 28:82)

అల్లాహ్ ఆగ్రహం వలన శిక్షించబడిన కొన్ని జాతుల పరిస్థితి శిక్ష తరువాత ఏ విధంగా మారిందో వివరించే ఆయత్‌లలో అస్‌బహ పదం ఉపయోగించబడింది. చూడండి : 7:78, 29:37, 7:91, 11:67, 11:94, 37:137, 46:25

అస్‌బహ అంటే 'అయిపోవుట' అనే ఒక అర్థాన్ని ఇప్పటివరకూ

చెప్పుకున్నాం. ఈ పదానికి ఉన్న ఇతర అర్థాలు :

to become, come to be, grow, turn (into), to be, to get or come to point where, reach a stage where, to enter upon morning, to wake up, awaken, waken, awake, to get up, rise, to come to light, show, emerge, surface, to be or become clear, evident, manifest, plain.

ఉదయం ప్రవేశించుట, నిద్రలేపుట, స్పష్టం అవడం మొదలైన అర్థాలను కూడా ఈ 'అస్‌బహ' పదం కలిగి ఉంది.

ఖుర్'ఆన్‌లో పదే పదే వచ్చే కొన్ని పదాలను పాఠకులకు పరిచయం చేసే ఉద్దేశ్యంతో ఉర్దూ, ఇంగ్లీష్ భాషలలో అందుబాటులోనున్న ఓ వర్క్‌ను తీసుకుని ఆగష్టు 2009న ప్రారంభించాము. ఈ శీర్షిక మరో 10 నెలలలో పూర్తి అయిపోతుంది. ఇన్షా అల్లాహ్ మొత్తం 37 పాఠాలలో అందించ బడిన పదాలను కంఠస్థం చేయగలిగితే, ఖుర్'ఆన్‌లో ఉన్న 80శాతం పదాలు తెలుసుకున్న వారవుతారు.

అయితే ఒరిజినల్ వర్క్‌లో వివరణలు లేవు. పాఠకుల ఆసక్తిని గమనించి వీటికి వివరణలను శాంతిబాట టీమ్ రూపొందిస్తుంది.

ఈ శీర్షిక పూర్తి అయిన తరువాత, ఈ శీర్షిక స్థానంలో అరబీ వ్యాకరణాన్ని తెలుగులో సులభంగా నేర్చుకునే విధంగా ఓ కొత్త శీర్షికను ప్రారంభించడంగాని లేదా 'ఖుర్'ఆన్ అరబీ భాషలోనే ఎందుకు అవతరించింది' అనే పరిశోధనాత్మక వర్క్‌ని సీరియల్ రూపంలో ఇన్షా అల్లాహ్ అందించడం జరుగుతుంది.

సర్వమానవాళి కోసం అల్లాహ్ చేసిన ప్రసంగం అరబీలో ఉంది. అవతరించబడినప్పటి నుండి ఎటువంటి మార్పుకు గురికాకుండా అల్లాహ్ సంరక్షణలో ఉంది. కాబట్టి ఆ అరబీ భాషను నేర్చుకుందాం! స్పష్టంగా అల్లాహ్ ప్రసంగాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకుందాం!

(ఎల్.కే.జి.తో మొదలై 10వ తరగతి పూర్తి చేసుకునే సమయానికి ప్రతీ ముస్లిమ్ విద్యార్థి అరబీలో మాట్లాడగలగడం, 'ఖుర్'ఆన్'ను అరబీలో అర్థం చేసుకుంటూ చదివే విధంగా, ఈ 12 సంవత్సరాల చదువులో వారానికి ఒక గంట చొప్పున 650 గంటలకు సరిపడే విధంగా సిలబస్ తయారు కావాలి. ఆ సిలబస్‌ను స్పష్టంగా మస్జిద్ ఇమామ్‌లు బోధించే విధంగా టీచింగ్ మెటీరియల్ తయారు చేసుకోవాలి.)

**మన రాష్ట్రంలోగాని ఇతరచోట్లగాని శాంతిబాటకు అనుబంధ సంస్థలు ఏమీ లేవు.**

**ఏ జమాత్‌కు ఇది అనుకూలం గాని లేదా వ్యతిరేకం గాని కాదు.**

**ఒకవేళ ఎవరైనా ఆ విధంగా ప్రచారం చేస్తే, అటువంటి ప్రచారానికి మాకూ ఎటువంటి సంబంధం లేదు. కేవలం ఖుర్'ఆన్ మరియు సున్నత్‌పైనే ఆధారపడి స్వచ్ఛందంగా కొందరు ముస్లిమ్ సోదరులు నడుపుతున్న పత్రిక ఇది మరియు ఇది ముస్లిమ్ ఉమ్మత్‌కి సంబంధించినది. సత్యాన్ని నిర్భయంగా ఏ ఒత్తిడి లేకుండా ప్రజలకు తెలియజేయడానికి మేము ఎవరి దగ్గర నుండి ఆర్థిక సహకారాన్ని కోరలేదు.**

**మేము గత సంచికను గవర్నమెంట్ బుక్‌పోస్ట్‌లో పంపితే, కొన్ని ప్రాంతాలకు అది 40 రోజుల తరువాత చేరిందని తెలియజేయబడింది. దయచేసి ఆలస్యానికి మమ్మల్ని నిందించవద్దు.**

**పత్రిక త్వరగా అందాలనుకునేవారు మరియు హైదరాబాద్ వంటి నగరాలలో ఉండేవారు 100 రు॥లు అదనంగా పంపితే వారికి డిటిడిసి కొరియర్‌లో పంపగలం, ఇన్షా అల్లాహ్.**

**శాంతిబాట టీమ్ సభ్యులందరూ వారి జీవనోపాధి చూసుకుంటూ, కొంత సమయాన్ని శాంతిబాట పత్రిక కోసం కేటాయించడం జరుగుతుంది. పత్రికను ఎడ్వర్‌టైజ్‌మెంట్స్ లేకుండా నడపడం ఎంత కష్టమో మీకు తెలుసు. అయినప్పటికీ సకాలంలో అందించాలని అల్లాహ్ పేరుతో మా ప్రయత్నం మేము చేస్తూనే ఉన్నాము. సకాలంలో సంవత్సర చందా పంపమని కోరుతున్నాము. త్వరలో శాంతిబాటలోని ముఖ్య శీర్షికలలోని వ్యాసాలను ప్రత్యేక పుస్తకాలుగా ముద్రించడానికి ప్రయత్నం చేస్తున్నాము.**

**శాంతిబాటలో అరుదైన గ్రంథాల నుండి ఎంతో విలువైన ఇస్లామీయ సమాచారాన్ని ప్రామాణిక ఆధారాలతో అందిస్తున్నాము. శాంతిబాటలో ముద్రించిన విషయాలను ప్రజలకు చేరవేయమని మా పాఠకులకు విజ్ఞప్తి చేస్తున్నాము. మీ దగ్గర ఉన్న శాంతిబాట కాపీని వారిచేత చదివింప జేయడంగాని, లేదా వారిని చందా దారులుగా చేర్చడం ద్వారాగాని సత్యాన్ని వ్యాపింప జేయండి.**

**- శాంతిబాట టీమ్**

*Freedom of Expression*
*Freedom of Speech* } ≠ *Freedom for abuse*

*"Everyone has the right to freedom of opinion and expression, this right includes freedom to hold opinions without interference and to seek, receive and impart information and ideas through any media and regardless of frontiers."*

# భావవ్యక్తీకరణ స్వేచ్ఛ

**ప్రపంచవ్యాప్తంగా అమలులో ఉన్న ఈ భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు సంబంధించిన వాస్తవాలపై ఓ విశ్లేషణ**

**ఒక పురుషుడు ఒక స్త్రీ గురించి తన మనస్సులో నున్న భావాలను పబ్లిక్‌గా గాని లేదా ఏకాంతంలో గాని వ్యక్తపరచినప్పుడు, ఆ వ్యక్తీకరణ అశ్లీలమైన పదాలతో ఉండి ఉంటే, ఆ స్త్రీ అవమానంతో బాధపడి, తరువాత అతడిని రఫ్ ఆడిస్తే, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ గురించి మాట్లాడే ఓ సాధారణ భారతపౌరుడిగా ఎవరైనా ఆ సంఘటనపై ఏ విధంగా స్పందిస్తారు?**

**భావవ్యక్తీకరణ స్వేచ్ఛ ఉంది కాబట్టి, ఆ పురుషుడు తన స్వేచ్ఛను బాగా ఉపయోగించుకో గలిగాడని అతడిని ప్రోత్సహిస్తారా? లేక ఆ పురుషుని స్వేచ్ఛను కాలరాసి, సహనం కోల్పోయిన స్త్రీగా ఆమెను విమర్శిస్తారా?**

**స్వేచ్ఛతోపాటు దానికి ఉన్న హద్దులు కూడా తెలుసుకోవాలి. ఒకరి స్వేచ్ఛ మరొకరిని గాయపరచకుండా ఉండాలి.**

నేడు 'భావవ్యక్తీకరణ స్వేచ్ఛ' అనే పదం ఇస్లామ్‌ను విమర్శించడానికి ఉపయోగించే ఊతపదంగా మారిపోయింది. సల్మాన్ రష్దీ, తస్లీమా నస్రీన్ అనే ఓ ఇద్దరి పేర్లు ఉదాహరించి, ముస్లిములను సహనం లేనివారిగా చిత్రీకరిస్తున్నారు. ప్రస్తుతం "The innocence of Muslims" అనే ఓ సినిమా విషయమై ఏర్పడిన వివాదానికి సంబంధించి ఇస్లామ్‌పై బురద చల్లుతూ గుండెలు బాదేసుకోవడాన్ని మీడియాలో చూస్తున్నాము.

### భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు ముస్లిములు వ్యతిరేకమా?

ఇదే నిజమైతే ప్రపంచంలోని ముస్లిమ్ పాలిత దేశాలలో కాకుండా, మిగిలిన అన్ని దేశాలలోనూ అక్కడి ప్రభుత్వాలు ఒక్క పుస్తకాన్ని కూడా నిషేధించి ఉండకూడదు. కాని అది వాస్తవం కాదు. **ప్రపంచంలోని వివిధ దేశాలలో ఎన్నో పుస్తకాలు నిషేధించబడ్డాయి.** ఆ పేర్లు అన్నీ ఇక్కడ ఇవ్వడం లేదు. ఇంటర్‌నెట్‌లో ఉన్నాయి. ఆసక్తిగలవారు చూసుకోవచ్చు. ఆ నిషేధించబడిన పుస్తకాలతో పోలిస్తే, ముస్లిములచే నిషేధించబడిన కొన్ని పుస్తకాలు పరిగణనలోకి తీసుకోవలసిన అవసరం కనిపించదు.

మరి వీరందరూ ఎందుకు'భావవ్యక్తీకరణ స్వేచ్ఛ'ను వ్యతిరేకించారు వీరెవరూ ముస్లిములు కాదు కదా! ఇది ఎలా ఉందంటే, ఎల్లప్పుడూ బురదలో పొర్లుతూ ఉండేవాడు, ఓ ముస్లిమ్ వేసుకున్న బట్టలపై నున్న చిన్న మరకను చూసి ఎగతాళి చేసినట్లుంది.

### విధ్వంసానికి పాల్పడ్డారా?

ముస్లిములు విధ్వంసానికి పాల్పడాలనేది పాశ్చాత్యుల కోరిక. కాని వారి పథకం బెడిసి కొట్టింది. ఈ మధ్యనే జీవవైవిధ్య సదస్సు మన రాష్ట్రంలో జరిగింది. దానిలో 193 దేశాలు పాల్గొన్నాయి. ఇది ఎందుకు ఇక్కడ చెప్పడం జరిగిందంటే, ప్రపంచంలో ఎన్ని దేశాలు ఉండవచ్చో సాధారణ పాఠకుడికి ఒకసారి జ్ఞాపకం చేయడానికి. 193 దేశాలలో 3 దేశాలలో విధ్వంసం జరిగింది. ఆ మూడు దేశాలు కూడా అమెరికా సామ్రాజ్య కబంధ హస్తాలలో చిక్కుకున్న పాకిస్తాన్, ఈజిప్టు మరియు యెమన్.

ప్రపంచంలోని అన్ని దేశాలలో జీవిస్తున్న ముస్లిములు విధ్వంసానికి పాల్పడలేదు. ప్రపంచంలో 150 కోట్లకు పైగా ముస్లిములు ఉన్నారు. వారందరూ విధ్వంసం సృష్టిస్తే ఎలా ఉంటుందో ఊహించండి.

మరి అలా జరిగిందా? **<u>లేదు కదా!</u>**

**అంటే ముస్లిములు శాంతిని కోరుకునే వారని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలి?**

ఆ మూడు చోట్ల జరిగిన దాడులు కూడా అమెరికా ప్రభుత్వమే, ఒబామా ఎన్నికకు ప్రయోజనం చేకూరేలా పథకం ప్రకారం చేయించి ఉండవచ్చు లేదా అమెరికా చేతిలో నలిగిపోతున్న ఆ దేశాలలోని వారు ఈ వంకతో ఏదైనా చేసి ఉండవచ్చు.

### మన దేశంలో ఏం జరిగింది?

చెన్నయ్, శ్రీనగర్‌లలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. కాని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. ఈ సినిమా నిషేధం కోసం కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. ఇలా చేయడం చట్టాన్ని గౌరవించేవారు చేసిన పనిగా భావిస్తారో లేక చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించినట్లు భావిస్తారో, విమర్శకుల విజ్ఞతకే వదిలేయాలి.

భారత రాజ్యాంగం మనకు అంటే ఈ దేశ పౌరులకు 7 ప్రాథమిక హక్కులను కలుగజేసింది. ఆ ఏడింటిలో 4వ దాని ప్రకారం, భారతీయ

పౌరుడు తనకు ఇష్టమైన మతాన్ని ఆచరించుకోవచ్చు, బోధించుకోవచ్చు, మత వ్యవహారాలను నిర్వహించుకోవచ్చు. ఈ హక్కు మన దేశంలో నివశిస్తున్న అన్ని మతధర్మాల ప్రజలకూ ఉంది. **కాని మతపరంగా వేరే మతస్థులను దూషించే హక్కు మాత్రం లేదు.**

మన రాజ్యాంగంలోని 19, 20, 21 మరియు 22 ఆర్టికల్స్ మాట్లాడటానికి స్వేచ్ఛను మరియు భావాన్ని వ్యక్తీకరించుకునే స్వేచ్ఛను కల్పించాయి. **అయితే మనం మననోటి కొచ్చినట్లు మాట్లాడకుండా, ఇష్టమొచ్చినట్లు వ్రాయకుండా కొన్ని హద్దులు కూడా ఏర్పరిచింది.**

అవి : 1. Security of the state 2. Friendly relation with foreign states 3. Public order 4. Decency and morality 5. Contempt of court 6. Defamation 7. Incitement of an offence and 8. Sovereignty and integrity of India.

కాబట్టి ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడటంగాని, కోర్టు తీర్పులు ధిక్కరించే విధంగాగాని, దేశభద్రతకు, ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించే విధంగా గాని, అశ్లీలంగా నీతిరాహిత్యంగాగాని, ఒకరి గౌరవ మర్యాదలకు భంగం కలిగించే విధంగా గాని ఎవరి వ్రాతలు మరియు ప్రసంగాలు ఉండకూడదు.

ఒకరి గౌరవ మర్యాదలకు భంగం కలిగిస్తే అది నేరం అవుతుంది. బ్లూ సినిమాలు (నీలి చిత్రాలు, అశ్లీల చిత్రాల) కేసెట్లుగాని, సిడి, డివిడిలు గాని పంపిణీ చేయడం ఈ భావవ్యక్తీకరణ స్వేచ్ఛ క్రిందికి రాదు. కొన్ని దేశాలలో బూతు సాహిత్యానికి నిషేధం లేదు. **కాని మన దేశంలో ఉంది.** కొన్ని దేశాలలో బహిరంగంగా ఒక ఆడ, మగ అశ్లీలంగా వ్యవహరించినా అక్కడ అడ్డు చెప్పరు. కాని మన దేశంలో ఆ ఆడమగ భార్యాభర్తలైనప్పటికీ కూడా, బహిరంగంగా అశ్లీలంగా వ్యవహరిస్తే అది నేరం అవుతుంది.

ఒక ధర్మాన్ని కించపరిచే The innocence of Muslims సినిమా భారత రాజ్యాంగం ప్రకారం Freedom of expression క్రిందకు రాదు కాబట్టి, దానిని నిషేధించ మని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగింది.

## విద్వేషం

మన దక్షిణాది రాష్ట్రాలలో చదవబడే ఓ జాతీయ ఇంగ్లీష్ దినపత్రికలో 'ఆధునికతపై సవాల్' అంటూ ఒక మహానుభావుడు వ్యాసం వ్రాసారు. ఇస్లామ్‌పై బహిరంగంగా అతడు విషం కక్కేటంతగా ఈ దేశంలో మరొకరు కక్కి ఉండరేమో! ఎడిటోరియల్ ప్రక్కనే సగం పేజీ ఈయనగారి వ్యాసం కోసం కేటాయిస్తారు. ఇతడు వ్యాసం ప్రచురించిన ప్రతీసారి, పాఠకులు ఇతనిని తీవ్రంగా విమర్శించి, చీవాట్లు పెడతారు. అయినా సరే ఇతడిలో మార్పు రాలేదు. ఆ పేపర్ మేనేజ్‌మెంట్ వారి విధానంలోనూ మార్పురాలేదు. ఇది ఎలా ఉందంటే, ఇస్లామ్‌పై విషం కక్కించడం కోసమే అతనికి ఉద్యోగం ఇచ్చారనిపిస్తుంది.

శాంతిబాట ప్రారంభానికి పూర్వం 2008 సంవత్సరంలో టీమ్‌లోని ఒకరు అతని వైఖరిని తెలుపుతూ ఎడిటర్‌గారికి లెటర్ వ్రాయడం జరిగింది. స్పందన మాత్రం శూన్యం.

ఈ ప్రస్తుత సినిమా విషయంలో ఆ వ్యాసకర్త ఒక ఉదాహరణ తెలిపాడు. ఇష్టం లేకపోతే Don't watch it (దానిని చూడకండి). ఈ సలహా 'మమతా బెనర్జీ'గారికి ఇస్తే బావుంటుంది. ఆమెపై ఓ కార్టూన్ గీసి, ఇష్టం లేకపోతే చూడవద్దు అని చెబితే, ఈ వ్యాసకర్తగారికి ఆమె జ్ఞానోదయం అయ్యేవిధంగా తగిన చర్యలు చేపడతారు.

## సమాజ శ్రేయస్సు

సమాజంలో సంస్కారవంతులు మాత్రమే కాదు సంస్కార హీనులు కూడా ఉంటారు. సహనం కలవారితో బాటు ఉన్మాదులు కూడా ఉంటారు. అశ్లీలంగా మరియు అనైతికంగా బ్రతికేవారు కూడా ఉంటారు. వీరు విద్య నేర్చుకున్న తరువాత, ఆ విద్య వలన వారిలో మార్పు రావచ్చు లేదా వారు తమ పూర్వపు లక్షణాలతోనే జీవితం కొనసాగించవచ్చు.

**అధికారులు, దర్శకులు, నిర్మాతలు, రచయితలు, ఇంజినీర్లు, డాక్టర్లు మొదలైన వారంతా వీరి నుండే రావాలిగాని, పైనుండి ప్రత్యేకంగా ఊడిపడరు కదా!**

కాబట్టి సంస్కారవంతుడైన ఒక వ్యక్తి దర్శకుడు అయితే, అతడు సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని విలువలతో కూడిన సినిమా తీస్తాడు. అశ్లీలాన్ని ఇష్టపడేవాడు తన సినిమాలో అశ్లీలాన్నే చూపిస్తాడు. ఒక దుర్మార్గుడు అత్యంత నీచమైన పనులు చేసినప్పటికీ, అతడి మరణాన్ని దయనీయంగా చిత్రీకరించి అతడిపై సానుభూతి కలిగేలా ప్రేక్షకుల చేత కంట తడిపెట్టించే దర్శకులు కూడా ఉన్నారు.

గురువులపై జోక్‌లు వేస్తూ సినిమాలొస్తున్నాయి. విలువలు దిగజారుతున్నాయని చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ. 'సారీ టీచర్' అనే సినిమా నిషేధం కోసం ఈ మధ్య కొందరు ప్రయత్నించారు.

అదే విధంగా వీరు వ్రాసే వ్రాతలు వారి గుణాన్ని బట్టే ఉంటున్నాయి. **భావవ్యక్తీకరణ స్వేచ్ఛ ముసుగులో వీటన్నింటిని ఆమోదిస్తే సమాజం నాశనమై పోతుంది.**

కొందరు ఇలా కూడా అనవచ్చు : "మమ్మల్ని బూతులు తిట్టినా మేము పట్టించుకోవడం లేదు. అవి వింటూ ఉంటే మాకు సరదాగా ఉంది. కాబట్టి మిమ్మల్ని తిట్టినా కూడా మీరు పట్టించుకోకుండా ఎంజాయ్ చేయండి. లేకపోతే మిమ్మల్ని ఛాందసవాదులు అంటాము".

ఛాందసవాదులని అంటారనో, ఎవరో ఏదో అంటారనో సంస్కార హీనులుగా బ్రతకవలసిన అవసరం సంస్కారం గలవారికి ఉండదు.

## మత దురభిమానం

పాశ్చాత్య దేశాలు ఇస్లామ్‌కు వ్యతిరేకంగా వేల సంఖ్యలో పుస్తకాలు ప్రచురించాయి. ప్రచురిస్తూనే ఉన్నాయి. ఇస్లామ్ పేరుతో వెబ్‌సైట్లు

ఏర్పాటు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. వందల వేల కోట్ల డాలర్లు ఖర్చు పెడుతున్నాయి. డబ్బు కోసం పసిపిల్లలు త్రాగే పాలునే కల్తీ చేసే దుర్మార్గులున్న ఈ కాలంలో, ఈ పాశ్చాత్యులు ఇచ్చే సొమ్ముకు ఆశపడి కొందరు ఇస్లామ్‌పై దుష్ప్రచారం చేస్తున్నారు. ముస్లిమ్ పేర్లతో కొందరు మునాఫిక్‌లను తయారుచేసి నెలకు కనీసం 6000 రూపాయలు చొప్పున జీతాలిస్తూ మన రాష్ట్రంలో దుష్ప్రచారం చేయిస్తున్నారు. ఈ విషయం వివిధ జమాత్‌ల నాయకులకు కూడా తెలుసు. కాని వారు తెలియనట్లు నటిస్తున్నారు. సామాన్య ప్రజలు ఈ నాయకుల వీపులను ఒకసారి గట్టిగా చరిచే వరకూ నిద్ర నటిస్తూనే ఉంటారు.

ఈ మత దురభిమానం ఈనాటిది కాదు. శతాబ్దాల కాలం నుండి వారిలో ఉన్నదే ఇది. **వ్యాపారం పేరుతో వారు తమ సహజగుణమైన మోసంతో మన భారతదేశాన్ని ఆక్రమించారు.** ఇక్కడి చరిత్ర పుస్తకాలను మార్పించడం ప్రారంభించారు.

క్రిందటి సంవత్సరం జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలో జస్టిస్ మార్కండేయ కాట్జుగారు **'What is India?'** అనే నెహ్రూ స్మారక ఉపన్యాసం ఇచ్చారు. ఈ ప్రసంగంలో చరిత్ర ఏ విధంగా వక్రీకరించ బడిందో ఆయన తెలిపారు. ప్రసంగంలోని ఆ కొంత భాగం ఇక్కడ పాఠకుల ప్రయోజనార్థం అందిస్తున్నాము.

"ఇప్పుడు మొదటి భాగం ఏమిటంటే, దండయాత్రలు చేసిన ముస్లిమ్‌లు దేవాలయాలు ధ్వంసం చేశారని మన చరిత్ర పుస్తకాలలో ప్రస్తావించ బడింది. కాని రెండవ భాగం, మొదటి దానికంటే 10 రెట్లు కాల వ్యవధి కలిగినది, ఆ దండయాత్ర చేసినవారి యొక్క వారసులు, వారే స్థానిక ముస్లిమ్ నాయకులు. వారు మత సామరస్యాన్ని పెంపొందించారు. దేవాలయాలు నిర్మించుకోవడానికి నిధులు ఇచ్చేవారు. వారు హిందువుల పండుగ వేడుకలు జరుపుకునే వారు మరియు నిర్వహించేవారు. **ఇవి బ్రిటిష్ వారిచే మన చరిత్ర పుస్తకాలలో రాకుండా చేయబడ్డాయి.** ఆ మొత్తం గేమ్ **విభజించి పాలించడం**. అంటే హిందువులు, ముస్లిములు పరస్పరం కొట్టుకోవాలని.

అలహాబాద్ యూనివర్శిటీ ప్రొఫెసర్, ఆ తరువాత ఒరిస్సా గవర్నర్ అయిన బి.ఎన్.పాండేగారు 1977లో పార్లమెంట్ ఎగువసభయైన రాజ్యసభలో ఇచ్చిన (History in the service of Imperialism) ప్రసంగాన్ని మీరు అర్థం చేసుకుంటే, హిందూ ముస్లిములు పరస్పరం విరోధులుగా అయ్యేటట్లు బ్రిటిష్‌వారు విధానం ఎలా ఉండేదో ప్రొఫెసర్ పాండేగారు చాలా వివరంగా ప్రస్తావించారు.

ఉదాహరణగా ఆయన ప్రసావించింది ఏమిటంటే, 1928లో ఆయన అలహాబాద్ యూనివర్శిటీ చరిత్ర ఆచార్యులుగా ఉన్నప్పుడు, కొందరు విద్యార్థులు ఒక పుస్తకంతో ఆయన దగ్గరకు వచ్చారు. ఆ పుస్తకం కలకత్తా యూనివర్శిటీలోని సంస్కృత ఆచార్యుడైన ప్రొఫెసర్ హరప్రసాద్ శాస్త్రి గారిచే వ్రాయబడింది. అందులో ప్రస్తావించబడినది ఏమిటంటే, టిప్పు సుల్తాన్ 3000 మంది బ్రాహ్మణులను ఇస్లామ్ స్వీకరించమని లేకపోతే చంపబడతారని చెప్పారు మరియు ముస్లిములుగా కావడం కంటే చావడం మేలని ఆ 3000 మంది బ్రాహ్మణులు ఆత్మహత్య చేసుకున్నారు. అది చదివి, ఏ ఆధారంతో మీరు ఇది వ్రాశారని అడుగుతూ ప్రొఫెసర్ బి.ఎన్.పాండేగారు ప్రొఫెసర్ హరప్రసాద్ శాస్త్రిగారికి లేఖ వ్రాశారు. **"ఈ సమాచారానికి ఆధారం ఏమిటి?"** ప్రొఫెసర్ హరప్రసాద్‌గారు సమాధాన మిచ్చారు దానికి ఆధారం "మైసూర్ గెజిటీర్" అని.

అప్పుడు ప్రొఫెసర్ పాండేగారు మైసూర్ యూనివర్శిటీలోని చరిత్ర ఆచార్యులైన ప్రొఫెసర్ శ్రీకంఠియగారికి వ్రాశారు. మైసూర్ గెజిటీర్‌లో 3000మంది బ్రాహ్మణులను ఇస్లామ్ స్వీకరించమని ప్రస్తావించబడటం నిజమా అని ఆయనను అడుగుతూ. అది పూర్తిగా అబద్ధమని ప్రొఫెసర్ శ్రీకంఠియ గారు సమాధానమిచ్చారు. ఆయన ఆ సబ్జక్టులో పనిచేసారు మరియు అటువంటి ప్రస్తావన మైసూర్ గెజిటీర్‌లో లేదు, బదులుగా నిజమైన వివరణ దానికి భిన్నంగా ఉంది. అదేమిటంటే, **టిప్పు సుల్తాన్ ప్రతీ సంవత్సరం 156 హిందూ దేవాలయాలకు నిధులు ఇచ్చేవారని, శృంగేరీ శంకరాచార్యులవారికి నిధులు పంపుతుండేవారని** ..."

ఇప్పుడు కాస్త ఊహించండి, ఎటువంటి మోసం జరిగిందో! **ఉద్దేశ పూర్వకంగా మన చరిత్ర పుస్తకాలు తప్పుగా వ్రాయబడ్డాయి. సులభంగా ప్రభావితమయ్యే వయస్సులో ఉండే పిల్లవాడి మనస్సు విషపూరితం అయ్యేవిధంగా వ్రాయబడ్డాయి.** కాబట్టి అతడు **ఇండియాలో ముస్లిములను ద్వేషించడం** మొదలు పెడతాడు మరియు **పాకిస్తాన్‌లో అతడు హిందువులను ద్వేషించడం** మొదలు పెడతాడు. సులభంగా ప్రభావితమయ్యే ఆ వయస్సులో అతడి మనస్సులో ఉంచబడిన విషాన్ని తరువాత కాలంలో తొలగించడం చాలా కష్టం. మన చరిత్ర పుస్తకాలన్నీ ఈ విధంగా తప్పుడు వ్రాతలు అయిపోయాయి.

**ఇదే సమయం.** మనం మన చరిత్ర పుస్తకాలను తిరిగి వ్రాయాలి మరియు చూపవలసిన వాస్తవం ఏమిటంటే **1857 వరకూ ఇండియాలో మతఘర్షణలు లేవు**. మిశ్రమ సంస్కృతి ఎప్పటి నుండో అభివృద్ధి చెందుతూ ఉండేది. హిందువులు ఈద్, ముహర్రమ్‌లో పాల్గొంటే, ముస్లిములు హెూలీ, దీపావళీ మొదలైన వాటిలో పాల్గొనేవారు. అయితే కొన్ని బేధాలున్నాయనడంలో సందేహం లేదు. కాని అవి చాలా చిన్నవి. **1857లో గొప్ప తిరుగుబాటు జరిగింది.** హిందూ ముస్లిములు కలిసి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడారు. ఆ విప్లవాన్ని అణచివేసిన తరువాత, బ్రిటిష్ పాలకులచే నిర్ణయించబడింది ఏమిటంటే ఈ దేశాన్ని నియంత్రించ డానికి ఉన్న ఒకే మార్గం - **విభజించి పాలించడం**. మరో విధంగా చెప్పాలంటే, హిందువులు మరియు ముస్లిములు ఒకరినొకరు కొట్టుకునేలా చేయడం. **అన్ని మతఘర్షణలు 1857 తరువాతే ప్రారంభ మయ్యాయి.**

ఇంగ్లీష్ కలెక్టర్ రహస్యంగా ఓ హిందూ పండితుడిని పిలిచి అతనికి కొంత డబ్బిచ్చి ముస్లిములకు వ్యతిరేకంగా మాట్లాడమనేవాడు మరియు

అదే విధంగా రహస్యంగా ఓ మౌల్వీని పిలిచి అతడికి కొంత డబ్బిచ్చి హిందువులకు వ్యతిరేకంగా మాట్లాడమనేవాడు....."

ఇది నేను మీకు చెప్పడానికి కారణం ఈ గేమ్‌లో నుండి చూడాలని మరియు సమయం ఆసన్నమైందని తెలపాలని. అంటే ఎంతకాలం తీసుకెళతాం ఈ సవారీని. **మనం తెలివితక్కువ వాళ్ళమా? ఎవడో మనదగ్గరకు రాగలిగి మరియు మనల్ని తెలివితక్కువవారిగా చేసి మనలో మనం కొట్టుకునేలా చేయడానికి?"**

ఇంతవరకూ తెలిపిన విషయాలు కాట్జుగారి ప్రసంగంలోనివి.

మొరార్జీ దేశాయ్‌గారు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు చరిత్ర పాఠ్య పుస్తకాలపై విమర్శలు మరియు వాటిని తొలగించాలనే ప్రయత్నాలు జరిగాయి. అయితే ఇవి పైన కాట్జు గారు చెప్పినట్లుగా మాత్రం కాదు. ఇవి రాజకీయ మార్పులు. ముస్లిములకు అనుకూలంగా ఉన్నాయని 1977 నుండి 79 వరకూ చాలా వాడి వేడి చర్చలు జరిగాయి. 2002లో బిజెపి ప్రభుత్వం NCERT పాఠ్యపుస్తకాలను పూర్తిగా మార్పించడానికి ప్రయత్నం చేసింది.

ఇక ఈ సంవత్సరం ఏప్రిల్‌లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా వర్గం ఇంటర్ NCERT పాఠ్య పుస్తకంలో డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారిని అవమానించారని ఆ పుస్తకాలు నిషేధించమన్నారు. అయితే ఆ పుస్తకం 2006లోనే ప్రచురించబడింది కాని 2012 వరకూ గుర్తించబడలేదు. ఏప్రిల్ 2వ తారీఖున రామదాస్ అతవాలె ప్రెస్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి పాఠ్యపుస్తక ప్రతులను తగులబెట్టారు.

**పుస్తకాలు నిషేధించమని కోరేది కేవలం ముస్లిములు మాత్రమేనా?** ఏ మానవుడికైనా తనకు ఆవేదన కలిగించే విషయంపై తగిన చర్య తీసుకోమని కోరే హక్కు ఉంది. నిరసన తెలిపే హక్కు ప్రతీ ఒక్కరికీ ఉంది. కాని **ఆ నిరసన శాంతిభద్రతలకు విఘాతం కలిగించ కూడదు.** మద్యపానం నిషేధించాలని ఉద్యమించారు, తమ ప్రాంతంలో అణు రియాక్టర్ నిర్మాణం వద్దని ఉద్యమిస్తున్నారు. ఇండియాలో నిషేధించిన తరువాత, సల్మాన్ రష్దీని తమ దేశానికి రప్పించుకుని 1988లో తమ దేశంలో అతని పుస్తకాన్ని ప్రచురించవలసిన అవసరం బ్రిటన్‌కు ఏముంది? ప్రపంచంలోని ఒక మెజారిటీ వర్గం వారికి బాధ కలిగించే పుస్తకం అని తెలిసినా సరే, వారు ఎందుకు ప్రచురింపజేశారు?

**"సల్మాన్ రష్దీ ఒక సబ్-స్టాండర్డ్ మరియు పూర్ రచయిత మాత్రమే. అతడు బుకర్ ప్రైజ్ పొందడం కూడా మిస్టరీయే. అతడు బుకర్ ప్రైజ్ గ్రహీత కాబట్టి గొప్ప రచయిత అనుకోవచ్చు. సెన్సేషనాలిజమ్ కోసం పుస్తకం వ్రాసి మిలియన్ల డాలర్లు పొందాడు కాని అది ముస్లిమ్ సెన్సిటివిటీని చాలా ఎక్కువగా గాయపరచింది."**

పై మాటలు మావి కాదు. సుప్రీం కోర్టు మాజీ జడ్జ్ కాట్జుగారి మాటలు. ప్రస్తుత వివాదాన్ని దృష్టిలో పెట్టుకుని ఒక ఇంగ్లీష్ న్యూస్ పేపర్‌వారు ఈ సల్మాన్ రష్దీ ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఇది దానికి సమయమా? దీనిని బట్టి ఆ పేపర్ వారి ఆంతర్యం ఏమిటో మనం అర్థం చేసుకోవచ్చు. సల్మాన్ రష్దీని హీరోగా చేసింది ముస్లిముల ఛాందసవాదం కాదు, కొందరి మత దురభిమానం మాత్రమే.

సుప్రీమ్ కోర్టు మాజీ జడ్జ్ మరియు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ జస్టిస్ కాట్జు గారు ఇలా చెప్పారు :

**Individual's freedom of speech has to be "harmonised" with the public interest.**

## నిజంగా భావవ్యక్తీకరణ స్వేచ్ఛను కాపాడటానికే సల్మాన్ రష్దీకి బ్రిటన్ ఆశ్రయమిచ్చిందా?

ఈ బ్రిటన్ మాత్రమే కాదు, ఇతర యూరోపియన్ దేశాలు స్వేచ్ఛకు అనుకూలం ఏమీ కాదు. **అది కేవలం ముస్లిముల పట్ల వారికున్న దురభిమానం మాత్రమే.** ఒక స్త్రీ తనకిష్టం వచ్చినట్లు చెడ్డీలు వేసుకుని తిరగవచ్చుట. కాని ఒక స్త్రీ తన ఇష్టప్రకారం 'బురఖా'/'హిజాబ్' వేసుకుని రాకూడదట. తమకు ఇష్టమైన విధంగా ఒకరు బట్టలు ధరించే స్వేచ్ఛను పౌరులకు కల్పించినప్పుడు, బురఖాను ఫ్రాన్స్‌లో ఎందుకు నిషేధించారు? ఆ నిషేధం కొరకు చెప్పే కారణాలన్నీ హాస్యాస్పదమైనవే.

మల్టీ నేషనల్ కంపెనీల ఎడ్వర్‌టైజ్‌మెంట్లు రాకుండా పోతాయేమో ననే భయమో లేక మరేమిటో తెలియదుగాని, ఈ బ్రిటిష్, యూరప్ మరియు అమెరికా దేశాలతో మన మీడియా తానా అంటే తందానా అంటుంది. ఆ దేశ ప్రజలను మరియు నాయకులను స్వేచ్ఛావాదులనే భావాన్ని మీడియా మనపై రుద్దుతుంటుంది.

**Atlas of Creation** (అట్లాస్ ఆఫ్ క్రియేషన్) అనే పుస్తకం దాదాపు 780 పేజీలతో హై క్వాలిటీ glossy పేపర్‌పై టర్కీలో ప్రచురించబడింది. ఈ పుస్తకంలో వందల సంఖ్యలో ప్రాచీన కాలం నాటి జంతువుల, కీటకాల అవశేషాలను కలిగిన యున్న ఫొటోలున్నాయి. వాటి ఆధారంగా డార్విన్ సిద్ధాంతం తప్పు అని పుస్తక రచయిత వివరించడం జరిగింది. డార్విన్ సిద్ధాంతం అని చెబితే చాలామందికి అర్థం కాకపోవచ్చు. మనిషి కోతి నుండే పుట్టాడని చెప్పే సిద్ధాంతం అంటే అర్థమౌతుంది.

అది కేవలం సిద్ధాంతం మాత్రమే. సైన్స్ కాదు. "అట్లాస్ ఆఫ్ క్రియేషన్" సైన్స్‌ను ఉపయోగించుకుని, డార్విన్ సిద్ధాంతం తప్పు అని చెప్పింది. ఈ విశ్వం దానంతట అదే సృష్టించబడలేదని, ఒక సృష్టికర్తచే సృష్టించబడిందని వివరించే క్రియేషనిజమ్‌నే నేడు అత్యధికులు నమ్ముతున్నారు. భౌతికవాదానికి మరియు నాస్తికత్వానికి ఆధారమైన డార్వినిజమ్ కనుమరుగై పోతుంది. యూరప్‌లో కూడా 'క్రియేషనిజమ్' వైపే ఎక్కువమంది మొగ్గు చూపుతున్నారు.

ఈ పుస్తకాన్ని యూరోపియన్ యూనియన్‌లో ఉండే సభ్య దేశాలలో నిషేధించాలని, "ద కౌన్సిల్ ఆఫ్ యూరోపియన్ పార్లమెంటరీ అసెంబ్లీస్ కమిటీ ఆన్ కల్చర్, సైన్స్ అండ్ ఎడ్యుకేషన్" కమిటీ సిఫారసు చేసింది.

ఆ రిపోర్ట్‌లోని కొన్ని ముఖ్య విషయాలు :

**ఆర్టికల్ 2 :** ... ఈ రోజు క్రియేషనిస్ట్ సిద్ధాంతాలు యూరప్‌లోకి తమ మార్గాలను చూసుకుంటున్నాయి మరియు వాటి వ్యాప్తి కొన్ని యూరప్ సభ్యదేశాలపై ప్రభావాన్ని చూపుతున్నాయి.

**ఆర్టికల్ 5 :** మనం చూస్తున్నాము పెరుగుతున్న ఆలోచన రీతులను ప్రకృతి, పరిణామం, మన మూలాలు మరియు విశ్వంలోని మన స్థానంపై ఓర్పుతో మనం నిర్మించుకున్న అంతరంగ జ్ఞానంపై ఆ రీతులు మత సిద్ధాంతాలను మనపై ఉంచుతున్నాయి.

వీరి బాధకు కారణం ఏమిటంటే డార్వినిజమ్ కూలిపోతే **భౌతిక వాదపు మరియు నాస్తికత్వపు పునాదులు నాశనమౌతాయి.** ఇన్నాళ్ళూ వీరు జాగ్రత్తగా కాపాడుకున్న నిర్మాణం అంతరించి పోబోతుంది.

**ఆర్టికల్ 6 :** మన పిల్లల మనస్సులకి తీవ్ర గందరగోళం పరిచయం అయ్యే వాస్తవమైన ప్రమాదం నుండి ...

**రెండు వాదాలు తెలిస్తే, దేనిని సైన్స్ సపోర్ట్ చేస్తుందో వారే తెలుసు కోగలుగుతారు. ఒకప్పుడు భూకేంద్రక సిద్ధాంతం ఉండేది. అది తప్పని తరువాత తెలిసింది. పిల్లలు గందరగోళానికి గురిఅవుతారని మరో సిద్ధాంతాన్ని రాకుండా ఆపగలిగారా? సత్యాన్ని ఆపలేరు. దాని ఆగమనాన్ని ఆలస్యం చేయగలరు, అంతే! ఆధారాలతో చూపే ఒకరి వాదాన్ని అడ్డుకోవడం మూర్ఖత్వమే అవుతుందిగాని, శాస్త్రీయత అనిపించు కోదు.**

ఆర్టికల్ 17 : ... జూలై 2005లో .... రీసెర్చ్ సెంటర్ ఓ సర్వే జరిపింది. 64 శాతం మంది అమెరికన్లు (పాఠశాలలలో) పరిణామ సిద్ధాంతంతో పాటుగా ఇంటెలిజెంట్ డిజైన్‌ను కూడా బోధించాలనే విషయానికి అనుకూలంగా ఉన్నారు మరియు 38 శాతం మంది ప్రభుత్వ పాఠశాల లలో ఈ సిద్ధాంతాన్ని బోధించడాన్ని పూర్తిగా ఆపెయ్యాలనే విషయానికి మద్దతు తెలుపుతున్నారు.

ఆస్ట్రేలియాలో కూడా అదే పరిస్థితి. థీరీ ఆఫ్ ఎవల్యూషన్ కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. ఫ్రాన్స్‌లో 95 శాతం మంది ఈ సిద్ధాంతాన్ని తిరస్కరిస్తున్నారు. ఇది డార్వినిస్టులలో కలవరం కలిగిస్తుంది.

**ఆర్టికల్ 54 :** The Turkish Islamist preacher Harun Yahya, whose real name is Adnan Oktar, is one of the most symbolic figures of this movement. **He is around fifty years old and has been publishing works on creation or religion for about twenty years. He also has his own publishing house, Global, the head office of which is in Istanbul. In 1991, Oktar set up the science and research foundation Bilim Arastirma Vakfi (BAV). Since its establishment, BAV has been very active in trying to have any reference to evolution removed from Turkish education. It also organises many conferences on creationism in the principal Turkish towns and cities.** ...

**ఆర్టికల్ 55 :** The latest work by Harun Yahya appeared in December 2006 and is entitled "**The Atlas of Creation**". It is a large book and is the first volume of a series of seven. **It attempts to refute Darwinism and the theory of evolution in 772 richly illustrated pages. Its conclusion is clear : "creation is a fact" and "evolution is a deception".** Moreover, the author sharply condemns "the secret links between Darwinism and the ideologies with blood on their hands, such as facism and communism". At the beginning of 2007 Yahya launched an offensive aimed at the mass distribution of his work in Europe and throughout the world.

ఆర్టికల్స్ 57 మరియు 104 లో వారు అభిప్రాయపడిన దానిని బట్టి, ఇంతకు ముందు క్రియేషనిజమ్‌పై వచ్చిన పుస్తకాల కంటే, ఈ హారున్-యహ్యాగారి పుస్తకం బాగా ప్రభావితం చేసేస్తుందని కంగారు పడుతున్నారు. పాశ్చాత్యులకు ఏదైనా నచ్చకపోయినా, **సమాధానం చెప్పలేని పరిస్థితి వస్తే ఫండమెంటలిస్ట్, ఫండమెంటలిజమ్ అనే పదాలు వాడతారు.**

ఈ అట్లాస్ ఆఫ్ క్రియేషన్ పుస్తక రచయిత - అద్‌నాన్ అక్తర్ (కలం పేరు: హారున్ యహ్యా). ఈయన ముస్లిమ్. ఆధారాలతో పాటు కొన్ని ఖుర్ఆన్ వాక్యాలను కూడా ఆ పుస్తకంలో ప్రస్తావించారు. ఖుర్ఆన్‌చే ప్రేరణ పొందడం వల్లనే ఈ వర్క్ మొదలైంది. ఒకవేళ అతడు వ్రాసిన విషయాలన్నీ తప్పు అనే అనుకుందాం. అంతా అతని ఊహామాత్రమే అని కూడా అనుకుందాం. అయినా సరే, ఒక వ్యక్తి తన భావాలను వ్యక్తీకరిస్తూ, దానికి తగిన ఆధారాలను చూపగలిగినప్పుడు మరియు వ్యక్తిగత దూషణలు చేయనప్పుడు, ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్‌కి విలువిస్తున్నాం అని చెప్పేవారు **ఆ పుస్తకంపై నిషేధం కోరవలసిన అవసరమేముంది?**

డార్విన్ సిద్ధాంతం కూడా ఒక ఊహ మాత్రమే. దీనిని మాత్రం బలవంతంగా ఎందుకు నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారు?

Dawkins అనే బయోలజీ ప్రొఫెసర్ వెబ్‌సైట్‌ను టర్కీలో హారున్-యహ్యా నిషేధింపజేశాడు అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దానికి కారణం హారున్-యహ్యా ప్రెస్ ఆఫీసర్ ఇలా చెప్పారు :

> **"We are not against freedom of speech or expression but you cannot insult people. We found the comments hurtful. It was not a scientific discussion.** There was a line and the limit has been passed. We have used all the legal means to stop this site. **We asked them to remove the comments but they did not."**

ఆ నిషేధించిన వెబ్‌సైట్‌ను శాంతిబాట టీమ్ కూడా పరిశీలించింది. ఎక్కువగా ఇటువంటి బ్లాగ్స్‌లో బూతులే ఎక్కువ ఉంటాయి. దూషణలు, బూతులతో కాకుండా సైంటిఫిక్‌గా చర్చించాలి.

ఈ పుస్తకాన్ని వ్యతిరేకిస్తూ ఒక బ్లాగ్‌లో వ్యాఖ్యలున్నాయి. 38 కామెంట్లలో 30కిపైగా వ్యతిరేకంగా ఉన్నప్పటికీ, వాటికి రెస్పాండ్ అవుతూ కూడా వ్యాఖ్యలున్నాయి. ఆసక్తిగలవారు చూడండి : http://www.irtiqa-blog.com/2009/02/evolution-of-harun-yahyas-atlas-of.html సైంటిస్ట్ ఒక పరిశోధనా పత్రం ఏదైనా సైంటిఫిక్ జర్నల్‌లో ప్రచురించినా లేదా ఏదైనా పుస్తకం వ్రాసినా వాటిలో చర్చ ఉంటుంది. ఈ చర్చలు మరియు వాటిపై చేసే సద్విమర్శలే సైన్స్‌ను అభివృద్ధి చేస్తాయి. దూషణలతో ఇవి సాధ్యం కావు.

పిల్లల మనస్సులలో ముస్లిముల పట్ల విషపూరిత ఆలోచనలను కలిగించే పాశ్చాత్యులు, డార్విన్ సిద్ధాంతాన్ని తప్పుపట్టే పుస్తకాలు **పిల్లలకు కీడు చేస్తాయని చెప్పడం హాస్యాస్పదం మాత్రమే కాదు, వారి శాడిజానికి నిదర్శనం కూడా.**

దేవుడు లేడని నమ్మేవారున్నారు. దేవుడు ఉన్నాడని నమ్మేవారూ ఉన్నారు. **ఈ విషయం పిల్లలకు తెలియదా?** డార్విన్ సిద్ధాంతాన్ని సత్యమని పిల్లల మనస్సులోకి బలవంతంగా ఎక్కించాలని ఎందుకు ప్రయత్నిస్తున్నారు? దానిని ఖండించే మరొక దానిని వారెందుకు చదవకూడదని ఆపుతున్నారు? వారు విద్యావంతులైన తరువాత, తమ పరిశోధనలను సమర్ధవంతంగా నిర్వహించగలిగే అవకాశం ఉంటుంది. ఒకవేళ వారికి డార్విన్ సిద్ధాంతమే కరెక్ట్ అనే భావం స్థిరంగా ఉండిపోయి, పరిశోధనా ఫలితాలు వ్యతిరేకంగా వస్తే, అప్పటి వారి ఒత్తిడికి కారణం తప్పుడు భావనలు కలుగజేయడమే కదా! **స్వేచ్ఛ గురించి మాట్లాడుతూ బలవంతంగా నమ్మించడమేమిటి?**

మీరు నాస్తికత్వాన్ని నిజం అని భ్రమపడి దానినే పట్టుకుని వేలాడే టప్పుడు, సృష్టికర్త ఒకరున్నారని, ఆయన పేరు అల్లాహ్ అని, ఆ ధర్మమే ఇస్లామ్ అని విశ్వసించిన దానికే వారు కట్టుబడి ఉండటాన్ని మీరు ఎందుకు విమర్శిస్తున్నారు?

ఒకరిని విమర్శించే స్వేచ్ఛ వీరికి ఉన్నప్పుడు, వీరిని విమర్శించే స్వేచ్ఛ మరొకరికీ ఉంటుంది. దూషించడం, సత్యాన్ని వక్రీకరించడం, దుష్ప్రచారం చేయడం, మోసం చేయడం మొదలైన వాటిని భావ వ్యక్తీకరణ స్వేచ్ఛగా పాశ్చాత్యులు భావిస్తున్నారు.

**భావవ్యక్తీకరణ స్వేచ్ఛ అనేది ఆయాదేశాల సంస్కృతులు, సమాజ శాంతిభద్రతలపై ఆధారపడి ఉంటుంది. ఈ స్వేచ్ఛ మానవాళికి ఉపయోగపడాలిగాని, మానవుల మధ్య అగాధాన్ని పెంచకూడదు. స్త్రీని గౌరవించే దేశాలు మరియు స్త్రీని అంగడి బొమ్మగా లేదా సెక్స్ బొమ్మగా భావించే దేశాలూ ఉన్నాయి. కాబట్టి అశ్లీల విషయాల వ్యక్తీకరణ కూడా రెండు దేశాలలో భిన్నంగా ఉంటుంది.**

## ముగింపు

ప్రపంచంలో ఎన్నో దేశాలున్నాయి. కాని రెండు, మూడు దేశాలను ఎన్నుకుని, ఆ దేశాలలో ఎక్కడైనా జరిగిన ఓ చిన్న సంఘటనను తీసుకుని, దానినే ప్రముఖంగా ప్రచురించి ముస్లిముల పట్ల తమ దురభిమానాన్ని చాటుకుంటున్న మీడియా వైఖరి మారాలి.

మన దేశంలో కూడా ఎక్కడో ఒకచోట ప్రతీరోజూ అనాగరికమైన సంఘటన ఏదో ఒకటి జరగవచ్చు. కాని అటువంటి వాటినే కావాలని ఎంచుకుని ప్రతీరోజూ ప్రచురించినంత మాత్రాన మన దేశం అనాగరిక దేశం అయిపోదు కదా!

చిన్నప్పటి నుండే విషబీజాలు పిల్లల మనస్సులలో పడుతున్నాయి. ఇవి జాతి సమైక్యతను పాడు చేస్తున్నాయి. పాశ్చాత్యుల అనాగరిక పద్ధతులు మారనంత వరకూ ముస్లిముల పట్ల విద్వేషం మీడియాలో కనబడుతూనే ఉంటుంది. ఆవేదన చెందకండి. **దాడి చేయాలనే ఆలోచనే మనస్సులోకి రానివ్వద్దు.** అది ముహమ్మద్(స)వారి విధానానికి వ్యతిరేకం. రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిధిలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడమే సరియైనది.

నిశ్చయంగా మీరు, మీ ధన ప్రాణాలతో పరీక్షింపబడతారు మరియు నిశ్చయంగా, **మీకు పూర్వం గ్రంథం ప్రసాదించబడిన వారినుండి మరియు అల్లాహ్‌కు భాగస్వాములు (సాటి) కల్పించిన వారి నుండి, మీరు అనేక వేదన కలిగించే మాటలు వింటుంటారు.** కానీ, ఒకవేళ మీరు ఓర్పు వహించి, అల్లాహ్ పట్ల భీతి కలిగి ఉంటే! నిశ్చయంగా, అది సాహసంతో కూడిన కార్యం. **(ఖుర్'ఆన్ 3:186)**

## సహనం వహించండి

**ముహమ్మద్(స)వారిని ప్రేమించే వ్యక్తులకు ఉండవలసిన ముఖ్య లక్షణం - సహనం.**

**ఛాందసవాదులెవరో, సంస్కారులెవరో ప్రజలు అర్థం చేసుకుంటారు.**

మీ స్నేహితుల చేత, మీ మస్‌జిద్ ఏరియాలో ఉండే సోదరుల చేత ఈ వ్యాసాన్ని చదివించండి.

**ముహమ్మద్(స)వారి జీవితచరిత్ర**

**ఉమర్(రజి)వారి జీవిత చరిత్ర**

**రాతియుగం**

**జ్ఞానం-అజ్ఞానం**

**బాలబాలికలకు ప్రత్యేకం**

**ఇంటర్‌నెట్‌లో ఇస్లామ్ కబుర్లు**

**మొదలైన శీర్షికలు స్థలాభావం వలన, సమయాభావం వలన ఈ సంచికలో అందించలేకపోయాము. వాటిని ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలలో కొనసాగిస్తాము.**

## అల్లాహ్‌ను మరియు ఆయన సందేశహరుడైన ముహమ్మద్(స)వారిని ప్రేమించేవారు గుర్తుంచుకోవలసిన విషయాలు

- **ఇతర మతస్థులు ఆరాధించే వాటిని దూషించకూడదు**

  ... అల్లాహ్‌ను వదలి వారు ప్రార్థిస్తున్న ఇతరులను (వారి దైవాలను) మీరు దూషించకండి. ఎందుకంటే, వారు ద్వేషంతో, అజ్ఞానంతో అల్లాహ్‌ను దూషించవచ్చు ... (ఖుర్ఆన్ 6:108)

- **ఇతర గ్రంథాలను దూషించకూడదు.**

  అబూహురైరాగారి ఉల్లేఖనం : గ్రంథప్రజలు 'తౌరాత్'ను హెబ్రూలో చదివి, దానిని అరబీ భాషలో ముస్లిములకు వివరిస్తుండేవారు. అల్లాహ్ యొక్క సందేశహరులు చెప్పారు : "**గ్రంథప్రజలు చెప్పేది నిజమనిగాని, అబద్ధమని గాని చెప్పవద్దు.** కాని (బదులుగా) చెప్పండి, 'మేము అల్లాహ్‌ను మరియు ఏదైతే మాపై అవతరింపబడిందో దానిని మరియు ఏవైతే మీపై అవతరింప బడ్డాయో వాటిని విశ్వసిస్తున్నాము". **(సహీహ్ బుఖారీ, నెం. 7362, సంపుటి 9, పుస్తకం 96, అధ్యాయం:25)**

- **ముస్లిములు ప్రవక్తలను ప్రేమిస్తారు మరియు గౌరవిస్తారు**

  ఈ ప్రవక్త తన ప్రభువు తరపునుండి, తనపై అవతరింప జేయబడిన దానిని విశ్వసించాడు మరియు (అదేవిధంగా) విశ్వాసులు కూడా. వారంతా అల్లాహ్‌ను, ఆయన దూతలను, ఆయన గ్రంథాలను మరియు ఆయన **ప్రవక్తలను విశ్వసించారు.** వారంటారు: "**మేము ఆయన ప్రవక్తల మధ్య ఎలాంటి బేధభావాలను చూపము.** మరియు మేము (ఆదేశం) విన్నాము మరియు దానిని శిరసా వహించాము, నీ క్షమాభిక్షను అర్థిస్తున్నాము, ఓ మా ప్రభూ! మా గమ్యస్థానం నీ వైపుకే ఉంది. (ఖుర్ఆన్ 2:285)

- **డిబేట్స్ పెట్టుకోవద్దు. వాదనలను ఆహ్వానించవద్దు.**

- **ఖుర్ఆన్ ఆయత్‌ల విషయంలో వాదనలు జరిగే చోటు నుండి లేచి వెళ్ళిపోవాలి.**

- **మునాఫిక్‌లకు దూరంగా ఉండండి. మత ఘర్షణలకు మరియు వివిధ జమాత్‌ల మధ్య అనైక్యతకు కారణం వారే.**

  "... వారు శతృవులు, కావున వారి పట్ల జాగ్రత్తగా ఉండు. అల్లాహ్ వారిని నాశనం చేయుగాక! ..." (ఖుర్ఆన్ 63:4)

- **ఆరాధన విషయంలో ఏదైనా ప్రతిపాదన తెస్తే ...**

  "మరియు మీరు ఆరాధిస్తున్న వాటిని నేను ఆరాధించేవాణ్ణి కాను. మరియు నేను ఆరాధిస్తున్న ఆయనను మీరు ఆరాధించేవారు కాదు. **మీ ధర్మం మీకూ మరియు నా ధర్మం నాకు!**" (ఖుర్ఆన్ 63:4)

**భారత రాజ్యాంగం మనకు సంక్రమింపజేసిన హక్కుల పరిధిలో ఏ రూపంలోనైనా మనకు ఎవరైనా ఆవేదన కలిగిస్తే చట్టపరమైన చర్యల కోసం ప్రయత్నించాలిగాని చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు.**

## ముస్లిములపై నిరంతరం ఏదో ఒక వంకతో దుష్ప్రచారం జరుగుతూనే ఉంది

### అస్సాం

అస్సాంలో గొడవలు జరుగుతున్నాయని, ముస్లిముల వలన అస్సామీయులకు ప్రమాదం జరగబోతున్నదని అనుమానం కలిగే విధంగా మీడియాలో అతి పెద్ద కవరేజి ఇచ్చారు. భయపడవద్దని వారికి ముస్లిములు బెంగుళూరులో విందు ఏర్పాటు చేసి మరీ చెప్పారు. హైదరాబాద్‌లో ముస్లిమ్ ఎమ్.పి. వారికి ధైర్యం చెప్పి వెళ్ళవద్దని విజ్ఞప్తి చేశారు. తన ఫోన్ నంబర్ కూడా వారికి ఇచ్చారు. ఈ విషయానికి సంబంధించి ముంబయిలో జరిగిన శాంతి నిరసనలలో మీడియా వాహనాలు తగలబడ్డాయి. హైదరాబాద్‌లో తెలంగాణా మార్చ్‌లో కూడా అదే జరిగింది. యు.పి.లో 200 మంది యువకులు అల్లరి చేశారు. **ఇండియాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు.**

### బెంగుళూరు

పాకిస్తాన్ జెండాను వేరే మతస్థులు ఎగురవేసి దానికి ముస్లిమ్ యువకులను బాధ్యులుగా చేసే ప్రయత్నం జరిగింది. దీనికి కారకులెవరో తెలిసిపోవడంతో ముస్లిములకు ఏమీ కాలేదు. లేకపోతే ఏమి జరిగి ఉండేదో!

### ఇప్పుడు సినిమా వివాదం

ఇండియాలో కేవలం రెండు రాష్ట్రాలలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. ముస్లిములు హింసకు పాల్పడలేదు. విధ్వంసాలకు పాల్పడలేదు.

**ఈ విధంగా ఏదో ఒక పథకం ప్రకారం ముస్లిములపై బురదజల్లడానికి మరియు అవమానించడానికి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి.**

**వారి సవాలక్ష ప్రయత్నాలలో ఏదో ఒకటి సక్సెస్ కావచ్చు. కాబట్టి ముస్లిములు చాలా జాగ్రత్తగా ఉండాలి. రెచ్చగొట్టినా రెచ్చిపోకుండా సహనంతో ఉండమని విజ్ఞప్తి చేస్తున్నాము.**

**అమెరికా చేతిలో పరోక్షంగా బందీలుగా ఉన్న కొన్ని ముస్లిమ్ దేశాలలో ఏదో ఒక సంఘటనను జరిపించి, ఆ సంఘటనకు మీడియాలో పెద్ద కవరేజీ వచ్చేలా చేస్తూనే ఉన్నారు. తీవ్రవాదులైన అమెరికన్లు ఆ ముద్ర ముస్లిములపై వేసి, ప్రజలు ఆ అపనిందను మరచిపోకుండా ఉండటానికి అన్ని ముఖ్య పత్రికలలో కవర్ అయ్యేలా అమెరికన్లు దుష్ప్రచారం చేస్తూనే ఉన్నారు.**

**ముస్లిములు రెచ్చిపోయి గొడవలు చేయాలని రకరకాలుగా కవ్వింపు చర్యలకు దిగుతున్నారు. మనం సంయమనంతో ఉంటే వారి కుయుక్తులను ప్రపంచ ప్రజలు అర్థం చేసుకుని వారినే ఛీకొడతారు. మన సహనం మన పిల్లల భవిష్యత్తుకు, ఇన్షా అల్లాహ్, మేలు చేస్తుంది.**

## YouTube యూ ట్యూబ్

ఈ 'యూ ట్యూబ్'లో ఇస్లామ్‌కి వ్యతిరేకంగా నిర్మించిన సినిమా గురించి మాత్రమే ఉందా? ఎన్నో సంవత్సరాల నుండి దీనిలో ఇస్లామ్‌ను, ముస్లిములను అవమానించే ఎన్నో వీడియోలున్నాయి. విచ్చలవిడి సెక్స్‌కు బానిసలై, సభ్యత సంస్కారాలు కోల్పోయిన కొన్ని దేశాలు, మిగతా ప్రజల సంస్కృతిని కూడా నాశనం చేయడానికి అశ్లీల వీడియోలెన్నింటినో వీటిలో అప్‌లోడ్ చేశారు.

### మన భారతదేశ సమగ్రతకు ముప్పు తెచ్చే వెబ్‌సైట్లు

**యూ ట్యూబ్ గురించి ఇటీవల సాక్షి పత్రికలో ప్రచురించబడిన వార్త:** ఫేస్ బుక్, ఆర్కుట్, యూట్యూబ్, యాహూ, బ్లాగ్ స్పాట్, గూగుల్, మైక్రోసాఫ్ట్‌తో సహా 21 సామాజిక అనుబంధ వెబ్‌సైట్లు అశ్లీల సాహిత్యాన్ని విక్రయిస్తున్నాయని, దేశంలో వర్గ విభేధాలను రెచ్చగొడుతున్నాయని, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఢిల్లీకి చెందిన జర్నలిస్ట్ వినయ్‌రాయ్ గత సంవత్సరం కోర్టులో పిటిషన్ వేశారు. దీనికి సంబంధించి కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని స్పందన కోరగా ... ఆ సైట్లపై ఆరోపణలు సరైనవేననడానికి తగిన ఆధారాలున్నాయని పేర్కొంది.

గూగుల్, ఫేస్‌బుక్ సహా 21 **అమెరికన్** వెబ్‌సైట్లు **మనదేశ సమగ్రతకు ముప్పు తెస్తున్నాయని, వాటిని భారత్ రప్పించేందుకు అవసరమైన చర్యలు (ఎక్స్‌ట్రాడిషన్ ప్రొసీడింగ్స్) తీసుకోవాలని ఢిల్లీ హైకోర్టును కేంద్ర హోం శాఖ కోరింది.**

ఇప్పుడు ఈ సినిమా ద్వారా ఇస్లామ్‌ను కొత్తగా ఏమీ అవమానించడం లేదు. ఈ సినిమా పేరుతో దాడులకు పాల్పడి ముస్లిములను బలితీసుకుందామని కొన్ని ధూర్త దేశాలు ఆడుతున్న ఎన్నికల గేమ్ ఇది. మన ఆస్తులెందుకు తగలబడాలి? ఓర్పుతో ఆలోచించండి.

### కొన్ని దేశాలలో మత ధూషణకై *(Blasphemy)* విధించే శిక్షలు

**గ్రీస్ :** ఈ దేశంలోని చట్టంలోని 14వ ఆర్టికల్ ప్రకారం దేశాధ్యక్షుడిని గాని, క్రైస్తవత్వాన్ని గాని, ఈ దేశంతో గుర్తించబడిన ఇతర మతాన్ని అవమానిస్తే అది అఫెన్స్ అవుతుంది.

**ఐర్లాండ్ :** ఈ దేశంలో మత దూషణ నేరం. ఇటలీలో ..... సెక్షన్ 403 క్రింద చట్ట వ్యతిరేకం.

**మాల్టా :** ఈ దేశంలో రోమన్ కాథలిక్ చర్చ్‌ని ధూషించడం చట్ట వ్యతిరేకం.

డచ్ క్రిమనల్ కోడ్ 137(.) ప్రకారం ఏదైనా వర్గాన్ని వారి జాతి, మత, కన్‌విక్షన్‌ను బట్టి ఉద్దేశపూర్వకంగా అవమానిస్తే అది నేరం అవుతుంది.

**పాకిస్తాన్‌లో** మత ధూషణకు శిక్ష ఉంది. ఈ శిక్షలు ఆయా దేశాల చట్ట పరిధిలో ఉన్నాయి.

అయితే ఇస్లామీయ పరిపాలనలో ఉన్న దేశం ప్రస్తుతం ప్రపంచంలో ఏదీ లేదు. ఇస్లామ్ అందించింది ప్రజాస్వామ్య పరిపాలన. దానికి అధ్యక్షుడు ఖలీఫా.

**1400 సంవత్సరాల క్రితం రెండవ ఖలీఫా ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి)వారు దాదాపు 10 సంవత్సరాలు ఇస్లామీయ పరిపాలనను అందించి, ప్రపంచానికి నిజమైన ప్రజాస్వామ్యాన్ని అందించారు.**

అటువంటి ప్రజాస్వామ్య పరిపాలన అంతకు పూర్వం ప్రపంచం చూడలేదు. ఇంతవరకూ అటువంటి ప్రజాస్వామ్యాన్ని ఏ దేశం కూడా ఆచరణలో పెట్టలేకపోయింది.

దేశాధ్యక్షుడైన ఆయనను ఆయన వేసుకున్న బట్టల గురించి కూడా ఓ వృద్ధ మహిళ ప్రశ్నించ గలిగింది. అంతటి హక్కు ఒక సామాన్య పౌరుడికి, ఓ నిరుపేద స్త్రీకి సయితం ఇవ్వడం జరిగింది. వారికి దేశాధ్యక్షుడైన ఉమర్(రజి)వారు వినమ్రంగా సమాధానమిచ్చేవారు. ఎటువంటి రక్షకదళం గాపి, విలాసవంతమైన భవనాలుగాని ఏమీ లేవు. ఆయన బట్టలు ఆయనే ఉతుక్కునేవారు. తన దేశంలో ఒక కుక్క ఆకలితో చనిపోయినా, దానికి తానే బాధ్యత వహించవలసి వస్తుందని చెప్పేవారు. ఆయన ప్రపంచంలో సగ భూభాగానికి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు, ఆయన వేసుకున్న చొక్కాకు ఎన్నో అతుకులు.

ప్రజలంతా సంతోషంగా ఉండేవారు. ఎక్కడా నిరసన ధ్వనులు లేవు. **పరమత సహనం అంటే ఎలా ఉండాలో ఆయన పరిపాలనలో ప్రపంచం చూసింది.** ఆయన అన్న మాటలు చూడండి :

**"అణిచేవాడి పట్ల నేను నిర్దయుడిగా మరియు కఠినంగా ఉంటాను, కాని నేను బలమైన స్తంభంగా ఉంటాను బలహీనుల పట్ల. ప్రజలను పీడించేవాడి ఒక చెంప నేలపై ఉంచి, రెండవదానిని** (రెండవ చెంపను) **నా పాదం క్రింద ఉంచనంత వరకూ నేను శాంతించను. మరియు పేదవారు మరియు బలహీనుల కొరకు నా చెంపనే నేలపై ఉంచుతాను."**

ఎవరినైనా ఒక ప్రాంతానికి గవర్నర్‌గా నియమిస్తే, ముందుగా అతని ఆస్తుల వివరాలు తీసుకునేవారు. గవర్నర్ తప్పు చేస్తే శిక్షించేవారు. గవర్నర్‌కు ద్వార పాలకుడు ఉండకూడదనేవారు. ఏ పేదవాడైనా నేరుగా గవర్నర్‌ను కలిసి తన కష్టాన్ని చెప్పుకునే విధంగా తన గవర్నర్‌లకు ఆదేశాలు జారీ చేశారు. **ఇంత గొప్ప శిక్షణ ఈయనకు ఇచ్చింది మరెవరో కాదు, చిట్ట చివరి ప్రవక్త యైన ముహమ్మద్(స) వారు.** ఇస్లామీయ పరిపాలనలో అందరూ సంతోషంగా ఉంటారు. ఉమర్(రజి)వారి జీవితచరిత్ర సీరియల్ రూపంలో ఈ పత్రికలో కొనసాగుతుంది.

పాకిస్తాన్ లేదా ఆఫ్ఘనిస్తాన్‌లోని సంఘటనలను పదే పదే ఉదాహరిస్తూ ఇస్లామ్‌ను అవహేళన చేసే దుర్మార్గపు దేశాల కపటత్వాన్ని పాఠకులకు తెలియజేయాలనే ఈ వ్యాసాన్ని అందించాము.

భార్యాభర్తల నుద్దేశించి ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా తెలియజేస్తున్నారు :


వారు మీకు వస్త్రాలు, మీరు వారికి వస్త్రాలు (2:187) | They are clothing for you and you are clothing for them | هُنَّ لِبَاسٌ لَّكُمْ وَأَنتُمْ لِبَاسٌ لَّهُنَّ




అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు : (సహీహ్ ముస్లిమ్, 3649, పుస్తకం 17, అధ్యా.19, సంపుటి 4)

**"ఈ ప్రపంచం తాత్కాలిక సుఖం. ప్రపంచంలోని తాత్కాలిక సుఖాలన్నింటికంటే ఉత్తమమైనది ధర్మపరాయణురాలైన స్త్రీ (భార్య)"**

*వస్త్రాలు నగ్నత్వం నుండి కాపాడుతూ మనకు గౌరవాన్నిస్తాయి. అదే విధంగా భార్య గౌరవాన్ని భర్త మరియు భర్త గౌరవాన్ని భార్య కాపాడాలి. కుటుంబంలో భార్యాభర్తలకు వేర్వేరు బాధ్యతలున్నాయి. వారి మధ్య హెచ్చుతగ్గుల గురించి ఆలోచించ వలసిన అవసరం లేదు. ఇద్దరిలో ఎవరికీ ఎక్కువ తఖ్వా ఉంటుందో, ఎవరు తమ బాధ్యతను అల్లాహ్ ఆదేశించిన దాని ప్రకారం నిర్వర్తిస్తారో వారికే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ విలువ ఉంటుంది. కాబట్టి భార్యాభర్తలు ధర్మ పరాయణతలో, బాధ్యతలను నిర్వహించడంలో, ఒకరి గౌరవాన్ని మరొకరు కాపాడటంలో పోటీపడాలి. భార్యాభర్తల సంబంధంలో > (ఎక్కువ), < (తక్కువ), = (సమానం) వంటి గుర్తులు ఉండవలసిన అవసరం లేదు. కొన్ని విషయాలలో భర్త అధికుడైతే, మరికొన్ని విషయాలలో భార్య ఆధిక్యత వహిస్తుంది. సంతోషంగా బ్రతకవలసిన ఎన్నో కుటుంబాలు చీలిపోయి విడాకుల కోసం పరితపించడమో, మానసిక క్షోభకు గురికావడమో జరుగుతుంది. సలాత్ (నమాజ్) ఎలా చేయాలీ, సౌమ్ (ఉపవాసం) ఎలా ఉండాలీ, ఖుర్‌ఆన్‌ను అరబీలో ఎలా చదవాలీ, ఈ విషయాలు తెలుసుకుంటే చాలు అని నేటి ముస్లిమ్ సమాజంలోని స్త్రీలు అనుకుంటున్నారు. వివాహం జరిగినప్పుడో లేక జరిగిన తరువాతైనా సరే ఒక ఇల్లాలిగా తాను నిర్వహించవలసిన బాధ్యతలేమిటో, వాటి గురించి అల్లాహ్ ఏమి ఆదేశించారో తెలుసుకోవడానికి ప్రయత్నించడం లేదు. తల్లి తన కుమార్తెకు బంగారు నగలు, బట్టలు, ఇతర సామాన్లు ఇవ్వడం గురించి ప్రాధాన్యత ఇస్తుంది గాని, తన కూతురు ఇహలోకంలోనూ పరలోకంలోనూ సంతోషంగా బ్రతకడం కోసం అవసరమైన శిక్షణ ఇవ్వడం లేదు. ఓ మాతృమూర్తి తన కుమార్తె వివాహ సమయాన ఎటువంటి విషయాలు చెప్పి, భర్తతో పంపారో ఈ శీర్షిక తొలి వ్యాసంలో చదవండి. మహిళ తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తి స్తే ఓ గొప్ప సమాజం మన ముందుంటుంది.*




ఏయే వయస్సులలో స్త్రీ, పురుషులు వివాహం చేసుకోవచ్చో, ఏయే వ్యక్తులతో వివాహం ధర్మ సమ్మతమో మరియు ఏ ఇద్దరి మధ్య వివాహం నిషిద్ధమో, మరియు **మానసిక సౌందర్యం యొక్క విలువ ఏమిటో** గత సంచికలలో చెప్పుకున్నాము. అంతేకాకుండా ఇతర ధర్మాల వారికి ముస్లిముల వివాహాలపై ఉన్న అపోహలను దూరం చేస్తూ, ఇస్లామీయ వివాహ వ్యవస్థలో ఉన్న వివేకాన్ని స్పష్టంగా ఉదాహరణ పూర్వకంగా వివరించడం జరిగింది.

ఈ విషయాలు ముస్లిమేతరులకే కాకుండా, ముస్లిములలో కూడా చాలా మందికి తెలియవు. కాబట్టి సామాజిక ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ అంశాలను చర్చించడం జరిగింది. ఇవి ప్రతీ ముస్లిమ్ తెలుసు కోవలసిన విషయాలు. కాబట్టి కొత్తగా చేరిన పాఠకులు, గత సంచికల లోని వివరాలు మా వెబ్‌సైట్ నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకొని చదవగలరని ఆశిస్తున్నాము.

## స్త్రీ యొక్క అంగీకారం లేకుండా ఆమెకు వివాహం జరిపే హక్కు ఉందా?

క్రిందటి సంచికలో వరుడు లేదా వధువు ఎంపిక గురించి ఇస్లామీయ సూచనలు తెలియజేశాము. వరుడు ఎంపిక జరిగిన తరువాత కుమార్తెకు ఇష్టం లేకుండా ఆమె వివాహాన్ని జరిపించే హక్కు తండ్రికి ఇస్లామ్ ఇచ్చిందా లేదా మొదలైన విషయాలపై ముహమ్మద్(స) వారు ఏమి చెప్పారో ఈ వ్యాసంలో తెలుసుకుందాం!

ఈ విషయాలు తెలుసుకునేముందు క్రింది హదీస్‌ను అర్థం చేసుకోవాలి.

ఇబ్నె అబ్బాస్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : **"పరస్పరం ప్రేమించుకునే ఇద్దరికి వివాహం వంటి (గొప్పది) ఏదీ లేదు."** (ఇబ్నెమాజా, హసన్ హదీస్, 1847, పుస్తకం 9, అధ్యా. 1, సంపుటి 3)

వివాహం అనేది స్త్రీ పురుషలిద్దరినీ కలిపే బంధం. ఆ బంధంలో ప్రేమ ఉండాలి. ఆ బంధాన్ని ఏర్పరచు కునేవారు ముందుగా ఒకరి నొకరు ఇష్టపడాలి. ఇంట్లో పెద్దవారి బలవంతం వల్లనో లేక మరో బలమైన కారణం వల్లనో అమ్మాయి ఇష్టం లేకుండా వివాహం జరిగితే, ఆ వివాహాన్ని వధువు రద్దు చేసుకోగలదు. **ఇస్లామ్ అటువంటి స్వాతంత్ర్యాన్ని స్త్రీకి ఇచ్చింది.**

సాధారణంగా స్త్రీకి వివాహాన్ని జరిపించేది ఆమె తండ్రి. వధువు కన్య అయినా కావచ్చు లేదా ఆమె అంతకు పూర్వం వివాహం జరిగి విడాకులు పొందిన స్త్రీ అయినా కావచ్చు లేదా ఆమె విధవరాలు అయివుండవచ్చు. ఒకవేళ వధువుకు తండ్రి లేకపోతే ఆమె తరఫున ఎవరైనా వివాహం జరిపించవచ్చు. ఇటువంటి వివిధ పరిస్థితులలో ఎలా వ్యవహరించాలో క్రింది హదీస్‌లు తెలియజేస్తున్నాయి.

### 1. వివాహిత విషయంలో

(విధవరాలు లేదా విడాకులు పొందిన స్త్రీకి జరిపే వివాహ విషయంలో)

ఖన్‌సా' బిన్త్ ఖిదామ్ అన్సారియా ఉల్లేఖనం. ఆమె తండ్రి ఆమె విధవరాలుగా ఉన్నప్పుడు వివాహం చేసారు. మరియు ఆమె ఆ వివాహాన్ని ఇష్టపడలేదు. కాబట్టి ఆమె అల్లాహ్ యొక్క సందేశహరులు(స) వద్దకు వెళ్ళారు మరియు ఆయన(స) ప్రకటించారు ఆ వివాహం చెల్లదని." (సహీహ్ బుఖారీ, 5138, పుస్తకం 67, అధ్యా. 43, సంపుటి 7)

అబ్దుర్ రహ్మాన్ బిన్ యజిద్ అన్సారి మరియు ముజమ్మ' బిన్ యజిద్ అన్సారి చెప్పారు, వారిలో ఖిదామ్ అని పిలువబడే ఒక వ్యక్తి తన కుమార్తె కొరకు వివాహాన్ని కుదిర్చారు. మరియు ఆమె తన తండ్రిచే కుదర్చబడిన వివాహాన్ని ఇష్టపడలేదు. ఆమె రసూలుల్లాహ్(స)వారి వద్దకు వెళ్ళారు మరియు ఆయనతో దాని గురించి చెప్పారు, మరియు ఆయన(స) ఆమె తండ్రిచే కుదర్చబడిన వివాహాన్ని రద్దు చేసారు. అప్పుడు ఆమె అబూ లుబాబహ్ బిన్ 'అబ్దుల్ మున్‌దిర్‌ను వివాహం చేసుకున్నారు. (ఇబ్నెమాజా, సహీహ్ హదీస్, 1873, పుస్తకం 9, అధ్యా. 12, సంపుటి 3) (ఉల్లేఖకులలో ఒకరైన) యహ్యా ప్రస్తావించారు ఆమె అప్పటికి వివాహిత అని.

### 2. కన్య విషయంలో

ఇబ్నె అబ్బాస్ (రజి)వారు ఉల్లేఖించారు. ఓ కన్య ప్రవక్త(స)వారి వద్దకు వచ్చి ఆయన(స)కు చెప్పారు తన తండ్రి వివాహం కుదిర్చారని, దానిని ఆమె ఇష్టపడలేదని మరియు ప్రవక్త(స)వారు ఆమెకు నిర్ణయించుకునే అవకాశం ఇచ్చారు. (ఇబ్నెమాజా, సహీహ్ హదీస్, 1875, పుస్తకం 9, అధ్యా. 12, సంపుటి 3)

పై హదీస్‌ల ప్రకారం ఒక స్త్రీ తనకు ఇష్టంకాని వివాహం జరిపిస్తే, ఆ వివాహాన్ని రద్దు చేయించుకోగలదు. అయితే **ఒక ముఖ్య విషయాన్ని కూడా ఆమె దృష్టిలో ఉంచుకోవాలి**. ఏ స్త్రీకి అయినా ఆమె బాగు కోరేవారిలో ముందుండేవారు ఆమె తల్లిదండ్రులే. అయితే స్వార్థంతో గాని లేక మరేదైనా కారణంతో కూడా కొందరు తల్లిదండ్రులు కుమార్తెకు ఇష్టం కాకపోయినా వివాహం జరిపించవచ్చు. అటువంటప్పుడు ఆ వివాహాన్ని తిరస్కరించే ముందు, **ఆ వధువు సహేతుకంగా ఆలోచన చేయడం చాలా ముఖ్యం.**

క్రింది హదీస్ చూడండి. వివేకవంతురాలు మరియు సుగుణ వంతురాలైన ఓ అమ్మాయి ఎటువంటి నిర్ణయం తీసుకున్నారో తెలుస్తుంది.

ఇబ్నె బురైదహ్ ఉల్లేఖనం. అతని తండ్రి చెప్పారు : "ఒక అమ్మాయి ప్రవక్త(స)వారి వద్దకు వచ్చింది మరియు చెప్పింది : "నా తండ్రి నన్ను తన సోదరుని కుమారునితో వివాహం జరిపారు. ఆయన అతని హోదాను దాని ద్వారా పెంచవచ్చునని.' ప్రవక్త(స)వారు ఆమెకు నిర్ణయించుకునే అవకాశం ఇచ్చారు మరియు ఆమె చెప్పారు : "నేను ఆమోదిస్తున్నాను ఏదైతే నా తండ్రి చేసారో, కాని నేను స్త్రీలు తెలుసుకోవాలని అనుకున్నాను, వారి తండ్రులకు ఈ విషయంలో హక్కు లేదని. (అలా చేయడానికి)" (ఇబ్నెమాజా, సహీహ్ హదీస్, 1874, పుస్తకం 9, అధ్యా. 12, సంపుటి 3)

**ఇదే విషయం మరింత వివరంగా నసాయీ గ్రంథంలో ఉంది.**

ఆయిషా(రజి)వారి ఉల్లేఖనం. ఒక అమ్మాయి ఆమె దగ్గరకు వచ్చింది మరియు చెప్పింది : "నా తండ్రి నన్ను తన సోదరుని కుమారుడితో వివాహం చేశారు దాని ద్వారా ఆయన అతని స్థాయిని పెంచవచ్చుని మరియు నేను ఇష్టపడలేదు." ఆమె(రజి) చెప్పారు : "కూర్చోమ్మా ఇక్కడ, ప్రవక్త(స)వారు వచ్చే వరకూ." తరువాత అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) వచ్చారు మరియు

నేను ఆయనకి చెప్పాను (ఆ అమ్మాయి ఏదైతే చెప్పిందో దానిని). ఆయన(స) అతనికి కబురు పంపారు, పిలుచుకు రమ్మని మరియు అతడు ఆ విషయాన్ని ఆమెకే వదిలేశాడు. ఆమె చెప్పింది: **"ఓ రసూలల్లాహ్(స)! నేను అంగీకరిస్తున్నాను ఏదైతే నా తండ్రి చేశారో, కాని నేను తెలుసుకోవాలనుకున్నాను స్త్రీలకు ఈ విషయంలో చెప్పడానికి ఏమైనా ఉందా అని." (నసాయీ, 3271)**

పై హదీస్‌లో "అతని స్థాయిని పెంచడానికి" అంటే, అది రెండు విధాలుగా అర్థమౌతుంది. "నా తండ్రి పేదవాడు మరియు అతని సోదరుని కుమారుడు మంచి స్థాయిలో ఉన్నాడు. కాబట్టి ఆయన ఆర్థికంగా ఈ సంబంధం ద్వారా ప్రయోజనం పొందదలచుకున్నారు." మరొక అర్థానికి కూడా అవకాశం ఉంది. అదేమిటంటే "తన సోదరుని కుమారుడు పేదవాడు మరియు నా తండ్రి అతని హోదాను పెంచాలని కోరుకుంటున్నాడు, నా వివాహ సంబంధం ద్వారా." ఈ అమ్మాయి తన గురించి మాత్రమే కాకుండా, తన వంటి స్త్రీల క్షేమాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని ముహమ్మద్(స)వారి దగ్గరికి వెళ్ళడాన్ని గమనించాలి.

తమ తల్లిదండ్రులకు తమపై ఉండే ప్రేమ గురించి కుమార్తెలకు బాగా తెలుస్తుంది కాబట్టి, సరైన నిర్ణయం తీసుకోవాలి. పెద్దవారికి అనుభవం ఉంటుంది. ఆ సంబంధం ద్వారా తన కుమార్తె జీవితం హాయిగా సాగిపోతుందని పూర్తి నమ్మకం వారికి ఉన్నప్పుడు మరియు చేసుకోబోయే వరుడిపై అమ్మాయికి ఎటువంటి అనుమానాలు లేనప్పుడు, తమ తల్లిదండ్రుల ఇష్టప్రకారం నడుచుకుంటే అమ్మాయికి మేలు జరగవచ్చు, ఇన్షా అల్లాహ్. **స్త్రీకి నిర్ణయించుకునే హక్కు అల్లాహ్‌యే ఇచ్చారు.** కాబట్టి ఆ హక్కును కాదనే హక్కు ఎవరికీ లేదు. పై హదీస్‌లో తండ్రి నిర్ణయాన్ని ఆమోదించడం ద్వారా ఆమె యుక్తాయుక్త జ్ఞానం కలదానిగా మరియు సలక్షణమైన అమ్మాయిగా తెలుస్తుంది.

### 3. తండ్రి మరణించినప్పుడు దగ్గర బంధువులెవరైనా వివాహం చేయగోరి నప్పుడు కూడా స్త్రీ యొక్క ఇష్టం లేనిదే వివాహం చెల్లదు.

ఇబ్నె ఉమర్(రజి)వారి ఉల్లేఖనం. ఉస్మాన్ బిన్ మజ్'ఉన్ మరణించి నప్పుడు, ఆయనకొక కుమార్తె ఉంది. ఇబ్నె ఉమర్(రజి) చెప్పారు : "నా తల్లిగారి సోదరుడు ఖుదామహ్, (అతడు) ఆమెకు తండ్రిగారి సోదరుడు (అవుతాడు), నన్ను ఆమెకిచ్చి వివాహం జరిపారు. కాని అతడు (ఖుదామహ్) ఆమెను సంప్రదించలేదు. అది ఆమె తండ్రి మరణించిన తరువాత (విషయం). ఆమెకు ఆ వివాహం నచ్చలేదు మరియు ఆ అమ్మాయి ముఘీరహ్ బిన్ షు'బహ్‌ను వివాహం చేసుకోవాలని అనుకుంది. కాబట్టి ఆమె అతనిని వివాహం చేసుకుంది. **(ఇబ్నెమాజా, సహీహ్ హదీస్, 1878, పుస్తకం 9, అధ్యా. 14, సంపుటి 3)**

**పై విషయాలను బట్టి వరుడిని ఎంపిక చేసేస్తే సరిపోదు, కుమార్తెను సంప్రదించాలి అని స్పష్టమైంది. అయితే అది ఏ విధంగా చెయ్యాలి?**

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు : "ఓ వివాహితకు వివాహం చేయకూడదు ఆమె సంప్రదించబడే వరకూ మరియు ఓ కన్యకు వివాహం జరిపించ కూడదు ఆమె అనుమతిని కోరే వరకూ మరియు ఆమె మౌనమే ఆమె అనుమతి." **(తిర్మిజీ, సహీహ్ హదీస్, 1107, పుస్తకం 9, అధ్యా. 18, సంపుటి 2)**

ఇబ్నె అబ్బాస్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) వారు చెప్పారు : అల్-అయ్యిమ్ (భర్తలేనివారి)కి ఎక్కువ హక్కు ఉంది ఆమెకు తన వలీ (గార్డియన్)కంటే మరియు కన్య తన కోసం అనుమతి ఇవ్వాలి. మరియు ఆమె మౌనమే ఆమె అంగీకారం. **(తిర్మిజీ, సహీహ్ హదీస్, 1108, పు 9, అధ్యా.18, సం.2)**

పై హదీస్‌లను బట్టి విధవరాలుగాని లేదా విడాకులు పొందిన స్త్రీ తన వివాహ సమ్మతిని నోటితో చెప్పాలి. కన్య కూడా తన వివాహ సమ్మతిని తెలపాలి. అయితే కన్య విషయంలో ఆమె మౌనమే ఆమె అంగీకారం అవుతుంది.

### వధువు మరియు వరుడు ఒకరినొకరు ఇష్టపడాలి కాబట్టి చేసుకోబోయే అమ్మాయిని పురుషుడు చూడవచ్చా?

బక్ర్ బిన్ అబ్దుల్లాహ్ ముజనీ ఉల్లేఖనం. ముఘీరా బిన్ షు'బహ్ ఒక స్త్రీకి వివాహ ప్రతిపాదన చేశారు, కాబట్టి ప్రవక్త(స)వారు అన్నారు: ఆమె వంక చూడు ఎందుకంటే అది నిశ్చయంగా మీ ఇద్దరి మధ్య విషయాలను మేలు గావించే అవకాశం ఎక్కువ ఉంది. **(తిర్మిజీ, సహీహ్ హదీస్, 1087, పుస్తకం 9, అధ్యా. 5, సంపుటి 2)**

అబూహురైరా(రజి)వారు చెప్పారు, నేను ప్రవక్త(స)వారితో ఉన్నాను ఒక వ్యక్తి ఆయన వద్దకు వచ్చి మరియు చెప్పినప్పుడు, అతడు అన్సారులకు చెందిన స్త్రీని వివాహమాడాడని. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) అడిగారు : "నీవు ఆమె వంక చూశావా?" అతడు చెప్పాడు : "లేదు". ఆయన(స) అన్నారు : "వెళ్ళు మరియు ఆమె వంక చూడు. ఎందుకంటే అన్సారు కళ్ళల్లో ఏదో వుంటుంది." **(సహీహ్ ముస్లిమ్, 3485, పుస్తకం 16, అధ్యా. 12, సం. 4)**

### సదాఖ్ (మహ్ర్)

**"మరియు స్త్రీలకు వారి మహ్ర్ సహృదయంతో ఇవ్వండి. కాని వారు తమంతట తాము సంతోషంగా కొంత భాగాన్ని మీకు విడిచిపెడితే, దానిని సంతోషంగా స్వేచ్ఛగా అనుభవించండి."** (ఖుర్'ఆన్ 4:4)

కాబోయే వధూవరులు ఒకరినొకరు ఇష్టపడ్డారు. ఇక వివాహమే తరువాయి. అయితే వివాహానికి ముందు నిర్ణయించవలసిన ముఖ్యమైన విషయం మరొకటుంది. అదే - సదాఖ్(మహ్ర్). ఇది వివాహం చేసుకోబోయే వరుడు 'వధువు'కి ఇవ్వాలి. మన దేశంలో దీనికి భిన్నంగా కట్నం పేరుతో పురుషుడికి ఇస్తారు. అతడు ఎంత కట్నం డిమాండ్ చేస్తే అంత ఇచ్చి వివాహం జరుపుతారు. **అయితే ఇస్లామ్‌లో స్త్రీకి**

**ఇవ్వవలసిన ఈ మహ్ర్ ఎంత ఉండాలి?** ప్రవక్త(స)వారు తన భార్యలకు ఎంత ఇచ్చారు? సహాబాలు ఎంతెంత ఇచ్చారు? మొదలైన విషయాలను తెలిపే హదీస్‌లను ఇక్కడ అందిస్తున్నాము.

## 1. మహ్ర్ 500 దిర్హములుగా

అబూ సలమహ్ (రజి) చెప్పారు : "నేను ఆయిషా(రజి)వారిని అడిగాను: "ప్రవక్త(స)వారి భార్యల మహ్ర్ ఎంత? ఆమె చెప్పారు: "ఆయన(స) తన భార్యలకిచ్చిన మహ్ర్ 12 ఊఖియ్యా మరియు ఒక నష్. మీకు తెలుసా నష్ ఏమిటో? అది ఊఖియ్యాలో ఒక సగం. మరియు అది (మహ్ర్) 500 దిర్హములకు సమానం. (ఇబ్నెమాజా, సహీహ్ హదీస్, 1886, అధ్యా.17)

ఒక ఊఖియ్యా అంటే 40 దిర్హములు. నష్ అంటే దేనిలోనైనా సగాన్ని సూచిస్తుంది. అంటే ఇక్కడ ఊఖియ్యాలో సగం. కాబట్టి నష్ అంటే ఇక్కడ 20 దిర్హములు. 12 ఊఖియ్యా అంటే (12 x 40 =) 480 దిర్హములు మరియు 20 దిర్హములు కలిపి మొత్తం 500 దిర్హములు అవుతుంది. నేటి మన భారతదేశ కరెన్సీ ప్రకారం ఇది సుమారు 75వేల రూపాయలకు సమానమవుతుంది.

## 2. మహ్ర్ ఎక్కువగా ఇవ్వడంపై

అబూ అజ్ఫా సులమీ చెప్పారు : ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) చెప్పారు: అతి చెయ్యకండి స్త్రీల మహర్‌కి సంబంధించి, ఎందుకంటే అది గౌరవానికి మరియు హుందాతనానికి ఇహ లోకంలో ఒక సూచన అయివుంటే లేక అల్లాహ్ ముందు తఖ్వాకి అది ఒక సూచన అయివుంటే, మీకంటే ఎక్కువ హక్కు ముహమ్మద్(స)వారికి ఉంది. కాని ఆయన(స) ఇవ్వలేదు తన భార్యలలో ఎవరికైనా మరియు తన కుమార్తెలలో ఎవరికీ ఇవ్వబడలేదు 12 ఊఖియ్యాల కంటే ఎక్కువ. ఒక వ్యక్తి మహ్ర్‌ని పెంచవచ్చు అతడు ఆమెపట్ల అయిష్టతను భావించేవరకూ మరియు చెబుతాడు : "నీవు పెద్ద మొత్తంలో నాకు కష్టాన్ని కలిగించావు." **(ఇబ్నెమాజా, హసన్, 1887, పు 9, అధ్యా. 17, సం. 3)**

నాకు తెలియదు రసూలుల్లాహ్(స)వారు తన స్త్రీలను వివాహం చేసుకోవడంలో లేక తన కుమార్తెలకు వివాహం చేయడం 12 ఊఖియ్యా కంటే ఎక్కువగా (తీసుకున్నట్లు) **(తిర్మిజీ, హసన్, 1114, పుస్తకం 9, అధ్యా. 23, సంపుటి 2)**

అబూహురైరా(రజి)వారు చెప్పారు: "మహ్ర్ అల్లాహ్ యొక్క సందేశహరులు(స) మా మధ్య ఉన్నప్పుడు పది అవాఖ్. **(నసాయీ, సహహ్, 3350, పుస్తకం 26, అధ్యా. 66, సంపుటి 4)**

## 3. మహ్ర్ తక్కువగా అంటే ఓ ఇనుప ఉంగరం మైనా సరే / లేక ఖుర్'ఆన్‌లో నేర్చుకున్న సూరహ్‌లను మహ్ర్‌గా

సహ్ల్ బిన్ సాద్ చెప్పారు : "ఒక స్త్రీ ప్రవక్త(స)వారి వద్దకు వచ్చారు మరియు ఆయన(స) అడిగారు : "ఎవరు వివాహం చేసుకుంటారు ఆమెను?" ఒక వ్యక్తి అన్నాడు : 'నేను'. ప్రవక్త(స)వారు చెప్పారు: 'ఇవ్వు ఆమెకు ఏదైనా, అది ఓ ఇనుప ఉంగరం అయినప్పటికీ.' అతడు అన్నాడు : 'నా దగ్గర లేదు'. ఆయన(స) చెప్పారు : 'నేను ఆమెను నీకు ఇచ్చి వివాహం చేస్తున్నాను, నీవు ఖుర్'ఆన్ నుండి నేర్చుకున్నవాటి కొరకు." **(ఇబ్నెమాజా, సహీహ్ హదీస్, 1889, పుస్తకం 9, అధ్యా. 17, సంపుటి 3)**

## 4. స్వేచ్ఛ నివ్వడాన్నే మహ్ర్‌గా

అనస్ బిన్ మాలిక్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) సఫియ్యహ్(రజి)వారికి బానిసత్వం నుండి స్వేచ్ఛ నిచ్చారు మరియు ఆమెకు స్వేచ్ఛనివ్వడాన్నే ఆమెకు మహ్ర్‌గా చేశారు. **(తిర్మిజీ, సహీహ్, 1115, పుస్తకం 9, అధ్యా.24, సంపుటి 2) (నసాయీ, సహీహ్, 3344)**

## 5. ఇస్లామ్ స్వీకరణనే మహ్ర్‌గా

అనస్(రజి)వారి ఉల్లేఖనం. అబూ తల్హా వివాహ ప్రతిపాదన చేశారు ఉమ్మె సులైమ్(రజి)వారికి మరియు ఆమె చెప్పారు: 'అల్లాహ్ సాక్షి, నీ వంటి వ్యక్తి తిరస్కరించ బడకూడదు, ఓ అబూ తల్హా! కాని నీవు అవిశ్వాసివి మరియు నేను ముస్లిమ్‌ని మరియు నాకు అనుమతి నివ్వబడలేదు నిన్ను వివాహం చేసుకోవడానికి. నీవు ముస్లిమ్‌గా అయితే, అదే నా మహ్ర్. నేను నిన్ను దేని కొరకూ అడగను. ఆ విధంగా ఆయన ముస్లిమ్ అయ్యాడు మరియు అదే అతని మహ్ర్. (ఉల్లేఖకులలో ఒకరైన) సాబిత్ చెప్పారు : "నేనెన్నడూ వినలేదు ఏ స్త్రీ గురించీ ఆమె మహ్ర్, ఉమ్మె సులైమ్ మహ్ర్ కంటే విలువైనదిగా (ఆమె మహ్ర్) ఇస్లామ్. మరియు అతడు ఆమెతో దాంపత్యబంధం ఏర్పరచుకున్నారు మరియు ఆమె అతని ద్వారా ఓ బిడ్డకు జన్మనిచ్చింది. **(నసాయీ, హసన్, 3343, పుస్తకం 26, అధ్యా. 63, సంపుటి 4)**

అబ్దుల్ అజీజ్ బిన్ సుహైబ్ ఉల్లేఖనం. నేను అనస్(రజి) చెప్పగా నేను విన్నాను. అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) చెప్పారు: నేను వివాహం చేసుకోవడం వలన ఉత్సాహంగా ఉండడాన్ని రసూలుల్లాహ్(స) చూచారు. నేను చెప్పాను: "నేను వివాహం చేసుకున్నాను అన్సార్ స్త్రీని". ఆయన(స) అడిగారు: "ఎంత ఇచ్చావు ఆమెకు మహ్ర్‌గా?" ఆయన చెప్పారు : "ఒక నవా బంగారాన్ని" **(నసాయీ, సహీహ్, 3354, పుస్తకం 26, అధ్యా.67, సం.4)**

('నవా' అనేది బంగారం యొక్క బరువు. ఇది 5 దిర్హములకు సమానమని చెప్పబడింది. మహర్ 5 దిర్హములంత తక్కువ ఉన్న ఫర్వాలేదు.)

శాంతిబాట పాఠకులకు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ గారి గురించి బాగా తెలుసు. ఈయన(రజి) గురించి ఇదివరకే వివరించాము. ముహమ్మద్

(స)వారి ముఖ్య అనుచరులలో ఒకరుగా మాత్రమే కాకుండా, కొన్ని ముఖ్య సంఘటనలకు ఈయన ఉదాహరణగా ఉన్నారు.

మరి అంత ముఖ్య అనుచరుడై ఉండి కూడా, వివాహానికి ముహమ్మద్(స)వారిని పిలవలేదు అని అర్థం అవుతుంది. ఇది నిర్లక్ష్యం కాదు. ఇస్లామ్‌లో వివాహానికి వధూవరులు, సాక్షులుంటే సరిపోతుంది. **ఇస్లామ్‌లో వివాహం అనేది ఖర్చుతో కూడుకున్న కార్యక్రమం కాదు.** అయితే 'వరుడు' వలీమా విందు ఇవ్వడం జరుగుతుంది. దీని గురించి తరువాత చెప్పుకుందాం.

అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి)వారు మక్కాలో పేరున్న వ్యాపారి. అయితే అన్నీ వదిలి మదీనా వలస వచ్చినప్పుడు ఆయన దగ్గర సంపద లేదు. అన్సారు సోదరుని సహాయం కూడా తీసుకోకుండా, బజారుకు దారి చెప్పమని అడిగారు. ఖాళీ చేతులతో మదీనా వచ్చారు. వ్యాపార మెళుకువలు తెలిసిన వ్యక్తి. చిన్నగా వ్యాపారం మొదలుపెట్టారు. ఆ తరువాత వివాహం చేసుకున్నారు. అప్పటికి ఆయన స్థోమతను బట్టి మహ్రగా ఖర్జూరపు పిక్క బరువంతటి బంగారాన్ని మాత్రమే ఇవ్వ గలిగారు.

తరువాయి కాలంలో చాలా పెద్ద వ్యాపారి అయ్యారు. వేల (బంగారు) దీనార్లు ఎన్నో సందర్భాలలో ఇస్లామ్ కోసం విరాళంగా ఇచ్చారు.

### 6. మహ్ర ముందుగా నిర్ణయించుకుని వివాహం తరువాత కూడా ఇవ్వవచ్చు.

అబ్దుల్లాహ్(రజి) ఉల్లేఖనం. కొందరు వ్యక్తులు ఆయన దగ్గరికి వచ్చి చెప్పారు : ''మాలోని ఒక వ్యక్తి ఒక స్త్రీని వివాహం చేసుకున్నాడు. కాని అతడు ఆమె కొరకు మహ్ర చెప్పలేదు మరియు ఆమెతో సంభోగం జరపలేదు మరణించడానికి ముందు.'' అబ్దుల్లాహ్ చెప్పారు : ''నేను ముహమ్మద్(స)వారిని వీడిన తరువాత నేనెన్నడూ దీనికంటే కష్టమైన ప్రశ్న అడగబడలేదు. మరొకరి దగ్గరకి వెళ్ళండి.' వారు ఆయన దగ్గరికి వస్తూనే ఉన్నారు నెలవరకూ. తరువాత చివరిలో వారు అన్నారు : **"ఎవరిని మేము అడగాలి మిమ్మల్ని అడగకపోతే? మీరు ఈ ప్రాంతంలో ముహమ్మద్(స)వారి ముఖ్య అనుచరులలో ఒకరు. మరియు మాకు మరొకరు దొరకలేదు మీరు తప్ప."** ఆయన చెప్పారు: 'నేను చెబుతాను ఏదైతే నేను అనుకున్నానో, మరియు అది సరియైనదే అయితే అది అల్లాహ్ నుండి మాత్రమే, ఆయనకు మరొక భాగస్వామి లేడు మరియు అది తప్పు అయితే అది నా నుండి మరియు షైతాన్ నుండి మరియు **అల్లాహ్ మరియు ఆయన సందేశహరునికి దీనితో సంబంధం లేదు.** నేను అనుకున్నది, ఆమెకు మహ్ర తన పెద్దవారికి ఇవ్వబడినట్లు తక్కువ కాకుండా, అన్యాయం కాకుండా ఇవ్వబడాలి. మరియు ఆమెకు అతని ఆస్తి నుండి వాటా ఇవ్వాలి. మరియు ఆమె ఇద్దత్ (గడువు), నాలుగు నెలల మరియు పదిరోజులు ఉండాలి.

అతడు అన్నాడు: ''మరియు అదే విన్నారు అష్జ'కు చెందిన కొందరు. వారు లేచి చెప్పారు : ''మేము సాక్ష్యం ఇస్తున్నాము, అటువంటి తీర్పునే రసూలుల్లాహ్(స)వారు ఇచ్చారు మాలోని ఓ స్త్రీకి సంబంధించి, ఆమె బిర్వ' బిన్త్ వాషిఖ్.''

అతడు అన్నాడు : **"అబ్దుల్లాహ్‌ని ఎన్నడూ చూడలేదు అంత సంతోషంగా ఆ రోజు ఆయన సంతోషించినట్లుగా, అతడు ఇస్లామ్ స్వీకరించిన సందర్భం తప్ప."** (నసాయీ, సహీహ్ హదీస్, 3360, పుస్తకం 26, అధ్యా. 68, సంపుటి 4)

పురుషుడికి కుటుంబాన్ని పోషించే స్థోమత వచ్చినప్పుడే వివాహం చేసుకోవాలి అని ఇంతకు పూర్వం చెప్పి, ఒక ఇనుప ఉంగరమైనా మహ్రగా ఇచ్చి వివాహం చేసుకోవచ్చని చెబుతున్నారు కదా. ఇది ఒక దానికొకటి భిన్నంగా లేదా అని అడగవచ్చు. ఏ రోజు సంపాదన ఆ రోజే ఖర్చయిపోయి, ఏమీ కొనుక్కోలేని పరిస్థితి ఎందరికో ఉంటుంది. ఒక స్త్రీ వివాహం కోసం సిద్ధపడటం జరిగింది. అందుకు ఎన్నో కారణాలు ఉండవచ్చు. ఉదాహరణకు తల్లిదండ్రులు మరణించడం వలన, ఏ సంరక్షకుడు లేకుండా జీవించే పరిస్థితి వచ్చినప్పుడు, వివాహం ద్వారా తోడుగా భర్తను పొందవచ్చు. ఇంకా ఎన్నో నైతికపరమైన విషయాలు కూడా కారణం కావచ్చు. ఆ కాలంలో ముస్లిముల ఆర్థిక పరిస్థితి చాలా దయనీయంగా ఉండేది. ఇస్లామ్ ప్రళయం వరకూ అన్ని ప్రాంతాలలో, అన్ని పరిస్థితులలో ఆచరించబడే ధర్మం. కాబట్టి అన్ని పరిస్థితులకూ సరిపోయే సమగ్ర సూచనలు ఉన్నాయి.

ఇప్పటివరకూ చెప్పుకున్న హదీస్‌లను బట్టి మహ్ర లేకుండా వివాహం చెల్లదు. ఆ 'మహ్ర' మొత్తాన్ని పెళ్ళి తరువాత ఇస్తానని వాగ్దానం చేసి కూడా వివాహం చేసుకోవచ్చు. ఆ విషయంలో కూడా ఆమె అంగీకారం కావాలి. మహ్ర ఎక్కువ ఇవ్వడం వలన ఎక్కువ పుణ్యం లభిస్తుందని భావించకూడదు. ఎక్కువ ఇవ్వకూడదని చెప్పే హక్కు కూడా లేదు. మహ్ర ఎక్కువ ఇవ్వడం వలన పురుషుడు ఇబ్బందులలో పడకూడదని అర్థమౌతుంది.

ఈ విషయం కొందరికి అర్థం కాకపోవచ్చు. ఉదాహరణకు లక్షల విలువైన ఆభరణాన్ని మహ్రగా ఇచ్చి భార్యగా చేసుకున్నాడని అనుకుందాం! అంత ఖరీదైన ఆభరణం ఆమెకు మహ్రగా ఇచ్చినా సరే, పెళ్ళి అయిన తరువాత అవసరమైతే అతనే ఖర్చు పెట్టుకుంటాడు కదా, **అతనికి వచ్చిన ఇబ్బంది ఏముంది?** అని అడగవచ్చు. కాని ఆ విధంగా చేయడానికి కుదరదు.

**"మరియు మీరు పరస్పరం దాంపత్య సుఖం అనుభవించిన తరువాత, వారు మీ నుండి గట్టి వాగ్దానం తీసుకున్న తరువాత, మీరు దానిని (మహ్రను) ఎలా తిరిగి తీసుకోగలరు?"** (ఖుర్ఆన్ 4:21)

**"మరియు మీ భార్యలకు సంతానం లేని పక్షంలో, వారు విడిచిపోయిన దానిలో మీకు అర్ధ భాగం. కాని ఒకవేళ వారికి సంతానం ఉంటే, వారు విడిచిపోయిన దానిలో నాలుగో భాగం మీది. వారు వ్రాసిపోయిన వీలునామాపై అమలు జరిపి, వారు అప్పులు తీర్చిన తరువాత."** (ఖుర్'ఆన్ 4:12)

ఇస్లామ్‌లో భార్య సంపదపై హక్కు భార్యకే ఉంటుంది. ఆమె తన ఇష్ట ప్రకారం తన ఆస్తి నుండి భర్త కోసం ఖర్చు చేయవచ్చు లేదా చేయకుండా ఉండవచ్చు. పోషించవలసిన బాధ్యత మాత్రం భర్తదే. అంతేకాకుండా భర్త తదనంతరం భర్త ఆస్తి నుండి, ఆమెకు కూడా వాటా ఉంటుంది.

సహీహ్ బుఖారీ గ్రంథంలోని 1462లోని చివరి భాగంలో ఇబ్నె మస్'ఊద్(రజి)వారి భార్యగారైన జైనబ్(రజి)వారు ప్రవక్త(స)వారితో జరిపిన సంభాషణ ఉంది. "ఓ అల్లాహ్ యొక్క ప్రవక్త(స)! ఈ రోజు, మీరు ప్రజలను ఆదేశించారు దానం ఇవ్వమని. మరియు నేను ఒక ఆభరణాన్ని కలిగి యున్నాను మరియు దానిని దానంగా ఇవ్వాలని సంకల్పించాను. కాని ఇబ్నె మస్'ఊద్ చెప్పారు, అతడు మరియు అతని పిల్లలు దానికి ఎక్కువ అర్హత కలిగి ఉన్నారని ఎవరి కంటే కూడా." ప్రవక్త(స)వారు సమాధానమిచ్చారు, "ఇబ్నె మస్'ఊద్ సత్యమే చెప్పాడు. నీ భర్త మరియు నీ పిల్లలకే ఎక్కువ హక్కు ఉంది దానిపై ఇతరుల కంటే." **(సహీహ్ బుఖారీ, 1462, పుస్తకం 24, అధ్యా.44, సంపుటి2)**

**మహ్ర్ ఎవరి స్థోమత బట్టి వారు ఇస్తారు. ఆ మహ్ర్‌కి వధువు అంగీకారం కావాలి. ఈ విధంగా స్త్రీకి పెళ్ళి ద్వారా అన్ని రకాలుగా రక్షణ మరియు గౌరవం ఇస్లామ్ ఏర్పాటు చేసింది. అంతేకాకుండా వివాహం కోసం స్త్రీ ఏదీ ఖర్చు చేయవలసిన అవసరం కూడా లేదు.**

## పెళ్ళి జరిగిన రోజు స్త్రీ తరపువారు వచ్చిన అతిథులకు భోజనాల ఏర్పాట్లు చేయవచ్చా?

ఈ విషయంలో ముస్లిమ్ సమాజంలో రెండు భిన్న వైఖరులు అవలంబించడం జరుగుతుంది. ఒక వర్గం అయితే భారీగా ఖర్చుపెట్టి 'నికాహ్' జరిపిస్తున్నారు. ఈ విధంగా చేయడం హెూదాగా భావిస్తున్నారు. అటువంటివి చూసి పెద్దగా స్థోమత లేనివారు కూడా అప్పులు చేసి చేస్తున్నారు. మస్జిద్‌ల వద్దకు వచ్చి అమ్మాయికి పెళ్ళి చేయాలని, సహాయం చెయ్యమని అడుగుతున్నారు. **వాస్తవానికి అమ్మాయి పెళ్ళికి ఖర్చు చేయవలసిన అవసరం ఏమీ లేదు.** ఇస్లామ్‌కి దూరమై పోవడం వలన, ఇస్లామ్ గురించి తెలుసుకోక పోవడం వలన, తెలుసుకున్న దానిని పాటించక పోవడం వలన కష్టాల పాలవుతున్నారు. **అందుకే ఆడపిల్ల పుడితే సంతోషించడానికి బదులు కుమిలి పోతున్నారు.**

దీనికి భిన్నంగా మరో వర్గం తయారైంది. ఆడపిల్ల పెళ్ళికి ఆహ్వానం అందుకుని వెళుతున్నారు. వారు భోజనం పెడితే తినకూడదని, అది సున్నత్ కాదని తిరస్కరించి వచ్చేస్తున్నారు. మరి కొందరైతే భోజనాలు ఏర్పాటు చేయడం ఘోరం అన్నట్లుగా భావిస్తున్నారు. పైన తెలిపిన రెండు వర్గాల వాదాలలో ఒకటి ఒకవైపు ఉండే అతివాదమైతే మరొకటి రెండవ వైపు ఉండే అతివాదం. ఇస్లామ్‌ది మధ్యస్థ విధానం. ఇందులో అతి లక్షణాలకు తావు లేదు.

ఒక స్నేహితుడు వేరే ఊరునుండి ప్రయాణం చేసి వచ్చాడు. అతడు మనకు అతిథి. భోజనం పెడతాము. బాటసారులకు కూడా మన స్థోమతకు తగ్గట్టుగా భోజనం పెడతాము. అదే విధంగా పొరుగునున్న ఇళ్ళల్లో ఎవరికైనా తినడానికి లేకపోయినా, విశ్వాసి వారితో ఆహారం పంచు కుంటాడు. కడుపు నిండినవారికి పిలిచి భోజనం పెట్టవలసిన అవసరం లేదు.

ఒక వ్యక్తి తనకు ఆప్తమిత్రుడైన వ్యక్తికి మరియు తనకు బాగా సన్నిహితులైన బంధువులకి తన కుమార్తె వివాహం గురించి ఆహ్వానం పంపిస్తాడు. వారంతా ఒకే ఊరు వాళ్ళు అయితే, ఆ కార్యక్రమం అరగంటలో పూర్తి చేసి ఎవరి ఇళ్ళకు వారు వెళ్ళిపోవచ్చు. అయితే ఒక విషయం ఆలోచించండి. మనం ఎవరి ఇంటికైనా వెళితే మంచి నీరు ఇస్తారు. కొందరు టీ, కాఫీలు ఇస్తారు. స్థోమత కలిగిన మరికొందరు జ్యూస్ లేదా ఇతర స్నాక్స్ కూడా ఇస్తారు. కొందరయితే భోజనం సమయం అయిందని, భోంచేసి వెళ్లమని పట్టుబడతారు.

**ఈ విధంగా ఆతిథ్యమివ్వడం సున్నత్. దానిని స్వీకరించడం కూడా సున్నత్.**

ఉమ్మె అయ్‌మన్(రజి)వారి ఇంటికి ప్రవక్త(స)వారు వెళ్ళినప్పుడు, ఆహారపానీయాలు ఆమె ఏర్పాటు చేసేవారు. ఒకొక్కసారి వాటిని ఆయన(స) తీసుకునేవారు కాదు. అంటే ఉపవాసం వల్లనో లేక మరేదైనా కారణం చేతనో. ప్రవక్త(స)వారిని భోజనానికి కొందరు పిలిచేవారు. ఆయన(స) వెళ్ళేవారు. ఒకొక్కసారి ఆయన(స) తన అనుచరులతో సహా భోజనానికి పిలిచినప్పుడు, వెళుతుండేవారు.

కాబట్టి ఆతిథ్యాన్ని స్వీకరించడం లేదా స్వీకరించకపోవడం అనేది అతిథి యొక్క ఇష్టం. స్వీకరిస్తే 'సున్నత్' అవుతుంది. **ఏదైనా కారణం చేత స్వీకరించకపోయినా సున్నత్ అవుతుంది.** ఆతిథ్యం ఇవ్వడం కూడా ప్రవక్త(స)వారి సాంప్రదాయమే!

మామూలు సమయాల్లోనే ఆతిథ్యం ఇస్తే మనం స్వీకరించేటప్పుడు, **'నికాహ్' అనే సంతోష సమయంలో ఆతిథ్యం ఇస్తే ఎందుకు తిరస్కరించాలి?**

ఒకప్పుడు 'మదీనా'లో పెళ్ళి జరుగుతుంటే, మక్కా నుండి చూడటానికి వెళ్ళాలంటే ఎంతో కష్టమైన పని. కాని నేడు ట్రెయిన్‌లో వెళ్ళవచ్చు లేదా విమానంలో వెళ్ళవచ్చు. ఇప్పుడు ప్రయాణం చాలా సులువైపోయింది. కాబట్టి ఆహ్వానించడం సులువైంది మరియు ఆహ్వానిస్తే హాజరయ్యేవారి సంఖ్య కూడా పెరుగుతుంది. కాబట్టి తమ స్థోమతకు తగిన విధంగానే ఆహ్వానాలు పంపితే మంచిది. ఇది వరుడికి కూడా వర్తిస్తుంది మరియు వధువు తరపువారికీ వర్తిస్తుంది.

నేడు ఏదైనా వివాహం వైజాగ్‌లో జరుగుతుంటే, హైదరాబాద్ నుండి ఢిల్లీ నుండి వచ్చేవారున్నారు. వారితో **'మేము భోజనం పెట్టకూడదు, ఏదైనా హొటల్‌లో తినండి'** అని చెప్పడం సమంజసం కాదు కదా! అదే విధంగా దూరప్రాంతాలనుండి వచ్చినవారు ఆడపిల్లవారు పెట్టిన భోజనాలు తినకూడదని భావించడం కూడా సమంజసం కాదు.

స్థోమత లేనప్పుడు వధూవరుల రెండు కుటుంబాలు మాత్రమే 'నికాహ్' జరిపించు కోవచ్చు. కొందరయితే అప్పటికే వంటలు సిద్ధమైపోయి, ఆహారం సరిపోయేటంత ఉన్నాకూడా తిరస్కరించి వెళ్ళిపోవడం జరుగుతుంది.

ముహమ్మద్(స)వారితో ఖదీజా(రజి)వారి వివాహం జరిగే సమయానికి ముహమ్మద్(స)వారికి ప్రవక్త పదవి ప్రారంభం కాలేదు. ఆ వివాహానికి ఖదీజా(రజి)వారు ముహమ్మద్(స)వారికి పసివయస్సులో పాలిచ్చిన హలీమా(రజి)వారిని వివాహానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. పెళ్ళి విందులు పూర్తయ్యాక, హలీమా(రజి)వారు వెళ్ళేటప్పుడు ఆమెకు బహుమతులనిచ్చారు ఖదీజా(రజి). అంటే ఈ బహుమతి వధువు తరపునుండే గాని, వరుడి తరపునుండి కాదు.

నికాహ్ భోజనాలు తినకూడదనుకునేవారు ఆహ్వానం అందు కున్నప్పుడే చెప్పివేయడం మంచిది. **'మేము భోజనం చేయము. తిరిగి మా ఇంటికి వచ్చి ఇంటిదగ్గరే చేస్తాము"**అని. అందువలన వంటలు వృధా కాకుండా సరిపడినంతే సిద్ధం చేస్తారు.

**వివాహం కోసం ఏ ముస్లిమ్ స్త్రీ అయినా ఏ విధమైనటువంటి ఖర్చు చేయనవసరం లేదు. 'నికాహ్' ద్వారా మహ్ర్ రూపంలో వధువుకు ధనం రూపేణా లేదా వస్తు రూపేణా బహుమతి లభిస్తుంది. కాబట్టి వధువు తీసుకుంటుందేగాని, స్వయంగా ఆమె ఖర్చు పెట్టేది లేదు. అటువంటప్పుడు ఆడపిల్ల పెళ్ళికి ఎందుకు బాధపడాలి?**

**ఆడపిల్ల పుడుతుందని తెలిసి అబార్షన్లు చేయిస్తున్నారు. దీనివలన పాపం చుట్టు కుంటుంది. ఆడపిల్లను పెంచి పెద్ద చేసి వారికి ఒక జీవితాన్ని చూపించే విశ్వాసులైన తల్లి దండ్రులకు స్వర్గశుభవార్త కూడా ఉంది. కాబట్టి ఆడపిల్ల వలన ఇహలోకంలోనూ మరియు పరలోకంలోనూ కలిసి వస్తుంది గాని, నష్టపోయేది ఏదీ లేదు. కాబట్టి**

**విశ్వసించిన వారికి ఆడపిల్ల పుట్టడం అదృష్టమే!**

**వధూవరులకు శుభాకాంక్షలు**

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెబుతుండే వారు, వివాహం సందర్భంగా శుభాకాంక్షలు చెప్పేటప్పుడు, **"బారకల్లాహు లకుమ్, వ బారక్ అలైకుమ్, వ జమ'అ బైనకుమా ఫీ ఖైర్"** (అల్లాహ్ నిన్ను అనుగ్రహించుగాక మరియు నీపై అనుగ్రహాలు కురిపించు గాక! మరియు మిమ్మల్ని మేలులోకి తీసుకువచ్చుగాక! **(ఇబ్నెమాజా, సహీహ్, 1905, పు 9, అధ్యా. 23, సం.3)**

అఖీల్ బిన్ అబూ తాలిబ్ ఉల్లేఖనం. ఆయన ఓ బనీ జుషమ్ స్త్రీని వివాహం చేసుకున్నారు. మరియు వారు చెప్పారు : "నీవు మంచిగా జీవించుగాక మరియు చాలామంది కుమారులను (పిల్లలను) కలగియుండు గాక!" ఆయన చెప్పాడు: "అలా చెప్పకండి, బదులుగా చెప్పండి రసూలుల్లాహ్(స)వారు ఏదైతే చెప్పారో : **"అల్లాహుమ్మ బారిక్ లహుమ్ వ బారిక్ అలైహిమ్".**
**(ఇబ్నెమాజా, 1906, పుస్తకం 9, సంపుటి 3)**

**(మరికొన్ని వివరాలు ఇన్షా అల్లాహ్, వచ్చే సంచికలో ...)**

**ముస్లిమ్ బాలికలారా! విద్యావంతులు కండి!**

స్త్రీలను విద్యావంతులు కమ్మని ఇస్లామ్ బోధిస్తుంది. స్త్రీ చదువుకుంటే అది సమాజమంతా వ్యాపిస్తుందని ముహమ్మద్(స) వారు బోధించారు. ఎక్కడో పాకిస్తాన్‌లో ఓ మారుమూల ప్రాంతం లోనో లేక ఆఫ్ఘనిస్తాన్‌లో ఏ బాలికపైనో ఏదైనా ఉద్దేశ్యంతో దాడి జరిగితే దానిని దృష్టిలో పెట్టుకుని విపరీతమైన పబ్లిసిటీ ఇచ్చి, ఇస్లామ్‌పై నిందలు వేయడం సమంజసం కాదని ఇప్పటికైనా మీడియా సంస్థలు మరియు విద్యావంతులు తెలుసుకుంటే బావుంటుంది. ఇస్లామ్‌కి సంబంధంలేని విషయాలు ఇస్లామ్‌కి ఆపాదించడం అన్యాయం.

**విజ్ఞప్తి**

వచ్చే సంచిక నుండి ప్రతీ ఎడ్రస్ స్లిప్‌పై, చందా రెన్యువల్ తేదీని ఇన్షా అల్లాహ్ ముద్రిస్తాము. ఆ తేదీ ప్రకారంగా పాఠకులు తమ చందా సకాలంలో చెల్లించమని కోరుతున్నాము. నేడు ముస్లిము సమాజంలో అత్యధిక శాతం మందికి ఇస్లామ్‌కి సంబంధించి ప్రాథమిక విషయాలు తెలియవు. ఇస్లామీయ చరిత్ర గురించి ఉన్నత విద్యనభ్యసించిన వారికి సయితం తెలియక పోవడం విచారకరమైన విషయం. ఇస్లామ్ గురించి ముస్లిములకే తెలియకపోతే, ఇతరులకు ఇస్లామ్‌పై నున్న అపోహలను ఎప్పుడు తొలగించడానికి ప్రయత్నిస్తారు? మన తోటివారికి ధర్మాన్ని తెలియజేయడం వ్యాపారంగా పరిగణించ కూడదు. దాని కొరకు మార్కెటింగ్ ఏజెంట్లుగా ప్రొఫెషనల్ దాయీలు అవసరం ఎంతమాత్రం లేదు. ధర్మం గురించి తెలుసుకోవడం మరియు దానిని ఇతరులకు తెలియజేయడం ప్రతీ ముస్లిమ్‌పై నున్న బాధ్యత. తెలిసిన ప్రతీ ఒక్కరూ తెలియని ఇతరులకు చెబితే, అనతి కాలంలోనే ఇన్షా అల్లాహ్ అందరూ ఇస్లామ్ గురించి తెలుసుకునే అవకాశం ఉంది.

# జిన్నాలు మరియు చేతబడి

6

సీరియల్

## మనిషికుండే బలహీనతలే కొందరికి జీవనాధారం

*శారీరక లేదా మానసిక సమస్యలతో బాధపడేవారు సంబంధిత డాక్టర్‌ని సంప్రదించండి.*

గత వ్యాసంలో మన కంటికి కనిపించని ఎన్నింటి నుండో రక్షించే మూడు దు'ఆలను అర్థాలతో సహా తెలియజేశాము. మరికొన్ని దు'ఆలు క్రింద నిస్తున్నాము. వచ్చే సంచికలో ఇన్షా అల్లాహ్ ఒక ప్రత్యేకమైన అంశాన్ని ప్రామాణిక హదీస్‌లతో అందిస్తాము.

**అబూహురైరా(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు : ఎవరైతే ఉదయం అయినప్పుడు సుబహానల్లాహిల్ అజీమీ వబి హమ్‌దిహి (పవిత్రత, కృతజ్ఞత మరియు సకల పొగడ్తలు సర్వాధికారియైన అల్లాహ్ కొరకే)" వందసార్లు చెబుతారో మరియు అదే విధంగా సాయంత్రం అయినప్పుడు చెబుతారో, (దీనికి) సృష్టిలో ఏదీ సమానం కాదు.** (అబూదావూద్, సహీహ్, 5091, పుస్తకం 40, అధ్యా. 100, సంపుటి 5)

حَـدَّثَـنَا مُحَمَّدُ بنُ المنُهَالِ : حَدَّثَنَا يَزِيدُ يَعني ابنَ زُرَيْعٍ : حَـدَّثـنَـا رَوْحُ بـنُ الْـقَاسِمِ عن سُهَيْلٍ، عن سُمَيٍّ، عَن أَبِي صَالحٍ، عن أَبِي هُرَيْرةَ قالَ : قالَ رَسُولُ الله ﷺ ((مَنْ قالَ حِيـنَ يُصْبحُ : سُبْحَانَ الله الْعَظِيمِ وَبِحَمْدِهِ مِائَةَ مَرَّةٍ؛ وَاِذَا أَمْسَـىٰ كَـذَلِكَ؛ لَـمْ يُـوَافِ أَحَـدٌ مِـنَ الْـخَلائِقِ بِمِثْلِ مَا وَافَى)).

పై హదీస్‌లో చెప్పబడిన **"సుబహానల్లాహిల్ అజీమీ వబి హమ్‌దిహి"** ఉదయం 100 సార్లు మరియు సాయంత్రం వందసార్లు చదవడానికి మీకు ఎంత సమయం పడుతుంది? ఆలోచించండి! అల్లాహ్ మనకోసం ఎన్నో సులభమైన రక్షణ ఏర్పాట్లు చేస్తే వాటిని నిర్లక్ష్యం చేసి, భూతవైద్యుల చుట్టూ తిరగడం అవివేకం కాక మరేమిటి?

ఈ విధంగా 100 సార్లు చదవడానికి ఎంత నెమ్మదిగా చదివినా 5 నిమిషాలు సరిపోతుంది. అంత సమయం ఖాళీ లేనివారు ఎవరైనా ఉంటారా?

దీనికి మించిన రక్షణ మరెవ్వరూ తీసుకురాలేరు.

గంటల పాటు ఫోన్‌లు చేస్తుంటారు. టి.వి.లు చూస్తుంటారు. భూతవైద్యుడి దగ్గరకు వెళ్ళడానికి మరియు అతనితో మాట్లాడటానికి కూడా చాలా సమయం పడుతుంది.

రాత్రి అయితే దోమలు కుడతాయని మస్కిటో రిపెల్లర్స్ ఆన్ చేస్తారు. తలుపులు వేస్తారు. పడుకునే ముందు స్టవ్ ఆఫ్ చేశామా లేదా చూసుకుంటారు. ఇన్ని జాగ్రత్తలు తీసుకునేవారు ఓ పది నిమిషాలు అల్లాహ్ చెప్పినట్లు జాగ్రత్త పడితే అది వారికి ఎంతో మేలు చేస్తుంది కదా! ఈ పదాలు చదివేటప్పుడు చదువుతున్న పదాలకు అర్థాలు కూడా మనస్సులో కదలాడుతూ ఉండాలి.

రోజూ ఉదయం 5 నిమిషాలు, రాత్రి 5 నిమిషాలు చదవడానికి మనం ఒక్క నయాపైసా కూడా ఖర్చు చేయనవసరం లేదు. అది పఠించడం వలన మన తోటివారికి కూడా ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఇది ఫ్రీ సర్వీస్.

**హమ్మాద్ మరియు వుహైబ్ నుండి ఉల్లేఖించబడింది. అదే విధంగా సుహైల్ నుండి, ఆయన తండ్రి నుండి. ఇబ్నె అబీ 'అయ్యాష్ నుండి - అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: ఎవరైతే ఉదయం అయినప్పుడు : లా ఇలాహ ఇల్లల్లాహు వహదహు లా షరీక లహు, లహుల్-ముల్కు వ లహుల్-హమ్‌దు, వహువ 'అలా కుల్లి షయ్ఇన్ ఖదీర్ (లేడు ఆరాధ్యుడు అల్లాహ్ తప్ప, ఆయనకు భాగస్వామి లేడు, ఆయనదే విశ్వసామ్రాజ్యం, ఆయనకే కృతజ్ఞతలు మరియు పొగడ్తలు మరియు అన్నింటిపై ఆయన శక్తి పరివేష్ఠించి ఉంది.) అతనికి (ప్రతిఫలం లభిస్తుంది) ఇస్మా'ఈల్ వారసులలోని ఒకరిని బానిసత్వం నుండి విమోచనం కలిగించిన దానికి సమానంగా, 10 మంచి ఆచరణలు అతని కొరకు వ్రాయబడతాయి, 10 చెడు ఆచరణలు చెరిపి వేయబడతాయి (అతని లెక్క నుండి). అతడి స్థాయి పది శ్రేణులు పెరుగుతుంది. మరియు అతడు రక్షింపబడతాడు షైతాన్ నుండి సాయంత్రం అయ్యేవరకూ. అతడు వాటిని సాయంత్రం అయినప్పుడు చదివితే, అతడు అటువంటిదే కలిగి ఉంటాడు ఉదయం వచ్చే వరకూ."**

హమ్మాద్ గారు (ఉల్లేఖించిన) హదీస్‌లో చెప్పబడింది : "ఒక వ్యక్తి అల్లాహ్ యొక్క సందేశహరులు(స)వారిని కలలో చూసాడు మరియు చెప్పాడు : "ఓ రసూలల్లాహ్! అబూ అయ్యాష్ ఉల్లేఖించారు ఫలానా ఫలానా మీ నుండి." మరియు ఆయన(స) చెప్పారు : "అబూ అయ్యాష్ నిజమే చెప్పాడు." (అబూదావూద్, హసన్, 5077, పుస్తకం 40, అధ్యా. 100,101, సంపుటి 5)

حَـدَّثَنَا مُوسَى بنُ اسْمَاعِيلَ : حَدَّثَنا حَمَّادٌ وَوُهَيبٌ نَحْوَهُ عن سُهَيـلٍ، عـن أَبيـهِ، عـن ابن أَبى عَائِشٍ وَقالَ حَمَّادٌ : عن أَبِي عَيَّاشٍ؛ أَنَّ رَسُولَ اللهِ ﷺ قـالَ : ((مَـنْ قالَ اِذَا أَصْبَح : لَا اِلَهَ اِلَّا اللهُ وَحْـدَهُ، لا شَـرِيكَ لَـهُ، لَـهُ المُلْكُ وَلَهُ الْحَمدُ وَهُوَ عَـلَـى كُـلِّ شَـيْءٍ قَدِيرٌ، كَانَ لَهُ عَدْلُ رَقَبَهٍ مِنْ وَلَدِ اسمَاعِيلَ وَكُتِـبَ لَـهُ عَشْـرُ حَسَنَاتٍ، وَحُطَّ عَنْهُ عَشْرُ سَيْئَاتٍ وَرُفِعَ لَهُ عَشْـرُ دَرَجَـاتٍ، وَكَـانَ فـي حِـرْزٍ مِنَ الشَّيْطَانِ حَتَّى يُمْسِيَ. وَاِنْ قالَهَا اِذَا أَمْسَى كَانَ لَهُ مِثلُ ذَلِكَ حَتَّى يُصْبِحَ))

قـالَ في حَدِيثِ حَمَّادٍ : فَرَأَى رَجُلٌ رَسُولَ اللهِ ﷺ فِيمَا يَرَى الـنَّـائِـمُ فـقَـالَ : يَـا رَسُـولَ اللهِ ! اِنَّ أَبَا عَيَّاشٍ يُحَدِّثُ عَنكَ بِكَذَا. قالَ : ((صَدَقَ أَبُو عَيَّاشٍ)).

**ము'ఆజ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఖుబైబ్ ఉల్లేఖనం. ఆయన తండ్రి చెప్పారు: "మేము బయటకి వెళ్ళాము ఒక వర్షపు మరియు చాలా చీకటి రాత్రి రసూలుల్లాహ్(స)వారిని చూడటానికి సలాత్‌లో మాకు ఇమామత్ చేయడానికి. మరియు మేము ఆయనను కనుగొన్నాము. ఆయన అన్నారు : 'చెప్పు, కాని నేను ఏదీ చెప్పలేదు. తరువాత ఆయన(స) అన్నారు : 'చెప్పు'. కాని నేను ఏదీ చెప్పలేదు. తరువాత ఆయన(స) అన్నారు : 'చెప్పు'. మరియు నేను అన్నాను : 'నేను చెప్పవలసిందేమిటి ఓ రసూలల్లాహ్?' ఆయన అన్నారు : 'చెప్పు : ఆయనే అల్లాహ్, ఒక్కడు మరియు అల్‌ము'అవ్విజతైన్' సాయంత్రం మరియు ఉదయం 3 సార్లు మరియు అవి చాలు నీకు అన్నిటి నుండి." (అబూదావూద్, హసన్, 5082, పుస్తకం 40, అధ్యా. 100,101, సంపుటి 5)**

**ఒక చిన్న దు'ఆ, సలాత్(నమాజ్)లో మనం రోజూ చదివే మూడు చిన్న సూరహ్‌లు ఉదయం మరియు సాయంత్రం చదవడానికి ఒక రోజులో కేవలం 20 నిమిషాలు లోపు సమయం పడుతుంది. ఇన్షా అల్లాహ్, మనం చేయగలిగిన ఈ సులభమైన పని వలన మనకెంతో మేలు జరుగుతుంది. ఆలోచించండి!**

حَدَّثَنَا مُحَمَّدُ بنُ المُصَفَّى قال : حَدَّثَنا ابنُ أَبِي فُدَيْكٍ قال : أخبـرني ابنُ أَبِي ذِئْبٍ عن أَبي أُسَيْدٍ الْبَرَّادَ، عن مُعَاذِ بنِ عَبْدِ اللهِ بـن خُبَيبٍ. عن أَبيهِ أَنَّهُ قال : خَرَجْنَا فِي لَيْلَةِ مَطَرٍ وَظُلْمَةٍ شَـدِيـدَةٍ نَطْلُبُ رَسُولَ اللهِ ﷺ لِيُصَـلِّـيَ لَـنَا فَأَدْرَكْنَاهُ فقَالَ : ((قُـلْ))، فَـلَـمْ أَقُلْ شَيْئًا، ثُمَّ قالَ : ((قُلْ))، فَلَمْ أَقُلْ شَيْئًا، ثُمَّ قـالَ : ((قُلْ)) فَقُلْتُ : مَا أَقُولُ يَا رَسُولَ اللهِ؟ قال : ((قُلْ، هُوَ اللهُ أَحَـدٌ وَالْـمُـعَـوِّذَتَيْـنِ، حِيـنَ تُـمْسِي وَحِينَ تُصْبِحُ، ثَلَاثَ مَرَّاتٍ، تَكْفِيكَ مِنْ كُلِّ شَيْءٍ)).

**అల్లాహ్ నామ స్మరణ**

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు: అల్లాహ్ చెబుతారు : నేను నా దాసునితో ఉంటాను అతడు నన్ను స్మరించి నప్పుడు మరియు అతని పెదవులు కదిలినప్పుడు నా పేరు చెబుతూ." **(ఇబ్నెమాజా, సహీహ్, 3792 పుస్తకం-33. అధ్యా. 53, సంపుటి 5)**

అల్లాహ్‌ను స్మరించినప్పుడు ఆయన మనతోనే ఉంటారు అంటే అల్లాహ్ భౌతికంగా మనతో ఉంటారని కాదు. ఆయన శక్తి మరియు జ్ఞానం అన్నింటిని పరివేష్ఠించి ఉంటాయి. ఆయన మనతో ఉంటే మనకు భయపడవలసిన అవసరం లేదు. మనకు వీలైనంత ఎక్కువగా అల్లాహ్‌ను స్మరిద్దాం!

జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి)వారి ఉల్లేఖనం. నేను అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పగా విన్నాను : ఉత్తమ స్మరణ **'లా ఇలాహ ఇల్లల్లాహ్'** (లేడు ఆరాధ్యుడు అల్లాహ్ తప్ప) మరియు ఉత్తమ దు'ఆ **అల్-హమ్‌దులిల్లాహ్** (సకల పొగడ్తలు మరియు కృతజ్ఞతలు అల్లాహ్ కొరకే) **(ఇబ్నెమాజా, హసన్, 3800 పుస్తకం-33. అధ్యా. 55, సంపుటి 5)**

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు: రెండు పదాలు నాలుకపై తేలికైనవి మరియు త్రాసులో బరువైనవి. మరియు అనంత కరుణామయుడికి ప్రియమైనవి - **సుబహానల్లాహి వ బి హమ్‌దిహి, సుబహానల్లాహిల్ - అజీమ్.** (అల్లాహ్ సకల లోపాలకు అతీతుడు మరియు ప్రశంసనీయుడు, అల్లాహ్ సకల లోపాలకు అతీతుడు, సర్వాధికారి)" **(ఇబ్నెమాజా, సహీహ్, 3806 పుస్తకం-33. అధ్యా. 56, సంపుటి 5, సహీహ్ బుఖారీ, 7563, పుస్తకం 97, అధ్యా. 58, సంపుటి 9)**

# మస్‌జిద్‌లు విజ్ఞాన కేంద్రాలు 2

ఖుర్‌ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదవాలంటే, ఏదో ఒక భాషలో చదవడం తెలియాలి. మన రాష్ట్రంలో కొన్ని ఏరియాల్లో తెలుగులో మాట్లాడితే అర్థం చేసుకోగలరు గాని, చదవలేరు. నేడు చాలామంది ముస్లిములు ఉర్దూ మాట్లాడగలరుగాని చదవలేక పోతున్నారు. చదవగలిగినా కూడా వాటిలోని చాలా పదాలు నేడు కొన్ని ప్రాంతాలలో వాడుకలో లేవు. వాడుక భాషలో ఉంటే కాస్త సులభంగా ఉంటుంది. కాబట్టి వాటిలోని ఉర్దూ పదాలను అర్థం చేసుకోవడానికి ఉర్దూ డిక్షనరీ అవసరం.

మస్‌జిద్‌లో అనువాదంతో కూడిన ఖుర్‌ఆన్ కాపీలు మాత్రమే కాకుండా, ఆయా భాషల డిక్షనరీలు కూడా ఏర్పాటు చేసుకుంటే, అందరికీ ఇన్షా అల్లాహ్ మేలు జరుగుతుంది.

కాస్తో కూస్తో చదువుకున్న వారికి ఫర్వాలేదు. చిన్నతనంలో స్కూలుకే వెళ్ళకుండా చిన్న చిన్న పనులు, కూలి పనులు చేసుకునేవారి సంగతి ఏమిటి? **వారికి ఖుర్‌ఆన్ చదువుకునే అవకాశం పోయినట్లేనా?** ఒకరు చెబితే వినవలసిందేనా?

వారికి కూడా మస్‌జిద్‌లో వారికిష్టమైన ఒక భాష నేర్పాలి. ఇటువంటి వారి కోసం ఆ మస్‌జిద్ పరిధిలోని విద్యావంతులు రోజుకి ఒకరు చొప్పున వంతులు వేసుకుని ఒక గంట సమయం వెచ్చించి నేర్పగలరు, ఇన్షా అల్లాహ్! ఏడుగురు విద్యావంతులు ఉంటే ఒకొక్కరు నెలలో 4 గంటలు కేటాయిస్తే సరిపోతుంది. 30 మంది ఉంటే నెలలో ఒక గంట కేటాయిస్తే సరిపోతుంది. ప్రతీ రోజూ ఇషా నమాజ్ తరువాత మస్‌జిద్‌లలో నేర్పితే, వారంతా అల్లాహ్ తమ గురించి చేసిన ప్రసంగాన్ని చదువుకోగలుగుతారు మరియు ఇంట్లో తమవారికి చెప్పగలుగుతారు. వినడంతో పాటు చదివితే, దాని ప్రభావం చాలా బాగుంటుంది. ఆలోచన కలిగే అవకాశం ఉంటుంది.

కొందరికి కొన్ని సమస్యలుంటాయి. వాటిని ఎలా పరిష్కరించు కోవాలో చెప్పేవారి అవసరం వారికి ఉంటుంది. సలహా కోసం వారు మస్‌జిద్‌లకు వచ్చేలా ఉండాలి. మస్‌జిదే కేంద్రం కావాలి. మస్‌జిద్‌లో పుస్తకాలు ఏర్పాటు చేసుకోవడానికి, విద్య నేర్చు కోవడానికి వేరే ఊరు మస్‌జిద్‌లకు వెళ్ళి చందాలు వసూలు చేసుకోకుండా, స్థోమత బట్టి ఒకటొకటిగా ఏర్పాటు చేసుకోవచ్చు. ఆ కార్యక్రమాలకు ఫొటోలు తీసి, వీడియోలు తీసి కొందరకు పంపి ఫండ్స్ తెచ్చుకోవడం కంటే స్వయంగా ఏర్పాటు చేసుకోవడంలోనే తృప్తి ఉంటుంది.

మన సంకల్పానికి అల్లాహ్ తోడుగా ఉంటారు. ఈ పనులన్నీ అల్లాహ్ కోసం స్వచ్ఛందంగా జరిగేలా ప్రయత్నించాలి. మనం నేర్చుకోవలసిన జ్ఞానం పుస్తక రూపంలో మన మస్‌జిద్‌లలోనే ఉన్నప్పుడు, ఎక్కువ మంది వాటివలన ప్రయోజనం పొందగలుగుతారు. డబ్బులిచ్చి ప్రసంగాలు చేయించుకునే పెయిడ్ సర్వీస్‌ల కంటే గ్రంథాలు సమకూర్చు కోవడం వలన ఎక్కువ మేలు జరుగుతుంది.

**పరిపూర్ణ జ్ఞానం**

వాస్తవానికి పరిపూర్ణ జ్ఞానం ఎవరికీ ఉండదు. సర్వజ్ఞాని అల్లాహ్ మాత్రమే. ఎంత జ్ఞానం లభిస్తే అంత జ్ఞానాన్ని వెంటనే ఆచరణలో పెట్టాలి. జ్ఞానం అంతా నేర్చుకుని అప్పుడే ఆచరణలో పెట్టాలనుకుంటే నష్టపోయినవారు అవుతారు.

సలాత్ ఎలా చేయాలో చదువుకోగానే, వెంటనే సలాత్ (నమాజ్) చేయడం ప్రారంభించాలి. అదే విధంగా ఖుర్‌ఆన్‌లో స్పష్టంగా అర్థమైన విషయాలను ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించాలి. నిషా స్థితిలో సలాత్ చేయకూడదని ఖుర్‌ఆన్ చెబుతుంది. ఆ స్థితిలో మనం ఏమి చేస్తున్నామో మనకు స్పష్టంగా తెలియదు. ఆ స్థితి మద్యపానం వలన రావచ్చు, డ్రగ్స్ వలన రావచ్చు లేదా ఇంకా ఏదైనా ఇతర కారణాల వలన కావచ్చు. అంటే మత్తు కలిగించే వాటి నన్నింటికి మనం దూరంగా ఉండాలని అర్థమౌతుంది. మరో ఆయత్‌లో మద్యపానం నిషేధమని ఉంది. కాబట్టి మద్యపానానికి దూరంగా ఉండాలి.

'వడ్డీ' నిషేధించబడింది. మహా పాపాలలో అది ఒకటి. వ్యభిచారం చేయకూడదు. అహంకారానికి పోయిన బలమైన జాతులు ఎలా నాశన మయ్యాయో ఖుర్‌ఆన్ పఠనం వలన అర్థమౌతుంది. సహనం వలన కలిగే మేలు అర్థమౌతుంది. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను 'ఉఫ్' అని కూడా అసహనం వ్యక్తం చేయకూడదని తెలుస్తుంది. స్త్రీలకు ఇవ్వవలసిన గౌరవం గురించి, దానచేయడం వలన కలిగే మేలు గురించి, జాతి, రంగు, వర్ణ విబేధాలు చూపకూడదని, అందరూ పుట్టుకతో సమానమని, అల్లాహ్ పట్ల ఎక్కువ భీతి గలవాడే అధికుడని స్పష్టంగా అర్థమౌతుంది.

వ్యభిచారం నిషేధమని, అన్యాయంగా ఎవరినీ చంపవద్దని, సహనం మేలనీ చెబుతూ జ్ఞానాన్ని పొందడానికి కృషి చేయమని ఖుర్‌ఆన్ చెబుతుంది.

నేడు బాగా వైద్యం చేయగల డాక్టరుగారు కూడా ఒకప్పుడు 1వ తరగతి చదువుకున్న విద్యార్థే. జ్ఞానం పొందాలంటే నేర్చుకోవాలి. పెద్దవారు చాలా తొందరగా నేర్చుకోగలుగుతారు. అల్లాహ్ ఎవరికైనా మేలు చేయాలనుకుంటే వారికి జ్ఞానాన్నిస్తాడు. జ్ఞానాన్ని నేర్చుకోవాలనే మీ సంకల్పం, మీకు మేలు చేస్తుంది, ఇన్షా అల్లాహ్!

**అల్లాహ్ కోసం ప్రార్థన చేయడానికి మస్‌జిద్‌కు వచ్చే మన సోదరులు అందులో ప్రశాంతంగా ప్రార్థన చేసుకునే విధంగా వారికి సహకరిద్దాం! మస్‌జిద్‌లు అల్లాహ్ గృహాలు. సలాత్ చేసేవారిని జమాత్‌ల పేరుతో అడ్డగించవద్దు.**

# పాఠకుల అభిప్రాయాలు

### ముస్లిం మహిళ

ఈ శీర్షికపై ప్రారంభం నుండి మంచి స్పందన వస్తూనే ఉంది. ఒక స్త్రీకి ఇస్లామ్ పట్ల మంచి అవగాహన ఉంటే, ఆమె వంశం విద్యావంతుల వంశంగా మారుతుంది. కుటుంబంలో విలువలు పెరుగుతాయి. కాబట్టి ఈ శీర్షిక విషయంలో ఎక్కువ శ్రద్ధ తీసుకుంటున్నాము.

### ఇస్లామ్ వ్యతిరేక సినిమాపై

రకరకాల భావాలతో మా పాఠకుల నుండి అభిప్రాయాలు అందాయి. వాటిని బట్టి ఓ ప్రత్యేక వ్యాసం అందించ వలసిన ఆవశ్యకత ఏర్పడింది. 'భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ' (Freedom of Expression) అనే వ్యాసాన్ని ఈ సంచికలో అందించాము.

### శాంతిబాట ఓ ప్రోత్సాహం మాత్రమే

సర్వమానవాళి సంతోషంగా ఉండటానికి అల్లాహ్ పంపిన సందేశాన్ని మరియు ముహమ్మద్(స)వారి ఆచరణలను తెలుగు భాషలో స్పష్టంగా అందించగలిగే అవకాశం అల్లాహ్ మాకు అనుగ్రహించారు.

'శాంతిబాట' అనేది మా తరపు నుండి పత్రిక రూపంలో వెలువడుతున్న ఓ humble request మాత్రమే. ఖుర్'ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనలు మరియు సన్మార్గం పొందిన ఖలీఫాల జీవితం గురించి సోదరసోదరీమణులను చదవమని, ఆ పుస్తకాలను మస్జిద్‌లలో ఏర్పాటుచేసి చదివించమని ప్రోత్సహించేదే 'శాంతిబాట'.

'శాంతిబాట' ఓ విన్నపం. ఈ పత్రికలో ప్రచురణ కాని విషయాలు మేము చెప్పినట్లుగా ఎవరైనా ప్రచారం చేస్తే వాటిని మా మాటలుగా స్వీకరించవద్దు. శాంతిబాటలో ప్రచురించబడిన విషయాలకే పరిమితం కమ్మని విజ్ఞప్తి చేస్తున్నాము.

సందేహాలైనా, సద్విమర్శలైనా మా పాఠకులు వ్రాతపూర్వకంగా వారి పూర్తి ఎడ్రస్‌తో సహా పంపవచ్చు. వాటిలో ప్రజలకు ఉపయోగపడే అంశాలుంటే, వాటిని మాత్రమే పరిగణనలోకి తీసుకుని ఏదైనా వ్యాస రూపంలోగాని లేదా వ్యాసంలో భాగంగాగాని సందర్భాన్ని బట్టి సమాచారాన్ని అందించగలం. దయచేసి మీ సుదీర్ఘ సందేహాల పరిష్కారాలకై మాలో ఎవ్వరికీ ఫోన్‌లు చేయవద్దు. మాకు అంత ఖాళీ సమయం లేదు. కొత్తగా చేరిన పాఠకులు, మా వెబ్‌సైట్‌లో ఉన్న పాత సంచికలను డౌన్‌లోడ్ చేసుకుని చదువుకోవచ్చు. లేదా మీరున్నచోట ఎవరి దగ్గరైనా అవి ఉంటే చదవండి. లేదా మొదటి నుండి పంపమంటే అందుబాటులో ఉన్న పుస్తకాలను పంపిస్తాము. ఎందుకంటే శాంతిబాటలోని అంశాలు ఒక వరుసక్రమంలో అందిస్తున్నాము. ప్రారంభం నుండి చదివితే, మీ సందేహాలు చాలావరకూ తీరిపోవచ్చు.

### చదువులను నిర్లక్ష్యం చేయకండి

విద్యార్థులు అర్థం చేసుకున్నారు. ఉద్యోగాలు చేసేవారూ అర్థం చేసుకున్నారు. ముఖ్యంగా చెప్పవలసింది ఏమిటంటే పేరెంట్స్ నుండి మంచి స్పందన వచ్చింది. ఎంతోమంది విద్యార్థులు తమ కళ్ళ ముందే మంచి భవిష్యత్తును నాశనం చేసేసుకుంటున్నారని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. యువకుల చదువులను దాయీలు మాన్పిస్తున్నారని తెలియ జేశారు. తాలిబన్లు ఆడపిల్లలు చదువుకోవద్దని మొన్ననే ఓ బాలికపై కాల్పులు జరిపారని మీడియా విపరీతమైన పబ్లిసిటీ ఇచ్చింది. నిజంగా వారు తాలిబన్లా? లేక పాశ్చాత్య దేశాలు మత దురభిమానంతో ఏర్పాటు చేసుకున్న కిరాయి గూండాలా? ఆ నిజాలు తెలుసుకోవడం మన స్థాయికి మించిన పని. **కాని ఒక్కటి మాత్రం నిజం**, వారెవరైనా సరే వారికీ ఇస్లామ్‌కి ఎటువంటి సంబంధం లేదనేది మాత్రం స్పష్టం. స్త్రీకి ఇస్లామ్‌లో గౌరవప్రదమైన స్థానం ఉంది. జ్ఞానం గలవారికే తఖ్వా ఉంటుంది. తఖ్వా గలవారే సన్మార్గంలో ఉంటారు. కాబట్టి అందరికీ తప్పనిసరిగా జ్ఞానం కావాలి. దాని కొరకు **విద్యను అభ్యసించాలి**. విద్యను వ్యతిరేకించేవాడు ముస్లిమ్ కానేకాడు. స్థోమత లేక చదివించ లేకపోతే అది వేరే విషయం. డిగ్రీలు మాత్రమే జ్ఞానానికి కొలమానం కాదు.

బాగా చదువుకునే విద్యార్థులను 'దావా' పేరుతో పాడుచేయడం కళ్ళారా చూసి, పేపర్లలో ఆడపిల్లపై కాల్పుల విషయం చదివి, విద్యకు ఇస్లామ్ వ్యతిరేకం అని పేరెంట్స్ ఇస్లామ్ పట్ల తప్పుడు భావాన్ని పెంచుకుంటున్నారు.

ముస్లిములు బాగా చదవకూడదని, ఒకవేళ మంచి ఉద్యోగాలు చేస్తుంటే వాటిని వదిలేసి, దావా పేరుతో తిరిగేలా చేసేవారు సన్మార్గులు ఎలా అవుతారు? ఉద్యోగులు తమ ఉద్యోగాలను మానివేస్తే, ఆ కుటుంబంపై చెడు ప్రభావం చూపుతుంది. ధర్మ ప్రచారం పేరుతో ఇస్లామ్‌పై పరోక్షంగా నిందలు పడేలా చేస్తున్నారు.

ఈ ప్రొఫెషనల్ దాయీల వెనుక ఉన్నది ఎవరు? విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్న వీరు, ఇదంతా చేయడానికి కారణం అక్రమ సంపాదన కోసమేనా? లేక ఆ విధంగా చేయమని దురభిమానంతో వేరే ఎవరైనా వీరిని వెనుక ఉండి నడిపిస్తున్నారా?

ఫీజులు కట్టలేక చదువుకోలేని విద్యార్థులకు, వారు చదువుకునే విధంగా డా॥ రాజశేఖర రెడ్డిగారు ప్రభుత్వం తరపు నుండి సహాయం అందేలా చేశారు. మరి 'ధర్మ సందేశం' అంటూ దాయీల రూపమెత్తిన వీరు మాత్రం చదువుకునే ముస్లిములను లక్ష్యంగా చేసుకుని వారు చదువుకోకుండా పాడు చేస్తున్నారు.

**మీ అభిప్రాయాలను, విమర్శలను కార్డుపై వ్రాసి 'వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ' ఎడ్రస్‌కు గాని లేదా** velugubaata@gmail.com **కు పంపండి.**

‘జీహాదీ’ సాహిత్యం ఉందని బెంగుళూరులో ఓ విద్యార్థిని అరెస్ట్ చేశారని వార్తలొచ్చాయి. ఎక్కడి నుండి వస్తుంది ఇటువంటి సాహిత్యం? ఈ పదాన్ని ఉపయోగించి ‘ఇస్లామ్’ను అవమానపరిచే విధంగా మీడియాలో తప్పుడు కథనాలు వస్తున్నాయి. కామెడీ సినిమాలలో సైతం ముస్లిములను అవమానపరిచే విధంగా చిత్రీకరణ జరుగుతుంది.

మన దేశంలోని ఏ ముస్లిమ్ విద్యార్థియైనా సరే మన భారతదేశానికి వ్యతిరేకంగా ఎలా పనిచేయగలడు? ఇస్లామ్‌ను ఆచరించడానికి మరియు ఇస్లామ్ ప్రచారాన్ని చేసుకోవడానికి మరియు బహిరంగంగా మన ‘ఈద్’ జరుపుకునే స్వేచ్ఛ భారత రాజ్యాంగం కల్పించి ముస్లిములకు సమాన హక్కులను ఇచ్చినప్పుడు, మన దేశ అభివృద్ధికి ప్రతీ ముస్లిమ్ విద్యార్థి కృషి చేస్తాడు గాని, దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఎందుకు ఆలోచిస్తాడు? **ప్రతీ విషయాన్ని ఇస్లామ్‌కి ఆపాదించి రిపోర్ట్ చేయడం జాతీయ సమైక్యతకు విఘాతం కలిగించడమే అవుతుంది.**

మన దేశ రాజ్యాంగం గురించి విద్యార్థులకు కనీస అవగాహన ఉంది. వారికి ప్రత్యేకంగా ఏ సాహిత్యాలు అవసరం లేదు. వారు చదివే పాఠ్యపుస్తకాలతో పాటు, ఖుర్ఆన్‌ను రోజూ ఓ పావుగంట లేదా అరగంట చదువుకుంటూ, అర్థమైనదానిని ఆచరణలో పెడితే సరిపోతుంది. ఖుర్ఆన్‌పై కనీస అవగాహన వచ్చాకగాని, లేదా వారి వీలును బట్టి రోజూ ఓ హదీస్‌ను చదువుకోవచ్చు. ఇంకా అవకాశం ఉంటే ముహమ్మద్(స)వారి జీవితచరిత్ర గురించి మరియు ఖలీఫాల కాలంలోని ఇస్లామీయ చరిత్ర గురించి మరియు 7-12 శతాబ్దాల మధ్య కాలపు ముస్లిమ్ శాస్త్రవేత్తల సైంటిఫిక్ ఆవిష్కరణల గురించి చదువుకోవచ్చు. దీనికి ప్రత్యామ్నాయంగా తల్లిదండ్రులు పిల్లలకు చదివి వినిపించవచ్చు.

మామూలు వ్యక్తులకే ముఖ్యమైన విషయాలు చాలా సులభంగా ఖుర్ఆన్ నుండి అర్థమౌతుండగా కాలేజీ విద్యార్థులకు ఇవి ఇంకా సులభతరంగా అర్థం అవుతాయనడంలో సందేహం ఏముంది? అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఇలా చెబుతున్నారు :

> **“మరియు వాస్తవానికి మేము ఖుర్ఆన్‌ను హితబోధ గ్రహించడం కోసం సులభం చేశాము. అయితే హితబోధను స్వీకరించేవాడు ఎవడైనా ఉన్నాడా?”** (ఖుర్ఆన్ 54:17)

తమ తల్లిదండ్రులు గర్వపడేలా విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, తమ తల్లిదండ్రులను ఇస్లామ్ బోధించినట్లు ప్రేమగా చూసు కోవడానికే ప్రాధాన్యత నివ్వాలి. ఖుర్ఆన్ అదే బోధిస్తుంది.

**మరియు నీ ప్రభువు(అల్లాహ్), తనను తప్ప ఇతరులను ఆరాధించ కూడదనీ మరియు తల్లిదండ్రులతో మంచితనంతో వ్యవహరించాలనీ, ఆజ్ఞాపించి ఉన్నాడు. ఒకవేళ వారిలో ఏ ఒక్కరుగానీ, లేదా వారిరువురు గానీ ముసలివారైతే, వారితో విసుక్కుంటూ ‘ఉఫ్’అని కూడా అనకు మరియు వారిని గద్దించకు మరియు వారితో మర్యాదగా మాట్లాడు. మరియు వారి మీద కరుణ మరియు వినయ విధేయతల రెక్కలను చాపు. మరియు వారి కొరకు ఇలా ప్రార్థించు : “ఓ నా ప్రభూ! వారు ఏ విధంగా నన్ను బాల్యంలో పెంచారో అదే విధంగా నీవు వారియెడల కరుణను చూపు.”** (ఖుర్ఆన్ 17:23-24)

వీరికి ఇతర ధర్మాలపై చర్చలు, వాదనలు అవసరం లేదు. మీ కారెక్టర్ (character) ముహమ్మద్(స)వారి కారెక్టర్‌కి దగ్గరగా ఉండేలా చూసుకోండి చాలు. ఇతరులను మీరు ప్రేమిస్తారు మరియు వారిచే ప్రేమించ బడతారు. అదే గొప్ప దావా.

**ఇస్లామ్ పరమత సహనాన్ని బోధించింది.** మీరు పరీక్ష పాసవ్వాలంటే, మీ సిలబస్ కవర్ చేసే పాఠ్యపుస్తకాలనే చదువుతారు. అదే విధంగా ఇహలోకపు పరీక్షలో మీరు అధ్యయనం చేయవలసినవి ముఖ్యంగా రెండే రెండు. 1. ఖుర్ఆన్ 2. సున్నత్. వాటిని అధ్యయనం చేయండి. అవి చాలు.

మీకు అర్థమయ్యే భాషలో సూరహ్ బఖరహ్ ఎక్కువ సార్లు చదవండి. **ప్రొఫెషనల్ దాయీలకు దూరంగా ఉండండి.**

**ఖుర్ఆన్ చదవండి**

**మేము ఎంతో శుభవంతమైన ఈ గ్రంథాన్ని నీపై అవతరింప జేశాము. ప్రజలు దీని సూచనలను గురించి యోచించాలని మరియు బుద్ధి మంతులు దీని నుండి హితబోధ గ్రహించాలని.** (ఖుర్ఆన్ 38:29)


**వాస్తవంగా, మేము మీ కొరకు ఒక గ్రంథాన్ని అవతరింప జేశాము. అందులో మీ కొరకు ఉపదేశముంది. ఏమీ? మీరిది అర్థం చేసుకోలేరా?** (ఖుర్ఆన్ 21:10)

## పబ్లిసిటీ

పత్రిక ప్రారంభం నుండి మా శ్రేయోభిలాషి ఒకరు, చెన్నయ్ నగరం నుండి తమ విలువైన సూచనలు ఇస్తున్నారు. వారికి కృతజ్ఞతలు తెలియ జేసుకుంటున్నాము. శాంతిబాటకు మంచి పబ్లిసిటీ ఇవ్వమని సూచించారు. అయితే దీని కొరకు ఆర్థిక వనరులు సమకూర్చు కోవడం ప్రస్తుత పరిస్థితిలో మాకు కష్టం. అంతేకాకుండా, శాంతిబాట టీమ్ సభ్యులు స్వయంగా ప్రతీ ప్రాంతానికి రావడానికి కూడా ప్రస్తుతం సాధ్యం కాదు. పత్రిక చదివిన ప్రతీ ఒక్కరూ ప్రశంసిస్తున్నారని ఆయన తెలియ జేశారు. అల్-హమ్‌దులిల్లాహ్! ప్రారంభంలో ప్రతీ పాఠకుడు మరొకరిని చందాదారునిగా చేర్చి సత్యాన్ని వ్యాపింప జేయడంలో శాంతిబాటకు సహకరించమని పత్రికాముఖంగా విజ్ఞప్తి చేస్తుండేవారము. తిరిగి ఆ విజ్ఞప్తిని కొనసాగించమని ఆయన సూచించారు. ఈ సంచికనుండే దానిని కొనసాగిస్తాము, ఇన్షా అల్లాహ్.

**Printed by** Md. Athaharullah, **Published by** Md. Athaharullah **Owned by** Velugubaata Educational Society (Regd.No. 569/2008), Samalkot and **Printed at** Saanthibaata Printing House, 19-1-447, Hanuman Statue Center, Samalkot - 533440 and **Published at** 2-8-31, Kota Bazar, Samalkot - 533440, **Editor:** Md. Athaharullah , Phone : 9347046090, Email: velugubaata@gmail.com, RNI Regd. No. APTEL/2009/29650

తొలి తెలుగు పరిశోధనాత్మక ఇస్లామీయ మాసపత్రిక



అల్లాహ్ అనుగ్రహంతో
4వ సంవత్సరపు
తొలి సంచిక మీకు
అందించ గలిగాము
అల్‌హమ్‌దులిల్లాహ్!



సర్వమానవాళి సంతోషంగా
జీవించడానికి అల్లాహ్ చూపిన మార్గాన్ని
సులభమైన తెలుగులో అందరికీ
అందించాలనేది మా సంకల్పం

విదేశాలలో ఉండి తెలుగు చదవగలిగే వారి కోసం ప్రచురించబడిన వెంటనే పత్రికను
వెబ్‌సైట్‌లో ఉచితంగా అందుబాటులోకి తెస్తున్న ఏకైక తెలుగు ఇస్లామీయ మాసపత్రిక



అల్లాహ్‌ను మరియు ముహమ్మద్(స)వారిని ప్రేమించే వారిచే
ఆదరించ బడుతూ, ప్రామాణిక ఇస్లామీయ సమాచారాన్ని అందించే పత్రిక




*For Free Download of Our Magazine and Books visit*
www. saanthibaata.net
www.saanthibaata.com



ధర్మం పేరుతో పేదప్రజలకు అందవలసిన
సొమ్మును దోచుకుంటున్న అవినీతి విద్వాంసుల
మరియు ప్రచారకుల గుట్టు బయట పెట్టిన పత్రిక

శాంతిబాట
ప్రారంభానికి
ముందు
ప్రచురించబడిన
పరిశోధనాత్మక
పుస్తకం



శాంతిబాట
పాఠకులకు
తొలి సంవత్సరం
ఉచితంగా
అందించబడిన
పరిశోధనాత్మక
పుస్తకం



సత్యాన్ని ప్రేమించేవారికి
మా మనవి :
మీ బంధువులను, స్నేహితులను
చందాదారులుగా చేర్చి సత్యాన్ని
వ్యాపింపజేయమని కోరుతున్నాము.

Special Issue

**SAANTHIBAATA MONTHLY   August-September, 2012**   Samalkot-533440 (East Godavari Dist.)
**Registered with Registrar of News Papers for India   RNI Reg. No. APTEL/2009/29650**
**Postal Concessional Registration No. AP/KD/140/2011-2013**

సృష్టికర్తయైన అల్లాహ్ పంపిన ప్రవక్త మరియు సందేశహరుడైన

# ముహమ్మద్(స)వారి బోధనల సారాంశం

ఏ ధర్మానికి చెందిన పొరుగువాడైనా సరే, ఆ పొరుగువానిని ప్రేమించడం మాత్రమే కాకుండా, అతడి అవసరాలను కూడా తెలుసుకోవాలి. అతడు ఆకలితో ఉంటే, అతనితో పాటు ఆహారాన్ని పంచుకోవాలి. అతడు పస్తులుండగా మనం కడుపు నిండా తింటే మనం విశ్వాసులం కాము.

కూలివాని చెమట బొట్టు ఆరకముందే అతని కూలి అతనికి ఇచ్చివెయ్యాలి.

బహుమతులుగాని మరేదైనా పంచవలసి వస్తే మన ఇంటికి ఏ పొరుగువాని గుమ్మం దగ్గరగా ఉందో వారికి ముందు ఇవ్వాలి, వారు ముస్లిములు కాకపోయినా సరే.

పొరుగువాని ప్రశాంతతకు భంగం కలిగించేవాడు విశ్వాసి కాడు.

భార్యను బాగా చూసుకునే వాడే ఉత్తముడు.

తల్లిదండ్రులను ప్రేమించాలి. వారికి సేవ చేయాలి. వారి కోసం అల్లాహ్‌ను ప్రార్థించాలి. వారు వృద్ధాప్యంలో ఉంటే, 'ఉఫ్' అని అసహనం కూడా వ్యక్తం చేయకూడదు.

పిల్లలను ప్రేమించాలి. వారు ఆడపిల్లలైనా మగపిల్లలైనా సరే వారిని విద్యావంతులుగా చేయాలి. ఉత్తమ లక్షణాలు వారికి అలవడేలా వారికి శిక్షణ నివ్వాలి.

వ్యభిచారానికి, మద్యపానానికి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.

స్త్రీలను గౌరవించాలి.

పరమత సహనం కలిగి ఉండాలి.

కుమార్తెలను బాగా చూసుకునే విశ్వాసులకు స్వర్గ శుభవార్తనిచ్చారు. కుమార్తెలను కలిగి ఉండడం విశ్వాసులకెంతో అదృష్టం.

మానవులంతా సమానమే. వారి రంగు, రూపు, జాతి, స్థితి మొదలైన వాటివలన వారికి ఎలాంటి ఆధిక్యత లేదు. అల్లాహ్ పట్ల భీతి (తఖ్వా) కలిగి, మంచిగా ఆచరించేవారే అందరికంటే అధికులు.

తన స్వహస్తాలతో కష్టపడి తినేతిండి ఉత్తమమైన ఆహారం. శక్తిని బట్టి కష్టపడి పనిచేసి సంపాదించాలి.

ఆధునిక సైన్స్‌కు పునాదులు వేయించి, సైన్స్‌లో వివిధ రంగాలకు పితామహులను తయారుచేసిన ఇస్లామ్ సర్వమానవులు ఆచరించదగిన ధర్మం. ఎవరో కొందరు ముస్లిములను చూసి ఇస్లామ్‌ను నిందించడం అనాగరికం మరియు హేయమైన పని. కత్తితో ఇస్లామ్ వ్యాపించలేదు. మానవత్వంతో, ఉత్తమ సంస్కారంతోనే వ్యాపించింది.




www.saanthibaata.net

23 దేశాలలోని తెలుగు పాఠకులచే వీక్షించబడుతున్న
తెలుగు ఇస్లామీయ వెబ్‌సైట్